
# గమనం మధురం

నవల

అంజన కొడాలి



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 251

కౌముది మాసపత్రికలో

జనవరి 2021 సంచిక నుంచి ఏప్రిల్ 2023 సంచిక వరకూ

సీరియల్‌గా వచ్చిన నవల

# (ప్రారంభం)

**ప్రొలోగ్**

"తొలిసారి మిమ్మల్ని చూసింది మొదలు.. కదిలాయి మదిలోనె ఎన్నెన్నో కథలు... ఎన్నెన్నో కథలు..."

కుర్చీలో వెనక్కి వాలి, హెడ్‌ఫోన్స్‌లో వినపడే పాట, ఏనాటి జ్ఞాపకాలనీ తట్టి లేపుతుంది. ఏమైంది ఇవేళ తనకు? చాలా ఏళ్ళ తరవాత, పాత పాటల సీడి వింటూ కూర్చుంది. తనకు చాలా ఇష్టమైన పాటలన్నీ ఏర్చి కూర్చి చేయించుకున్నది ఈ సీడీలో.

తెల్లవారు ఝామున శబ్దమే చేయకుండా విచ్చుకునే పున్నాగపూలను చూసినప్పుడు, తుషార బిందువుల్ని బద్ధకంగా విదిలించుకునే ముద్దబంతిని పలుకరించినప్పుడు, హర్షవర్షంతో పులకరించే ప్రకృతిలో పాలుపంచుకున్నప్పుడో సాయం సంధ్యతో ఆకాశరాజుకు, పుడమి కన్నె చాటుగా పంపే లేఖ గురించి తెలిసినప్పుడో –

జంట కోసం ఒంటరి కోయిల పాడే విషాదగీతం –

నా కంటి చివర ఆర్ద్ర గీతమైనప్పుడో –

అప్రయత్నంగా, మది గదులను తెరచుకుని గతం ముందు నిలుస్తుంది. ప్రతి మనిషికి ఒక గతం ఉంటుంది. ఆ గతం తాలుకు ప్రభావం కూడా ఉంటుంది. కొన్ని పొరపాట్లు సరిదిద్దుకోలేనంతగా జీవితపు గమ్యాన్ని మార్చేస్తాయి.

ఎంతో కావాలని తపించిన వాటిని సాధించుకునే సత్తా లేక, ఒక రకమైన ప్రేమరాహిత్యంలో కొట్టుకుపోతూ, ఈ మధ్య వయస్సులో ఈ ఆలోచనల వలన ఏమిటి ప్రయోజనం?

నాది మధ్య వయస్సా? అంటే జీవితంలో సగభాగం అయిపోయిందా? నిజం చెప్పాలంటే గడిచిపోయిన జీవితం ఎంతో ఉత్సాహంగా, సంతోషంగా ఉండవలసింది. ఆ సంతోషపు బలంతో, సంతృప్తితో మిగతా జీవితం గడపాలి.

యవ్వనపు తొలకరిలో ఎంతో గాఢంగా విశ్వసించేదానిని. నా కోసం ఎవరో ఒకరు ఉండే ఉంటారని, నాకోసం నన్ను నన్నుగా నన్ను నేను మరచిపోయేంతగా నన్ను ప్రేమిస్తారని. పిచ్చితనం కదూ!

ఎందుకో ఎవ్వరూ ధైర్యంగా నా చెయ్యి అందుకోలేకపోయారు. కాలేజీలో ఉన్నప్పుడు చాలామంది అమ్మాయిలకు ఓ ప్రేమకథ నడిచేది. ఒక్క ప్రేమలేఖ కూడా అందుకోని అతి కొద్దిమంది ఆడపిల్లల్లో నేనూ ఒకదాన్ని.

ఒక మోస్తరు అందగత్తెను, చాలా చలాకీగా ఉండేదాన్ని. ఎప్పుడూ చుట్టూ స్నేహితులు హడావుడి. బాగా చదివేదాన్ని. అయినా సరే ఏ ఒక్క అబ్బాయి ధైర్యం చేసి నాతో అతి చనువు ప్రదర్శించలేదు. దానికి నా స్నేహితురాలి నిర్వచనం – ఎంత స్నేహంగా ఉన్నా కానీ కళ్ళతో ఆమడ దూరం పెడతానంట నేను. అందుకే అబ్బాయిలకు భయం అంట నేనంటే. ఒక రకంగా గర్వంగా అనిపించేది ఆ మాటలకు.

జీవితంలో ఏదో వెలితి, గుండెలో శూన్యం. ఎవ్వరితోనూ మాట్లాడాలని లేదు. ఒంటరిగా ఎక్కడికన్నా వెళ్ళాలని ఉంది. ఎందుకీ బంధాలు కాళ్ళకు అడ్డం పడుతున్నాయి.

అనవసరంగా గోరంతను కొండంతలు చేసి బాధపడుతున్నానా? ఈ జీవితంలో నాకు ఇంతే ప్రాప్తం అని సర్దుకుపోనా? మనఃశ్శాంతి, ఆనందం ఎక్కడున్నాయో తెలిస్తే వెతుక్కుందును. ఇంకా ఎన్నాళ్ళు బ్రతుకుతానో తెలియదు. మానసికంగా శారీరకంగా అలసిపోయాను. ఇంకా ఎన్నాళ్ళు పోరాడాలి? ఎవరి కోసం పోరాడాలి?

ప్రాప్తమను కోనీ క్షణమే బ్రతుకులాగా..

***అనిత***

గ్రీష్మ ఋతువు - 1997

విమానం కొద్ది నిమిషాల్లో లాండ్ అవ్వబోతుందని ఎనౌన్సుమెంటు విని చదువుతున్న పుస్తకం పక్కన పెట్టి, కిటికీలో నుండి క్రిందకు చూసింది అనిత. కొంచెం కంగారుగా, బెరుకుగా, ఆనందంగా ఎన్నెన్నో భావాలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి అనితను.

తనకు వీసా వచ్చేదాకా అస్సలు నమ్మకం లేదు. అప్పటికే చాలా మంది వీసాలు తిరస్కరించబడటంతో చాలా నిరుత్సాహంగా అనిపించింది. కష్టపడి టోఫ్ఫ, జి.ఆర్.ఇ, జీ. మాట్ అని రకరకాలుగా కోచింగ్ కోసం తిరిగి, పరిక్షలు రాసి, అమెరికాలో మంచి యూనివర్సిటీలో సీటు సంపాదించి, వీసా దగ్గర తిరస్కరింపబడి ఎంతోమంది తన స్నేహితులు నిరుత్సాహంగా మద్రాసునుండి తిరిగి వచ్చారు.

వీసా అప్రూవయ్యింది అని వినగానే ఒక్క క్షణం నమ్మబుద్ది కాలేదు. ఒక్కతే దేశంకాని దేశంలో అని కొంచెం కంగారు వేసినా, అక్కకూడా అమెరికాలో ఉండటం, ఇంకా స్వభావరీత్యా ఉన్న ధైర్యంతో ఉత్సాహంగా బయలుదేరింది.

డెట్రాయిట్ విమానాశ్రయంలో విమానం ఆగాక, కస్టమ్స్ అయ్యాక, లగేజి తీసుకుని బైట లాంజ్‌లోకి వచ్చింది అనిత.

''హాయ్ అనిత'' చేతులు ఊపుతూ దగ్గరకు వచ్చింది కవిత.

''హాయ్ అక్కా! ఎలా ఉన్నావు?'' మూడు సంవత్సరాల తరువాత చూస్తున్న అక్కను గట్టిగా హత్తుకుంది అనిత.

''నాకు హాయ్ చెప్పవా? నేనే నిన్ను కాలేజీకి తీసుకువెళ్ళేది'' నవ్వుతూ దగ్గరకు వచ్చాడు ప్రసాద్.

''మీతో చాలా అవసరం ఉంది బావా, ఎలా మర్చిపోతాను మిమ్మల్ని'' నవ్వింది అనిత.

''ఇప్పటిదాకా మీ అక్కతో గెలవలేకపోయాను. ఇంక ఇద్దరూ తోడైతే నేను అవుట్'' లగేజ్‌ని ట్రాలీలో కారు దగ్గరకు తీసుకు వెళుతూ అన్నాడు ప్రసాద్.

ప్రసాద్ అక్కడే ఉన్న కార్ల కంపెనీలో ఇంజనీరుగా చేస్తున్నాడు. కవిత పెళ్ళి అయ్యి మూడు సంవత్సరాలు అయ్యింది.

కారులో ఇంటికి వెళ్ళే వరకు అక్కా చెల్లెళ్ళు ఒకటే కబుర్లు. విపరీతమైన ఫోన్ బిల్లు వలన, ఉత్తరాలు రాసుకోవటమే మార్గం, అంతేలేని వారి మాటలకు, కబుర్లు చెపుతూనే కారులోనుండి బైటకు చూస్తుంది అనిత. విశాలమైన రోడ్లు, ఎత్తైన భవంతులు, ఇన్ని కార్లు రోడ్డుమీద తిరుగుతున్నా కార్ల హారన్లు, శబ్దకాలుష్యం లేకపోవడం తమాషాగా అనిపించింది.

ఎయిర్‌పోర్టునుండి ఒక అరగంట ప్రయాణం చేసి కవిత వాళ్ళ అపార్టుమెంట్‌కు చేరారు. మూడు అంతస్తులు ఉన్న బిల్డింగులు చాలా ఉన్నాయి. పెద్ద కాంప్లెక్సు అది.

''స్నానం చేసిరా, భోజనం చేద్దాం'' అన్నది కవిత.

"అబ్బా! ఇప్పుడేమీ వద్దు. ఆ ఫ్లైట్‌లో ఏదో ఒకటి పెడుతూనే ఉన్నారు. స్నానం చేసి రిలాక్స్ అవుతా. ఇదిగో ఈ సూట్‌కేసు. నిండా ఏవో పంపింది అమ్మ. సర్దుకో" అని చెప్పి స్నానానికి వెళ్ళింది అనిత.

వేడినీళ్ళతో హాయిగా తలస్నానం చేసి అక్కతో కబుర్లు చెపుతూ సోఫాలో నిద్రపోయింది అనిత.

"లే అనిత ఇంక, రెండు గంటలు పడుకున్నావు. ఇంక చాలు లేకపోతే జెట్‌లాగ్‌తో ఇబ్బంది. ఇదిగో టీ తాగు" బలవంతాన కవిత లేపితే కానీ అనితకు తెలియలేదు సోఫాలో నిద్రపోయానని. " పద కాసేపు బైట వాకింగ్‌కు వెళదాం. నిద్రమత్తు వదులుతుంది" అని బలవంతాన బయలుదేరతీసింది కవిత.

కాంప్లెక్సులో నడవటానికి చాలా బాగుంది. మట్టి కనపడకుండా చక్కటి లాన్, పచ్చటి చెట్లు, చిన్న సరస్సు, దాంట్లో బాతులు, పక్కనే ఉన్న ఆటస్థలంలో పిల్లల కేరింతలు - చుట్టూ గమనిస్తూ నడుస్తుంది అనిత.

"చాలా బాగుందక్కా. ప్రశాంతంగా ఉంది మీ కాంప్లెక్స్"

"మంచిదయ్యింది నా మాట విని కాలేజీలో చేరటానికి నెలరోజుల ముందే వచ్చేశావు. కాస్త ఇక్కడ వాతావరణం, పద్ధతులు అలవాటు అవుతాయి. అమెరికా గురించి, ఇక్కడ మనుష్యుల గురించి మన దేశంలో చాలా అపోహలు ఉన్నాయి. అవన్నీ చాలా వరకు అపోహలే పోను పోనూ నీకు కూడా అర్థం అవుతాయి" అన్నది కవిత.

"ఇక్కడ అందరూ నీతో.. అంటే మన ఇండియన్స్‌తో బాగానే ఉంటారా అక్కా" కుతూహలంగా అడిగింది అనిత.

"ఇక్కడ సామాన్యంగా చాలా మర్యాదగా ప్రవర్తిస్తారు. అపరిచితులైనా ఎదురుపడితే హాయ్ అంటారు. ఒకరి విషయాల్లో అనవసరంగా జోక్యం చేసుకోరు. అన్ని దేశాల్లోలాగానే ఇక్కడ పేదరికం ఉంది, దానివల్ల సమాజంలో జరిగే నష్టాలు ఉన్నాయి. సరిగ్గా చదువుకోని పేదవర్గం, నిరుద్యోగం దానితో పాటే క్రైమ్. కాకపోతే మనదేశంలో తుపాకీలు వాడటం తక్కువ ఇక్కడ ఎక్కువ. రాత్రిపూట కొన్ని ప్రాంతాల్లో తిరగకుండా జాగ్రత్తగా ఉండాలి"

"నువ్వు చికాగోలాంటి పెద్ద సిటీలో చదువుకోటానికి వెళుతున్నావు. ఎటూ ఏదో ఉద్యోగంలో చేరతావు, కాస్త సేఫ్‌గా ఉండే ప్రాంతాల్లో ఉద్యోగం చెయ్యి. ఈ నెలరోజుల్లో నీకు కాస్త డ్రైవింగ్ నేర్పిస్తా. ఇండియాలో నేర్చుకున్నావు కాబట్టి నీకు కష్టంకాదు. ఇప్పుడే కారుకొనే అవసరం, స్తోమత రెండూ ఉండవు. అయినా నేర్చుకుంటే నష్టం లేదుగా" అన్నాడు ప్రసాద్.

అనితకు నెలరోజులు అక్కా,బావలతో చాలా సరదాగా గడిచిపోయింది. కవిత, అనిత ఇద్దరే పిల్లలు రాజారావు, లక్ష్మి దంపతులకు. కొంచెం ఎగువ మధ్య తరగతి కుటుంబం. ఆడపిల్లలు అని ఏమీ తక్కువగా పెంచలేదు. చిన్నప్పటినుండి మంచి పుస్తకాలు చదవటం, స్వతంత్రభావాలు, మంచి వ్యక్తిత్వంతో పెంచారు ఇద్దరు పిల్లల్ని.

కవితకు అమెరికా సంబంధం వచ్చినప్పుడు కొంచెం బెరకుగా అనిపించింది. చాలా దూరం, దేశంకాని దేశం, మంచికి చెడుకు వెంటనే వెళ్ళటానికి దూరాభారం అని. కానీ మధ్యవర్తి చాలా నచ్చచెప్పాడు. మంచి కుటుంబం, పిల్లాడిది మంచి ఉద్యోగం అని. దాంతో అంతా ఒప్పుకున్నారు.

అనిత కూడా చదువు పేరిట మళ్ళీ అంత దూరం వెళ్ళటం లక్ష్మికి అస్సలు నచ్చలేదు. పెళ్ళి చేసేద్దాం అని గట్టిగా పట్టుపట్టింది. కానీ అనిత వినలేదు. ఇప్పుడే పెళ్ళివద్దు. చదువుకోవాలని బాగా గొడవ చేసేసరికి, రాజారావు సర్ది చెప్పాడు.

కవిత కొంచెం నిదానమైన మనిషి. చిన్నప్పటినుండీ అమ్మ వెనకాలే తిరుగుతూ బుద్ధిమంతురాలు అని అందరి మెప్పు పొందింది. అనిత బాగా అల్లరి. ఇంట్లో గారాబం కూడా ఎక్కువే. తను నమ్మిన విషయం ఏదైనా ఖచ్చితంగా మాట్లాడుతుంది. అది అవతల వాళ్ళను కించపరిచేదిగా లేక అవమానపూరితంగా ఉండదు. కేవలం తన అభిప్రాయం నవ్వుతూ నిక్కచ్చిగా చెపుతుంది. ఎవరిమీదైనా కోపం వచ్చినా నవ్వుతూ చురకలు వేస్తుంది. అందుకే 'గడుగ్గాయి' అన్న బిరుదు కూడా సంపాదించిమి.

పైకి అలా అల్లరిగా, అన్నీ తేలికగా తీసుకున్నట్లు కనిపించినా చాలా సున్నితమైన మనస్సు అనితది. అమెరికాలో చదువుకోవాలన్న తన కల నెరవేరటం చాలా ఆనందంగా ఉంది అనితకు. అసలీ ఆలోచన కూడా అక్కకు పెళ్ళయ్యాకే కలిగింది. అక్కకు దగ్గరలో ఉండొచ్చనే ఆశ. కానీ తన స్వశక్తితో రావలన్న పట్టుదలతో, పెళ్ళి చేసుకోమని తల్లి ఎంత బలవంతం చేసినా లొంగలేదు.

రూములో తన సామాన్లు అన్నీ సర్దుకుంటుంది అనిత. అక్కా, బావతో కలిసి మధ్యాహ్నం వచ్చింది చికాగొ. ఆరుగంటల ప్రయాణం కారులో. సామాన్లు అన్నీ రూములో చేర్చి తిరిగి ప్రయాణం అయి వెళ్ళిపోయారు ఇద్దరూ.

తలుపు తీసిన శబ్దం, దానితోపాటే "హాయ్!" అని వినపడి వెనక్కు తిరిగి చూసింది అనిత.

తన కొత్త రూం మేట్ లీసా.

"హాయ్" అని నవ్వుతూ విష్ చేసింది అనిత.

లీసాతో పాటు వాళ్ళ అమ్మ, నాన్న కూడా లోపలకు వచ్చారు. ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు.

గుండ్రటి మొహం, గోధుమరంగు కళ్ళు, నడుముదాకా ఉన్న లేత గోధుమ రంగు జుట్టు, షార్ట్స్, టీ షర్టులో చాలా అందంగా ఉంది లీసా. వాళ్ళ అమ్మకూడా దాదాపు అలానే ఉంది. నిజం చెప్పాలంటే తల్లిలాగా కాకుండా అక్కలాగా ఉంది.

"చాలా అలసిపోయాను. నిద్రపోవాలని ఉంది. ఐదుగంటలు ప్రయాణం చేసి వచ్చాను" తల్లిదండ్రులు వెళ్ళిపోయాక మంచం మీద కూలబడుతూ అన్నది లీసా.

చిన్నగా నవ్వి ఊరుకుంది అనిత.

"నువ్వు తక్కువ మాట్లాడుతావా? నేనైతే ఎప్పుడూ వాగుతూనే ఉంటా ఎలా భరిస్తావో" నవ్వింది లీసా.

"లేదు. కొంచెం అలవాటు అవ్వాలి."

"ఏ కంట్రీ నీది? నీ ఇంగ్లీష్ యాస కొంచెం తమాషాగా ఉంది" కుతూహలంగా అడిగింది లీసా.

"ఇండియా నుండి"

"నాకు వేరే దేశాల లేదా ప్రాంతాల సంస్కృతి, జీవిన విధానం తెలుసుకోవాలంటే చాలా ఇష్టం. అందుకే రూం అప్లికేషన్‌లో వేరే దేశం వాళ్ళు కావాలని పెట్టాను. నేను బిజినెస్ మేనేజ్‌మెంట్ చెయ్యబోతున్నాను. మరి నువ్వు?" అడిగింది లీసా.

"నేను కంప్యూటర్స్"

"ఓ వావ్! చాలా తెలివికలదానివి అయితే. బైటకు వెళ్ళి మిగతా రూమ్స్‌లో ఎవరున్నారో పరిచయం చేసుకున్నావా?"

"లేదు ఇంకా" అన్నది అనిత

"రా అయితే. కామన్ రూములో టివి ఉంటుంది కదా. ఎవరన్నా కనిపిస్తారేమో చూద్దాం. తర్వాత బైట శాండ్‌విచ్ తినేసి వద్దాం. రేపటినుండి చాలా బిజీ అయిపోతాం కదా" అంటూ చనువుగా లాక్కెళ్ళింది లీసా.

నెలరోజులు ఎలా గడిచిపోయాయో కూడా అర్థం కానంత వేగంగా గడిచిపోయాయి అనితకు. కొత్త వాతావరణం, కాలేజి పరిసరాలు, కొత్త పరిచయాలు అన్నీ ఎక్జయిటింగ్‌గా ఉంది. రోజు మొత్తం క్లాసులు ఉండకపోవటంతో, తన ఖర్చులకు ఉద్యోగం చెయ్యాలని, అక్కడే ఉన్న బుక్ షాపులో ఉద్యోగం సంపాదించుకుంది.

ఇండియాలో ఉన్నప్పుడు కాలేజి చదువంతా చాలా సరదాగా గడచిపోయింది. కాలేజి, హాస్టలు ఫీజులు నాన్న కట్టటంతో డబ్బు గురించి ఆలోచించాల్సిన అవసరం ఎప్పుడూ రాలేదు. బాగా చదువుకోవటం, ఫ్రెండ్‌తో సరదాగా ఎంజాయ్ చెయ్యటం ఇంతే.

అమెరికాలో చదువు, ఉద్యోగంతో చాలా సతమతమయ్యింది అనిత. మొదటి సెమిస్టరుకు నాన్న ఫీజు కట్టేసినా, మిగతా అందరిని చూసి చాలా నేర్చుకుంది అనిత. లీసా స్నేహంతో అమెరికాలో కాలేజీ చదువు ఎంత కష్టమో, ఆర్థికంగా ఎంత భారమో తెలుసుకుని, ఇండియాలో తల్లిదండ్రుల కష్టాన్ని అర్థం చేసుకోకుండా ఎలా ఉండేదాన్నా అని సిగ్గేసింది అనితకు. దాదాపు అందరూ లోన్లు తీసుకుని, లేక ఉద్యోగం చేస్తూ డబ్బు దాచుకుని చదువుకుంటారు. ఎలాంటి ఉద్యోగం చెయ్యటానికైనా వెనుకాడరు తక్కువగా భావించరు.

"అనితా నీకు ఓ వ్యక్తిని పరిచయం చెయ్యటానికి తీసుకొచ్చా. తను నా క్లాస్‌మేట్ ప్రియ. నా రూమ్మేట్ కూడా ఇండియన్ అని చెప్పి పరిచయం చెయ్యాలని తీసుకొచ్చా" లీసా పరిచయం చేసింది.

భుజాల దాకా కత్తిరించిన జుట్టు పక్కకి తీసుకుంటూ "హాయ్" అని చెయ్యి కలిపింది ప్రియ.

జీన్స్, టీ షర్ట్‌లో పొడుగ్గా చాలా స్టైలిష్‌గా ఉన్న ప్రియ వైపు కుతూహలంగా చూసి నవ్వింది అనిత.

"కమ్ లెట్స్‌గో ఎండ్ హావ్ పిజ్జా" అంటూ బయలుదేర తీసింది ప్రియ. క్యాంపస్‌లో రకరకాల ఫాస్ట్‌ఫుడ్ జాయింట్లు ఉన్నాయి. వెళుతున్నంతసేపూ ప్రియ, లీసా మాట్లాడుతూనే ఉన్నారు. ప్రియది కూడా హైదరాబాదు అని తెలిసి సంతోషించింది అనిత.

ముగ్గురు వెళ్ళి పిజ్జా కార్నర్‌లో కూర్చున్నారు. పిజ్జా ఆర్డరు చేశాక, "నీకు తెలుసా అనితా, ప్రక్కనే ఉన్న కాఫీ షాపులో ఒక తెలుగు అమ్మాయి పనిచేస్తుంది. కానీ తను స్టూడెంటు కాదు. పేరు రాజి" అన్నది ప్రియ.

"నేను పెద్ద గమనించలేదు. ఈసారి పరిచయం చేసుకుంటా" అన్నది అనిత.

"పిజ్జా తిన్నాక వెళదాం. సారీ లీసా నీకు బోర్ కొడుతుందేమో. కానీ వేరే దేశంలో, మన భాష మాట్లాడేవాళ్ళు కనపడితే ఇంత ఆనందంగా ఉంటుంది ఇప్పుడిప్పుడే అర్థం అవుతుంది" నవ్వుతూ ఎపాలజిటిక్‌గా అన్నది ప్రియ.

ప్రియలో ఒక ప్రత్యేకమైన ఆకర్షణ ఉంది. కేవలం అందంతో లేక వస్త్రధారణతో వచ్చింది కాదు అది. తన మాట తీరు చాలా ఆకర్షణీయంగా, అవతలి వ్యక్తి చాలా ప్రత్యేకం అనిపించేట్లు ఉంటుంది.

"ఉండండి మామ్‌కి ఫోను చేసి వస్తా" అంటూ లేచి వెళ్ళింది లీసా.

"లీసా తన అమ్మానాన్నలతో చాలా క్లోజ్. చాలా మంచి అమ్మాయి" అంది అనిత.

వీళ్ళు మాట్లాడుతుండగా పిజ్జా వచ్చింది, వెనకాలే లీసా కూడా.

"నీ గురించే మాట్లాడుకుంటున్నాము మేము. మీ పేరెంట్స్‌తో బాగా క్లోజ్ అంట కదా నువ్వు" అన్నది ప్రియ.

"మా అమ్మ చాలా కష్టపడింది తన జీవితంలో. పంతొమ్మిది సంవత్సరాలకే పెళ్ళికాకుండా తల్లి అయింది. కుటుంబ గౌరవం నాశనం అయిందని వాళ్ళ ఇంట్లో బాగా గొడవ అయ్యిందట. బాయ్ ఫ్రెండేమో మొహం చాటేసాడు. పట్టుదలతో పార్ట్ టైం ఉద్యోగం చేస్తూ సెక్రటరీ కోర్సు చేసింది. ఎలా చేసేదో నాకయితే తెలియదు కానీ నేను చంటి పిల్లను. రెండు ఉద్యోగాలు చేస్తూ నన్ను పెంచింది.

పగలు ఒక కంపెనీలో, రాత్రివేళ నన్ను నిద్రపుచ్చి చిన్న కంపెనీలకు లెక్కలు రాసేది. నాకు ఏమీ తక్కువ చెయ్యలేదు. ఎప్పుడు నిద్రపోయేదో కూడా నాకు తెలియదు'' పిజ్జా తింటూ చెప్పింది లీసా.

''లక్కీగా తన జీవితంలోకి షుమారు నాకు పదేళ్ళప్పుడు అనుకుంటా, జాన్, అదే నా సవితి తండ్రి వచ్చాడు. లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అని చెపుతాడు ఎప్పుడూ. మగాళ్ళు అంటే నమ్మకం పోయిన మా అమ్మకు మళ్ళీ ప్రేమ రుచి చూపించి పెళ్ళికి ఒప్పించాడు. నన్ను ఎప్పుడూ పరాయిగా చూడలేదు. చాలా ప్రేమ నేనంటే. మా అమ్మ నాకు రోల్ మోడల్. చాలా కష్టాలు పడింది చిన్న వయస్సులో, అయినా ధైర్యంగా జీవితాన్ని ఎదుర్కొంది'' చాలా ఇష్టంగా, ఆప్యాయంగా చెప్పింది లీసా తన తల్లి గురించి.

''వావ్! చాలా ఆశ్చర్యంగా ఉంది. ఇదే మా దేశంలో అయితే ఒకవేళ పెళ్ళికాకుండా తల్లి అయితే, వాడు ఎంత ఛండాలుడైనా వాడి కాళ్ళు పట్టుకుని పెళ్ళిచేస్తారు. ఒకవేళ అదీ కుదరకపోతే ఆ అమ్మాయి ఇక తల ఎత్తుకుని బ్రతకలేదు. సమాజంలో అందరి సూటిపోటి మాటలు పడలేక ఆత్మహత్య చేసుకునేదేమో'' కాస్త తీవ్రంగా అన్నది ప్రియ.

''మీ ఫాదర్ చాలా గ్రేట్. పదేళ్ళ కూతురున్న ఆమెను పెళ్ళిచేసుకోవటమే కాకుండా నిన్ను సొంత కూతురులాగా చూసుకున్నారు'' అంది అనిత.

కబుర్లు చెప్పుకుంటూ పిజ్జా తినేశారు. ముగ్గురు బిల్లు షేర్ చేసుకుని కాఫీ షాపుకు వచ్చారు రాజిని పరిచయం చేసుకోవటానికి.

కౌంటరు వెనకాల ఉంది రాజి ఆర్డరు తీసుకుంటూ. వెళ్ళి పలకరించారు ప్రియ, అనిత. మొహమాటంగా నవ్వింది రాజి. వాళ్ళ బాబాయిది అంట ఆ కాఫీ షాపు. దాంట్లో తాను పని చేస్తున్నానని చెప్పింది. బిజీగా ఉండటం చూసి మళ్ళీ కలుస్తామని చెప్పి బైటకు వచ్చారు ముగ్గురు.

**''ఏంటి ఇంకా** ఇలాగే కూర్చున్నావు? రెడీ అవ్వలేదా? చెప్పాకదా పార్టీ ఉందని. ఏంటి మనసు మార్చుకున్నావా?'' గదిలోపలకు వస్తూనే ప్రశ్నల వర్షం కురిపించింది ప్రియ.

''అబ్బా! చాలా అలసటగా ఉంది. ఇప్పుడు రాలేను. పైగా ఎల్లుండికి ఒక ఎస్సైన్‌మెంట్ పూర్తిచెయ్యాలి. నాకు ఈ పార్టీలు అవీ నప్పవు, వదిలెయ్యి'' అంది అనిత.

''కాలేజ్ లైఫ్ అంటే చదువుతోపాటు ఎంజాయ్ చెయ్యాలి. ఈ ఎంజాయ్‌మెంట్ మళ్ళీ వస్తుందా? లేలే'' హడావుడి చేసింది ప్రియ.

''లీసా చెప్పింది ఈ పార్టీల్లో అందరూ బాగా తాగుతారంట కదా? నాకు ఇలాంటి పార్టీలు అలవాటు లేదు'' ఇబ్బందిగా అన్నది అనిత.

''చూడు అనిత పార్టీ అంటే రకరకాలు ఉంటారు. అయినా తాగిన వాళ్ళు అందరూ చెడ్డవాళ్ళు అని ఎవరు చెప్పారు నీకు. నీకు తాగాలని లేకుంటే ఎవ్వరూ బలవంతం చెయ్యరు కదా! మన లిమిట్స్‌లో మనం ఉంటాం. ఎవరో అభిప్రాయాలతో, ప్రభావంతో ఎందుకు బ్రతుకుతావు. నీ జీవితం నీది, నువ్వు నీ అనుభవాలతో, నీ ఆలోచనలతో ముందుకు వెళ్ళు'' కోప్పడింది ప్రియ.

దాదాపు యాభైమంది ఆడపిల్లలు, మగపిల్లలు - కబుర్లు, కేరింతలు హోరెత్తించే మ్యూజిక్ - వాతావరణంలో ఒకరకమైన ఎగ్జైట్‌మెంట్ తెలియని గమ్మత్తైన మైకం. అందరిని ఆసక్తిగా గమనిస్తూ, తెలిసిన వాళ్ళను పలకరిస్తూ లోపలికి వెళ్ళారు ముగ్గురు స్నేహితురాళ్ళు.

గుంపులుగా నిల్చుని మాట్లాడుకునే వాళ్ళు కొంతమంది, మ్యూజిక్ తగ్గట్లుగా డాన్సు చేసేవాళ్ళు కొంతమంది, అందరిని దాటుకుంటూ స్నాక్స్, డ్రింక్స్ ఉన్న చోటుకు వచ్చారు.

"ఏమున్నార్రా ఒక్కొక్కళ్ళు, కత్తిలాంటి ఫిగర్స్" పక్కనుండి తెలుగు మాటలు విని తలతిప్పి చూశారు ప్రియ, అనిత. చేతిలో బీరు పట్టుకుని చుట్టూ చూస్తు మాట్లాడుకుంటున్నారు ఇద్దరు అబ్బాయిలు.

వచ్చే నవ్వును ఆపుకుంటూ "కాస్త జాగ్రత్త, కత్తులు తెగుతాయి" అన్నది ప్రియ. ఉలిక్కిపడి ఇటువైపు తిరిగారు ఇద్దరూ.

"హాయ్ ప్రియ! నువ్వేనా! వస్తావని అనుకోలేదు. అందుకే ఇంత ధైర్యంగా తెలుగులో మాట్లాడుకుంటున్నాం"

"అనిత ఇతను నా క్లాస్‌మేట్ ఆనంద్. తనకు తానే పెద్ద హీరో అనుకుంటాడు" టీజింగ్‌గా పరిచయం చేసింది ప్రియ.

"హాయ్ ఐ యామ్ శ్రీనివాస్ - శ్రీని" అంటూ పక్కన ఉన్న అబ్బాయి తనని తాను పరిచయం చేసుకున్నాడు.

"సర్లే మేము పక్కన ఉంటే అమ్మాయిలకు సైటు వేసుకోలేరు. మళ్ళీ కలుద్దాం" నవ్వుతూ అన్నది ప్రియ.

"అవునూ! స్టీవ్ రాలేదా పార్టీకి? వస్తానన్నాడే"

"వచ్చాడు. ఈ గుంపులో ఎక్కడ చిక్కడిపోయాడో" అన్నాడు ఆనంద్.

అనితకు అంతా కొత్తగా, కొంచెం ఇబ్బందిగా ఉంది.

ఇండియాలో ఎప్పుడూ ఇలాంటి పార్టీలకు వెళ్ళలేదు. ఒకవేళ పుట్టినరోజు పార్టీలలో అబ్బాయిలు, అమ్మాయిలు ఉన్నా, అందరూ దగ్గర స్నేహితులే కాబట్టి సరదాగా ఉండేది.

తాగితే సినిమాల్లో లాగా ప్రవర్తిస్తారు అనుకునేది ఇన్నాళ్ళు. అతిగా తాగి, అతిగా వాగటం, తూలటం అమర్యాదగా ప్రవర్తించటం అనుకునేది. కానీ ప్రస్తుతానికి అలాంటివి ఏమీ కనబడలేదు.

"ఇదిగో ఈ వైన్‌కూలర్ తాగు" ప్రియ ఇచ్చింది.

"వద్దు ప్రియ. నేను ఆల్కహాలు తీసుకోను" మృదువుగా తిరస్కరించింది అనిత.

"ఇదేమంత ఆల్కహాలు కాదు. చాలా మైల్డ్. బాగుంటుంది, ట్రై చెయ్యివోయ్. హావ్ సమ్ ఫన్" లీసా చెప్పింది.

"వద్దు ప్లీజ్. ఇంకెప్పుడైనా తాగుతాలే. వదిలెయ్యండి. మీరు ఎంజాయ్ చెయ్యండి."

లీసా, ప్రియకు ఇంకెవరో క్లాసుమేట్స్ కనపడితే అటువైపు వెళ్ళారు. ఒంటరిగా నిలబడి చుట్టూ అందరిని గమనిస్తూ నిల్చుంది అనిత. స్త్రీ పురుషుల మధ్య సహజంగా ఉండే కవ్వింతలు - ఏదీ దాచుకోకుండా, అనవసరమైన ముసుగులు లేకుండా, స్వేచ్ఛగా ఆనందంగా ఒక రకమైన స్వచ్ఛతతో కూడిన తుళ్ళింత.

"నా పేరు స్టీవ్. స్టీవెన్ మిల్లర్. ప్రియ క్లాస్‌మేట్‌ని, ఇందాక ప్రియతో చూశాను నిన్ను" అనిత మాట్లాడకపోవటంతో మళ్ళీ తనే అన్నాడు.

"ఐ యామ్ అనిత"

"అనీట?" స్పానిష్ వాళ్ళు పలికినట్లుగా పిలిచాడు స్టీవ్.

"కాదు అనిత" స్పష్టంగా పలకటం నేర్పింది.

"ఏంటి ఒక్కదానివి నిల్చున్నావు? బోర్ కొడుతుందా?"

అనిత జవాబు చెప్పేలోపల ప్రియ దగ్గరకు వచ్చింది.

"హాయ్ స్టీవ్! రాలేదేమో అనుకున్నాను కనపడకపోయేసరికి"

ప్రియతో మాట్లాడుతున్నా స్టీవ్ అనితనే గమనిస్తున్నాడు. ప్రియలో అయిస్కాంతంలాగా లాగేసే ఆకర్షణ ఉంది. చనువుగా ఉండే తన మాట తీరు కావచ్చు, తొందరగా అందరితో కలిసిపోయే స్వభావం కావచ్చు. తన సమక్షంలో ఇంకే ఆలోచన రాకుండా ఉక్కిరిబిక్కిరి అయిపోతారు చాలామంది అబ్బాయిలు.

అనితలో బాగా పరిచయం ఉన్నవాళ్ళకే తెలుసు తను ఎంత సరదాగా చిలిపిగా ఉంటుందో. క్రొత్తగా పరిచయం అయిన వాళ్ళకు ఒక ప్రశాంతమైన నదిలా ఉంటుంది. తన చుట్టూ ఒక గంభీరత, కళ్ళతో ఆమడదూరంలో కట్టిపడేస్తుంది.

"ప్రియ నేను వెళతాను, నా అస్సైన్మెంటు పూర్తి చెయ్యాలి. మీరు ఎంజాయ్ చెయ్యండి" అన్నది అనిత ఒక గంట తర్వాత.

"అరె ఒక్కదానివే వెళతావా? కాస్త ఆగు" ప్రియ వారించింది.

"నిజం చెప్పాలంటే నేను కూడా వెళ్ళాలి. చాలా పని ఉంది. అనితను రూం దగ్గర దింపేసి వెళ్ళిపోతాను" అన్నాడు స్టీవ్ వెంటనే.

స్టీవ్‌వైపు ఆశ్చర్యంగా చూసింది ప్రియ. స్టీవ్‌కి పార్టీలంటే ఎంత సరదానో చాలాసార్లు చెప్పాడు.

"పర్లేదు నేను ఒక్కదాన్నే వెళతాను. కాంపస్ బస్ ఉంటుంది కదా" ఇబ్బందిగా అన్నది అనిత.

"ఈ టైంలో ఎందుకు ఒక్కదానివే, బస్ దిగిన తర్వాత నడవాలి కదా రూందాకా. నేను వెళ్ళేది అటువైపే. ప్లీజ్ కమ్. ప్రియ నీ ఫ్రెండ్‌కు చెప్పు నేను నమ్మదగిన వ్యక్తినే అని" నవ్వుతూ అన్నాడు స్టీవ్.

మరీ మొండితనం పోకుండా స్టీవ్‌తో బయలుదేరింది అనిత.

"కొంచెం చలిగా ఉంది. కాఫీ ఏమన్నా తాగుదామా?" అడిగాడు స్టీవ్ నడుస్తూ.

తనకు తోడు వస్తున్నాడు. పాపం చలిగా ఉందేమో అని ఒప్పుకుంది అనిత.

"ఇండియానుండి వచ్చావు కదా, ఈ చలి నీకు కొత్తగా ఉంటుందేమో కదా! నవంబరు నుండి ఏప్రిల్ దాకా బాగా చలి, స్నో ఉంటుంది. మొదటి సంవత్సరం కష్టం నీకు"

కాఫీ తీసుకుని కూర్చున్నారు ఇద్దరూ ఒక కాఫీ జాయింట్‌లో.

"కష్టమేనేమో. మా అక్క చెప్పింది. తను డెట్రాయిట్‌లో ఉంటుంది. మూడు ఏళ్ళు అయ్యింది తను అమెరికా వచ్చి."

"మా పేరెంట్స్ విస్కాన్సిన్ రాష్ట్రంలో ఉంటారు. ఇక్కడికి ఒక రెండు గంటల ప్రయాణం. మా నాన్న ఒక ఫాక్టరీలో సూపర్‌వైజర్, అమ్మ గృహిణి. నాకు ఒక అక్క, చెల్లి ఉన్నారు. అక్కకు పెళ్ళి అయిపోయింది. చెల్లెలు హైస్కూల్లో ఉంది" తన గురించి చెప్పాడు.

అనిత తన గురించి కూడా చెప్పింది. ఇండియాలో తన జీవితం, జీవన విధానం గురించి చాలా ఆసక్తిగా అడిగాడు. అనితకు కొంచెం ఆశ్చర్యంగా అనిపించింది అతని ఆసక్తి. చాలామంది అమెరికన్లకు వాళ్ళ దేశం చాలా గొప్పదని, మిగతా అన్ని దేశాలు చాలా పేదరికంలో మగ్గిపోతున్నారని రాతియుగంలో బ్రతుకుతున్నారని ఓ అభిప్రాయం. పెద్దగా ప్రపంచ జ్ఞానం కూడా చదువుకున్న చాలామందికి ఉండదు.

కానీ స్టీవ్ ఆ అభిప్రాయాలకు అపోహలకు దూరంగా నిజంగా ఒక కొత్తదేశం గురించి తెలుసుకోవటానికి ప్రయత్నించటం నచ్చింది అనితకు. కాఫీ తాగుతూ ఒక గంట ఎలా గడిచిపోయిందో కూడా తెలియలేదు అనితకు.

"చాలా ఆలస్యం అయ్యింది ఇక వెళదామా?" మృదువుగా అడిగింది అనిత చిన్నగా నవ్వి లేచాడు స్టీవ్.

“I had lot of fun tonight. See you soon” రూం దగ్గర దిగబెడుతూ అన్నాడు స్టీవ్.

"నాక్కూడా. గుడ్‌నైట్."

అనిత లోపలికి వెళ్ళే వరకు బిల్డింగ్ బైట నిల్చొని వెళ్ళాడు స్టీవ్.

"ఏంటి వీకెండ్ ప్లాన్లు? బాన్‌ఫైర్ ఉంది ఇవాళ రాత్రి. వెళదాం మనం" రూంలోకి వస్తూనే అన్నది ప్రియ.

"వెళ్ళాలనే ఉన్నది. కానీ బుక్‌షాప్‌లో రాత్రి తొమ్మిదిదాకా పని ఉంది. ఆలస్యం అవుతుందేమో."

"అబ్బా ఏమీ ఆలస్యం అవదులే. వెళదాం. రెండు వారాలనుండి నిన్ను కలవలేకపోయాను. ఏంటి స్టీవ్‌కి నీకు మధ్య కథ" కుతూహలంగా అడిగింది ప్రియ.

"మా మధ్య కథ ఏంటి? ఏం మాట్లాడుతున్నావు? ఆ రోజు రూం దగ్గర దింపాడు అంతే" నొసలు చిట్లిస్తూ అన్నది అనిత.

"అరె కోపం తెచ్చుకోకు. నువ్వంటే కొంచెం ఇంట్రెస్టు చూపించాడు. రెండుసార్లు నీ గురించి అడిగాడు. తనే చెప్పాడు. ఆ రోజు కాఫీ తాగారని రూం దగ్గర దింపాడని. చాలాసేపు మాట్లాడుకున్నారంట" నవ్వుతూ కన్ను కొట్టింది ప్రియ.

"ఏంటి ప్రియా నువ్వు కూడా. ఒక అబ్బాయి అమ్మాయి మాట్లాడుకుంటే ఇక అర్ధం ఒకటేనా?"

"లేదు తల్లీ. కానీ ఒక అబ్బాయి అందునా అమెరికా అబ్బాయి ఇంట్రెస్టు చూపిస్తుంటే తెలుసుకోలేవా? స్టీవ్ చాలా సరదాగా ఉంటాడు. బాగా తెలివికలవాడు. ఇంక్ హాండ్‌సమ్‌గా ఉంటాడు. ఇంకేం కావాలి?" ఏం మాట్లాడలేదు అనిత.

నిజంగా స్టీవ్ తనంటే ఆసక్తి చూపాడా? చాలా చక్కగా మాట్లాడాడు. బాగా flirt చేస్తాడు అని చెప్పింది ప్రియ. కానీ తనతో అలా మాట్లాడలేదు. ఫ్రెండ్లీగా ఉన్నాడు. నవ్వే కళ్ళు. ఛ! ఏంటిలా ఆలోచిస్తుంది. ప్రియకు ఏమీ పనిలేదు. ఇలాగే కెలుకుతుంటుంది" బలవంతానా మనస్సు మళ్ళించుకుంది అనిత.

"చూడు ప్రియ, చాలా కష్టపడి అమెరికాలో చదువుకోటానికి వచ్చాను. అందరిని ఒప్పించాను. చాలా డబ్బులు ఖర్చుపెట్టారు నాన్న. నాకు ఏ రకమైన ఆలోచనలతో దృష్టి మళ్ళించుకోవాలని లేదు. అబ్బాయిలతో సరదాగా తిరగటం నా ఒంటికి సరిపడదు. బాగా చదవాలి. మంచి కెరియర్ ఉండాలి. నాకంటూ ఒక గోల్ ఉంది. అది సాధించాలి"

"అరె లైట్ తీసుకో. ఇక్కడ ఎవరికి లేదు గోల్? అంతమాత్రాన లైఫ్ అంతా సీరియస్‌గా ఉంటామా? సరదాగా ఉన్నంతమాత్రాన జీవితంలో ఏమీ సాధించలేమా? అన్నీ బాలెన్సు చెయ్యాలి."

"సరే! థాంక్స్‌గివింగ్ వీకెండ్‌కి అక్క దగ్గరకు వెళుతున్నాను. నువ్వు కూడా నాతో రా. సరదాగా ఉంటుంది" టాపిక్ మారుస్తూ అంది అనిత.

"చూద్దాంలే! సాయంత్రం తప్పకుండా రా. నీకు తెలిసినవాళ్ళు చాలామంది వస్తారు. ఎంజాయ్ చేద్దాం బాగా" బయలుదేరుతూ మళ్ళీ గుర్తుచేసింది ప్రియ.

ఉవ్వెత్తున ఎగసిపడే మంటల కాంతి. హోరెత్తే మ్యూజిక్ మధ్య అందరి కేరింతలు - అనిత నడిచివస్తుంటే దూరానికే వినపడింది. ‘బాగా చలిగా ఉంది‘ సన్నగా ఒణుకుతూ కోటు దగ్గరగా లాక్కుని జిప్ వేసుకుంది.

చాలామంది ఉన్నారు బోన్ఫైర్ దగ్గర, తెలిసిన వాళ్ళు ఎవరైనా ఉన్నారా అని వెతికింది. తన క్లాస్‌మేట్స్ మైక్, కేటీ కనిపించారు. వాళ్ళతో మాట్లాడుతూ చుట్టూ గమనించింది. కొంతమంది వింత కాస్ట్యూమ్స్ వేసుకుని ఉన్నారు.

"హాయ్ అనిత" దగ్గరకు వచ్చారు ప్రియ, ఆనంద్, శ్రీవి.

"ఇదిగో ఆపిల్ సైడర్ తాగు. హాయిగా వేడిగా ఉంది. లేకపోతే అక్కడ హాట్ చాక్లెట్ ఇస్తున్నారు. తెచ్చుకో" ప్రియ చెప్పింది.

"హాయ్ ప్రెట్టీ గర్ల్స్" స్టీవ్ గొంతు విని తలతిప్పి చూసింది అనిత.

నలుపురంగు జీన్స్, గ్రీన్ స్వెటర్‌తో చాలా హాండ్సమ్‌గా ఉన్నాడు.

"అమ్మాయిలతో ఫ్లర్ట్ చెయ్యకుండా ఉండలేవా? అయినా ఇదొక టాలెంట్ లే" నవ్వాడు ఆనంద్.

"ఏమన్నాను నేను? అందమైన అమ్మాయిలతో ఉన్నమాటే కదా అన్నాను" అతి అమాయకమైన మొహంతో అన్నాడు స్టీవ్.

"అనితకు హాట్ చాక్లెట్ కావాలంట తీసుకురా" పురమాయించింది ప్రియ.

"పర్లేదు నేను తెచ్చుకుంటా"

"ఇద్దరం వెళదాం. నాకు కూడా కావాలి" అన్నాడు స్టీవ్.

"రండి మనం డాన్స్ చేద్దాం" అందరిని లాక్కెళ్ళింది ప్రియ.

"ఏంటి శ్రీవి అనిత వైపే చూస్తున్నావు? అంత నచ్చిందా?" నవ్వింది ప్రియ.

"అవును బాగుంటుంది తను. కానీ నీ ఫ్రెండేంటి తెలుగు అమ్మాయి ఐనా ఆ తెల్లోడితో వెళుతుంది. మీ అమ్మాయిలకు మేము పనికిరామా?" గొణిగాడు శ్రీనివాస్.

"ఓయ్! కొంచెం కంట్రోల్లో ఉండు. ఎవరికి నచ్చిన వాళ్ళతో వాళ్ళు ఉంటారు. తెలుగు వాళ్ళు తెలుగువాళ్ళతోనే, దాంట్లో ప్రాంతాలు కులాల వారీగా పంచుకుంటారా? అమ్మాయిలకు నచ్చే విధంగా ఉండటం నేర్చుకో. అంతేకానీ ఇలా ఇంకొకళ్ళ మీద పడి ఏడవకు" క్లాసు పీకింది ప్రియ.

"తల్లీ దండం. సందు దొరకనివ్వవు బుర్ర తినేస్తావు"

"ఎప్పుడూ ఇంతేనా? ఇలా మౌనంగా నిదానంగా ఉంటావా?" చేతిలో హాట్ చాక్లెట్ గ్లాసు పెడుతూ అడిగాడు స్టీవ్.

"అలా ఏమీలేదు. చాలా బాగుంది ఇక్కడ. ఈ చలిలో, వెచ్చటిమంట, ఈ హాట్ చాక్లెట్..."

"కాసేపట్లో మంచి పోటీలు ఉంటాయి బాగుంటుంది."

"నాకు ఈ ఆకురాలే కాలం చాలా నచ్చింది. కొంచెం చలి, రంగులు మారిపోయే ఆకులు చాలా అందంగా ఉంది. మా ఇండియాలో ఇంత అతి మార్పులు ఎప్పుడూ చూడలేదు. అందుకేనేమో ఇంకా నచ్చింది" అంది అనిత.

"డిసెంబరు వస్తే బాబోయ్ ఏంటి ఈ చలి ఇండియా వెళ్ళిపోతాను అంటావేమో" నవ్వాడు.

"ఇక్కడ ఇంకా ఏమి చూశావు అనిత. దగ్గర్లో చాలా ప్రదేశాలు ఉన్నాయి వీకెండులో వెళ్ళటానికి. టైం అంతా చదువుకే పెడితే ఎట్లా?"

"రేపు 'కార్న్‌మేజ్' అంట. దానికి వెళదాం అంది లీసా"

"మరి నన్ను పిలవవా?" నవ్వుతూ అడిగాడు స్టీవ్.

"కారులో ఓ గంట ప్రయాణం అని అంది. నాకు కారు లేదుగా. తనని అడుగుతాను" మొహమాటంగా అంది.

"ఊరికే టీజ్ చేశాలే. నేను కూడా వస్తున్నా. మొత్తం పదిమంది రెండు కార్లు. నువ్వు మా దేశానికి అతిథివి. మా దేశం ఎంత అందమైనదో చూపించాలిగా"

ఖాళీ కప్పు అనిత దగ్గర తీసుకుని పారెయ్యటానికి వెళ్ళాడు స్టీవ్.

ఇద్దరూ కలిసి డాన్స్ చేస్తున్న ఫ్రెండ్స్ దగ్గరకు వెళ్ళారు.

గాలిలోనే ఒక తుళ్ళింత ఉందో, లేక అందరి ఉత్సాహపు కేరింతలోనో వాళ్ళతో పాటే కాళ్ళు కదిపింది అనిత. ఎంతో హాయిగా, మనసంతా ఉత్సాహంగా అనిపించింది. కాలేజీ అయిపోయాక ఒక సంవత్సరం అమెరికా రావటానికి ప్రయత్నాలు, వీసా టెన్షన్‌తో ఇక్కడికి వచ్చాక ఉద్యోగం చదువు మధ్య నలిగిపోతూ సతమతమైన అనితకు ఇవాళ చాలా తేలికగా అనిపించింది.

ఆదివారం కావటంతో కాఫీ షాపు కొంచెం ఖాళీగా ఉంది. రాజీని పలుకరించి ఒక కాపచీనో ఆర్డరు చేసింది అనిత. ఈ మధ్య ఆదివారం మధ్యాహ్నం వచ్చి కాఫీ షాపులో కూర్చోవటం బాగా అలవాటయ్యింది. నిదానంగా ఉండే రాజి ఎందుకో నచ్చింది. పెదవులు నవ్వుతున్నా అది కళ్ళదాకా పాకదు. ఏదో కోల్పోయినట్లు ఒక నైరాశ్యం రాజి కళ్ళల్లో.

చిన్న చిన్న మాటలతో మొదలయిన పరిచయం, ఎవ్వరూ లేకపోతే కాసేపు కూర్చుని కబుర్లు చెప్పుకునేదాకా వచ్చింది.

సినిమా కథలా ఉంటుంది రాజి జీవితం. దిగువ మధ్య తరగతి కుటుంబం. ఇద్దరు అక్కలు, వాళ్ళిద్దరికి అతి కష్టం మీద పెళ్ళిళ్ళు చేసేసరికి ఉన్న కొద్దిపాటి ఆస్తి అంతా హరించుకుపోయింది. కష్టపడి డిగ్రీ పూర్తిచేసింది రాజి, షార్టుహాండ్ టైపింగ్ పరీక్షలు పాసైయ్యింది. దానితోపాటే చిన్న కంప్యూటర్ కోర్సుకూడా. ఏదైనా గవర్నమెంట్ జాబ్ చూసుకుందామని పరిక్షలు రాస్తున్న సమయంలో హఠాత్తుగా తండ్రి గుండెపోటుతో మరణించాడు.

తండ్రి చేసింది బట్టలకొట్టు ఉద్యోగం కాబట్టి పోయిన తరువాత ఆ యజమాని జాలితో ఇచ్చిన డబ్బులు దినకర్మలు, పైఖర్చులకు సరిపోయాయి.

అదే సమయంలో వేరేపనిమీద అమెరికానుండి వచ్చిన చినతాత కొడుకు, వరసకు బాబాయ్ అయ్యే కుమార్, పిన్ని వాణి చాలా జాలి చూపించారు. అమెరికా వెళ్ళాక వీసా పేపర్లు పంపి తమ ఇంట్లో ఉంచుకుంటామన్నారు. మంచి ఉద్యోగం చూపిస్తామన్నారు. ఒకరకంగా బంధువులు కూడా అసూయపడ్డారు. అయాచితమైన అవకాశం దొరికిందని.

ఒక సంవత్సరం తరవాత తల్లిని అక్కలకు అప్పగించి చేతిలో సర్టిఫికెట్లు, అరడజను చీరలతో అమెరికాలో కాలుపెట్టింది రాజి.

కుమార్‌కు చికాగోలో నాలుగు కాఫీషాపులు ఉన్నాయి. ఇంక వేరే ఉద్యోగం కూడా. వాణీకూడా ఉద్యోగం చేస్తుంది. ఇద్దరివి ఒకేరకం మనస్థత్వాలు. రూపాయి పెట్టుబడి పెడితే దానికి పదింతలు లాభం ఉంటే కానీ చెయ్యరు.

రాజి పరిస్థితి చూడగానే ఇద్దరికీ ఒకే ఆలోచన వచ్చింది. ఇంట్లో పనులు చెయ్యటానికి తీసుకురావచ్చని వీసా పేపర్ల మీదకూడా తన తల్లిని చూసుకోవటానికి భాష తెలిసిన డొమెస్టిక్ హెల్ప్ అని రాశారు. రాజికి ఈ వీసాగోల అంతా అయోమయంగా ఉండేది. కుమార్‌కు ఇండియాలో తెలిసిన ట్రావెల్ ఏజంటు ద్వారా పేపర్లు పంపితే, ఆయన చెప్పమన్నట్లు వీసా ఇంటర్వ్యూలో చెప్పింది.

ఎలాగో వీసా వచ్చింది. అమెరికా వెళ్ళి ఒక చిన్న ఉద్యోగం సంపాదించి, అమ్మని తన దగ్గరే పెట్టుకుందాం, ఇంక కష్టాలు తీరినట్లే అని ఎంతో సంతోషించింది రాజి.

**మొదట్లో నెమ్మదిగా** ఇంట్లో పనుల్లో సాయం చెయ్యటంతో మొదలయ్యి ఒక వారంలోనే ఇంటి పని అంతా మీద పడింది. నాలుగు బెడ్‌రూమ్స్, నాలుగు బాత్‌రూమ్స్, ఫామిలీ రూం, లివింగ్ రూం, లైబ్రరీ, కిచెన్ డైనింగ్ హాల్, బేస్‌మెంటు - ఇవన్నీ అద్దంలా ఉంచాలి, లేకుంటే వాణికి చిరాకు. దానికి తోడు వంట, పిల్లలకు సాయం.

పిన్ని బాబాయి మనవాళ్ళే కదా, ఇంత సాయం చేశారు అని రాజి కూడా ఏమీ తప్పుగా అనుకోలేదు మొదట్లో, ఉద్యోగం విషయం ఎత్తినప్పుడల్లా ఏవో వంకలు చెప్పేవారు.

ఇంటికి ఎవరన్నా భోజనానికి వస్తే వాళ్ళ ఎదురుగా రాజి పరిస్థితి చెప్పటం, వాళ్ళు వాణిని పొగడటం కొంచెం చిన్నతనంగా అనిపించేది రాజికి. కారు డ్రైవింగ్ నేర్పించారు, దానితో పాటే బజారు పనులు కూడా మీద పడ్డాయి.

సంవత్సరం తర్వాత అనుకోకుండా బైటపడింది. ఒక పనిమనిషిగా తెచ్చారని, వేరే ఉద్యోగాలు చెయ్యటానికి కుదరదని, వాణి ఎవరితోనో చెపుతుంటే విన్నది రాజి. ఒక్కసారిగా తగలరాని చోట దెబ్బతగిలినట్లు విలవిలలాడింది రాజి. ఏమి చెయ్యాలో తోచలేదు. ఏమని నిలదీస్తుంది, అసలే నిదానం. పైగా వాళ్ళు కోపంతో ఇండియా పంపిస్తే అన్న భయం కుంచించుకు పోయింది.

కొద్దిలో నయం ఏంటంటే కుమార్ తల్లి అనసూయమ్మ, 75 ఏళ్ళ వయస్సు, వయస్సు తెచ్చిన అనారోగ్యం ఉన్నా తనతో రోజంతా ఇంట్లో ఉండే తెలుగు మాట్లాడే అమ్మాయి ఉందని ఆవిడ బాగనే మాట్లాడేది రాజితో.

మూడు సంవత్సరాలయ్యింది అమెరికా వచ్చి. ఈ కాఫీ షాపు పెట్టినప్పుడు ధైర్యం తెచ్చుకుని అడిగింది దీంట్లో పని చేస్తా అని, జీతం ఇవ్వమని. ఏమనుకున్నారో కానీ ఒప్పుకున్నారు.

కొంచెం కొంచెంగా తన కథ అంతా చెప్పుకుంది రాజి. ఈ మూడు సంవత్సరాలల్లో తన మనసులో మాట చెప్పుకోటానికి దొరికిన ఏకైక ఆత్మీయురాలుగా అనిపించింది.

''సరే ఏదో వాళ్ళ స్వార్ధానికి నీతో అన్నీ మాట్లాడకుండా తీసుకువచ్చారు, ఇక్కడ నువ్వే వీసా మార్పించుకుని వేరే ఉద్యోగం చూసుకోవచ్చుకదా?'' అడిగింది అనిత.

''ఒకసారి వాళ్ళు ఇంట్లో లేనప్పుడు, అమ్మకు ఫోను చేసి విషయం చెప్పా. వాళ్ళు అమెరికాకు తీసుకువెళ్ళి నాకు ఎంతో ఉపకారం చేసారని, ఇలా వేరే వెళితే ఎదురు తిరిగినట్లు ఉంటుందని కోప్పడింది. ఏ వంకతో అమెరికా తీసుకు వెళ్ళినా, మంచి ఇంట్లో తిండికి లోటు లేకుండా హాయిగానే ఉన్నావు కదా అని సర్ది చెప్పింది. అమ్మను బాధపెట్టలేక ఊరుకున్నా, కానీ అమ్మను నాతో ఉంచుకుని చూసుకోవాలన్న కోరిక తీరదు, కనీసం అక్కవాళ్ళకు ఆర్ధికంగా సహాయం చెయ్యలేను'' నిస్సహాయంగా కన్నీళ్ళు తుడుచుకుంది రాజి.

రాజి పరిస్థితులవలన చాలా ఆత్మనూన్యతతో ఉన్నదని అర్ధం అయ్యింది అనితకు.

''సర్లే! ఇవన్నీ మనస్సులో పెట్టుకుని బాధపడకు. ఏదో ఒకదారి దొరుకుతుందిలే. మధ్యాహ్నం రెండు గంటలకు బయలుదేరి ఫ్రెండ్స్ అందరం ఇక్కడ దగ్గర్లోని 'కార్న్‌మేజ్'కి వెళుతున్నాం. నువ్వు కూడా రాకూడదూ? సరదాగా ఉంటుంది అందరితో గడిపితే. అస్సలు సెలవే తీసుకోవు.''

''లేదు అనిత నాకు వీలవదు. పోనీ ఈసారి ముందుగానే ఏమైనా తెలిస్తే చెప్పు, ఇంట్లో అడిగి ఒప్పుకుంటే వస్తాను''

''సరే ఇంక వెళతా'' అంటూ లేచింది అనిత.

యూనివర్శిటీకి గంటన్నర దూరంలో ఉన్న మొక్కజొన్న పొలాలకు రెండు కార్లలో దేరారు. దారిలో లీసా చెప్పింది ''అది ఒక వంద ఎకరాల పొలం. పంటలు ఐపోయాక ఓ పది ఎకరాల్లో ఒక మేజ్‌లాగా డిజైన్ చేశారు. దాంట్లో నుండి ఎలా బైటపడాలి అన్నది మాప్ చూసుకుంటూ వెళ్ళాలి. చాలా సరదాగా ఉంటుంది.''

''ఇండియాలో తాతగారి ఊరు వెళ్ళేదాన్ని సంక్రాంతికి. అక్కడ ఇలా కమర్షియల్‌గా ఆలోచించరు కదా? వింతగా ఉంది. ఎంత బిజినెస్ సెన్సు ఉంది వీళ్ళకు. ఒక పక్క పంటలు పండిస్తూనే, ఇలా వేరే బిజినెస్సు పెట్టారు'' చుట్టూ చూస్తూ ఆశ్చర్యంగా అన్నది ప్రియ.

కారు పార్కు చేసి టికెట్టు కౌంటరులో అందరూ టికెట్లు తీసుకున్నారు. ఒక పక్క పెద్ద షెడ్డు, దాంట్లో ఒక చిన్న రెస్టారెంటు, ఇంకా వారి దగ్గర పండించిన కూరగాయలు, పళ్ళు కూడా అమ్ముతున్నారు. పక్కనే పికినిక్ టేబుల్స్ ఉన్నాయి. దాదాపు అన్నీ నిండిపోయాయి. పిల్లల కేరింతలతో ఆ ప్రాంగణమంతా నిండిపోయింది.

''ఇవిగో మాప్స్, ఇద్దరిద్దరిగా విడిపోయి, వేరే వేరే దారుల్లో వెళదాం. అందరం చివర్లో కలవాలి, ఎవరైతే అందరికంటే ముందుగా చేర్తుకుంటారో వాళ్ళు గెలిచినట్లు'' ఉత్సాహంగా చెప్పాడు టామ్.

ప్రియ, లీసా వేరే వాళ్ళతో జట్టు కట్టేసుకున్నారు. '

''ఏమీ అనుకోకపోతే, నాతో వస్తావా?'' అడిగాడు స్టీవ్.

''ఏంటీ ఎప్పుడూ ఈ అబ్బాయి పక్కన అనుకోకుండా ఇలా కుదురుతుంది. ప్రియ చూస్తే తాటాకులు కట్టేస్తుందేమో మళ్ళీ. అయినా స్టీవ్ చాలా మర్యాదగా మాట్లాడతాడు, ఫ్రెండ్లీగా ఉంటాడు. వెళితే తప్పేంటి?'' సర్దిచెప్పుకుని ఒప్పుకుంది అనిత.

లోపలకు వెళ్ళటానికి ఐదు ద్వారాలు ఉన్నాయి. జంటలందరూ ఒక్కోవైపు వెళ్ళారు. రెండు వైపులా దాదాపు ఎనిమిది అడుగుల ఎత్తుగా మొక్కజొన్న మొక్కలు. ఎదురుగా కనిపించే బాట తప్పితే ఏమీ కనిపించటంలేదు. లీలగా నవ్వులు, కేకలు ఎవరివో. మాప్ పట్టుకుని ఇలా తిరగటం తమాషాగా ఉంది.

ఏవో కబుర్లు చెపుతూ నడుస్తున్నాడు స్టీవ్. కొంచెం రిలాక్సయ్యింది అనిత. తను కూడా ఫ్రీగా మాట్లాడటం మొదలుపెట్టింది.

''ఇటు వైపు వెళ్ళాలనుకుంటా ఇప్పుడు'' అన్నాడు స్టీవ్.

''లేదు మాప్ ప్రకారం ఎడమ పక్కకు తిరగాలి''

''లేదు లేదు నాకు తెలుసు పద కుడివైపే'' దబాయించాడు స్టీవ్.

కొంచెం దూరం నడిచేసరికి అక్కడితో ఆ దారి మూసేసి ఉంది. గట్టిగా నవ్వేసింది అనిత.

''ఒకే. ఒప్పుకున్నా నాదే తప్పు. కానీ ఇదంతా ఊరికే తమాషాకి చేశా. నిన్ను నవ్వించాలని'' చిలిపిగా నవ్వాడు స్టీవ్ వెనక్కి తిరిగి నడుస్తూ.

"రియల్లీ? చాలా కవర్ చేసుకుంటున్నావు. అంత డ్రామా వద్దు"

"ఓకే. మనం ఆలస్యం చేస్తే ఓడిపోతాం. పద పరిగెత్తాలి ఇంకా."

మాప్ వైపు చూస్తూ జాగింగ్ చేస్తున్నట్లు వెళుతుంటే దోవలో అడ్డంగా ఉన్న కర్రను తట్టుకుని పడబోయాడు స్టీవ్. గభాల్న పట్టుకుని ఆపింది అనిత.

"ఇది రెండోసారి నిన్ను సేవ్ చెయ్యటం గుర్తుపెట్టుకో" టీజ్ చేసింది అనిత.

"లేదు లేదు ఇలాంటివి లెక్కపెట్టకూడదు ఫ్రెండ్స్ మధ్య"

"సరే ఈ రెండుసార్లు ఫ్రీ. ఇంక ముందర ఏమన్నా జరిగితే నో ఫ్రీ"

"డీల్" నవ్వాడు స్టీవ్.

ఇద్దరూ ఒకరి గురించి ఒకళ్ళు తెలుసుకుంటూ, నవ్వుకుంటూ, మాట్లాడుకుంటూ చివరిదాకా వచ్చారు. దాదాపు అరగంట పట్టింది. వీరికంటే ముందరే ఇంకో నలుగురు వచ్చేశారు.

"నా వల్లకాదు ఇంకా నడవటం. వాపసు వెళ్ళేటప్పుడు ఎత్తుకుని వెళ్ళు నన్ను" నవ్వుతూ అన్నది కేటీ తన బాయ్ ఫ్రెండ్ టామ్‌తో.

"నేను సూపర్ మాన్‌ని కాదు. అలాంటి ఆశలేం పెట్టుకోకు" గాబరాగా అన్నాడు టామ్.

"మరి నాకోసం ఏమైనా చేస్తానన్నావు?" బుంగమూతి పెట్టింది కేటీ

"ఏదైనా చేస్తాం అంటే ఒకటే అర్థం ఉంటుంది. అతిగా ఊహించుకోకు" నవ్వింది లీసా.

"ఆకలేస్తుంది, పైగా చీకటి పడేట్లుగా ఉంది. అన్ని దారుల్లోకి దగ్గరి దారిలో అందరం కలిసి వెళదాం. రెస్టారెంట్లో ఖాళీ ఉంటుందో లేదో" అంది లీసా.

అప్పటికే చిరు చీకట్లు అలముకుంటున్నాయి. సంజ వెలుగులో అలా నడుస్తూ అప్రయత్నంగా పాడింది అనిత.

"మొక్క జొన్న తోటలో ముసిరిన చీకట్లలో

మంచెకాడ కలుసుకో, మరువకు మావయ్యా"

"వావ్! ఈ పాట నాకు తెలుసు. సరిగ్గా సరిపోయింది ఈ సందర్భానికి" ప్రియ చప్పట్లు కొట్టింది.

అందరూ ఏంటి ఆ పాటకు అర్థం అని అడిగితే, అది ఒక జానపద గీతం అని అర్థం చెప్పింది ప్రియ.

"మాకూ నేర్పించు" అన్నాడు టామ్

ప్రియ, అనిత నేర్పిస్తుంటే, తమాషా అమెరికన్ యాసతో వాళ్ళు పాడుతుంటే, నవ్వు ఆపుకుందామనుకున్నా సాధ్యపడలేదు ఇద్దరికీ.

"సారీ మిమ్మల్ని చూసి నవ్వటం లేదు. మీ పాట వేరేగా వినిపిస్తుంది మీరు పాడుతుంటే" అంది అనిత నవ్వు కంట్రోల్ చేసుకుంటూ.

అందరూ మూకుమ్మడిగా "మొక్కజొన్న తోటలో..." అని కేకలు పెడుతూ మొత్తానికి బైటకు వచ్చేసరికి రెండు లైన్లు నేర్చుకున్నారు.

కాళ్ళు లాగేశాయి అందరికి. నీరసంగా నడుచుకుంటూ రెస్టారెంటుకు వచ్చారు. లక్కీగా ఖాళీ టేబుల్ దొరికింది.

"ఆపిల్ పై చాలా బాగుంటుంది ఇక్కడ. తప్పకుండా తినాలి" అనితతో చెప్పాడు స్టీవ్. డిన్నరు తిని రిలాక్స్‌గా కూర్చున్నారు అందరూ కబుర్లు చెప్పుకుంటూ.

ఊహించిన దానికంటే చాలా ఎక్కువ నచ్చింది ఈ ట్రిప్ ప్రియ, అనితలకు.

రాత్రి పన్నెండు దాటింది. అనిత శ్రద్దగా లైబ్రరీలో నోట్సు రాసుకుంటుంది. ఇంత రాత్రి అయినా చాలామంది ఉన్నారు లైబ్రరీలో. ఇక్కడ బోధనా పద్దతి చాలా కష్టంగా ఉండేది క్రొత్తలో. ఇండియాలోలాగ ఒక టెక్స్ట్ బుక్ ఉండి దాంట్లో మాత్రమే ప్రశ్నలు వస్తాయని చదువుకోలేము. ప్రాజెక్టులు, అసైన్‌మెంటులు పూర్తి చెయ్యాలంటే రకరకాల పుస్తకాలనుండి విషయసేకరణ చెయ్యాలి. రోజూ చదువుకోటానికి లైబ్రరీకి రావటం తప్పనిసరి. అందుకే రాత్రిపూట ఆలస్యంగా ఉండటం.

"ఇంకా పూర్తి అవ్వలేదా అనిత నీ పని? 'మా గ్రూప్ స్టడీస్ అయిపోయాయి. రూంకి వెళదామనుకుంటున్నాం. వస్తావా?" ప్రియ, లీసా దగ్గరకు వచ్చారు.

"ఇంకో గంట పని ఉంది. మీరు వెళ్ళండి, క్యాంపస్ బస్సులు ఉంటాయి కదా. ఏమీ పర్లేదు నాకు"

"మాకు కూడా నిద్ర రావట్లేదులే. నీ కోసం ఆగుతాం" అన్నారు ఇద్దరు.

అతి కొద్ది సమయంలోనే ఇంత మంచి స్నేహితులైన వీళ్ళిద్దరిని ఆప్యాయంగా చూసింది అనిత.

"చాలా థాంక్స్. కానీ వద్దు నాగురించి భయపడొద్దు. సెక్యూరిటీ ఉంటుంది కదా. సర్లెండి నేనూ వస్తాను" అని కాగితాలు అన్నీ సర్దుకుంది అనిత.

"హాయ్ లీసా. డు యు వాంట్ టు హాంగ్ అవుట్ ఫర్ సమ్ టైమ్?" లీసా ఫ్రెండ్ జోసెఫ్ వచ్చాడు.

"డు యు మైండ్ అనిత? నేను జోతో వెళ్ళనా?" అడిగింది లీసా.

"పర్లేదు హావ్ ఫన్. నేను ప్రియ వెళ్ళిపోతాం" కనుబొమ్మలు ఎగురవేస్తూ నవ్వింది అనిత.

"చాలానే మాట్లాడుతుంది లీసా జో గురించి. ఐ థింగ్ షి లైక్స్ హిమ్ ఎ లాట్. ఇక్కడ ఒకటి గమనించావా అనిత. అమ్మాయిలు ఇంతమంది ఉన్న క్యాంపస్‌లో ఒక్కసారన్నా అబ్బాయిలు వెనకనుండి కామెంట్స్ పిల్లికూతలు, నక్క ఊళలుతో ఏడిపించారా?"

"అదే ఒక్కోసారి చాలా ఆశ్చర్యంగా ఉంటుంది ప్రియ. స్త్రీలను గౌరవించి పూజించే దేశం అని చాలా గర్వంగా చెప్పుకుంటాం, కానీ పట్టపగలు కూడా ధైర్యంగా బైటకు వెళ్ళలేము. కాలేజీలో, రోడ్లమీద, బస్సుల్లో ఎక్కడైనా సరే అంగాంగ వర్ణనలు చేస్తూ వెధవల వెకిలి వేషాలు భరించాలి. భరించలేక ఎదురు తిరిగితే సర్దుకుపొమ్మనే వాళ్ళే ఎక్కువ"

అమెరికా రాకముందు చాలానే విన్నాను ఈ దేశం గురించి. శృంగార విశృంఖలత్వం గురించి కానీ, టీనేజిలో తల్లులయ్యే వాళ్ళ గురించి. అవన్నీ ఎంతవరకు నిజమో తెలియదు కానీ చూసిన ప్రపంచంలో మాత్రం ఒకళ్ళనొకళ్ళు ఇష్టపడితే మొహం మీదే చెప్పేస్తారు. పరోక్షంగా అబ్బాయిలు ఎలా మాట్లాడుకుంటారో తెలియదు కానీ ఎదురుగా మాత్రం అమ్మాయిలతో గౌరవంగా ఉంటారు. దైనందిక అవమానాలు, వెకిలి చేష్టలు భరించటంతో కుంచించుకు పోవటం అంటే ఏమిటో కేవలం ఆడపిల్లలకే అర్ధం అవుతుంది.

"వచ్చేవారం సౌత్ ఏషియా అసోసియేషన్ ఆధ్వర్యంలో దసరా, దీపావళి ఫంక్షను ఉంది కదా. ఏం డ్రెస్ వేసుకుంటావు నువ్వు" అడిగింది ప్రియ.

"ఒక చీర తెచ్చుకున్నాను. ఇంకా రెండు చుడీదార్లు. ఇంకా ఏదీ నిర్ణయించుకోలేదు"

"నీ ఫిగర్‌కి చీర బాగుంటుంది. కట్టుకో, నాకు అంత ఓపిక లేదు. సల్వార్ వేసుకుంటా. చాలా పనులు ఉన్నాయి నాకు. మొత్తం వంద టిక్కెట్లు కొన్నారు. దాండియా ఉంటుంది కదా. బాగా సరదాగా ఉంటుందిలే. ఈ కమిటీలో ఉన్నందుకు చాలామంది ఇండియన్స్ పరిచయం అయ్యారులే" అన్నది ప్రియ.

"లైబ్రరీలో కూడా చాలామంది కనిపిస్తుంటారు. రాజితో చెప్పాను ఆ రోజు ఉండిపొమ్మని. కాస్త లైఫ్ ఎంజాయ్ చేస్తుంది"

"మరీ పిచ్చి మొహం తను. బాబాయి వాళ్ళు అమెరికా తీసుకొచ్చారు సరే, కానీ రెండేళ్ళు ఫ్రీగా అన్ని పనులు చేయించుకున్నారు కదా. ఇప్పుడు కానీ రెండేళ్ళు ఫ్రీగా అన్ని పనులు చేయించుకున్నారు కదాణ ఇప్పుడు మాత్రం, రోజంతా ఈ షాపును చూసుకుంటుంది. సాయంత్రం వెళ్ళేటప్పుడు రోజుకో బ్రాంచికి వెళ్ళి అక్కడ చూసుకుంటుంది. ప్రొద్దున్నే ఇక్కడకి వచ్చేలోగా వంటపూర్తి చేస్తుంది. ఎవరుంటున్నారు ఈ రోజుల్లో ఇంత మెతకగా" కొంచెం ఆవేశంగా అన్నది అనిత.

"మెతక అనకు చేతకాని తనం అను. ఇలా ఉంటే ఎప్పుడూ ఎవరో ఒకళ్ళు మనల్ని exploit చేస్తూనే ఉంటారు. మన పోరాటం మనమే చెయ్యాలి. మంచితనంలో ఉండాలి కానీ ఆ మంచితనాన్ని అవతలివాళ్ళు. వాళ్ళకు అనుగుణంగా మార్చుకుంటే కనీసం గట్టిగా నిలబడాలి కదా" చిరాకుగా అన్నది ప్రియ.

"అందరూ ఒకేలా ఉండరు ప్రియ"

కాసేపు మౌనంగా నడుస్తూ ఎవరి ఆలోచనల్లో వాళ్ళు ఉండిపోయారు.

"అవునూ ఇవాళ స్టీవ్ రాలేదా మీతో చదువుకోటానికి కనపడలేదు" టాపిక్ మార్చింది అనిత.

"రోజూ ఎదురు చూస్తున్నావా తనకోసం" చిలిపిగా నవ్వింది ప్రియ.

"ఛఛ అదేమీ లేదు. ఇవాళ కనపడలేదని అడిగా. అన్నిటికీ పెడార్థాలు తీస్తావు" కంగారుగా కప్పిపుచ్చింది అనిత.

"ఒప్పుకో స్టీవ్ అంటే నీకు ఇష్టం కదా!" మోచేతితో అనిత చెయ్యిమీద పొడిచింది ప్రియ.

"మంచి అబ్బాయి, ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తాడు. అందరూ ఇష్టడతారు కదా తనని"

"అబ్బా అంత అమాయకత్వం నటించకు. ఒకటి మాత్రం నిజం. మంచివాడు, బాగా కష్టపడతాడు. టీచర్ అసిస్టెంట్‌గా చేస్తాడు కాబట్టి ఫీజు లేదు తన ఖర్చులకు సరిపోతుంది. అయినా వేరే జాబ్ చేస్తాడు. బాగ చదువుతాడు. ఫన్ లవింగ్, బాగా ఫ్లర్ట్ చేస్తాడు కూడా, కానీ అది ఫన్ వరకే. ఒక పరిధి దాటడు. Healthy flirting" నవ్వుతూ చెప్పింది ప్రియ.

రెండు చేతులు ఎత్తి దండం పెట్టి, చేతితో నోరు మూసుకోమని సైగ చేసింది అనిత. మొహంలోని భావాలని కప్పిపుచ్చుకుంటూ.

"దాండియాకు స్టీవ్‌ని కూడా పిలువు బాగుంటుంది" ప్రియ రెట్టించింది.

"బాగుండేది ఎవరికి. నీకా, స్టీవ్‌కా" చిరుకోపంతో అడిగింది అనిత.

"మా ఇద్దరి కంటే ఎక్కువగా నీకు, అయినా ఒక అబ్బాయి నచ్చాడు. అతనితో సమయం గడిపితే బాగుంటుంది అని నీకు అనిపించినప్పుడు, ఈ ముసుగులో గుద్దులాట దేనికి. తను కూడా మంచివాడు, నీతో బాగా మాట్లాడుతాడు కదా! అతను మంచివాడు కాకుంటే నేనే చెప్పేదాన్ని నీకు వద్దని"

అనిత మాట్లాడకపోవటం చూసి మళ్ళీ తనే అన్నది "నీ ఇష్టం అనిత నా మనస్సుకు తోచింది చెప్పాను. నీ కోసం, నీ ఆనందం కోసం ఉండు. అతిగా ఆలోచిస్తావు. అన్నింటినీ తెగ విశ్లేషిస్తావు. అవన్నీ నాకు పట్టవు. నాకు తెలిసింది ఒక్కటే. నేను వేరే ఎవ్వరిని నాశనం చెయ్యను, అలాగే వేరే వాళ్ళకోసం నా ఆనందాన్ని జీవితాన్ని బలి చెయ్యను"

"సరే నా గురించి ఇంత చెపుతున్నావు. మరి నీ గురించి చెప్పవే? నీకు ఎవ్వరూ నచ్చలేదా?"

ప్రియ అందరితో కలవిడిగా ఉంటుంది. నిర్మొహమాటంగా మాట్లాడుతుంది. కానీ తన పర్సనల్ విషయాలు ఏమీ చర్చించదు. ఇండియాలో తన జీవితం గురించి కూడా ఏమీ పెద్దగా తెలియదు, అప్పుడప్పుడు చెప్పే కాలేజి కబుర్లు తప్పితే. గుచ్చి గుచ్చి అడిగే మనస్థత్వం కానందున, అనిత కూడా అంతగా అడగలేదు.

అనిత ప్రశ్నకు కాసేపు మౌనంగా ఉండిపోయింది ప్రియ.

"నామీద ఒకళ్ళు చాలా ఇంట్రెస్టు చూపుతున్నారు. అది ఎటువైపు దారి తీస్తుందో నాకు బాగా తెలుసు. చాలా అసహనంగా చిరాకుగా ఉంది"

"ఎవరతను? ఎందుకీ సందేహాలు, అసహనం"

"ఇంకోసారి ఎప్పుడన్నా చెపుతాలే, వదిలెయ్యి. నా గురించి చాలా చెప్పుకోవాలి అనిత నీకు. చాలా కొద్దికాలంలోనే చాలా దగ్గర స్నేహితులం అయ్యాం. నేను ఇంత తొందరగా ఎవ్వరినీ నమ్మను. కానీ నీలో ఒక గుణం ఉంది. నీతో ఎవరైనా చాలా కంఫర్టబుల్‌గా ఫీల్ అవుతారు."

ప్రియ కళ్ళల్లో మొట్టమొదటిసారి నైరాశ్యం కనపడింది. ఇద్దరూ మౌనంగా అపార్టుమెంటు దగ్గరకు వచ్చారు. ప్రియ తన రూం దగ్గరకు వెళుతుంటే చెయ్యిపట్టుకుని ఆపింది అనిత.

"నీకు ఎప్పుడు నాతో మాట్లాడాలనుకుంటే అప్పుడే మాట్లాడు. కానీ బాధను మనస్సులో పెట్టుకుని, నవ్వుతూ తుళ్ళుతూ ఉంటే చూసే వాళ్ళకు ఓకే కానీ, నీకు మంచిది కాదు. నాతోనే అవసరం లేదు. నిన్ను అర్థం చేసుకునే ఏ వ్యక్తితోనైనా సరే చెప్పుకో"

ఒక్క క్షణం అనితవంక మౌనంగా చూసి గట్టిగా హత్తుకుంది ప్రియ. ఏమీ మాట్లాడకుండా ఇద్దరూ అలాగే మౌనంగా ఉండిపోయారు.

"సెంటిమెంటల్ చేసేస్తావు నన్ను. గుడ్‌నైట్" జీవంలేని నవ్వు నవ్వింది ప్రియ తన రూంకి వెళ్ళిపోయింది.

**ప్రియ**

**శిశిరం - 1999**

ప్రొద్దున పదిగంటలకు అలారం మ్రోతతో కళ్ళు తెరిచింది ప్రియ. మధ్యాహ్నం దాకా క్లాసులు లేకపోవటంతో, అలారం ఆలస్యంగా పెట్టుకుంది.

పార్ట్‌టైం జాబ్ కింద జాబ్ కింద ప్రొఫెసర్‌కి అసిస్టెంటులాగా చేస్తుంది ప్రియ. అండర్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్సుకు క్లాసులో ఉండే అనుమానాలు తీర్చటం ఇంకా ఎస్సైన్‌మెటు పేపర్లు దిద్దటంపని.

ప్రియ చదువులో చాలా బ్రిలియంట్. ఇండియాలో ఎం.కాం ఇంకా బిజినెస్ ఎడ్మినిస్ట్రేషన్‌లో డబులు పోస్టుగ్రాడ్యుయేషన్ చేసింది. యూనివర్సిటీ టాపర్.

కంఫర్టర్ పక్కకి తొలిగించి తన రూమ్మేట్ ఎమిలీ కోసం చూసింది. రూంలో కనపడలేదు, క్లాసుకు వెళ్ళిపోయిందేమో. ఎమిలీ చైనా దేశీయురాలు. తన చిన్నప్పుడే తల్లిదండ్రులు ఈ దేశానికి వచ్చారు. ఎప్పుడూ చదువే లోకంగా ఉంటుంది. బద్ధకంగా మంచం దిగి, స్నానం చెయ్యటానికి వెళ్ళింది ప్రియ. హాయిగా వేడినీళ్ళతో స్నానం చేస్తుంటే శరీరం, మనస్సు కూడా తేలికగా అనిపించాయి.

చకచకా రెడీ అయిపోయి, బ్రెడ్ జామ్‌తో తినేసి, బుక్స్ తీసుకుని కాలేజికి బయలుదేరింది.

క్లాసుకు వెళ్ళేముందు ప్రొఫెసర్ రాబర్ట్ హాల్ దగ్గరకు వెళ్ళింది.

"ఏంటి నిన్న సాయంత్రం కలుస్తానన్నావు, రాలేదే? సాయంత్రం ఏడుదాకా చూశాను" కళ్ళజోడు తీసి టేబుల్ మీద పెడుతూ అన్నాడు.

అతనికి దాదాపు 55 సంవత్సరాలు ఉంటాయి. చెంపల దగ్గర నెరుస్తున్న జుట్టు, ఆరు అడుగుల రెండు అంగుళాల ఎత్తు, చాలా హాండ్సమ్‌గా ఉంటాడు. చాలామందికి హీరో వర్షిప్ ఉంది. ప్రొఫెసర్‌గా మంచి పేరుంది.

"కుదర్లేదు. ఫ్రెండ్స్‌తో గ్రూప్ స్టడీస్‌కి వెళ్ళాను. రాత్రి ఒంటిగంటదాకా వాళ్ళతోనే ఉన్నాను" ఎందుకు ఇంత సంజాయిషీ ఇస్తుంది తను. చిరాకుగా ఉంది.

"ఆనంద్ నీ బాయ్ ఫ్రెండా? తనతో కనిపిస్తావు ఎప్పుడూ" పరీక్షగా చూస్తూ అడిగాడు.

"అదేమీ లేదు. ఇద్దరం ఒకే దేశానికి చెందిన వాళ్ళం అని స్నేహితులం అంతే."

"గుడ్! నీకు చాలా మంచి భవిష్యత్తు ఉంది. తెలివిగా భవిష్యత్తును నిర్మించుకో. నా దగ్గర పి.హెచ్.డి చెయ్యటానికి అప్లై చెయ్యి" నర్మగర్భంగా అన్నాడు.

"స్టూడెంటు ఎస్సైన్మెంట్లు అన్నీ గ్రేడ్ చేశాను. క్లాసుకు వెళ్ళాలి" అని బైట పడింది ప్రియ.

రాబర్టుతో చాలా చిరాకుగా ఉంది ప్రియకు. అతని మాటల్లోని గుఢార్ధం తెలుసుకోలేనంత అమాయకురాలేమీ కాదు. అతని మీద కంప్లైంటు చేద్దామంటే సాక్ష్యం లేదు. చాలా తెలివిగా దొరకకుండా ప్రపోజ్ చేస్తున్నాడు. తనతొ సంబంధం పెట్టుకుంటే ఆమె ఫ్యూచర్‌కు సహాయం చేస్తా అని.

"జిత్తులమారి నక్క" కసిగా తిట్టుకుంది ప్రియ.

మధ్యాహ్నం రెండు క్లాసులే ఉన్నాయి. అయ్యాక బ్యాగ్ సర్దుకుంటుంటే ఆనంద్, స్టీవ్ దగ్గరకు వచ్చారు.

"కాఫీ తాగుదాం వస్తావా?"

"లేదు బిజీగా ఉన్నాను. రేపు దీపావళి ఫంక్షను ఉందికదా. దానికి ఫైనల్ మీటింగ్ ఉంది. అది అయ్యాక లైబ్రరీకి వెళ్ళాలి. ఇవాళ్ళే కాస్త ఖాళీ దొరికింది చదువుకోటానికి. రేపు అస్సలు ఖాళీ ఉండదు"

"ఏయ్ ప్రియ! తెగ చదివేస్తావు. ఫ్రైడే నైట్ ఇవాళ ఫ్రీ మూవీ వేస్తున్నారు వస్తావా నాతో" హఠాత్తుగా ఊడిపడ్డాడు శ్రీని.

"ఏం ఇంకెవ్వరూ నీతో రానన్నారా?" నవ్వింది ప్రియ.

"మరీ అంత దారుణంగా కనిపిస్తున్నానా? అందరికి లైన్ వేస్తున్నానా ఏంటి? సరదాగా అమ్మాయిలతో మాట్లాడతా అంతే. నువ్వంటే మాత్రం స్పెషల్ ఇష్టం."

"అవునవును. ఇప్పటికి ఓ పదిమంది అమ్మాయిలకు ఇదే మాట చెప్పావు" నవ్వాడు ఆనంద్.

"స్టీవ్ ఈ అమ్మాయిలు నాకు అర్థంకారు. మా ఇండియన్ అమ్మాయిలు వేస్ట్, అమెరికన్లు హాయిగా ఫన్ లవింగ్. డేటింగ్‌కి ఒప్పుకుంటారు"

"డ్యూడ్! అమ్మాయిలంటే కేవలం డేటింగ్‌కే అని అనుకోకూడదు. ఏదో ఒక అమ్మాయితో తిరగాలి అని అస్సలే అనుకోకూడదు. ఒక అమ్మాయి నచ్చితే, ముందు తన గురించి తెలుసుకో, స్నేహం చెయ్యి. అందంగా ఉన్నంత మాత్రాన నచ్చే విధంగా ఉండాలని లేదుగా" భుజం తడుతూ చెప్పాడు స్టీవ్.

"సర్లే! ఈ శ్రీని వేస్ట్. బుర్ర టీనేజ్‌లో ఆగిపోయింది" కొంచెం చిరాకుగా అన్నాడు ఆనంద్.

"నాది ఒకటే పాలసీ బాస్. కాలేజీలో ఫుల్‌గా ఎంజాయ్ చెయ్యాలి అన్ని రకాలుగా. ఏదీ సీరియస్‌గా తీసుకోకూడదు ఒక్క చదువు తప్ప. మంచి జాబ్ చెయ్యాలి, అమెరికా సంబంధం అంటే ఇండియాలో అమ్మాయిలు క్యూ కడతారు. వాళ్ళల్లో మంచి సౌండ్ పార్టీ, అందమైన అమ్మాయిని మా వాళ్ళు సెలెక్టు చేస్తే, పెళ్ళి చేసుకుని సెటిల్ అవ్వాలి" అన్నాడు శ్రీని.

"మంచి ఆలోచనే. నీకు కాబోయే భార్య ఎవరో కానీ, తనుకూడా ఇలాగే ఆలోచిస్తూ ఉండొచ్చు. కాలేజిలో ఫుల్‌గా ఎంజాయ్ చేసి, ఏ బకరా గాడినో పెళ్ళి చేసుకుని ఒద్దికగా కాపురం చెయ్యాలని. నీకు పర్లేదు కదా" కోపాన్ని ఆపుకుని వ్యంగ్యంగా అడిగింది ప్రియ.

"నేను పద్ధతిగల కుటుంబానికి చెందిన అమ్మాయినే పెళ్ళి చేసుకుంటా" ఉక్రోషంగా అన్నాడు శ్రీని.

"నీకు లేని పద్ధతి అమ్మాయిలకు ఎందుకుండాలి" ఇక కోపాన్ని ఆపు కోలేక గట్టిగా అడిగింది ప్రియ.

టాపిక్ బాగా సీరియస్ అవుతుందని గ్రహించాడు ఆనంద్, "తిక్కగా వాగకు శ్రీని. నువ్వు చాలా తప్పుగా ఆలోచిస్తున్నావు. వదిలెయ్యి ఈ టాపిక్, ప్రియ. ప్లీజ్ సీరియస్ అవ్వకు. వీడిలాగా ఆలోచించే వాళ్ళు చాలామంది ఉంటారు. దా కాఫీ తాగుదాం'"

'సారీ గైస్. నాకు పని ఉంది. రేపు కలుద్దాం. స్టీవ్ రేపు వీలైతే వస్తాను అన్నావు కదా, ఆనంద్‌తో రా. బై" చకచకా నడుస్తూ వెళ్ళిపోయింది ప్రియ.

ఎర్రటి జార్జెట్ చుడీదార్, పెద్ద జూకాలు, చేతినిండా గాజులతో అలంకరించుకుంది ప్రియ. లైట్‌గా మేకప్ వేసుకుని తలదువ్వుకుంటుండగా తలుపు తట్టిన శబ్దంతో వెళ్ళి తలుపు తీసింది.

''ఇంకా రెడి అవ్వలేదా?'' నవ్వుతూ లోపలకు వచ్చింది అనిత.

''ఎంత బాగున్నావో ప్రియ.!! ఏ డ్రస్ వేసుకున్నా నీకు భలే ఒప్పుతుంది. ఇంక ఇంత స్పెషల్‌గా తయారయితే చెప్పేదేముంది?''

''సర్లే ఇక ఆపు. నిన్ను నువ్వు అద్దంలో చూసుకున్నావా? తాజా గులాబిలా ఎంత క్యూట్‌గా ఉన్నావో తెలుసా? స్టీవ్ కోసం తయారయ్యావా?'' టీజ్ చేసింది ప్రియ.

ఆ మాటలకు కొంచెం సిగ్గుపడింది అనిత.

''ఓయ్! తరువాత తీరిగ్గా సిగ్గుపడుదువు. ముందు పద, పదా! నాకు హెల్ప్ చేస్తానని ప్రామిస్ చేశావు. ఆలస్యం అవుతుంది.''

యూనియన్ సెంటర్‌లో పెద్ద హాలు ఉంది ఇటువంటి సమావేశాలకు. ఇద్దరూ నడుస్తుండగా అక్కడక్కడ సాంప్రదాయ దుస్తుల్లో ఇండియన్లు కనిపించారు.

''బాగుంది కదా. ఈ దేశంలో మన దుస్తుల్లో ఇంతమంది కనిపిస్తుంటే, అక్క చెప్పింది, ప్రతి ఊళ్ళోనూ ఒక ఇండియన్ అసోసియేషన్ ఉంటుందంట. పండుగలన్నీ కలిసి చేసుకుంటారంట''

''నీకు ఒక సర్‌ప్రైజ్ ఉంది ఇవాళ. బి ప్రిపేర్డ్'' కన్నుకొట్టింది ప్రియ.

''ఏం ప్లాను చేస్తున్నావు?'' అనుమానంగా చూసింది ప్రియ వైపు.

''నేను చెప్పను. హమ్మయ్య సరిగా టైంకు చేరుకున్నాం. కేటరింగ్ వాళ్ళు వచ్చినట్లున్నారు. అన్నీ సరిగ్గా తెచ్చారో లేదో చూడాలి. వీళ్ళతో ఎంత బేరం ఆడామో తెలుసా? ఐ హోప్ రుచిగా వండారనే అనుకుంటున్నా'' వేగంగా నడుస్తూ అన్నది ప్రియ.

లోపల సీనియర్లు కొందరు కనిపించారు. స్టేజ్ మీద డి.జెవాళ్ళు సర్దుకుంటున్నారు. ''వందకు పైగా టికెట్లు కొన్నారు. ఎందుకైనా మంచిదని నూటయాభై మందికి ఆర్డరు చేసాం.''

గంటసేపు కష్టపడి అంతా సక్రమంగా సర్దించారు. స్నాక్స్, డ్రింక్స్ ఒక పక్క టేబుల్స్ మీద పెట్టారు. డిన్నరు వంటకాలన్నీ లోపల సర్ది తరవాత బైట పెడదామా, లేక అన్నీ ఒకేసారి పెట్టెయ్యాలా అన్న విషయంపై చాలాసేపు తర్జన భర్జనలు జరిగాయి. ఇది కూడా ముందే మాట్లాడుకోవాల్సింది. ఇప్పుడు హడావుడిలో వాదనలు అవసరమా? మనస్సులోనే విసుక్కుంది ప్రియ.

చివరకు ఫుడ్ అంతా ఒకేసారి పెట్టాలని నిర్ణయించారు, సర్దేవాళ్ళకు తేలికగా ఉంటుందని, ముందు ఏవో స్పీచ్‌లు ఉన్నాయి, తర్వాత కాసేపు కెరియోకీ, ఆ టైంలోనే డిన్నరు. అంతా అయ్యాక దాండియా డాన్స్. డి.జె వాళ్ళ మ్యూజిక్ పెడతారు.

రాజి వచ్చింది లోపలకు.

"హమ్మయ్య వచ్చావా? ఎక్కడ మానేస్తావో అని భయపడ్డాను."

"చాలా నచ్చచెప్పాల్సి వచ్చింది. ఇలా కాలేజీ వాళ్ళతో పార్టీలకూ అదీ తిరిగి రేపు జరగరానిది ఏదైనా జరిగితే, మేము మీ అమ్మకు సమాధానం చెప్పుకోలేము అని అన్నారు" విరక్తిగా నవ్వింది రాజి.

"మరి రాత్రిపూట నువ్వు షాపులు చూసుకుని ఆలస్యంగా ఒక్కదానివే డ్రైవ్ చేసుకుంటూ వెళుతుంటే ఏమీ కాదంటనా?" చిరాకుపడింది అనిత.

"ఏమో అనిత. చాలా సంవత్సరాల తరవాత, కాస్త ఊపిరి పోసుకుందామని వచ్చా. అన్నీ మర్చిపోయి హాయిగా ఎంజాయ్ చేస్తా" మనస్ఫూర్తిగా చెప్పింది రాజి.

వీళ్ళు మాట్లాడుకుంటుండగానే చాలామంది రావటం మొదలెట్టారు.

"అదేంటి స్టీవ్ కూడా వస్తున్నాడు?" ఆశ్చర్యంగా అడిగింది అనిత, దూరంగా ఆనంద్‌తో కలిసి వస్తున్న స్టీవ్‌ని చూసి.

"మరి నీకు సర్‌ప్రైజ్ అన్నాకదా! ఇదే"

"తను ఎందుకు వస్తున్నాడు" రెట్టించింది అనిత.

అనిత కంగారు చూస్తే ముచ్చటేసింది ప్రియకు.

"అరే! ఇంకా కొంతమంది అమెరికన్లు కూడా వస్తున్నారు. కనపడటం లేదా? అయినా నిన్ను చూడటానికి వస్తున్నాడని అనుకుంటున్నావా? ఏదో ఇండియన్ పార్టీ, సరదాగా ఉంటుంది అంటే వస్తా అన్నాడు" అమాయకంగా మొహం పెట్టి చెప్పింది ప్రియ. "అంతేలే మీరందరూ ఫ్రెండ్స్ కదా!"

"అనితా నీ మొహం ఒక పుస్తకంలాగా చదివెయ్యొచ్చు. ఎంత జెలసి స్టీవ్ నీకోసం రావట్లేదేమోనని" గట్టిగా నవ్వేసింది ప్రియ.

"ఛీ నోరుముయ్యి పిచ్చి మాటలన్నీ మాట్లాడుతావు" కసిరింది అనిత.

"హాయ్ గర్ల్స్" దగ్గరకు వచ్చారు ఆనంద్, స్టీవ్.

స్టీవ్ కళ్ళన్ని అనిత మీద ఉన్నాయి. "వావ్! యు లుక్ అమేజింగ్ లైక్ ఎ పింక్ రోజ్"

అనితకు సిగ్గుతో మొహం కందిపోయింది. ముదురు గులాబీరంగు షిఫాన్ చీరమీద అక్కడక్కడ పరుచున్న లతలు. సిల్వర్ జూంకీలు, గాజులు వేసుకుంది.

స్టీవ్ ఎప్పుడూ అందరికి అలా కాంప్లిమెంట్స్ ఇస్తూనే ఉంటాడు. అయినా ఇవాళ్ళ ఏంటో కొత్తగా, ప్రత్యేకంగా అనిపిస్తుంది అతని గొంతు, చూపు. కొన్ని క్షణాలు ఇద్దరి చూపులు చిక్కడిపోయాయి.

"హలో! ఎక్కడికి వెళ్ళిపోయావు?" స్టీవ్ మొహం ముందర చిటికె వేస్తూ నవ్వింది ప్రియ. గభాల్న మొహం తిప్పుకున్నారు ఇద్దరూ.

"స్టెప్పులు మొదలెట్టారు. ఆ పక్కన దాండియా కర్రలు ఉన్నాయి, తెచ్చుకోండి. నేను కాసేపు ఫుడ్ దగ్గర చూసి వస్తాను. మీరు ఎంజాయ్ చెయ్యండి" అనితవైపు చూసి చిన్నగా నవ్వి వెళ్ళింది ప్రియ.

ఇంత హడావుడిలోనూ, మనస్సులో ఏదో దిగులు మేఘం కమ్ముకుని వదలటం లేదు ప్రియను. రెండు రోజుల్ క్రితం అమ్మ దగ్గరనుండి వచ్చిన ఉత్తరం వెంటాడుతుంది. చాలా దిగులుగా, బెంగగా రాసింది అమ్మ. తను ఒక్కతే సంతానం, అందుకే అమ్మ ప్రాణాలన్నీ తన మీద పెట్టుకున్నట్లు ఉంటుంది. యధాప్రకారంగా తను పెళ్ళి చేసుకుని హాయిగా సంసారం చేసుకుంటుంటే చూడాలన్న ఆశను మళ్ళా వ్యక్తపరిచింది.

పెళ్ళి.. హు! ప్చ్! జీవితంలో తను పెళ్ళి అనే బంధంలో ఎప్పటికైనా ఇమడగలుగుతుందా? ఒక వ్యక్తితో జీవితాంతం ఇష్టంగా ప్రేమగా ఉండగలదా? అంతగా తనను ప్రభావితం చేసే వ్యక్తి తన జీవితంలోకి వస్తాడా?

తల విదిలించి ఈ ఆలోచనల నుండి బలవంతాన బైటపడింది ప్రియ. తన కళ్ళముందు ఇప్పుడిప్పుడే చిగురిస్తున్న ఒక ప్రేమకథ ఈ ఆలోచనలను రేపుతుందా? లేకుంటే తనేంటి ప్రేమ గురించి ఆలోచించటం ఏంటి? అయినా స్టీవ్, అనితలది కేవలం ఆకర్షణ - ప్రేమకాదు కదా!

ఎంతమందిని చూడలేదూ హైస్కూలు వయస్సు నుండి - ప్రేమ, ప్రేమ అంటూ తన వెంట పడిన వాళ్ళు కొందరైతే, ప్రేమ పేరుతో కలిసి తిరిగే వాళ్ళు ఇంకొందరు. ఎవ్వరిని చూసినా ఒక అందమైన ఆత్మవంచనలో బ్రతుకుతున్నారు. జస్ట్ ఫన్, ఎంజాయిమెంట్ - ఒక ఆకర్షణ, వయస్సులో ఉండే ఆపోజిట్ సెక్స్ మీద వున్న కుతూహలం, కోర్కెలు తీర్చుకునే ఉండే ఆపోజిట్ సెక్స్ మీద ఉన్న కుతూహలం, కోర్కెలు తీర్చుకునే ఓ ముసుగు. తమకు ఓ బాయ్ ఫ్రెండ్ / గర్ల్ ఫ్రెండ్ ఉన్నారని చెప్పుకోవటం ఓ ఫాషన్.

సినిమాల్లోలాగా గాఢంగా ప్రేమించుకుని, పరిస్థితుల్ని ఎదుర్కొని ఎదిరించి, చదువు అయ్యాక పెళ్ళి చేసుకున్న వాళ్ళని చూడలేదు ఇంతవరకు. అంతా ట్రాష్ - సినికల్‌గా నవ్వుకుంది ప్రియ.

చూడాలి ఈ అనిత, స్టీవ్‌ల కథ ఏమవుతుందో. అనిత అన్నీ తేలికగా తీసుకునే అమ్మాయిలాగా కనిపించదు. స్టీవ్ అమెరికన్ ఇద్దరూ పెరిగిన వాతావరణం వేరు. కానీ స్టీవ్ అనితను నిజంగానే ఇష్టపడుతున్నట్లే కనిపిస్తున్నాడు. అనిత గురించి ఎన్నో వివరాలు అడుగుతాడు. అనిత గురించి మాట్లాడేటప్పుడు కళ్ళలో ఓ విధమైన మెరుపు. అనితకు చెపుదామా స్టీవ్ ఎంతగా అడుగుతాడో అనిపిస్తుంది, కానీ కొన్ని విషయాలు ఎవరికి వాళ్ళే తెలుసుకోవాలి. చూడాలి ఏమవుతుందో ఈ కథ.

"ప్రియ! ఇక్కడ డిన్నరు అంతా రెడీగా ఉందిగా. అనౌన్సు చేస్తున్నారు." ఎవరో అడిగిన ప్రశ్నకు ఆలోచనల నుండి బైట పడింది ప్రియ.

"యా! అంతా పర్ఫెక్ట్" అంటూ అనిత వాళ్ళను వెతుక్కుంటూ వెళ్ళింది.

"కమాన్! అందరూ డిన్నరుకు రండి. మళ్ళీ పెద్ద క్యూలు ఉంటాయి. తొందరగా తినేస్తే, తర్వాత బాగా ఎంజాయ్ చెయ్యొచ్చు" అందరి దగ్గరకు వెళ్ళి చెప్పింది ప్రియ.

"ఇంతమంది ఇండియన్స్‌ని ఒకేచోట, ఇలా సాంప్రదాయ దుస్తుల్లో చూడటం ఇదే మొదటిసారి. చాలా కలర్‌ఫుల్‌గా ఉంది" అన్నాడు స్టీవ్.

"ఇదేముంది? మా స్పైసీ ఫుడ్ తిని, ఆ తర్వాత రాకింగ్ మ్యూజిక్‌తో డాన్స్ చెయ్యి, ఇంకా బాగుంటుంది" అన్నాడు ఆనంద్.

"కమ్ అనిత ఇక ఆలస్యందేనికి. చాలా ఊరించాడు ఆనంద్ ఇండియన్ ఫుడ్ గురించి. చూడాలి ఎంత నిజం ఉన్నదో ఆ మాటల్లో, లేకపోతే హాస్పిటల్‌లో చేరతానేమో అంత కారం తినలేక, కానీ ఆనంద్ మాటలు నమ్మను నేను, అనిత నీ గైడెన్స్ కావాలి నాకు, ఏమి తినాలో, ఏం తినకూడదో"

అనిత స్టీవ్ పక్కన నడుస్తూ అన్ని రకాల వంటకాల గురించి చెపుతూ ఓపికగా అతని సందేహాలు తీరుస్తూ ముందుకు వెళ్ళటం చూసి, ఆనంద్, రాజి, శ్రీనిలను ఆపేసింది ప్రియ.

"కొంచెం నెమ్మదిగా వెళదాం, వాళ్ళిద్దరిని కాసేపు ఒంటరిగా వదిలెయ్యండి. ఏం ఫ్రెండ్‌వి నువ్వు ఆనంద్, స్టీవ్ మనస్సు తెలుసుకోలేవా? అనిత అంటే తనకు ఇష్టం కదా!" తెచ్చిపెట్టుకున్న కోపంతో ఆనంద్‌ని కోప్పడింది.

చాలామంది ఔత్సాహిక గాయకులు స్టేజి మీద పాడటం మొదలెట్టారు. చాలామంది బాగానే పాడారు. కొద్దిమంది మాత్రం తమగాత్ర సౌకుమార్యంతో కొంచెం గుండెదడ తెప్పించారు. కానీ అందరూ ఈలలూ చప్పట్లతో ప్రతి ఒక్కరిని ఉత్సాహపరిచారు.

"ఏంటి ఎక్కడ ఉండిపోయారు. మా దగ్గరకు రాలేదు డిన్నరు తినేటప్పుడు" అంటూ దగ్గరకు వచ్చారు అనిత, స్టీవ్.

"మాకు కూడా మీరు కనిపించలేదులే" సమాధానం చెప్పాడు ఆనంద్.

హైదరాబాద్‌లో చదువుకోవటంతో అనిత, ప్రియలకు దాండియా కాస్త తెలుసు. అందరికి దాండియా కర్రలు తెచ్చి ఇచ్చారు.

పెద్దగా కష్టంకాదు. గుజరాతీ వాళ్ళు బాగా చేస్తారు. వాళ్ళతో పాటే వాళ్ళను చూస్తూ చెయ్యోచ్చు. లేదంటే మనమే ఓ చిన్న గ్రూపులాగా చేద్దాం" అంది ప్రియ.

"నాకస్సలు రావు డాన్సులు మీరు చెయ్యండి చూస్తాను" మొహమాటంగా అంది రాజి.

"చిన్నప్పుడు కోలాటం ఆడలేదా? చూడలేదా ఇది కూడా అంతే. మనమేమన్నా పోటీలకు వెళుతున్నామా? ఇదొక సరదా, తప్పులుంటే ఉంటాయి. ఏముందు లైట్ తీసుకో, ఎంజాయ్ చెయ్యి" కోప్పడింది అనిత.

స్టీవ్ కూడా అందరితో కలిసిపోయి డాన్స్ చెయ్యటం బాగా నచ్చింది స్నేహితులందరికి.

ఉత్సాహపరిచే సంగీతంతో, కనీసం ప్రక్కనే ఉన్న వాళ్ళ గొంతులు కూడా వినపడనంత కోలాహలంగా ఉంది అక్కడి వాతావరణం. గంట రెండు గంటలు. ఎంత సమయం గడిచించో కూడా తెలియలేదు. గొంతులన్నీ ఆర్చుకుపోయి శరీరం అలసిపోయేదాకా.

"ఇక నావల్లకాదు. కాసేపు రెస్టు తీసుకోవాల్సిందే" మొహం పైన చెమట తుడుచుకుంటూ అన్నది రాజి.

"చాలా వేడిగా ఉంది ఇక్కడ, ఈ డాన్సులతో ఇంకా వేడెక్కింది. కాసేపు బ్రేక్ తీసుకుందాం" రాజితో ఏకీభవించాడు ఆనంద్.

"నేను ఇక బయలుదేరతాను. తొమ్మిదయ్యింది" అంది రాజి.

"అదేంటి రాత్రికి ఇక్కడే పడుకుందువుగానీ బట్టలు తెచ్చుకో అన్నాను కదా. లీసా లేదు ఇవాళ. నా రూంలో పడుకోవచ్చు"

"నా రూం కూడా ఖాళీనే. ముగ్గురం కబుర్లు చెప్పుకుంటూ ఒకేచోట పడుకోవచ్చు" అన్నది ప్రియ కూడా.

"అరే! ఇంత మొహమాటం ఏంటి నీకు?" కోప్పడింది అనిత.

"మీకు ఇబ్బంది ఎందుకని?" గొణిగింది రాజి.

"ఇబ్బంది అయితే ముందే చెపుతాం కదా రాజి" మృదువుగా నచ్చచెప్పింది.

నెమ్మది నెమ్మదిగా అందరిలోనూ అలసట స్పష్టంగా కనిపిస్తుంది. ముందున్న ఉత్సాహం, శక్తి తగ్గిపోయి గుంపులుగా నిల్చుని మాట్లాడుకోవటం మొదలుపెట్టారు. "ఇక బయలుదేరదామా? బాగా అలసటగా ఉంది. నాకు పనికూడా ఏమీలేదు" అంది ప్రియ.

అందరూ ఒప్పుకుని కోట్లు వేసుకుని బైటకు వచ్చారు. కాస్త చలిగానే ఉంది కోటు వేసుకున్నా కాని.

"చాలా నచ్చింది ఈ పార్టీ అనిత. మీ ఫుడ్ కూడా మరీ ఆనంద్ బెదిరించినంత కారంగా లేదు. వెరీ ఫ్లేవర్ ఫుల్. థాంక్స్ నాతో ఈ టైం గడిపినందుకు" అనితతోపాటు నిదానంగా నడుస్తూ చెప్పాడు స్టీవ్.

"ఐ హాడ్ ఎ గుడ్ టైం విత్ యు టూ" చిరునవ్వుతో చెప్పింది అనిత.

రాజి తన కారులో నుండి బ్యాగ్ తీసుకుని అనిత ప్రియతో కలిసి అనిత రూముకి వెళ్ళింది. ముగ్గురూ కలిసి అనిత రూంలో నైట్ డ్రస్సులు మార్చుకుని ఉన్న రెండు మంచాలకు మధ్య నేలమీద ఒకళ్ళకు పక్కేశారు, కంఫర్టర్‌తో మెత్తగా. ప్రియ తానే కింద పడుకుంటానని పట్టు పట్టింది.

"దాదాపు మూడు నాలుగేళ్ళు అయ్యిందేమో ఇంత హాయిగా ఎంజాయ్ చేసి. మీ ఇద్దరికీ థాంక్స్ చెప్పాలి"

"పోనీలే రాజి ఏదో ఒకవంకతో గాలి పీల్చుకున్నావు" అన్నది అనిత.

**"పరిచయం అయిన** కొద్ది రోజులకే ఇలా నీ విషయాల్లో జోక్యం చేసుకుంటున్నానని, సలహాలు ఇస్తున్నానని తప్పుగా అనుకోకు. నీ జీవితాన్ని వేరే ఎవరి చేతుల్లోనూ పెట్టకు. ఒక్కోసారి మన ప్రమేయం లేకుండానే కొన్ని సంఘటనలు జరిగిపోతుంటాయి. కానీ ఎంత త్వరగా మనకు అనుగుణంగా మార్చుకుంటే అంత సంతోషంగా ఉంటాము. ఏమంటావు?"

"నువ్వు చెప్పేది నిజమే ప్రియ. కానీ నాకు అంత ధైర్యం తెగింపు లేవేమో?"

"నీకు ఉండే ధైర్యం నీకుంది. మీ బాబాయి వాళ్ళింట్లో ఒక పనిపిల్లలాగా మిగిలిపోకుండా, ఈ కాఫీ షాపులో జీతంకు పనిచేస్తున్నావు. నీకంటూ ఒక సంపాదన ఉంది కదా. అలాగే చిన్న చిన్నగా ఏమన్నా కోర్సులు చెయ్యి ఇక్కడకు పనికొచ్చేవి. వీసా మార్పించుకోటానికి ప్రయత్నించు, ఎందుకంటే నువ్వు షాపులో చేసేది ఇల్లీగల్‌గానే కదా! జీవితాన్ని నీ కంట్రోల్లోకి తెచ్చుకో రాజి" మృదువుగా నచ్చచెప్పింది అనిత.

రాజి మౌనంగా ఆలోచిస్తూ ఉండిపోయింది. "మరీ సీరియస్‌గా మాట్లాడుకుంటున్నాం. వేరే కబుర్లు చెప్పు ప్రియ" మాట మార్చింది అనిత.

ఇండియాలో కాలేజీ కబుర్లు, అల్లరి విషయాలు చెపుతూ నవ్వించింది ప్రియ.

"రెడీనా ప్రియ? టైం అవుతుంది" ప్రియ రూంలోకి వస్తూ అడిగింది అనిత.

"యా! అంతా అయిపోయింది. పద బస్ మిస్ అవుతాం" సూట్ కేస్ లాగుతూ హేండ్‌బ్యాగ్ చేతిలో పట్టుకుని ముందుకు నడిచింది ప్రియ.

అనిత, ప్రియ ఇద్దరూ థాంక్స్‌గివింగ్ సెలవలకు డెట్రాయిట్ వెళుతున్నారు కవిత దగ్గరకు. వారం రోజులు సెలవలు వచ్చాయి. చికాగో నుండి ట్రెయిన్‌లో వెళుతున్నారు.

రెండు బస్సులు మారి, ట్రైన్ స్టేషన్‌కు వచ్చి కూలబడ్డారు ఇద్దరూ. ఇంకా అరగంట టైం ఉంది. ఆరుగంటల ప్రయాణం. రాత్రి పదిగంటలకు చేరుతుంది.

ప్రియకు కొంచెం మొహమాటంగా అనిపించింది. ఇలా వారం రోజులు ఉండటం. అనిత తన స్నేహితురాలైనా, వాళ్ళ అక్క, బావ ఇంట్లో ఉండటానికి ఇబ్బందిగా అనిపించింది. కానీ అనిత ఒప్పుకోలేదు. మొత్తం కాలేజీ క్యాంపస్‌లో ఎవ్వరూ ఉండరు. రెస్టారెంట్లు కూడా ఉండవు అని వింది. అమెరికాలో థాంక్స్‌గివింగ్‌కి అందరూ తమ కుటుంబ సభ్యులతో జరుపుకుంటారు. దేశంలో ఏ మూల ఉన్నా కానీ, ఆ రోజుకు వారి తల్లిదండ్రుల ఇంటికో, లేక అత్తమామల దగ్గరకు వెళ్ళి ఆ నాలుగురోజులు చాలా సంతోషంగా గడిపి, తమకు లభించిన జీవితానికి భగవంతునికి కృతజ్ఞతలు చెప్పుకుంటారు.

"అమెరికాలో మొదటి ట్రైన్ ప్రయాణం. అన్నీ డైరీలో రాసుకోవాలి. అమెరికాలో నా అనుభవాలు అని ఒక పుస్తకం రాయొచ్చేమో?" ట్రైన్‌లో కూర్చున్నాక బైటకు చూస్తూ చెప్పింది అనిత.

"ఏంటి చదువు అయ్యాక తిరిగి ఇండియా వెళ్ళిపోతావా?" ఆశ్చర్యంగా అడిగింది ప్రియ.

"తెలియదు కదా నా భవిష్యత్తు ఎలా ఉంటుందో. నాకైతే ఇక్కడే ఉండిపోవాలని ఉంది. అక్క కూడా ఇక్కడే ఉందికదా"

"నేను మాత్రం తిరిగి ఇండియా వెళ్ళే ప్రసక్తే లేదు. మంచి జాబ్ సంపాదించాలి. కెరియర్‌లో టాప్ పొజిషన్ సాధించాలి."

"మరి మీ అమ్మా నాన్నా ఓకేనా నువ్వు ఇక్కడే వుండిపోతే? వాళ్ళకు నువ్వు ఒక్కత్తివే కదా!"

కాసేపు మౌనంగా ఉండిపోయింది ప్రియ.

"నాకు, మా పేరెంట్స్‌కి మధ్య కొన్ని సమస్యలు ఉన్నాయి. ముఖ్యంగా మ నాన్నకు వీలైనంత దూరంగా ఉండాలని నా కోరిక. అమ్మ గురించి ఒక్కోసారి బెంగగా ఉంటుంది. తన అసహాయతను అర్థం చేసుకోవాలని అనిపిస్తుంది. నాకున్న ఒకే ఒక్క వీక్‌నెస్ అమ్మ.

నా గురించి కొంచెం చెప్పుకోవాలి అనిత. ఎప్పుడో చెపుతాలే, ఇప్పుడు కాదు. ప్రస్తుతం నేను రెడీగా లేను. ఎవ్వరితోనూ పంచుకోటానికి" లో గొంతుకతో చెప్పింది ప్రియ.

"పర్లేదు ప్రియ ఇదివరకే చెప్పాకదా నీకు. నీ మనస్సులో భారం ఎవరితోనన్నా షేర్ చేసుకో అని."

ఇద్దరూ మౌనంగా కాసేపు కిటికీలోంచి బైటకు చూస్తూ ఎవరి ఆలోచనల్లో వాళ్ళు ఉండిపోయారు.

"నా గురించి ఒకటి చెప్పాలి ప్రియ" మొహమాటంగా మొదలు పెట్టింది అనిత.

"స్టీవ్ గురించా?"

"అవును. అంత తేలికగా దొరికిపోయావా?" చిన్నగా నవ్వింది అనిత.

"లేదులే చెప్పు. ఏంటి విషయం?"

"స్టీవ్ విషయం ఏంటో అర్థం కాకుండా ఉంది ప్రియ. పరిచయం అయి మూడు నెలలు. మొదట్లో మామూలుగానే మంచి అబ్బాయ్, నవ్వుతూ నవ్విస్తుంటాడు, తెలివిగలవాడు ఇంతే తెలుసు. అంతకంటే పట్టించుకోలేదు. కానీ ఈ మధ్య తన ఆలోచనలు ఎక్కువయ్యాయి. అది ఆకర్షణో ఇంకేంటో అర్థం కావటంలేదు."

"కాలేజీలో ఉన్నప్పుడు, ఏ అబ్బాయితోనూ క్లోజ్ అవ్వలేదు నేను. నేను ఒక పరిధి దాటి దగ్గరకు రానివ్వలేదు అనటం సబబేమో. ఫ్రెండ్స్‌తో ఉన్నప్పుడు అబ్బాయిల మీద కామెంట్స్, అల్లరి, అబ్బ భలే ఉన్నాడు లాంటి మాటలు ఇవన్నీ కామన్. నేనూ వాటికి అతీతురాలిని ఏమీ కాను. మా గ్రూపులో అమ్మాయిలూ, అబ్బాయిలూ కలిసి ఓ పదిమందిమి ఉండేవాళ్ళం. బాగా క్లోజ్, కొందరితో ఇంకా టచ్‌లో ఉన్నాను. కానీ ఎవ్వరితోనూ ఇలా అనిపించలేదు"

"ఏదో అర్థంకాని గడిబిడ. ఎలా చెప్పాలో అర్థంకావటంలేదు. నన్ను నేనే కోప్పడుకుంటున్నా. ఈ టీనేజ్ వేషాలేంటి అని. తనతో ఉండాలనిపిస్తుంది. తను మాట్లాడిన రోజు చాలా సంతోషంగా ఉంటుంది. అలా అని మేము ఏమీ స్పెషల్‌గా మాట్లాడుకోము. అందరితో ఎలా ఉంటాడో, నాతోనూ అంతే. పిచ్చిగా అనిపిస్తుంది. నాకు చదువు, ఉద్యోగం చాలా ఇంపార్టెంట్. ఇలా డిస్ట్రాక్ట్ అవ్వటం నాకు నచ్చట్లేదు" కొంచెం బేలగా అన్నది అనిత.

"నాకు ఈ ప్రేమ వ్యవహారాల్లో ఎక్స్‌పీరియన్స్ లేదు. పైగా సలహాలు కూడా ఇవ్వలేను. ఇది ప్రేమో ఆకర్షణో కూడా నేను ఎలా చెప్పగలను?" చిన్నగా నవ్వింది ప్రియ.

"ఏంటో అయోమయంగా మాట్లాడుతున్నాకదా? నీ గురించి చెప్పు. ఇంతవరకు నీకు నచ్చిన వాళ్ళు దొరకలేదా? చాలా బావుంటావు. చదువులో ఫస్ట్, అందరితో కలిసిపోతావు" అమ్మాయిలకుండే సహజమైన ఆసక్తితో అడిగింది.

"నిజం చెప్పాలంటే చాలామంది ప్రపోజ్ చేశారు. ప్రేమలేఖలు రాశారు. అతి చనువు తీసుకోబోయారు. చాలా జరిగాయిలే ఇలాంటివి. కానీ నాకెప్పుడూ బాగా మనస్సుకు నచ్చిన అబ్బాయి కనపడలేదు. ఫ్రెండ్స్ అంతే. అమ్మ బాగా గొడవ చేసింది పెళ్ళి చేసుకుని అమెరికా వెళ్ళమని కానీ నాకంటూ ఒక అస్థిత్వం ఉండాలని పట్టుబట్టి పోట్లాడి వచ్చా. అదీకాకుండా ఈ పెళ్ళిళ్ళ మీద పెద్ద నమ్మకం లేదులే"

అనిత మొహం మీద సన్న నవ్వు చూసి అడిగింది ప్రియ. "ఏమి గుర్తుకొచ్చింది?"

"స్టీవ్ మాట్లాడేటప్పుడు నవ్వే తన కళ్ళు చాలా బాగుంటాయి కదా. తన కళ్ళ రంగు కూడా చాలా ప్రత్యేకంగా ఉంటుంది. బ్రౌన్‌గా ఉంటాయి కానీ మధ్యలో కొంచెం గ్రీన్‌గా తమాషాగా ఉంటాయి కదా?" ఏదో లోకంలో ఉన్నట్లుగా చెప్పింది అనిత.

"అవును చాలా హేండ్‌సమ్‌గా ఉంటాడు"

"తనను ఎప్పుడు ఇష్టపడటం మొదలుపెట్టానో నాకే తెలియదు ప్రియ. తెలియకుండానే చాలా గమనించటం మొదలుపెట్టాను. కొన్ని చిన్న చిన్న విషయాలు హత్తుకుపోతాయి. మీతో కంబైన్డ్ స్టడీస్ చేసేటప్పుడు, సీరియస్‌గా సబ్జెక్టు మాట్లాడుతున్నప్పుడు ముడిపడే తన కనుబొమ్మల్ని సరిచెయ్యి బుద్ధి అవుతుంది. ఛ అతిగా వాగుతున్నా కదా" సర్దుకు కూర్చుంది.

గట్టిగా నవ్వేసింది ప్రియ. "లాభంలేదు అనిత, గట్టిగానే తగిలింది. కొంచెం జాగ్రత్త."

కొంచెం సిగ్గుపడింది అనిత. "నాకు లైబ్రరీలో జాబ్ వచ్చింది. అక్కడి కంప్యూటర్ సెక్షన్‌లో. వారానికి కనీసం పదిహేనుగంటలు చెయ్యమన్నారు. గంటకు పది డాలర్లంట. చాలా టైట్ అవుతుంది కానీ తప్పదు" టాపిక్ మార్చింది అనిత.

బాగానే కాలక్షేపం అయ్యింది ట్రైన్‌లో. ఇన్ని గంటలు బోర్ కొడుతుందేమో అనుకున్నా కబుర్లతో టైం తెలియలేదు.

రాత్రి ఆలస్యంగా రావటంతో పడుకునేసరికి అర్థరాత్రి దాటిపోయింది. పనిలేకుంటే ఆలస్యంగా లేవటం అలవాటయినా కానీ, క్రొత్త చోటు పైగా మొహమాటంతో ఆరుగంటలకల్లా లేచేసింది ప్రియ. అనిత గాఢంగా నిద్రపోతుంది. బాత్రూంలో బ్రష్ చేసుకుని వచ్చేసరికి కవిత సోఫాపై కూర్చుని కాఫీ తాగుతూ కనిపించింది.

"అప్పుడే లేచావే? కాఫీ అలవాటు ఉందా? లేక ఇంకేమన్నా తాగుతావా?" నవ్వుతూ అడిగింది కవిత.

"కాఫీ తాగుతాను. కానీ హడావుడి ఏమీలేదు. అనిత లేచాక తాగుతాను మీరు లేవకండి" మొహమాటంగా అంది ప్రియ.

"అంత మొహమాటపడకు. మీరు ఏంటి? చక్కగా అక్కా అని పిలువు నన్ను. అనిత ఫ్రెండ్స్ అందరికీ నేను అక్కనే. పెళ్ళికి ముందు కాఫీ అలవాటు లేదు నాకు. ప్రసాద్ కాఫీ బాగా తాగుతారు. రోజుకు నాలుగు ఐదు కప్పులు. తనతోపాటే నాకూ అలవాటు అయ్యింది. కానీ నేను ఒక్క కప్పు మాత్రమే తాగుతా, ప్రొద్దున్నే ఇలా వేడిగా పడకపోతే అస్సలు బాగోదు. లేచి కాఫీ తయారు చేస్తూ చెప్పింది కవిత.

ఇంతలో అనితకూడా లేచి వచ్చింది. కాఫీలు తాగుతూ కాలేజీ కబుర్లతో కవితను బాగా నవ్వించారు.

భోజనం చేశాక ఊరు చూపించటానికి బయలుదేరారు.

"థాంక్స్ గివింగ్ అయిన తెల్లవారు ఝామున నాలుగు గంటలకు స్పెషల్ షాపింగ్ మొదలవుతుంది. బ్లాక్ ఫ్రైడే సేల్ అంటారు. అతి పెద్ద సేల్ అన్నమాట. కొన్నిటిమీద 70 పర్సెంట్ తక్కువ. దానితో విపరీతంగా రద్దీగా ఉంటాయి మాల్స్ అన్నీ. కానీ అదొక సరదా. మనం కూడా వెళదాం. పేపర్‌లో డీల్స్ చూసుకుని ఎక్కడికి వెళ్ళాలో ముందే ప్లాను చేసుకుందాం. చాలా క్రేజీగా ఉంటుందిలే" కవిత చెప్పింది.

ఈ వారం రోజులు చాలా సరదాగా గడిచిపోయాయి. కవిత, అనితల బంధం చూస్తుంటే మొట్టమొదటిసారి తనకు కూడా తోబుట్టువులు ఎవ్వరూ లేరే అని బాధగా అనిపించింది. ఇండియా ఫోన్ చేసి తన తల్లిదండ్రులతో మాట్లాడుతుంటే ఎక్కడో చిన్న అసూయ.

కవిత వాళ్ళిద్దరి సేల్ రోజున బాగానే కొన్నది, వద్దని వారిస్తున్నా వినలేదు. క్రిస్టమస్ సెలవల్లో కూడా రమ్మనమని మరీ మరీ చెప్పారు ప్రియతో తిరిగి బయలుదేరి వస్తుంటే.

"ఇంకో రెండు వారాల్లో ఇంకో సెమిష్టర్ అయిపోతుంది. మళ్ళీ నెలరోజులు సెలవలు. ఏమి చేద్దామనుకుంటున్నావు సెలవల్లో" ఫైనల్స్‌కి కష్టపడి చదువుతున్నారు అనిత ప్రియ ఇద్దరూ.

"చికాగాలో ఒక రెస్టారెంట్‌లో పార్ట్ టైం జాబ్ వచ్చింది. టిప్స్ బాగా ఉంటాయనుకుంటున్నా"

"అక్క రమ్మని గొడవ చేస్తుంది గానీ సరదాలు ఎప్పుడూ ఉండేవే, నేను కూడా ఈ నెలరోజుల్లో ఏమి చెయ్యాలా అని ఆలోచిస్తున్నా"

"నిజం చెప్పనా అనిత మీ కుటుంబంలోని ఆప్యాయత, ప్రేమ చూస్తుంటే కొంచెం జెలసీ అనిపించింది. ఇంకా హాయిగా కూడా" నవ్వింది ప్రియ.

కొంచెం ఆశ్చర్యంగా చూసింది అనిత ప్రియవైపు.

చిన్నగా నిట్టూర్చింది ప్రియ. "నేను చెప్పబోయే విషయం నీకు నమ్మశక్యం కానట్లు షాక్‌గాను ఉండొచ్చు. నాన్న వాళ్ళది పెద్ద వ్యాపారవేత్తల కుటుంబం. అమ్మతో పెళ్ళి కూడా ఒక వ్యాపారబంధమే. అమ్మ వాళ్ళ నాన్నకు కొన్ని వ్యాపారాల్లో పార్టనర్. నాన్న ఎప్పుడూ అమ్మను పట్టించుకునేవాడు కాదు. తన వ్యాపారం, పార్టీలు, తిరుగుళ్ళు. కానీ సొసైటీ కోసం చక్కటి భార్య, అందమైన ఫామిలీ అమ్మకు మాత్రం నేనంటే చాలా ప్రేమ. నేనే లోకం ఆ ఒంటరి జీవితంలో.

నాకు దాదాపు పన్నెండేళ్ళ వయస్సులో నాన్న క్లోజ్ ఫ్రెండ్ ఇంకా బిజినెస్ పార్టనర్ సూర్య అంకుల్ నాతో తేడాగా ప్రవర్తించేవాడు. అప్పుడే పొడచూపుతున్న యవ్వనం, అర్ధం అయ్యీకాని వయస్సు. ఆయన నన్ను ఒళ్ళో కూర్చోపెట్టుకుని చాక్లెట్లు తినిపించే మిషమీద తొడలు నిమరటం, పదేపదే బుగ్గలమీద ముద్దులు చాలా ఇబ్బందిగా ఉండేది. ఎలా చెప్పాలో ఎవరితో చెప్పాలో కూడా అర్ధం అయ్యేదికాదు. వీలైనంతగా తప్పించుకునేదాన్ని"

అలా ఓ రెండేళ్ళు గడిచింది. నాకు అర్ధం కావట్లేదని ఇంకా ధైర్యం వచ్చింది కాబోలు ఒకరోజు ఇంకా ముందుకు వెళ్ళాడు. అమ్మ గుడికి వెళ్ళింది. ఒక్కదాన్నే ఉన్నాను. నాన్నకోసం వచ్చినట్లు నటించి, ఐస్ క్రీం తిందాం అని బలవంతాన తీసుకువెళ్ళాడు. కారును ఎవ్వరూ లేని చోట ఆపి కారులో ఉన్న ఏవో బూతుబొమ్మలున్న పుస్తకాలు చూపించటం మొదలెట్టాడు. నేను షాక్‌గా చూస్తుంటే నాకాళ్ళు నిమురుతూ బలవంతాన నన్ను ముద్దు పెట్టుకున్నాడు. ఎంతో జుగుప్స నన్ను గట్టిగా అదిమిపెట్టి. తేరుకుని గట్టిగా నెట్టెయ్యబోయా. ఇంకా బలవంతాన నా డ్రెస్‌లో చెయ్యిపెట్టి" ఒక్క నిమిషం గట్టిగా ఊపిరి పీల్చుకుంది ప్రియా.

"గట్టిగా అరిచి మొహం రక్కాను. నాన్నతో చెపుతానని బెదిరించాను. ఏమనుకున్నాడో ఇంటికి తీసుకొచ్చి దింపేశాడు. నాన్నకు చెపితే వ్యాపారంలో నష్టపోయేలా చేస్తానని రోడ్డు మీదకు ఈడుస్తానని బెదిరించాడు. కొన్నాళ్ళు నిద్రలో పీడకలలతో లేచేదాన్ని. ఒకరోజు భరించలేక అమ్మతో చెప్పేశా. ఏనాడూ నాన్నతో రెండు ముక్కలు కూడా మాట్లాడని అమ్మ నాన్నతో ఇదంతా చెప్పి అతన్ని నిలదియ్యమంది."

"ఏ తండ్రన్నా ఎలా ప్రవర్తిస్తాడో తెలియదుకానీ నా తండ్రి మాత్రం నన్ను నమ్మలేదు. సినిమాలు చూసి ఏవేవో ఊహించుకుని పిచ్చిగా మాట్లాడుతున్నాను అన్నాడు. ఇంక పైగా సరిగ్గా పెంచటం చేతకాలేదని అమ్మను తిట్టాడు. ఇలాగే పెంచితే పదహారేళ్ళకే ఎవడితోనో కడుపు తెచ్చుకుంటానంట. ఒక తండ్రి మాట్లాడవలసిన మాటలేనా? ఆ అంకుల్ ప్రవర్తన కంటే నాన్న రియాక్షన్ ఇంకా కృంగదీసింది.

నా పరిస్థితి చూసి అమ్మకు చాలా భయం వేసింది. మొట్టమొదటిసారి తనంతట తానే ఓ నిర్ణయానికి వచ్చి ఒకమంచి బోర్డింగ్ స్కూల్లో చేర్పించింది. డబ్బులు బాగానే ఉన్నాయి కదా. వాతావరణం మార్పు ఇంకా స్కూలు డాక్టరు సాయంతో నెమ్మదిగా ఆ జ్ఞాపకాల భయం నుండి బైటపడ్డాను. కాలేజీలో కూడా నేను అందంగా ఉంటానని కాబోలు చాలామంది అబ్బాయిలు వెంటపడేవారు. వాళ్ళెవ్వరూ నన్ను ప్రేమించారని నేను అనుకోను. నాకు మగవాళ్ళమీద ఈ పెళ్ళిళ్ళ మీద కొంచెం నమ్మకం తక్కువ. ఆ రోజు తరువాత నేను మళ్ళీ మా నాన్నతో మాట్లాడలేదు. కాలేజీరోజుల నుండి నా పాకెట్ మనీ కోసం ట్యూషన్స్ చెప్పేదాన్ని. కాలేజీ ఫీజుకు చాలకుంటే తీసుకునేదాన్ని. అది కూడా అమ్మ డబ్బులు మాత్రమే.

అమ్మమీద కూడా ఏదో కోపం. అలాంటి భర్తతో ఇంకా ఉందని, తనకు కూడా చాలా ఆస్థి ఉంది కదా, తెగించి నాన్నను వదిలెయ్యవచ్చు కదా! ఇప్పుడిప్పుడే కొంచెం అర్థం చేసుకుంటున్నా. చాలామంది ఆడవాళ్ళకు పరిస్థితులను ఎదుర్కునే శక్తి పరిస్థితులను ఎదుర్కునే శక్తి తక్కువ నా పరిస్థితికి బాధపడి హాస్టల్లో పెట్టింది కానీ నాన్నను ఎందుకు నిలదియ్యలేదు? కన్నకూతురిని నమ్మకుండా ఆ వెధవతో బిజినెస్ ఎలా చేస్తున్నావని. సారీ అనిత ఇలాంటి చెత్త విషయాలు కెలుక్కున్నాను. ఎప్పుడో ఒకసారి ఇవన్నీ గుర్తుకువచ్చి మనసంతా ఒకలాగా అయిపోతుంది. జరిగినదాంట్లో నా తప్పేమీ లేదు. ఒక పర్వర్ట్ చేసినదానికి నేను బాధ్యురాలిని కాదని నాకు తెలుసు, కానీ ఎవరిమీదో కోపం"

ప్రియ మాట్లాడుతున్నంతసేపు తన చెయ్యిపట్టుకుని కూర్చుంది అనిత. మధ్యలో ఏమీ మాట్లాడలేదు.

"నిజం చెప్పాలంటే నీకు జరిగిన అవమానం, లేక ఇంకో విధమైన లైంగిక దాడులు చాలామంది ఆడపిల్లల మీద జరుగుతుంది. చాలామంది బైటకు కూడా చెప్పుకోలేక లోలోపల నాశనం అయిపోతారు. పెళ్ళి అయినా కూడా భర్తతో సరిగ్గా ఉండలేరు. సెక్స్ అంటే విముఖత, ద్వేషం. థోజ్ స్కేర్స్ నెవర్ గో అవే. నీకు సైక్రియాటిస్టు సాయంతో ఆ జ్ఞాపకాల నుండి బైటపడే అవకాశం వచ్చింది. నిన్ను నిన్నుగా ప్రేమించే వ్యక్తి డెఫినెట్‌గా నీ జీవితంలోకి వస్తాడు" నిజాయితీగా చెప్పింది అనిత.

"నా అస్థిత్వం కేవలం ఒక మగవాడి వల్లేనా? చాలామంది మొగవాళ్ళు ఎలా ప్రవర్తిస్తారో నాకు తెలుసు. సెక్స్ ఈజ్ జస్ట్ ఎ ఫిజికల్ నీడ్ ఫర్ దెమ్. మన దేశంలో ఓపెన్ రిలేషన్‌షిప్స్ తక్కువ కాబట్టి, ప్రేమ, పెళ్ళి, ముసుగులు" ఆవేశంగా అన్నది ప్రియ.

"అందరూ చెడ్డవాళ్ళు కాదులే ప్రియ. ఎప్పటికైనా నీ అభిప్రాయం మారుతుంది"

"మనం ఓ ఇరవైయేళ్ళ తరువాత కనుక కలిస్తే అప్పటికి మన జీవితం ఎలా ఉంటుందో తెలియదు కానీ నేనే కరెక్ట్ అని గ్రహిస్తావు. మోస్ట్ ఆఫ్ ది మెన్ ఆర్ అబ్యూస్ టు ఉమెన్, అదైర్ ఫిజికల్లు ఆర్ ఎమోషనల్లి"

ప్రియ బాగా అప్‌సెట్‌గా ఉందని గ్రహించి ఇక మాటలు పొడిగించలేదు అనిత.

అలవాటులేని చలికి గడగడలాడుతూ వేగంగా నడుస్తుంది ప్రియ. శీతాకాలం సెలవల్లో రెండు జాబ్స్ చేస్తుంది ప్రియ. వారంతా చికాగోలో ఉన్న ఇండియన్ రెస్టారెంట్‌లో వెయిట్రెస్‌గా చేరింది. వీకెండ్‌లో పార్టీల కేటరింగ్‌లో కూడా సహాయం చేస్తుంది. జీతం బాగుంది, పైగా చలాకీగా ఉండటంతో టిప్స్ కూడా బాగానే వస్తున్నాయి.

"గుడ్ మార్నింగ్ మెహతా సాబ్" రెస్టారెంట్‌లోకి అడుగుపెడుతూనే ఎదురుగా కనిపించిన బాస్‌ని పలుకరించింది.

"ప్రియ వి హేవ్ లాట్ ఆఫ్ వర్క్ టుడె అనుకోకుండా ఒక పార్టీకి బుక్ చేశాం. ఇవాళ మధ్యాహ్నం పన్నెండు నుండి మూడు దాకా. ఒంట్లో బాగోలేదని ఇద్దరు స్టాఫ్ రాలేదు. నువ్వే మేనేజ్ చెయ్యాలి పార్టీ ఎరేంజ్‌మెంట్స్ అమంతా. వీళ్ళది అవుతూనే మళ్ళీ సాయంత్రం ఆరుగంటలనుండి ఇంకో పార్టీ ఉంది."

మెహతా చాలా కష్టపడే మనిషి. ఇండియానుండి ఎప్పుడో పాతిక సంవత్సరాల క్రితమే వచ్చి చిన్న చిన్న పనులు చేస్తూ ఇంగ్లీషు నేర్చుకుని ఒక హోటల్లో పనికి కుదిరి కొన్నాళ్ళకు ఒక చిన్న ఇండియన్ రెస్టారెంట్ మొదలుపెట్టారు. క్రమేణా మంచిపేరు రావటంతో పెద్దది చేశారు.

ప్రియ చేరి రెండు వారాలే అయినా, ఆయనకు బాగా నమ్మకం కుదిరింది. ప్రియ పని తీరు, కష్టపడే విధానం. సెలవలు అయిపోయాక కూడా వీకెండు వచ్చి చెయ్యమని అడిగారు.

తోటి వర్కర్ అనిల్ సహాయంతో పార్టీ హాలు మొత్తం సర్దేసింది. పది టేబుల్స్ మీద క్లాత్ వేసి, సెంటర్ పీస్‌లా ఒక్క గులాబి ఉన్న చిన్న వేజ్‌తో ఫైనల్ టచ్ ఇచ్చేసరికి దాదాపు పదకొండు అయింది. ఇంతలో బెలూన్స్ వచ్చాయి. ఒక ఇండియన్ దంపతుల బాబు పుట్టినరోజు. దాదాపు యాభై మందికి పార్టీ.

ఒక పార్టీ తర్వాత ఇంకొకటి రాత్రి పదకొండు దాకా క్షణం తీరిక లేనట్లుగా కష్టపడ్డారు అందరూ. మధ్యలో ఆదరాబాదరాగా తిన్న అన్నం ఎప్పుడో అరిగిపోయింది. మర్నాడు వస్తానని బైటపడింది ప్రియ.

ఇంకో నాలుగురోజుల్లో క్రిస్‌మస్ కావటంతో అర్ధరాత్రి కావొస్తున్నా షాపులన్నీ తెరిచే ఉన్నాయి. విపరీతంగా షాపింగ్ చేస్తారు క్రిస్‌మస్‌కు. ఆఖరి నిమిషందాకా కొంటూనే ఉంటారు.

రెండు బస్సులు మారి గదికి వచ్చేసరికి అర్ధరాత్రి దాటింది. అలసటగా పక్కమీద పడిపోయింది ప్రియ.

**అలారం మోతకు** బద్దకంగా నిద్రలేచి తయారయ్యింది ప్రియ. స్నానం చేసి కార్న్‌ఫ్లేక్స్‌లో పాలు పోసుకుని గబగబా తిని బ్యాగులో బుక్స్ సర్దుకుని బయలుదేరింది. ఆనంద్, స్టీవ్‌లతో కలిసి ఒక ప్రాజెక్టు చేస్తోంది ఈ సెలవల్లో.

ముగ్గురూ ఒక బుక్‌స్టోర్లో కలిశారు. అక్కడ రిఫరెన్సు పుస్తకాల సాయంతో కావల్సిన విషయ సేకరణ చేస్తూ ఎంత టైం గడిచిందో కూడా తెలియలేదు.

"అబ్బా అప్పుడే నాలుగయ్యింది. ఆరుగంటలకల్లా పనికి వెళ్ళాలి. నిన్న పని బాగా ఎక్కువయ్యింది, చాలా అలసటగా ఉంది." బద్దకంగా చేతివేళ్ళు విరుచుకుంటూ అన్నది ప్రియ.

"ఇండియాలో ఇంత కష్టపడము మేము. చదువుకుంటూ ఉద్యోగాలు చెయ్యటం చాలా రేర్. ఇక్కడికి వచ్చాక నిజాయితీగా చేసిన ఏ పనీ తప్పుకాదు అని నేర్చుకున్నా. ఈ పద్ధతి ఇండియాలో కూడా వస్తే డబ్బు విలువ తెలుస్తుంది" అన్నాడు ఆనంద్.

"టీనేజ్ నుండే అందరూ ఏదో ఒక చిన్న పనైనా చేసి తమ ఖర్చులకు సంపాదించుకుంటారు. మరీ బాగా డబ్బున్న వాళ్ళు తప్పించి అండర్ గ్రాడ్యుయేట్ అయ్యాక ఒక రెండేళ్ళు పనిచేసి బాగా డబ్బులు ఆదా చేసుకుని మళ్ళీ చదువుతున్నా. ఎలాగైనా ఎం.బి.ఏ చెయ్యటం నా కల. మా నాన్నలాగా చిన్న ఉద్యోగంతో ఉండిపోకూడదన్న తపన. మంచి ఉద్యోగం సంపాదించాలన్నది నా గోల్" అన్నాడు స్టీవ్.

కాఫీ తాగుతూ మౌనంగా ఉండిపోయారు కాసేపు.

"మర్చిపోయా ఇంటెన్ షిప్‌కి అప్లై చేశాం కదా! మీకేమన్నా జాబ్స్ వచ్చాయా? పెద్ద కంపెనీల్లో దొరికితే మన ఫ్యూచర్‌కు చాలా మంచిది. చికాగోలో ఎన్ని పెద్ద ఫైనాన్స్ కంపెనీలు ఉన్నాయో" ఆనంద్ అడిగాడు.

లేదన్నారు ఇద్దరూ.

"ఇంటికి ఎప్పుడు వెళుతున్నావు?" స్టీవ్‌ని అడిగింది ప్రియ.

"క్రిస్టమస్ గురువారం కదా! నేను బుధవారం వెళతా. రెండుగంటల డ్రైవ్ అంతేకదా. మా పేరంట్సు వారం ఉండేట్లు రమ్మంటున్నారు. ఇంకా గిఫ్ట్సు కొనలేదు. వర్కులో చాలా బిజీగా ఉన్నాను. రేపు షాపింగ్ పూర్తి చెయ్యాలి" ఒక్క నిమిషం మౌనంగా ఉండి "అనితను అడిగాను నాకు షాపింగ్‌లో సాయం చెయ్యమని, వస్తానన్నది" అన్నాడు.

"ఆర్ యు సీరియస్ అబౌట్ అనిత?" అడిగాడు ఆనంద్.

"ఐ లైక్ హర్ ఎ లాట్! తన దగ్గర ఉంటే ఏదో హాయిగా ఉంటుంది. అదే సమయంలో ఎక్సైయిటింగ్‌గా కూడా ఉంటుంది. నాకు తెలుసు ఇండియన్ అమ్మాయిలు సాంప్రదాయంగా ఉంటారని. ఆనంద్ చాలా సార్లు వాయించాడుగా. నేనేమీ అతి చనువు తీసుకుని ఇబ్బంది పెట్టటం లేదు. తన కంపెనీ నచ్చుతుంది. అంతే" చిన్నగా నవ్వాడు స్టీవ్.

రూముకు వచ్చి బట్టలు మార్చుకుంటూ స్టీవ్ అనితల గురించి ఆలోచించింది ప్రియ. ఎందుకో మొదటినుండి కూడా మొగాళ్ళ మీద తనకుండే సినిసిజం స్టీవ్ మీద కలుగలేదు. సిన్సియర్‌గా ఉంటాడు అనిపిస్తుంది.

'తనకు కూడా ఎప్పటికైనా ఎవరైనా నచ్చుతారా?' ఉలిక్కిపడింది ఆ ఆలోచనకు.

ఇంతవరకు ఎవ్వరిని ఒక పరిధి దాటి ముందుకు రానివ్వలేదు. ఎంత పరిచయం స్నేహం ఉన్నా వాళ్ళ మీద వేరే భావం రాలేదు. ఎందుచేత? తనలోనే ఏమైనా లోపం ఉన్నదా? ఈ వయస్సులో ఇదంతా సహజమే కదా!

వయస్సు ఆకర్షణ కావొచ్చు, వ్యక్తిత్వపు ఆకర్షణ కావొచ్చు. ఎందువలన తను ఎవ్వరితోనూ దగ్గరగా రాలేకపోతుంది. ప్రేమ అంటే సంపూర్ణంగా మనల్ని మనం మనసా వాచా కర్మణా అవతలి వ్యక్తికి అర్పించుకోవటం అని ఎక్కడో చదివి, అంతా ట్రాష్ అని నవ్వుకుంది.నో! నా విషయంలో అది ఎన్నటికి జరగదు. నేను ఇంకొకరికి లొంగిపోవటమా? నెవ్వర్. ఒకవేళ మతి, గతి తప్పి ఎవరికన్నా లోబడితే ఇంక అంతే. వాళ్ళ కంట్రోల్లోకి వెళ్ళిపోతాం. వాళ్ళకోసం బ్రతుకుతాం, మన అలవాట్లు అభిప్రాయాలు అన్నీ మారిపోతాయి. కొన్నాళ్ళకు నా ఐడెంటిటీ కోల్పోవాల్సి వస్తుంది. వద్దు. నా బ్రతుకు నాది. నాకోసం నేను బ్రతుకుతా! నా ఆనందం, దుఃఖం నావి, నా ఆనందాన్ని వేరే వారి చేతుల్లో పెట్టలేను. స్థిరంగా అనుకుంది ప్రియ.

క్రిస్టమస్ రోజు నిద్రలేస్తూనే కిటికీలోనుండి బైటకు చూసి గట్టిగా అరిచేసింది అనిత. ఉలిక్కిపడి నిద్రలేచింది ప్రియ.

"ప్రియ లే! లే! బైట చూడు స్నో పడుతుంది. అబ్బా ఎంత బాగుందో! మల్లెపూల వానలాగా"

ప్రియ రూమ్మేటు సెలవలకు ఇంటికి వెళ్ళటంతో రాత్రి అనిత వచ్చింది. ఈ నాలుగురోజులు ప్రియ దగ్గర ఉండటానికి. ఈ అపార్టుమెంట్‌కు బాల్కనీలేదు. బైటకు చూస్తుంటే, రోడ్లు అన్నీ ఒక పల్చటి తెల్లని మేలిముసుగు వేసుకున్నట్లుగా ఉన్నది. ఆకాశం నుండి దట్టంగా కురుస్తున్న మంచుపూల రేకుల్లా మెత్తగా మృదువుగా అద్భుతంగా ఉందా దృశ్యం.

"పద పద! అలా బద్దకంగా చూడకు. రెడీ అవ్వు బైటకు వెళదాం. మన మొట్టమొదటి స్నో." చాలా ఎక్సయిటింగ్‌గా ఉంది అనితకు.

"సర్లే! బైట బ్రేక్ ఫాస్టుకు వెళదాం, ఎటూ మధ్యాహ్నం మనమే వండుకోవాలి కదా! రెడీ అయ్యి వస్తా" బాత్రూంలోకి వెళ్ళింది ప్రియ.

అంతటా మెత్తటి స్నో పరుచుకుంది. ఆశ్చర్యం ఏంటంటే, మామూలుగా చికాగోలో విపరీతమైన గాలి. అందుకే 'విండీ సిటీ' అంటారు, గాలి మూలాన చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. కానీ మంచు పడుతుంటే గాలిలేదు. బైట నిల్చున్నా కానీ మరీ ఇబ్బందిగా లేదు.

"మనకు ఈ చలి అలవాటయ్యిందా? లేక నిజంగానే అంత చలిలేదా? ఎంత హాయిగా ఎంజాయి చేస్తున్నాం ఇలా స్నో పడుతుంటే" తల పైకెత్తి కళ్ళు మూసుకుని మొహం మీద పూలజల్లులాగా పడుతున్న మంచును ఆస్వాదిస్తూ అన్నది అనిత.

"ఎంత బాగుందో చూడు. అందరూ ఎంత బాగా ఎంజాయ్ చేస్తున్నారో. ప్రతి సంవత్సరం దాదాపు ఏడు నెలలు అడపాదడపగా, ఒక్కోసారి తీవ్రంగా స్నో పడినా, మొట్టమొదటి స్నో ప్రతిసారి కొత్తగా అందంగా ఉంటుంది కాబోలు. తమలాగే స్నోను ఆస్వాదిస్తున్న వారిని చూసి అనుకుంది అనిత. వైట్ క్రిస్టమస్ అన్న సెంటిమెంట్ అంట, స్టీవ్ చెప్పాడు మొన్న.

కాసేపు అలానే స్నోలో చిన్నపిల్లల్లాగా ఆడుకుని, మొహం అంతా ఎర్రగా కందిపోవటంతో దగ్గర్లో ఉన్న కాఫీ షాపుకు వెళ్ళారు. బూట్లకున్న స్నో, బైట విదిలించి, వేడి కాఫీ బ్రేక్‌ఫాస్ట్ ఆర్డరు ఇచ్చారు.

"ఇక ఇప్పుడు చెప్పు అసలు కథ. ఏంటీ నువ్వూ స్టీవ్ షాపింగ్‌కు వెళ్ళారంట. నువ్వే చెపుతావు కదా ఎదురుచూస్తుంటే చెప్పవే?" దబాయించింది ప్రియ.

"ఏముంది చెప్పటానికి?" కొంచెం సిగ్గుగా అడిగింది అనిత.

"నువ్వు నన్ను చంపకే తల్లీ. ఒక్కటి కూడా వదలకుండా డీటైల్సు అన్నీ చెప్పు మర్యాదగా"

"మరీ అతి చేసుకున్నావు. ఏముంది చెప్పటానికి. షాపింగ్ చేస్తూ ఇద్దరం ఒకరి ఫామిలీ గురించి ఒకరం చెప్పుకున్నాం. ఇంకా చిన్నప్పటి సంగతులు. అన్నీ అయ్యాక డిన్నరు తిన్నాం. నీకు, ఆనంద్‌కు కూడా కొన్నాడు. ఏమీ రొమాంటిక్‌గా మాట్లాడుకోలేదు ప్రియ. నేను క్రిస్టమస్ చేసుకోను అని చెప్పా అయినా అందరికి ఇస్తాం అని నాకు కూడా ఓ గిఫ్ట్ ఇచ్చాడు. ఇవాళ్ళ తెరవమన్నాడు. వాళ్ళ పండుగ కదా అని నేను కూడా ముందే ఏదో కొన్నాను. అది ఇచ్చాను. ఇంతేకథ"

"ఏమీ రొమాంటిక్ కబుర్లు చెప్పుకోలేదా?"

"అరే! ఏమీ లేదు తల్లీ కానీ అంత సమయం ఎలా గడిచిపోయిందో తెలియలేదు. చాలా నవ్విస్తాడు. తనతో మాట్లాడుతుంటే చాల ఫ్రీగా ఉంటుంది. నాతో నేను ఉన్నట్లు"

"ఇంతకీ ఏమి గిఫ్ట్ ఇచ్చావు స్టీవ్‌కి" అడిగింది ప్రియ.

"ఇండియన్ షాపులో కొన్నాను. మంచి నగిషీ చెక్కిన పెన్‌స్టాండ్"

"మరి స్టీవ్ ఏమిచ్చాడు నీకు"

"ఇదిగో" అంటూ హ్యాండు బ్యాగు నుండి చిన్న గిఫ్టు బాక్స్ తీసింది. పైన ఒక కెంపురాయి, కింద వేలాడుతున్న ఇంకో కెంపు, చుట్టూ తెల్లరాళ్ళు ఎంతో ముద్దుగా ఉన్నాయి చెవిపోగులు.

"వావ్! బలే ఉన్నాయి పెట్టుకో అనిత"

"లేదు, తనను కలిసినప్పుడు పెట్టుకుంటా" పోగులను అపురూపంగా చూస్తూ చెప్పింది అనిత.

"ఎంత రొమాంటిక్ నువ్వు. డు యు లవ్ హిమ్?"

"అదే అర్థంకావట్లేదు.  చాలా కన్ఫ్యూజింగ్ గా ఉంది. కానీ నాలో తనపైన ఉన్న ఫీలింగ్స్ పేరు ప్రేమ అయితే మేబీ నేను తనను ప్రేమిస్తున్నానేమో" నెమ్మదిగా చెప్పింది అనిత.

"అయినా ఈ ఫీలింగ్స్ అర్థం కావట్లేదు. స్టీవ్‌కి మాత్రం నేనొక ఫ్రెండ్ మాత్రమే అనుకుంటా. నవ్విస్తాడు, బాగా మాట్లాడతాడు, కానీ ఫ్లర్ట్ చెయ్యటమో, చనువు తీసుకోవటమో లేదు. తను ఎదురుగా ఉంటే నాకేమో బుఱ్ఱ పనిచెయ్యదు. ఏమిటిదంతా?" బేలగా అడిగింది.

"నాకు తెలియదు తల్లో ఇదంతా. కానీ ఒకటి మాత్రం చెప్పగలను, పీకల్లోతు కూరుకుపోయావు. కొంచెం ఆచితూచి ప్రవర్తించు అనిత. దెబ్బతినకుండా జాగ్రత్తపడు. నీ గురించి నాకు తెలుసు, చాలా సెన్సిటివ్, తను అమెరికన్, పరిచయం లేని మనస్తత్వాలు. అంటే చెడ్డవాడని కాదు, చాలా మంచివాడు. లేకుంటే నేను నిన్ను ఇలా టీజ్ చేసేదాన్ని కాదు ఎప్పుడో చెప్పేదాన్ని అతను వద్దు అని. కానీ తొందరపడుతున్నావేమో నిదాన్నగా ఆలోచించుకో"

"రాజి ఎలా వుందో? సెలవల్లో కాఫీ షాపుకు రావటంలేదు కదా!" టాపిక్ మార్చింది అనిత.

"అవును వాళ్ళ ఇంటికి ఫోన్ చెయ్యబుద్ధి అవలేదు నాకు. పద బిర్యాని చేసుకుని తిందాం. మన రీతిలో మనమూ సెలబ్రేట్ చేసుకోవాలి.

***అనిత***

***వసంత - 2000***

ఏప్రిల్ నెల కావటంతో చలి కాస్త తగ్గుముఖం పట్టింది. క్యాంపస్‌లో ఆ చలిలో తిరుగుతుంటే ప్రాణాలు గడ్డకట్టిపోతున్నట్లు అనిపించేది. అలవాటు అవుతున్నట్లే ఉండేది, మళ్ళీ బాగా స్నో పడి చలి విపరీతంగా వున్న రోజు ఏమి కష్టాలురా బాబూ, ఇండియా వెళ్ళిపోతే బాగుండు, ఎందుకున్నాను ఇక్కడ అనిపించేది.

కాలింగ్ కార్డుతో రెండు వారలకో, నెలరోజులకో ఒకసారి ఇండియా ఫోను చేసి అమ్మా నాన్నలతో మాట్లాడుతుంది ఓ అరగంట సేపు. మొదటి సెమిస్టరు ఫీజు ఇండియాలో ఉన్నప్పుడే కట్టేశారు. రెండో సెమిస్టరుకు, కొంత డబ్బులు తను దాచుకున్నవి ఉన్నాయి అని చెప్పినా వినిపించుకోకుండా ప్రసాద్ కట్టేశాడు.

వచ్చే సంవత్సరానికి మొత్తం ఎలాగైనా తానే కట్టాలని, కష్టపడి కూడబెడుతుంది అనిత. బావ దగ్గర డబ్బులు తీసుకోవటం మొహమాటంగా ఉండి, తల్లితో చెప్పింది. పోయినసారి ఫోనులో మాట్లాడినప్పుడు తండ్రి నచ్చచెప్పాడు.

"ఎక్కువగా ఆలోచించకమ్మా. హాయిగా చదువుకో. నేను ఇక్కడినుండి పంపి, మళ్ళీ మార్చుకోవటం ఎందుకని నేనే బావకు చెప్పాను. ఇక్కడ నేను అక్క, బావపేరు మీద అపార్టుమెంటు తీసుకుంటున్నా వాటికి బదులుగా. వర్రీ అవ్వకు" నచ్చచెప్పాడు రామారావు.

ఎంత నచ్చచెప్పినా, వచ్చే సంవత్సరం తనే ఫీజులు కట్టుకోవాలని గట్టిగా నిర్ణయించుకున్నది అనిత. ఎంత మారిపోయింది తన మనఃస్తత్వం అమెరికాకు వచ్చాక అని తనమీద తనకే ఆశ్చర్యంగా ఉంటుంది ఒక్కోసారి. ఇండియాలో ఉండగా నాన్న డబ్బులు పంపుతుంటే విచ్చలవిడిగా ఇక్కడికి వచ్చాక డబ్బు విషయంలో బాధ్యత పెరిగింది. పైగా అన్ని విషయాలు బాగా బాలెన్సు చేసుకోగలుగుతుంది. చదువు, రెండు ఉద్యోగాలు, స్నేహితులు, ఎంజాయ్‌మెంట్ అన్నీ బాగున్నాయి.

స్నేహితుల గురించి ఆలోచిస్తుంటే స్టీవ్ గుర్తుకు వచ్చాడు. అతనితో స్నేహం ఎటు దారి తీస్తుందో అర్థం కావట్లేదు. అతని సమక్షంలో మనస్సు పురివిప్పిన నెమలిలా ఆడుతుంది. ప్రతి చిన్న విషయం తనతో పంచుకోవాలని ఉంటుంది. అందరూ కలిసి సినిమాకో మ్యూజియంకో వెళితే, అతనికోసం ప్రత్యేకంగా తయారవుతుంది. మళ్ళీ ఏదో మథన నా గురించి ఏమనుకుంటున్నాడు? నేనంటే ఇష్టమేనా లేక కేవలం స్నేహమా? ఆ ఆలోచనే దిగులుగా ఉంటుంది.

ఒక్కోసారి చాలా ఉక్రోషంగా ఉంటుంది. ఈ గొడవంతా ఎందుకు? అడిగేద్దామా? మహా అయితే నో అంటాడు అంతేగా అని. కానీ ఏదో సంకోచం.

ఎన్ని దేశాలు మారినా, ఆడపిల్లల మనస్సులో ఇంత బిడియం ఉంటుందా? అప్పటి కాలంలో రుక్మిణినే నయమేమో, ధైర్యంగా తాను ప్రేమించిన కృష్ణుడికి ప్రేమలేఖ పంపింది.

శిశిరంలో మోడువారిన చెట్లన్నీ మళ్ళీ చిగురిస్తున్నాయి. ప్రతి చెట్టూ, కొమ్మ చిన్ని చిన్ని ఆకులతో, పచ్చని సింగారంతో కనువిందుగా ఉంది క్యాంపస్ అంతా. ఎక్కడ చూసినా మాగ్నోలియా పూల చెట్లు, చెర్రీపూలు, డాఫెడెల్స్ గుత్తులు.

రెండువారాల క్రితం కాబోలు అప్పుడే మొట్టమొదటిసారిగా మాగ్నోలియా పూలను చూడటం. లైబ్రరీ నుండి సాయంత్రం తిరిగి వస్తుంటే స్టీవ్ కనిపించి కాఫీ తాగుదామా అని పిలిచాడు.

"ఏంటి ఈ పూలు, చాలా బాగున్నాయి" రోడ్డు పక్కన ఉన్న చెట్టు చూపిస్తు అడిగింది. చెట్టు నిండా ఒక్క ఆకు కూడా లేకుండా, అరచేతి వెడల్పుతో తెల్లటిపూలు. పల్చటి సున్నితమైన పరిమళం.

"మాగ్నోలియా అంటారు. మా ఇంట్లో కూడా ఉంది. కానీ అది లైట్ పింక్"

చెట్టు కింద నిల్చుని ఆ పూలను చూస్తూ చాలా మైమరచిపోయింది అనిత. కొమ్మల్ని ఊపుతూ రాలే పూరేకుల మధ్య తలతిప్పి స్టీవ్ వైపు చూస్తూ ఏదో అనబోతూ అతని చూపుల్లో చిక్కడిపోయింది.

స్టీవ్ మొహంలో ఏదో తెలియని అర్థంకాని భావం. పెదవుల మీద సన్నటి చిరునవ్వు చేతులు కట్టుకుని తనవైపే చూస్తూ సిగ్గుగా అనిపించింది. అది సొంతం సిగ్గుకూడా కాదేమో? సిగ్గు, తడబాటు, కంగారు అన్ని రకాల భావాల ముప్పేటలో ఉక్కిరి బిక్కిరి అయ్యింది. చూపులు పక్కకు తిప్పలేకపోయింది.

అకాలంలో పడుతున్న స్నో, పూలజల్లులో కలిసిపోయి, మొహం మీద ముత్యపు జల్లై ఆ స్నో తుడుచుకోవాలన్న ఆలోచన కానీ, హుడీ తలపైకి లాక్కోవాలన్న ఇంగితం కానీ లేనట్లుగా ఇద్దరూ అలానే ఉండిపోయారు.

నెమ్మదిగా స్టీవ్ చెయ్యి చాచి, అనిత మొహం మీద పడుతున్న వెంట్రుకలు సున్నితంగా వెనక్కి నెట్టాడు.

ఊపిరి తీసుకుంటే ఈ కల చెదిరిపోతుందా అన్నంత ఉద్విగ్నంగా అనిపించింది అనితకు.

"కమ్ లెట్స్‌గో! స్నో పడుతుంది" గొంతు సవరించుకుని అన్నాడు స్టీవ్.

"నా రూంకి వెళ్ళిపోతాను" అని ఎవరో తరుముతున్నట్లుగా రూంకు వచ్చిపడింది. మంచం మీద కూలబడినా కానీ కాళ్ళూ చేతులు ఇంకా ఒణుకుతున్నట్టుగానే ఉంది.

ఏంటి ఈ ఫీలింగ్స్? స్టీవ్ తనవైపు చూసిన చూపుకు తనను ముద్దుపెట్టుకున్నంత సన్నిహితంగా ఎందుకు అనిపించింది. ఒక్క చూపుకే ఇలా అయిపోతే నిజంగా ముద్దుపెట్టుకుంటే ఉలిక్కిపడింది అనిత. కేవలం ఈ ఆలోచన వచ్చినందుకే చాలా గిల్టీగా ఉంది.

ఏనాడూ చెలించని మనస్సు, ఇలా కంట్రోల్లో లేకపోవటం, పైగా చదువు, కెరియర్ అన్న గోల్ నుండి ఏనాడూ దృష్టి మరల్చలేదు తను. అలాంటిది ఈ ఆలోచనలు ఏంటి? అర్థంకాని బెంగ, దిగులు కమ్మేసింది అనితను.

ఓ రెండు వారాలు కాస్త ముభావంగా ఉన్నాడు స్టీవ్ కనిపించినప్పుడల్లా. ఇంకా బెంగగా అయిపోయింది అనిత.

లైబ్రరీలో చదువుకుంటుంటే దగ్గరికి వచ్చి ఆగాడు స్టీవ్.

"రేపు శనివారం ఏమన్నా ప్లాన్సు ఉన్నాయా నీకు?"

"ఏమీ ప్రత్యేకంగా లేవు. ఏంటి సంగతి?" ఆశ్చర్యంగా అడిగింది.

"శనివారం సాయంత్రం నిన్ను డిన్నరుకు తీసుకువెళదామని"

"ఏంటి అకేషన్?" అనితకు అర్థంకాలేదు.

"అకేషన్ లేకుంటే నాతో రావా?" మొహం మీద సన్న చిరునవ్వు

"అలా అనికాదు, వస్తాను. ఎవరెవరం వెళుతున్నాం?"

"నువ్వు, అంతే సాయంత్రం ఆరుగంటలకు నిన్ను పిక్ చేసుకుంటాను. బైదిబై ఇండియన్ డ్రస్ వేసుకుంటావా? దాంట్లో చాలా బాగుంటావు. సీయూ టుమారో" గబగబా చెప్పేసి, అనిత తేరుకునే లోగా వెళ్ళిపోయాడు.

ఏంటి ఈ కుర్రాడు నేనూ తనూ మాత్రమే డిన్నరుకు వెళ్ళటం ఏంటి?

ఏదో తెలియని తడబాటు, గుండె వేగంగా కొట్టుకోవటం మొదలుపెట్టింది. గబగబా పుస్తకాలు బ్యాగులో సర్దుకుని ప్రియకోసం వెతికింది. లైబ్రరీలో కనపడలేదు. టైంకు కనపడదు. ఎక్కడుందో అని లైబ్రరీ బైటకు వచ్చి ఫోనుచేద్దామనుకుంటుంటే, లోపలికి వస్తూ కనిపించింది ప్రియ.

"ప్రియా ఒక్క నిమిషం నీతో పని ఉంది ఆగు."

"ఏమైంది?"

స్టీవ్ తనను డిన్నరుకు పిలిచిన విషయం చెప్పింది.

"వావ్! ఆర్యూ గోయింగ్ ఆన్ డేట్?"

"డేటింగా?" కంగారుగా అడిగింది అనిత.

"అబ్బా! అనితా అన్నిటికీ ఏంటా కంగారు. డేటింగ్ అంటే శారీరక సంబంధం మాత్రమే కాదు. ఒకరినొకరు తెలుసుకోటానికి, ఇలా సినిమాలకు, డిన్నర్లకు వెళతారు. అతిగా ఊహించుకుని భయపడకు. నీకు ఇష్టంలేకుంటే కట్ చేసుకో. కానీ ఐ థింక్ హి లైక్స్ యు ఎ లాట్"

"ఇండియన్ డ్రస్ వేసుకోమన్నాడు.""అరే వాః! క్యా బాత్ హై" చిలిపిగా నవ్వి చీర కట్టుకో, తట్టుకోలేక పడిపోవాలి"

"చల్ నీతో చెప్పా చూడు. నమిలేస్తావు. బై వెళుతున్నా" అని పారిపోయింది అక్కడినుండి.

**సెల్వార్ వేసుకోవాలా** లేక చీర కట్టుకోవాలా అని చాలాసేపు మధనపడింది. రేపు తన పుట్టిన రోజని ప్రియ చెప్పిందేమో అందుకే పార్టీ ఇస్తున్నాడేమో అని మనస్సుకు సర్దిచెప్పుకుంది. అయినా స్టీవ్ మనస్సులో ఏముందో తెలుసుకోకుండా ఇలా అతిగా ఆలోచించకూడదని తనని తానే కోప్పడుకుంది.

థ్యాంక్స్‌గివింగ్‌కి అక్క దగ్గరకు వెళ్ళినప్పుడు తెచ్చుకున్న కనకాంబరం రంగు జార్జెట్టు చీర కట్టుకుంది.

తలుపు తట్టిన శబ్దానికి స్టీవ్ వచ్చాడనుకుని కొంచెం బెరుకుగా తీసింది.

"స్టీవ్ అనుకున్నావా? సారీ నేనేలే" నవ్వింది ప్రియ

"అయినా అంత ఆత్రం ఏంటి ఇంకా టైం ఉంది కదా"

"చాల్లే ఆపు. ఎలా ఉన్నానో చెప్పు"

"సూపర్‌గా ఉన్నావు."

"నా పుట్టినరోజు అని చెప్పావా నువ్వు?"

"అరె ఛిల్! ఎంజాయ్ చెయ్యి. ఊరికే అన్నీ అనుమానాలు నీకు.

"సరే బై వెళుతున్నా" అంటూ వెళ్ళిపోయింది ప్రియ.

సరిగ్గా ఆరుగంటలకు తలుపు చప్పుడయ్యింది. టాన్ కలర్ ప్యాంట్ మీద బ్లూ గళ్ళ షర్టు వేసుకుని చాలా హాండ్‌సమ్‌గా ఉన్నాడు స్టీవ్.

"వావ్! యూ లుక్ అమేజింగ్. ఈ కలర్ నీకు చాలా బాగుంది. బయలుదేరదామా, రెడీనా?"

స్టీవ్ కళ్ళల్లోకి చూడటానికి కూడా సిగ్గుగా అనిపించి, 'నేను రెడీ'హాండ్ బ్యాగు, స్వెటర్ తీసుకుని బైటకు వచ్చి రూం లాక్ చేసింది. కారులో కూర్చుని ఇండియన్ డ్రస్సుల గురించి, వివిధ పద్ధతుల గురించి అడుగుతూనే ఉన్నాడు. బెరుకుగా ఉన్న అనితను స్వాంతన పరచటానికి లేక నిజంగానే తెలుసుకుందామనో మరి. కారును దెవాన్ స్ట్రీట్‌లోకి తిప్పాడు. ఇక్కడ అంతా ఇండియాలాగా ఉంటుంది. రోడ్డుకు ఇరుపక్కలా ఇండియా, పాకిస్తాన్ షాపులు - రెస్టారెంట్లు, నగల కొట్లు, బట్టల కొట్లు, పచారీ కొట్లు. విపరీతంగా రద్దీగా ఉంటుంది.

పార్కింగు కోసం కొంచెం కష్టపడవలసి వచ్చింది. "నువ్వు ఆర్డరు చెయ్యి, నీకు బాగా తెలుసుకదా" రెస్టారెంటు లోపలికి వెళ్ళి కూర్చున్నాక అన్నాడు స్టీవ్.

మ్యాంగో లస్సీ బాగా నచ్చింది స్టీవ్‌కు. కాలేజీ విషయాలు, ఫ్యామిలీ విషయాలు గురించి చెప్పుకుంటూ భోజనం ముగించారు. రసమలై తింటూ నెమ్మదిగా మొదలుపెట్టాడు స్టీవ్.

"నీతో మనసు విప్పి మాట్లాడాలని నిన్ను ఇంత సడన్‌గా ఒక్కదాన్ని డిన్నరుకు పిలిచాను. నువ్వంటే నాకు చాలా ఇష్టం అనిత. మొదటిసారి చూసినప్పుడే చాలా నచ్చావు. ఇండియన్ అమ్మాయివి, డేటింగ్‌లాంటి వాటికి చాలా దూరం, సాంప్రదాయంగా ఉంటారని ఆనంద్ భయపెట్టాడు. అందుకే ఇన్నాళ్ళు ధైర్యం చెయ్యలేదు. కానీ నాకెందుకో ఈ మధ్య కొద్దిగా నమ్మకం వచ్చింది, నీకు కూడా నేనంటే ఇష్టం అయితే మన స్నేహం ఇంకొంచెం ముందుకు తీసుకెళ్ళాలని ఉంది."

అంత అకస్మాత్తుగా చెపుతాడని, అందులో ఇలా రెస్టారెంటులో చెపుతాడని అస్సలు ఊహించలేదు.

మౌనంగా రసమలై తింటున్న అనిత వైపు నిరుత్సాహంగా చూసాడు స్టీవ్.

బిల్ పే చేసి ఇద్దరూ బైటకు వచ్చారు. కారుస్టార్టు చేస్తున్న స్టీవ్ వైపు చూసింది అనిత. మరీ ఏడిపించబుద్ది కాలేదు. పాపం తన జవాబు కోసం చూస్తున్నట్లున్నాడు. నెమ్మదిగా స్టీరింగ్ మీద వున్న అతని చేతిమీద చెయ్యి వేసింది.

"నాకు జవాబు ఎలా చెప్పాలో తెలియక ఇందాకటినుండి మౌనంగా ఉండిపోయాను. నాకు కూడా నువ్వంటే ఇష్టం" అంతకు మించి చెప్పలేకపోయింది.

"నన్ను చాలా అన్ రొమాంటిక్ అనుకుంటున్నావేమో కదూ, ఇలా రెస్టారెంటులో మాట్లాడానని. కానీ నువ్వు తప్పుగా ఏమన్నా అనుకుంటావేమో అన్న భయం. సరే ఇప్పుడు టైమ్ పదే కదా అయ్యింది కాసేపు మిచిగన్ లేక్ దగ్గరకు వెళదామా?" హుషారుగా అడిగాడు స్టీవ్.

కారును ప్లానెటేరియం దగ్గర పార్క్ చేశాడు. పక్కనే ఉన్న లేక్ రాత్రి పూట ఎంతో అందంగా ఉంది. పగలు వాతావరణం బాగున్నా రాత్రిపూట చలిగానే ఉంటుంది. కారులో నుండి రెండు బ్లాంకెట్లు తీసాడు స్టీవ్.

"నీకు స్వెటర్ చాలదేమో, లేక్ దగ్గర కదా, ఇంకా చలిగా ఉంది. ఈ బ్లాంకెట్ కప్పుకో" అంటూ భుజాల చుట్టూ కప్పాడు.

చిన్న చిన్న మాటలు, సరదా కబుర్లు, చిలిపి ముచ్చట్లు ఎన్నో ఎన్నెన్నో. అందమైన లేక్ మిచిగన్ నీళ్ళలో ప్రక్కనే ఉన్న డౌన్‌టౌన్ కాంతి తళతళలు, అన్నింటినీ మించి స్టీవ్ సాంగత్యం. అనిత చెయ్యి స్టీవ్ చేతిలోకి ఎప్పుడు వెళ్ళిందో కూడా గమనించుకోలేదు.

"హ్యాపీ బర్త్‌డే టూ యూ" వెనకాల నుండి గట్టిగా వినిపిస్తే ఉలిక్కిపడి వెనక్కు చూసింది.

ప్రియ, ఆనంద్, లీసా, టామ్ శ్రీని - ఒక కేక్ పట్టుకుని తమ వైపే వస్తున్నారు. ఆశ్చర్యంగా స్టీవ్ వైపు చూసింది.

"నిన్ను సర్‌ప్రైజ్ చేద్దామని చెప్పలేదు. దాదాపు అర్ధరాత్రి అయ్యింది కదా" నవ్వాడు స్టీవ్.

"మీకెలా తెలుసు మేము ఇక్కడ ఉన్నామని " ఆశ్చర్యంగా అడిగింది.

"స్టీవ్ మెసేజ్ చేశాడు మీ డిన్నరు అయ్యాక, ఎక్కడ ఉంటారో. సో మేము టైంకు వచ్చేశాం."

"సరే సరే. టైం అయ్యింది. కేక్ కట్ చెయ్యి" చేతిలో చిన్న కత్తి పెట్టాడు ఆనంద్.

ఇలా ఆరుబైట, తన స్నేహితులందరితో పుట్టినరోజు సెలబ్రేట్ చేసుకోవటం, ముఖ్యంగా వాళ్ళంతా తనకోసం ఇలా రావటం చాలా అందంగా అనిపించింది.

"సరే పదండి ఇంక. కాప్స్ వస్తారు ఇక్కడ ఈ టైంలో గోల చేస్తుంటే. రేపు కలుద్దాం" అని బయలుదేర తీసింది లీసా.

"థాంక్యూ స్టీవ్ ఫర్ ఎ వండర్‌ఫుల్ ఈవినింగ్" మనస్ఫూర్తిగా చెప్పింది రూం దగ్గర కారు దిగాక.

చిన్నగా నవ్వి "యు ఆర్ వెల్‌కం. తెలుసా నీతో నిజంగా ఎలా ఉండాలని ఉన్నదో అలా ఉండలేకపోతున్నా, ఆనంద్ మరీ బెదిరించాడు. ఐ హోప్ ఫర్ బెటర్ మూమెంట్స్ బిట్వీన్ అజ్" సన్నగా కన్నుగీటి వెళ్ళిపోయాడు.

అతను అన్నదేంటో అర్థం కావటానికి ఒక నిమిషం పట్టింది అనితకు.

గట్టిగా నవ్వేసింది అతని చిలిపితనానికి. ఎంతో ఆనందంగా గడిచింది ఈ రోజు.

ఫోన్ మోగింది. అక్క చేసింది. "బైటకు వెళ్ళాం అక్కా. ఇప్పుడే వచ్చాను" రేపు తీరికగా మాట్లాడతా"

ఏంటో మొట్టమొదటిసారిగా ఒక విషయం అక్క దగ్గర దాస్తుంది. ఎందుకో ఇప్పుడే చెప్పాలని లేదు. చాలా అపురూపంగా అనిపించింది స్టీవ్‌తో గడిపిన సాయంత్రం. మళ్ళీ మళ్ళీ తలచుకుంటూ నెమ్మదిగా నిద్రలోకి జారుకుంది.

కాలేజీ, చదువు, అతి కష్టమైన ప్రాజెక్టులు, ఉద్యోగం - వీటన్నిటితోనే టైం సరిపోవట్లేదని పరుగులు తీస్తుంటే, అన్నింటిని తలదన్నే ప్రేమ చుట్టు ముట్టింది.

ప్రేమలో పడ్డవాళ్ళకు తమ ప్రేమే చాలా అపురూపమైనదిగా ఉంటుంది. కానీ నిజమైన ప్రేమికులకే దానిలోని మాధుర్యం, అలౌకికానందం, ఓ రకమైన గిలిగింత, ఉత్సుకత అర్థం అవుతాయి.

రెండో సెమిస్టరులో ఇద్దరికి చాలా క్లాసులు ఉన్నాయి. కానీ ఎంత బిజీగా ఉన్నా రోజులో కాసేపన్నా కలుసుకుంటున్నారు. ప్రేమ అంటే కేవలం కలిసి తిరగటం కళ్ళలో కళ్ళు పెట్టుకుని చూసుకోవటం అనుకుంటారు టీనేజ్‌లో, మన ప్రతి పనిలో ప్రేమించిన వ్యక్తి ఎంత బలం, ఎంత ప్రేరణ, శక్తి ఇస్తారో చాలామందికి అర్థంకాదు. ఎంత సమయం గడిపాం అన్న లెక్క కాదు. ఎంత ఆనందంగా ఉన్నాం ఆ సమయంలో, మనలో ఎంత చైతన్యం నింపుతున్నది అన్నది ముఖ్యం.

స్టీవ్‌కు బాగా స్పోర్ట్స్ పిచ్చి ఉంది. ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, బేస్‌బాల్ ఏదైనా సరే. ఇక కాలేజీలో జరిగే గేమ్స్ సంగతి చెప్పనవసరంలేదు. ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్ వరకు అనిత స్టీవ్‌తో చూసేది కానీ బేస్‌బాల్ నచ్చేది కాదు. అస్సలు కొరుకుడు పడలేదు. దీని కంటే క్రికెట్ ఎంత బాగుంటుందో కదా అని ఆనంద్, అనిత వాపోయేవాళ్ళు. కాలేజి క్యాంపస్‌లో ఫ్రెండ్స్ కలిసి ఎంజాయ్ చెయ్యటానికి చాలా ఆస్కారాలు, అవకాశాలు ఉన్నాయి. ఎప్పుడూ ఏదో ఒక గేమ్ ఉంటుంది వీకెండులో, లేకుంటే ఏదైనా కాన్సెర్ట్, లేకుంటే ఒక హాబీ పెంచుకోటానికి క్లబ్స్. వాటిల్లో చేరటం మూలాన మనకు ఉన్న ఆసక్తిలాంటి వాళ్ళతో పరిచయం, స్నేహం ఏర్పడుతుంది, పైగా చదువు నుండి మంచి రిలాక్సేషన్.

చలి సాంతం తగ్గటంతో సైకిల్స్ అద్దెకు తీసుకుని ఇద్దరూ వీకెండులో సైక్లింగ్‌కు వెళుతున్నారు. ఇప్పుడిప్పుడే యవ్వనంలోకి అడుగుపెడుతున్న ఆడపిల్ల తొలిసారి పరికిణీ ఓణీలో ఎంత ముద్దుగా ఉంటుందో, శిశిరం తర్వాత వసంతంలో ప్రకృతి కూడా అంతే. పల్చగా పరుచుకున్న మంచుతెరను చీల్చుకుని దోబూచులాడుతున్న సూర్యకిరణాలు - లేక్ షోర్ మీద సైకిల్‌పై వెళ్ళటం ఓ మంచి అనుభూతి.

స్టీవ్‌తో గడిపే ప్రతి నిమిషం ఎంతో అపురూపంగా, మానసికంగా తనకు చాలా దగ్గరయినట్లుగా ఉంది. మామూలుగానే ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ ఉంటాడు. కానీ తనవంక చూసి ఒక చిరునవ్వు నవ్వితే ఎంతో ప్రియంగా ఉంటుంది. బాగా టీజ్ చేసినప్పుడు అనిత పెట్టే బుంగమూతి స్టీవ్‌కు చాలా ఇష్టం. అనిత ఏమన్నా చెపుతుంటే చాలా శ్రద్ధగా వింటాడు. పైగా గుర్తుపెట్టుకుంటాడు కూడా. కానీ పెద్ద పని రాక్షసుడు. చదువులో పడితే టైం కూడా చూసుకోడు, ఆకలి కూడా పట్టించుకోడు.

సైకిల్ తొక్కుతూ వారం క్రితం జరిగిన సంఘటన గుర్తు తెచ్చుకుంది అనిత. దాదాపు అర్ధరాత్రి అప్పుడు ఫోన్ చేశాడు. 'ఎక్కడున్నావు' అంటూ

"రూంలోనే చదువుకుంటున్నాను. బాగా బిజీగా ఉన్నావా? సాయంత్రం ఫోన్ చేస్తే తియ్యలేదు"

"సారీ చాలా బిజీగా ఉన్నాను. ఐదు నిమిషాల్లో నీ దగ్గరకు వస్తాను. ఒక్కసారి బైటకు వస్తావా?"

"యా ష్యూర్" అని రూం లాక్ చేసి బైటకు వెళ్ళేసరికి కారు పార్కు చేసి వస్తూ కనిపించాడు స్టీవ్.

"హాయ్!" అంటూ దగ్గరకు వెళ్ళింది.

"యు ఆర్ విజన్ టు సోర్ ఐస్" అంటూ హత్తుకున్నాడు స్టీవ్.

ఇప్పుడిప్పుడే స్టీవ్ ఇచ్చే హగ్స్‌కి అలవాటవుతున్నా ప్రతిసారి కొత్తగా సిగ్గుగానే ఉంటుంది అనితకు. అమెరికన్ సంస్కృతిలో ఆప్యాయపు ఆలింగనాలు సర్వసాధారణం కానీ స్టీవ్ పై ఉన్న ప్రేమ వలన చాలా ప్రియంగా ఉంటుంది.

"అబద్దాలు చెప్పటానికి కూడా ఒక లిమిట్ ఉంటుంది ఈ పాత టీ షర్టులో అంత బాగున్నానా?" స్టీవ్ భుజం మీద చిన్నగా చరిచింది.

"నాకు ఎప్పుడూ బాగుంటావు నువ్వు" భుజం చుట్టూ చెయ్యివేస్తూ అన్నాడు స్టీవ్.

"చాలా అలసటగా ఉంది. సరిగ్గా నిద్రపోయి వారం అయ్యింది"

"డిన్నర్ తిన్నావా?"

"లేదు. మధ్యాహ్నం తిన్న శాండ్‌విచ్, తర్వాత మూడు కాఫీలు, తినే ఓపిక లేదు. వెళ్ళి పడుకుంటా, కనీసం ఓ ఐదు గంటలు. నీతో ఫోనులో కూడా మాట్లాడలేదని ఓ పదినిమిషాలు నీతో ఉందామని వచ్చాను."

ప్రొద్దుటినుండీ ఏమీ తిననందుకు కోప్పడాలో, లేక ఇంత అలసటలో కూడా తనను చూడటానికి వచ్చిన అతని ప్రేమకు సంతోషించాలో అర్ధం కాలేదు అనితకు.

"పద నాతో" చెయ్యి పట్టుకుని కారు వైపు నడవసాగింది.

"ఎక్కడికి ఇప్పుడు?"

"చైనీస్ ఫుడ్ దొరుకుతుంది ఈ పక్కనే. తిన్న తరవాతే నువ్వు నీ రూంకు వెళ్ళేది" తెచ్చిపెట్టుకున్న కోపంతో అన్నది అనిత.

"నీతూ ప్లీజ్. ఐ యాం ఎ బిగ్ బాయ్. నా ఆకలి నాకు తెలియదా? ఒక్కపూట తినకుంటే ఏమీకాదు. ఇంట్లో ఆపిల్స్ ఉన్నాయి. తింటాను"

"నీకు ఆకలి ఉండదులే. నాకు ఆకలిగా ఉంది. నాకు తినిపిస్తావా లేదా ఇప్పుడు?" దబాయించింది

బుగ్గపట్టుకుని లాగి చిన్నగా నవ్వాడు "సర్లే పద"

.....

......

"హే ఏంటి ఆలోచిస్తున్నావు? పిలిస్తే పలకటం లేదు" స్టీవ్ మాట వినబడి ఆలోచనల నుండి బైట పడింది అనిత.

"అబ్బే ఏం లేదు. ఏదో ఆలోచిస్తున్నా. ఏమన్నావు?"

"ఇక తిరిగి వెళదామా, ఆకలవుతుంది" అన్నాడు స్టీవ్.

ఇద్దరూ రెంటల్ బైక్స్ తిరిగి ఇచ్చేసి, బ్రేక్‌ఫాస్ట్ కాఫీకి వెళ్ళారు.

ఆమ్లెట్ తింటూ అడిగాడు స్టీవ్. "ఫైనల్స్ అయ్యాక ఇంకో రెండు వారాల్లో మీ అక్క దగ్గరకు వెళతావు. మళ్ళీ మూడు నెలలకు కనిపిస్తావు. నేనెలా ఉండాలి నిన్ను చూడకుండా"

"కబుర్లు చెప్పకు. నీ పనిలో పడితే నేను గుర్తువస్తానా అస్సలు" నవ్వింది.

"నీ ఆలోచనల్లో పడితే చాలా రెస్ట్‌లెస్ అవుతా, మెంటల్‌గా ఫిజికల్‌గా. అందుకే బలవంతాన మనస్సు కంట్రోల్లో పెట్టి, పనిమీద ధ్యాస మళ్ళిస్తా" చిలిపిగా నవ్వాడు.

"ఫిజికల్‌గా ఎలా?" అంటుండగానే అర్ధం అయ్యి నాలుక కరచుకుని టేబుల్ క్రిందనుండి కాలుతో తన్నింది.

ఎర్రబడ్డ అనిత మొహం చూసి గట్టిగా నవ్వేశాడు.

"నీకు చక్కగా చికాగోలోనే ఇన్‌టర్న్ షిప్ వచ్చింది. మరి నాకేమో డెలాయిట్‌లో తప్పదు కదా మరి" సిగ్గును కప్పిపుచ్చుకుంటూ అన్నది అనిత.

టేబుల్ మీద ఉన్న అనిత చెయ్యి పట్టుకుని చిన్నగా నొక్కాడు. సడన్‌గా ఏదో ఆలోచనల్లో మునిగినట్లుగా మాటలు ఆపేసి, అనిత చేతిని చూస్తూ ఉండిపోయాడు.

ఒక్కోసారి ఇంతే. ఏదో ఆలోచనల్లోకి జారిపోతాడు. ఏంటి అని అడిగితే, ఒక్కసారిగా తేరుకున్నట్లుగా నవ్వేసి మాట మారుస్తాడు. అట్లా అని మూడీగా ఉండడు కానీ తన అంతర్ ఆలోచనలను ఎవ్వరితోనూ తొందరగా పంచుకోడు అని మాత్రం అర్థం అయ్యింది.

"సామాన్లు అన్నీ సర్దుకున్నావా? రేపు అక్కవాళ్ళు ఎన్ని గంటలకు వస్తారు" అడుగుతూ లోపలికి వచ్చింది ప్రియ.

"రూం ఖాళీ చెయ్యవలసి రావటంతో లగేజ్ ఎక్కువుంది కదా అందుకే అక్కా బావ వస్తున్నారు. కారు కొనుక్కునేంత డబ్బులుంటే వాళ్ళను ఇబ్బంది పెట్టకుండా సరిపోయేది. వచ్చేసరికి లంచ్ టైం అవుతుందేమో?"

మర్నాటినుండి సెలవలు మొదలవుతున్నాయి. రెండో సెమిస్టరు కూడా అయిపోయింది. అప్పుడే అమెరికా వచ్చి దాదాపు సంవత్సరం కావొస్తుంది. ఎంత వేగంగా గడచిపోయింది. ఇంకో సంవత్సరంలో చదువు అయిపోతుంది. తొందరగా పూర్తి చెయ్యాలని ప్రియ ప్రయత్నిస్తుంది ఎక్కువ క్లాసులు తీసుకోవచ్చా అని కౌన్సిలర్‌ని అడిగిందంట. ఎంత ఎడ్జెస్టు చేసినా వీలవలేదంట. ఈ సమ్మర్ సెలవల్లో ప్రియకు కూడా ఒక పెద్ద ఫైనాన్స్ కంపెనీలో ఇన్‌టర్న్ షిప్‌వచ్చింది. కాలేజి క్యాంపస్‌లో ఇక ఉండకూడదని నిర్ణయించుకుని, సిటీలో పేయింగ్ గెస్ట్‌గా చేరింది. ఈ మూడు నెలల్లో రూం నచ్చితే వచ్చే సెమిస్టరు కూడా ఇలానే ఉందామని నిర్ణయించుకుంది. అనిత కూడా ఒప్పుకుంటే వేరే అపార్ట్‌మెంట్ చూసుకుందామని నిర్ణయించుకుంది.

"ఒక్క వారం రోజులు నువ్వు కూడా రావొచ్చు కదా అక్క వాళ్ళింటికి. ఒప్పుకోలేదు కనీసం జులైలో మూడురోజులు సెలవలు వస్తాయి, అప్పుడైనా రా"

"చూద్దాంలే పద బయలుదేరు. డిన్నరు ఆలస్యం అయితే మళ్ళీ సినిమా మిస్ అవుతాం" హడావుడి పెట్టింది ప్రియ.

ఫ్రెండ్స్ అందరూ కలిసి ముందు డిన్నరు తినేసి, సినిమాకు వెళ్ళాలని ప్లాన్. ఫైనల్స్ పూర్తి అయిపోయినందుకు సెలబ్రేషన్స్.

లిసా, తన బాయ్ ఫ్రెండ్ టామ్, ఆనంద్, స్టీవ్, ప్రియ, అనిత, శ్రీవి అందరూ కలిసారు ఓ చైనీస్ రెస్టారెంటులో.

"వీడి పని బాగుంది. టేస్ట్ ఎలా వున్నా చవకగా పైగా రాత్రి ఒంటిగంట దాకా ఉంటాడు కాబట్టి బిజినెస్ బాగుంటుంది. ఎప్పుడు వచ్చినా బిజీగానే ఉంటాడు."

"మరీ అంత చెత్తగా ఉండదులే" అన్నాడు టామ్

"చైనీస్ ఫుడ్ ఇండియాలో తినాలి మీరు. ఎంత బాగుంటుందో" అంది ప్రియ.

కబుర్లు చెప్పుకుంటూ, నవ్వుకుంటూ, సరదాగా ఏ టెన్షన్ లేకుండా చాలా రోజుల తరువాత రిలాక్స్ అయ్యారు స్నేహితులందరూ. ఒక సంవత్సరం క్రితం వరకూ ఒకరినొకరు పరిచయం లేదు, కానీ ఇప్పుడు ఎంత మంచి స్నేహితులైయ్యారు అందరూ.

"ఇంకో రెండేళ్ళలో ఎక్కడుంటామో కదా అందరం!?" కొంచెం మూడీగా అడిగాడు ఆనంద్.

''ఏముంది ఎక్కడో ఉద్యోగాల్లో చేరతాం. కొత్త ఉద్యోగంలో ఏదో సాధించాలని తెగ కష్టపడుతూ ఉంటాం. హెచ్.వన్ బి వీసా వచ్చిన వెంటనే, భారీ కట్నంతో అందరికంటే ముందు శ్రీవి పెళ్ళి అయిపోతుంది'' నవ్వింది ప్రియ.

''ఇంతేనా జీవితం అంటే. చదువు పూర్తి అయ్యేదాకా దానికోసం పరుగు, తర్వాత ఉద్యోగంలో మెట్టు మెట్టు పైకి ఎక్కటానికి ఓ 35 ఏళ్ళ పరుగు. స్ట్రగుల్ ఫర్ ఎక్జిస్టెన్స్ - జీవితాంతం'' సాలోచనగా అన్నాడు ఆనంద్

''ఏంటి అంత ఫిలసాఫికల్‌గా మాట్లాడుతున్నావ్ ఏమైంది?'' భుజం మీద చెయ్యివేసి అడిగాడు స్టీవ్.

''ఏంటో తెలియటం లేదు. భవిష్యత్తు అంటే భయంగా ఉంది.''

“Fall in love Man – This is not the age to be single. You will find life very interesting When you are with a girl” కన్నుకొడుతూ నవ్వాడు టామ్.

''ఛీర్ అప్ ఆనంద్. మరీ చదువు ప్రెషర్ ఎక్కువయ్యి ఇలా మాట్లాడుతున్నావు. ఈ మూడునెలలు ఇన్‌టర్న్‌షిప్ ఫన్‌గా ఉంటుందిలే''

పాప్‌కార్న్, డ్రింక్స్ కొనుక్కుని థియేటర్‌లోకి వెళ్ళి కూర్చున్నారు. రొమాంటిక్ కామెడీ సినిమా అది. కామెడీతోపాటు రొమాన్సు పాళ్ళు కూడా ఎక్కువగానే ఉంది. స్టీవ్ పక్కన కూర్చుని రొమాంటిక్ సీన్లు చూడటం కొంచెం ఇబ్బంది పడింది అనిత. అనిత భుజం చుట్టూ చెయ్యి వేశాడు స్టీవ్. అప్రయత్నంగా అతని భుజం మీద తల వాల్చింది. అతని వెచ్చని చేతి స్పర్శ ఎంత ఎక్జయిటింగ్‌గా ఉంటుందో, అంతే స్వాంతన ఇస్తుంది. శృంగార దృశ్యాలు చూస్తూ పడిన ఇబ్బంది అంతా తీసేసినట్లు పోయింది.

సినిమా అయిపోయాక రూం దగ్గర కారులో డ్రాప్ చేసి ''కాసేపు బైట కూర్చుందామా, నువు అలసిపోకుంటే'' అని అడిగాడు స్టీవ్.

''సరే వాకింగ్‌కి వెళదామా?''

''వద్దులే, ఆ పక్కనే బెంచి ఉంది. అక్కడ కూర్చుందాం.''

అనిత చెయ్యి పట్టుకుని మృదువుగా ముద్దుపెట్టుకున్నాడు స్టీవ్.

''చాలా మిస్ అవుతా నిన్ను. జులై నాలుగు హాలిడే కదా మూడురోజులు సెలవలు వచ్చాయి. ఇక్కడికి వచ్చెయ్యి ఆ మూడురోజులు''

''ఎక్కడ ఉంటాను స్టీవ్ నేను వస్తే, ప్రియకూడా పేయింగ్ గెస్ట్‌లాగా ఉండబోతున్నది కదా, తనతో ఉండటానికి కుదరదు కదా!''

''ఏదో ఆలోచించుదాం లే. ప్లీజ్ ఒప్పుకోముందు.''

స్టీవ్‌కు దగ్గరగా జరిగి అతని భుజం మీద తలవాల్చి కళ్ళు మూసుకుంది అనిత.

చాలాసేపు ఏమీ మాట్లాడుకోలేదు ఇద్దరూ.

''చలిగాలి వేస్తుంది. లోపలికి వెళ్ళు, జలుబు చేస్తుందేమో, రేపు వస్తాను నువ్వు వెళ్ళే లోపల.''

మాట్లాడకుండా లేచింది అనిత. రూం తలుపు దగ్గరకు. వచ్చాక ఆప్యాయంగా హత్తుకుని నుదుటిమీద ముద్దు పెట్టుకున్నాడు స్టీవ్.

"గుడ్నైట్! స్వీట్ డ్రీమ్స్" నవ్వుతూ చెప్పాడు.

"గుడ్నైట్" ఎందుకింత భారంగా ఉంది మనస్సు. గుండె నొక్కిపెట్టినట్లు..

ఇద్దరూ పెద్దగా మాట్లాడకపోయినా, మాటల అవసరం లేనట్లుగా ఒక మనస్సు నుండి ఇంకో మనస్సుకు మౌన సందేశాలు.

"ప్రియను అడిగావా? తనకు నిజంగానే ఇబ్బంది లేదుకదా, నువ్వు తనతో ఉంటే - లేకుంటే నాతో ఉండు."

జులై నాలుగు, అమెరికా స్వాతంత్రదినోత్సవం, శుక్రవారం వచ్చింది దానితో మూడురోజులు సెలవలు. గురువారం సాయంత్రం బయలుదేరి వచ్చేస్తే, ఆదివారం సాయింత్రం తిరిగి వెళ్ళొచ్చు అని స్టీవ్ ప్లాన్ చేశాడు.

"అడిగాను తనకేమీ ఇబ్బంది లేదంట. నా ట్రైన్ వచ్చేసరికి రాత్రి పదవుతుంది"

"నేను వస్తాను నిన్ను రిసీవ్ చేసుకోటానికి. ఎన్నో ప్లాన్ చేస్తున్నా ఈ మూడు రోజుల్లో ఏమేమి చెయ్యాలో అని. అన్నీ చెయ్యగలమనే అనుకుంటున్నా. నువ్వు నా దగ్గరే వుండొచ్చు కదా. ప్రామిస్ గుడ్ బాయ్లాగా ఉంటా"

గట్టిగా నవ్వేసింది "నేను మరీ అంత గుడ్ గర్ల్ కాదేమో అని జాగ్రత్త పడుతున్నా"

"ప్లీజ్ ఒప్పుకో, ఎటూ రోజంతా నాతోనే ఉంటావు కదా!"

"నువ్వూ, ప్రియా తేల్చుకోండి. తనేమో కలిసి ఫైర్ వర్క్స్ చూద్దాం అని చెప్పింది" టీజింగ్గా అన్నది అనిత.

"సర్లే నేను ప్రియను మేనేజ్ చేస్తే. నా ప్లాన్ దేనికి అడ్డు చెప్పకు"

ఇద్దరికీ చాలా ఎక్సయిటింగ్ ఉంది. దాదాపు నెల తరవాత కలుసుకోవటం. రోజూ ఫోనులో మాట్లాడుకుంటున్నా తృప్తిగా లేదు. కవితతో స్టీవ్ కోసం చికాగో వెళుతున్నట్లుగా చెప్పలేదు అనిత. స్టీవ్ మీద తనకున్న ఫీలింగ్స్ ఎందుకో కవితతో చెప్పలేదు. ఫ్రెండ్స్ అందరి గురించి చెప్పినట్లే తన గురించి చెప్పింది కానీ ప్రేమిస్తున్నట్లు చెప్పలేదు.

రాత్రి పదిగంటలకు ట్రైన్ దిగేసరికి ఎదురుగా స్టీవ్ నవ్వుతూ చెయ్యి ఊపుతుంటే పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లయ్యింది."చాలా మిస్ అయ్యాను నిన్ను" గట్టిగా హత్తుకున్నాడు స్టీవ్.

"ఏమి తేల్చుకున్నారు నువ్వూ ప్రియ?" బైటకు వచ్చి కారులో కూర్చున్నాక అడిగింది.

"ముందు అర్జంటుగా సాండ్విచ్ ఏదైనా తిందాం. ఆకలవుతుంది. తర్వాత ప్రియ దగ్గర దింపేస్తా నిన్ను. రేపు బ్రేక్ఫాస్ట్ అయ్యాక నిన్ను కిడ్నాప్ చేస్తా. మా పేరెంట్స్ దగ్గరకు వెళదాం ఇద్దరం. హోప్ యు డోంట్ మైండ్"

"నేనా? అదేంటి సడన్గా ఈ ప్లాను?"

"మామ్ గొడవ చేస్తుంది రమ్మనమని. ప్రతి సంవత్సరం జులై నాలుగున బార్బెక్యూ పార్టీ ఇస్తారు ఇంట్లో. నువ్వుకూడా మా ఫామిలీని చూసినట్లు ఉంటుంది కదా. రాత్రికి తిరిగి వచ్చేద్దాం. ఏమన్నా ప్రాబ్లమా?"

"ప్రాబ్లమ్ అంటూ ఏమీలేదు కానీ మొహమాటంగా ఉంది."

శాండ్‌విచ్ తిన్నాక, ప్రియ దగ్గర దింపేసి వెళ్ళిపోయాడు స్టీవ్.

పేయింగ్ గెస్టులాగా ఉండటం బాగుంది పైగా చవకగా ఉందని చెప్పింది ప్రియ. రూం కూడా పైన మేడమీద ఉంది. ఓనర్స్‌తో సంబంధం లేకుండా గరాజీలో నుండి పైకి వేరే మెట్లు ఉన్నాయి. ఇంకో రూం కూడా ఇలాగే అద్దెకు ఇచ్చారంట. రిటైర్ అయిపోయిన దంపతులు. బ్రేక్‌ఫాస్ట్ ఫ్రీ అంట. లంచ్, డిన్నర్ కావాలంటే దానికి వేరే డబ్బులు అని చెప్పారంట. ప్రియ వద్దని చెప్పిందంట.

కబుర్లు చెప్పుకుంటూ పడుకునేసరికి రాత్రి రెండు దాటింది.

చికాగో నుండి స్టీవ్ వాళ్ళ తల్లిదండ్రులు ఉండే మిల్‌వాకీ అనే ఊరు ఓ రెండు గంటల ప్రయాణం. విస్కాన్సిన్ రాష్ట్రంలో ఉంది ఆ ఊరు. ప్రియను కూడా రమ్మనమని అడిగారు కానీ ప్రియ మృదువుగా తిరస్కరించింది.

అనితకు మొహమాటంగానే ఉన్నది, ఎప్పుడూ అమెరికన్ల ఇంటికి వెళ్ళలేదు ఎలా ఉంటారో, వాళ్ళ పద్ధతులు ఎలా ఉంటాయో, అందునా స్టీవ్ వాళ్ళ ఇంటికి అంటే ఇంకా బెరుకుగా ఉంది.

వాళ్ళకు ఏదైనా గిఫ్ట్ కొనాలి అని ప్రియతో తర్జన భర్జనలు పడి - మంచి వైన్ బాటిల్, బెర్రీస్ పై, వాళ్ళ అమ్మకు ఒక మంచిపూల బొకే తీసుకుంది.

స్టీవ్ వాళ్ళ ఇంటి చుట్టుపక్కల కూడా అందరూ పార్టీలు చేసుకుంటున్నారేమో వీధంతా కార్లతో నిండిపోయింది. కారు దిగి చుట్టూ చూసింది అనిత. చక్కటి లాన్, ఇంటికి రెండు వైపులా పెద్ద చెట్లూ, పూల మొక్కలు, కొంచెం సైజు చిన్నదిగా అనిపిస్తున్నా రెండు అంతస్థుల ఇల్లు. ఇండియాలో ఇంత ఇల్లు తోట ఉండి, ఇంత పచ్చగా ఉండే కాలనీలు ఉన్నాయా అస్సలు అనిపిస్తుంది.

"మాకు మధ్యాహ్నం నుండి ఓపెన్ హౌస్, అంటే వచ్చేవాళ్ళు వస్తారు వెళ్ళేవాళ్ళు వెళతారు. ప్రతి సంవత్సరం ఫామిలీ ఫ్రెండ్స్ అందరికి నో ఫార్మాలిటీ పార్టీ ఇది. విపరీతమైన తిండి మాత్రం ఉంటుంది" కారులో నుండి పై, వైన్ బాటిల్ తీసుకుని దిగుతూ నవ్వాడు స్టీవ్.

తలుపు తీసుకుని లోపలికి వెళుతూనే స్టీవ్ చెల్లెలు లిండా వచ్చి గట్టిగా హత్తుకుంది స్టీవ్‌ని. పదవ తరగతి చదువుతుంది అని చెప్పాడు స్టీవ్. సన్నగా, దాదాపు అనిత ఎత్తులో ఉంది లిండా. నడుముదాకా ఉన్న జుట్టు వదిలేసుకుంది. షార్ట్స్, టీ షర్టు వేసుకుంది. లిండా అరుపులు విని లోపలనుండి అతని తల్లి వచ్చింది.

"మామ్! తను అనిత నా ఫ్రెండ్" అని పరిచయం చేశాడు.

"నైస్ టు మీట్ యు.. మిసెస్ మిల్లర్" అంటూ అనిత ఆవిడకు పూలబొకే ఇచ్చింది.

"మేరీ అని పిలువు చాలు నైస్ ఆఫ్ యు టు బ్రింగ్ ఫ్లవర్స్ అండ్ వైన్. మేక్ యువర్ సెల్ఫ్ కంఫర్టబుల్" ఎంతో మర్యాదగా అని తను పలుకరించి ఆ తరవాతే స్టీవ్‌ను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని, బుగ్గమీద ముద్దు పెట్టుకుంది.

లిండాది తల్లిపోలిక అనుకుంది అనిత. ఇద్దరికి నీలి కళ్ళు, మేరీకి కురచజుట్టు భుజాలు వరకు, నవ్వే కళ్ళు, వయస్సుతో పాటు వచ్చిన హుందాతనం, కొంచెం బొద్దుగా, నిండుగా ఉన్నారు ఆవిడ.

తిన్నగా ఇంటి వెనకవైపుకు తీసుకువెళ్ళాడు స్టీవ్. రాళ్ళతో నలుచదరంగా అందంగా పరిచారు పాటియో. చుట్టూ పూల మొక్కలు, గులాబీలు. ఓ పక్క పెద్ద గ్రిల్ ఉంది. దాని ముందు మొక్కజొన్న కంకుల పై ఆకులు తీస్తూ వాళ్ళ నాన్న రిచర్డ్ ఉన్నాడు. పరిచయం చేశాక ఆయనకు షేక్‌హాండ్ ఇచ్చింది అనిత.

"స్టీవ్‌కు ఇంత అందమైన ఫ్రెండ్ ఉందని ఇంతవరకు మాకు తెలియదే" నవ్వుతూ అన్నాడాయన. పొడుగ్గా, బలిష్ఠంగా ఉన్నాడాయన. సగం పైగా తెల్లబడిన జుట్టు, కొంచెం ముడుతలు పడ్డ మొహం, నవ్వుతుంటే అచ్చంగా స్టీవ్‌లాగానే ఉన్నారు.

ఓ పక్క ఓ పది కుర్చీలు, పెద్ద ప్లాస్టిక్ టేబుల్ ఉన్నాయి.

"ఇప్పుడే అంతా సర్దుతున్నాం. ఈ కుర్చీలో కూర్చో. ఏం తాగుతావు నువ్వు? కొంచెం వైన్ ఇవ్వనా?" లోపలినుండి వస్తూ అడిగింది మేరి.

"కోక్ తాగుతాను. ఏమన్నా హెల్ప్ చెయ్యాలా?" మర్యాదగా అడిగింది అనిత.

"బార్బెక్యూ పార్టీ అంటే మొగవాళ్ళు చేస్తారు. మనం ఎంజాయ్ చెయ్యాలి. ఎప్పుడూ ఆడవాళ్ళ చేస్తుంటారు కదా, కనీసం ఇలాంటప్పుడైనా తప్పించుకోవాలి" అనిత పక్క కుర్చీలో కూర్చుంటూ నవ్వింది ఆవిడ.

"వేడిగా ఉంది ఇవాళ్ళ, ఇదిగో చల్లగా కోక్ తాగు" అనిత చేతికి చల్లటి కోక్ బాటిల్ ఇచ్చాడు స్టీవ్ "మామ్ నీకు బీర్"

"థాంక్స్ స్వీట్ హార్ట్! చాలా ప్రయాణం చేసి వచ్చారు. ఆకలవుతుందేమో మీకు. ముందు వేడిగా మొక్క జొన్న పొత్తులు తినండి. అప్పటికి గ్రిల్డ్ చికెన్ రెడీ అవుతుంది. అందరూ నెమ్మదిగా మూడుగంటల తరవాత వస్తారు."

తను కూడా ఒక బీర్ తెచ్చుకుని అనిత పక్కన కూర్చున్నాడు స్టీవ్. కొంచెం ఆశ్చర్యంగా అనిపించింది తల్లిదండ్రుల ఎదురుగా బీర్ తాగటం.

"అనిత నువ్వు బీఫ్ తినవని చెప్పాడు కానీ ఏమి ఇష్టమో చెప్పలేదు."

"పెద్ద పట్టింపులు ఏమీ లేవు, ఒక్క బీఫ్ తప్పించి, ఏదైనా తింటాను"

లిండా, స్టీవ్ కలిసి లోపలనుండి కోల్‌స్లా, పొటాటో సాలడ్, పచ్చి కూరగాయల సలాడ్, చికెన్, హాట్‌డాగ్స్, పుచ్చకాయ ముక్కలు అన్నీ టేబుల్ మీద సర్దారు. పెద్ద ఐ బాక్స్ నిండా వాటర్ బాటిల్స్, బీర్, కూల్‌డ్రింక్స్ ఉన్నాయి.

వాళ్ళందరూ బాగా ఆప్యాయంగా మాట్లాడుకుంటుంటే చాలా ముచ్చటగా అనిపించింది. మేరీ కొసరి కొసరి వడ్డిస్తూంటే అమ్మ గుర్తుకు వచ్చింది. ఏ దేశంలో అయినా అమ్మలందరూ ఒకటేనేమో! ఎంత ఎదిగినా పిల్లలు ఎప్పుడూ చిన్నవాళ్ళలాగానే కనిపిస్తారేమో.

కోల్‌స్లా, సలాడ్స్ ఫ్రిజ్‌లో పెట్టటానికి మేరీ స్టీవ్ లోపలకు వెళ్ళినప్పుడు లిండా అన్నది "స్టీవ్ ఎప్పుడూ తన గర్ల్ ఫ్రెండ్స్‌ని ఇంటికి తీసుకు రాలేదు."

సిగ్గుపడింది అనిత ఆ మాటలకు. వచ్చినప్పటినప్పటినుండి లిండా తనను బాగా గమనిస్తుందని అర్ధం అయ్యింది అనితకు. ఏమి సమాధానం ఇవ్వాలో అర్ధం అవ్వక, లిండా స్కూలు విషయాలు అడుగుతూ మాట మార్చింది.

సాయంత్రం ఆరుదాకా టైం ఎలా గడచిపోయిందో కూడా తెలియలేదు అనితకు. దాదాపు ఓ ముప్పైమంది దాకా వచ్చినట్లున్నారు. కబుర్లు, నవ్వులూ, గోలగోలగా సరదాగా గడచిపోయింది.

బయలుదేరుతుంటే ఏమేమో డబ్బాల నిండా ఫుడ్ పెట్టి ఇచ్చింది మేరి, స్టీవ్ వద్దు అంటున్నా కోప్పడుతూ బలవంతానా ఇచ్చింది.

"మా స్టీవ్‌కు నువ్వు చాలా నచ్చావు. నీ గురించి తెలుసుకోవడానికి ఈ టైం సరిపోలేదు. కానీ స్టీవ్‌కి నువ్వు నచ్చితే నాకూ నచ్చినట్లే. ఎప్పుడు రావాలనుకున్నా మొహమాటపడకుండా మా ఇంటికి రావొచ్చు నువ్వు" కారుదాకా వచ్చి అనితను హగ్ చేసుకుని చెప్పింది మేరి.

"ఏం చెప్పావు నా గురించి?" కుతూహలంగా అడిగింది అనిత తిరుగు ప్రయాణంలో.

"మా అమ్మ మాటలకు ఫీల్ అయ్యావా? సారీ."

"ఛఛ అలాక్కాదు, నేను వేరే దేశం అమ్మాయిని. కానీ నీ గర్ల్‌ఫ్రెండ్ అని చెప్పేశావా? ఏమీ అభ్యంతరం పెట్టలేదా?"

"మొదట్లో నాకు తెలియకుండానే నీ గురించి ఎక్కువగా మాట్లాడా. మన దేశం కాదు అని. డీప్‌గా ఇన్వాల్వ్ అవ్వొద్దు అని నచ్చ చెప్పారు. కానీ ఓ రోజు కూర్చుని నువ్వు నాకెందుకు నచ్చుతావో, నువ్వంటే నాకెందుకు అంత ఇష్టమో చెప్పాను. నేను నా ఫామిలీ చాలా క్లోజ్ నీతూ. ఇవ్వాళ నిన్ను చూశారు. అమ్మకు నువ్వు నచ్చావు అని అర్థం అయ్యింది. ఒకవేళ వాళ్ళకు ఇంకా ఏమన్నా అనుమానాలు ఉన్నా, నీతో ఇంకా పరిచయం పెరిగితే నిన్ను ఇష్టపడని వాళ్ళు ఎవరు నీతూ. మాయలో పడేస్తావు" చిలిపిగా నవ్వాడు.

అనితకు విపరీతంగా ఆశ్చర్యం వేసింది. తన ఇంట్లో స్టీవ్ గురించి చెపితే ఏం జరుగుతుందో ఊహించుకోటానికే భయం వేసింది.

స్టీవ్ తన రూంకు తీసుకువెళ్ళాడు.

"కాస్త ఫ్రెష్ అవుతావా? ఫైర్ వర్క్స్ చూడటానికి నేవీ పియర్‌కు వెళదాం"

విపరీతంగా రద్దీతోబాటు, పార్కింగ్ కూడా దొరకటం చాలా కష్టం కాబట్టి, రెండు బస్సులు మారి నేవీ పియర్‌కు వెళ్ళారు. అనుకున్నట్లుగానే విపరీతంగా రద్దీగా ఉంది.

"నచ్చట్లేదు ఇంత జనం మధ్య. అక్వేరియం దగ్గరకు వెళ్ళి అక్కడనుండి చూద్దామా?"

అడిగాడు స్టీవ్.

నేవీ పియర్ దగ్గర బోట్ ఎక్కి, అక్వేరియం దగ్గర దిగారు. ఇలా బోటు మీద కూర్చుని ఫైర్‌వర్క్స్ చూస్తే ఎంత బాగుంటదో కదా అనిపించింది అనితకు.

అక్వేరియంకు ప్లానెటోరియంకు మధ్యలో ఉన్న రాళ్ళ గోడ మీద కూర్చున్నారు. మిచిగెన్ లేక మీద వెన్నెల కాంతుల తళతళలు, ఓ పక్క అద్భుతమైన ఎత్తైన బిల్డింగ్‌లు, ఇంకోపక్క ఆకాశంలో రంగురంగుల తారాజువ్వల అందమైన కాంతులు - పక్కనే మనసు దోచిన చెలికాడు.

"ఎంత బాగుందో కదా!" ఎక్సైటెడ్‌గా స్టీవ్ వైపు చూసింది అనిత.

తనవంకే తదేకంగా చూస్తున్న స్టీవ్‌ను గమనించి, కనుబొమ్మలెగరేసింది.

మృదువుగా అనిత గడ్డం ఎత్తి "ఐ లవ్ యు నీతు" అంటూ పెదవులను చుంబించాడు.

చుట్టుపక్కల గాలి, శబ్దాలు, ప్రకృతి అంతా స్థంభించినట్లుగా అనిపించింది.

మృదువుగా అంటీ అంటనట్లుగా మొదలయ్యిన ముద్దు - ఎవరిని దగ్గరకు లాక్కున్నారో - ఎవరు ఎవరి దగ్గరకు వెళ్ళారో తెలియలేదు. భావాల పరిష్వంగంలో, ఉద్వేగపు అలల తాకిడిని తట్టుకుంటూ - ప్రేమా, వ్యామోహమా, కాంక్షా - వీటన్నిటినీ మించిన పదం నాకు తెలియదే అని మనస్సు వాపోయింది.

గుండెకి సవ్వడెందుకు - పెదవులకు ఒణుకెందుకు
పరువానికి పరుగెందుకు - తనువుకి తపనెందుకు
ఏమిటీ కొత్త వింత - మదిలో ఏదో పులకింత
అర్ధంకాని కవ్వింత - ఆశల గిలిగింత
ఇదేనేమో ప్రేమ - ఇదే సుమా ప్రేమ!

**రాజి**

గ్రీష్మ ఋతువు - 2000

సమ్మర్ హాలీడేస్ మొదలవ్వటంతో యూనివర్సిటీలో ఉన్న కాఫీ షాపుకు అంతగా వ్యాపారం లేదు. దానితో వ్యాపార గంటలు కుదించారు. పైగా పిన్నివాళ్ళ పిల్లలకు కూడా సెలవలు కావటంతో రాజి అవసరం ఇంట్లోనే ఎక్కువ ఉండటంతో యూనివర్సిటీకి వెళ్ళటం తగ్గించింది.

అమెరికా వచ్చి నాలుగు సంవత్సరాలయ్యింది. ఇండియాలో ఉన్నప్పుడు ఎవరైనా అమెరికా గురించి చెపితే అది ఒక రంగుల ప్రపంచంలా ఉండేది. అందమైన ఇళ్ళు, పెద్దకార్లు, డాలర్లను మార్చి రూపాయిలను విరజిమ్మే వారి దర్జా అంతా మిరుమిట్లు గొలుపుతుండేది.

ఏమోలే తన జీవితమే ఇలా అయిపోయిందేమో. నాలుగేళ్ళుగా ఏమి సాధించింది తను. దగ్గరి బంధువులే ఇలా పనిమనిషిలాగా తీసుకురావటమేంటి? ఎదిరించే ధైర్యం లేదు. తనూ అంతే పిరికితనంతో వీళ్ళ ఇంట్లో ఇలా ఉండిపోయింది. అమ్మ అన్నట్లుగా, ఏదో వంకతో ఇంట్లోనే ఉంచుకున్నారు కదా బ్రతుకు రోడ్డున పడలేదని సంతోషించాలా?

చిన్నప్పటినుండి ఆర్ధిక పరమైన ఇబ్బందులు, సర్దుకుపోవటం, కష్టాలు, సమస్యల మధ్య పెరిగి ఒక రకమైన ఆత్మనూన్యతకు గురైంది రాజి మనస్సు. తనను తాను కించపరచుకోవటం, తనలోనే ఏదో లోపం ఉందనుకోవటం, నా కర్మ ఇంతేలే అన్న కృంగుబాటు. ఇలా ఉండటం నచ్చలేదు కానీ అందులోనుండి ఎలా బైటపడాలో తెలియదు, వీసా మార్పించుకునే మార్గాలు వెతుకుదామన్నా భయమే, పిన్ని బాబాయికి తెలిస్తే ఏమనుకుంటారో అని. కెఫెలో పనిచేస్తానని ఎలా అడిగిందో అని తనమీద తనకే ఆశ్చర్యం. ఆ వచ్చే డబ్బులతో చాలా పొదుపుగా తనకు ఇక్కడ కావాల్సిన బట్టలు, బూట్లు కొనుక్కుంది, వీలైనంత వరకు దాస్తుంది. పిన్ని బాబాయి కూడా ఈ ఉద్యోగం మొదలు పెట్టకముందు ఏమీ డబ్బులు ఇచ్చేవారు కాదు, కావల్సిన బట్టలు కొన్నారు, ఇంట్లో ఖర్చు ఇంకేమి ఉంటుంది.

అమెరికా వచ్చాక తనకంటూ దొరికిన మొట్టమొదటి స్నేహితురాలు అనిత. తనతో మాట్లాడుతుంటే చాలా ఆత్మీయంగా ఉంటుంది. ఈ సెలవల్లో కలవలేక పోవటం వెలితిగా ఉంది. ప్రియ కూడా మంచి అమ్మాయే కానీ ఎందుకో తన దగ్గర చనువు ఏర్పడలేదు. తను నిక్కచ్చిగా మాట్లాడే విధానం ఎందుకో భయం వేస్తుంది అనుకుంది రాజి.

"రాజీ రేపు లంచ్‌కు ఓ నాలుగు ఫామిలీలను పిలిచాను. ఏమి వంటలు చేద్దాం" వాణి మాటలకు ఆలోచనలనుండి బైటపడింది రాజి.

వాణిలో ఒక ప్రత్యేకత ఉంది, ఎలాంటి పరిస్థితుల్లోనూ కూడా కోపంగా అరవటం కానీ తీవ్రంగా మాట్లాడటం కానీ చెయ్యదు. చాలా నాజూకుగా తెలివిగా మాట్లాడుతుంది, పని అప్పచెపుతుంది.

"స్వీట్సు ఏమన్నా ఇవాళే చెయ్యమంటారా పిన్ని" ఏమేమి వంటలు చెయ్యాలో లిస్ట్ వాణి ఇచ్చాక అడిగింది రాజి.

"ఇవాళే చేసేద్దాం"

"సర్లెండి నేను వెళ్ళి కూరగాయలు తీసుకుని వస్తాను"

షాపింగ్ చేస్తూనే ఇంట్లో పనులన్నీ ఎట్లా పూర్తి చెయ్యాలో అన్నీ ప్లాను చేసుకుంది రాజి. రేపు లంచ్ దాకా ఊపిరి ఆడదు. నాలుగేళ్ళు అయ్యింది అమ్మను చూసి. ఈ మధ్య మరీ అనిపిస్తుంది. పోయినసారి ఫోను చేసినప్పుడు అమ్మకు జాండీస్ వచ్చి కాస్త తగ్గుముఖం పట్టిందని అక్క చెప్పింది. ఫోనుకూడా రెండు నెలలకు ఒకసారి చేస్తుంది. ఫోను బిల్లు ఎక్కువ అవుతుందని బాబాయి ఏమన్నా అనుకుంటారేమో అని కాలింగ్ కార్డుతోనే చేస్తుంది.

అమ్మకు సుస్తీ చేసినప్పుడు తనమీద బాగా బెంగపెట్టుకుని కలవరించేదంట. పోనీ అమెరికాలో మంచి ఉద్యోగం చేస్తుంటే ఎలాగోలా అమ్మను తన దగ్గర పెట్టుకునేదేమో. పెళ్ళీ పెటాకులు లేకుండా ఒంటరిగా మిగిలిపోతావ అని గోల. ఇండియా వచ్చెయ్యి మనకు తగ్గ సంబంధం ఏదో చూస్తాను అని ఆరునెలలుగా ఒకటే పోరాడుతుంది. పోయినసారి ఫోను చేసినప్పుడు చిన్న నాయనమ్మ అనసూయతో వాపోయింది తల్లి.

ఇంటికి వెళ్ళగానే "లడ్డూలు చేద్దాం ఇవాళ. పిల్లలు ఇంట్లో కూడా తింటారు" అనసూయమ్మ అంది.

"అలాంటివన్నీ మీరు చూసుకోండత్తయ్య. రాజి చేస్తుంది. నాకు రావు ఆ వంటలు" అన్నది వాణి.

అమెరికాలో ఈ నాలుగు సంవత్సరాల నుండి ఉన్నందుకు పెద్దావిడ హయాంలో మన సాంప్రదాయపు వంటలన్నీ బాగా నేర్చుకుంది రాజి. పచ్చళ్ళు, పొడులు, స్వీట్లు ఒకటేమిటి అన్నీ నేర్పించింది ఆవిడ. కొడుకూ, కోడలు రాజిని ఇలా వాడుకోవటం నచ్చకపోయినా, ఉన్నంతసేపు తన సోదంతా ఓపికగా వినే ప్రాణిదొరికినందుకు ఆవిడకూ ఆనందంగానే ఉంది. ఇంట్లో మిగతా వాళ్ళు అవసరం ఉన్నంతవరకే మాట్లాడతారు. కానీ ప్రత్యేకంగా ఈవిడ దగ్గర కూర్చుని కబుర్లు చెప్పరు. పైగా ఆవిడకు కాస్త ఓపిక ఉన్న రోజున రాజిని అడిగి దగ్గర్లోని సాయిబాబాగుడికి భజనకు వెళుతుంది. దానితో అనసూయమ్మకు కూడా రాజి ఉండటం నచ్చింది.

రాజి వాళ్ళ అమ్మ, కూతురు పెళ్ళిగురించి కన్నీళ్ళు పెట్టుకున్నప్పటినుండి అనసూయమ్మకు కూడా లోలోపల పీకుతుంది. పోనీ ఇక్కడే ఏదన్నా సంబంధం చూద్దామా అని. కొడుకూ కోడలుతో ఒకటికి రెండుసార్లు చెప్పింది రాజి లేకుండా చూసి.

"ఏమన్నా చీరకట్టుకో రాజి ఇవాళ" పనులన్నీ అయిపోయాక వంటిల్లు అంతా శుభ్రం చేసి మళ్ళీ స్నానం చెయ్యటానికి వెళుతున్న రాజితో చెప్పింది వాణి.

"సరే పిన్ని" ఏంటి ఎప్పుడూ లేనిది ఇంత ప్రత్యేకంగా చెపుతుంది అనుకుంది. రాజి కూడా అనసూయమ్మ గదిలోనే ఉంటుంది. ఆవిడ మందుల దగ్గరనుండి భోజనం వరకు అన్నీ చాలా శ్రద్ధగా చూసుకుంటుంది. ఏమాటకామాటే ఆవిడ కూడా వెనకటి బంధాలవలన కాబోలు రాజి అంటే ఆపేక్షగానే ఉంటుంది. వాణివి పాత చీరలు రాజికి ఇప్పించింది. ఎటూ అమెరికాలో అంతగా కట్టుకునే అవకాశం రాదుకదా.

స్నానం చేసి జడవేసుకుంటున్న రాజిని చూస్తూ "వయస్సు తగ్గట్లు కొంచెం పుష్టిగా ఉంటే బాగుంటుంది. కానీ పల్చటి పుటక తల్లిలాగానే. చామనఛాయ అయినా మొహం బాగానే ఉంటుంది" అని అనుకుంది.

"నానమ్మ అందరూ వచ్చే టైం అయిందేమో, మిమ్మల్ని సోఫా దగ్గరకు తీసుకు వెళ్ళనా లేక తరవాత వస్తారా?"

"వస్తాలే ఇప్పుడే ప్రొద్దుటనుండి రూంలోనే ఉండిపోయా"

"చెపితే వినిపించుకోకుండా నిన్న లడ్డూలు చుట్టారు. అంతసేపు అలా కూర్చునేసరికి నడుము పట్టేసి రాత్రంతా బాధపడ్డారు కదా" మృదువుగానే కోప్పడింది రాజి.

అనసూయమ్మ చెయ్యిపట్టుకుని నెమ్మదిగా నడిపిస్తూ ముందు గదిలోకి తీసుకొచ్చింది రాజి. ఆవిడ గది మొదటి అంతస్తులోనే ఉంటుంది.

85 ఏళ్ళ వయస్సులో కూడా ఆరోగ్యంగానే ఉంటుంది ఆవిడ. కీళ్ళనొప్పులు తప్పితే ఏ రకమైన అనారోగ్యం లేదు ఆవిడకు. కానీ సంవత్సరం క్రితం బాత్రూంలో కాలు జారిపడిన తర్వాత విరిగిన తొంటి ఎముక తిరిగి అతుక్కోటానికి చాలా సమయమే పట్టింది. అందుకే రాజి జాగ్రత్తగా చెయ్యి పట్టుకుని నడిపిస్తుంది.

మొత్తం నాలుగు ఫ్యామిలీలు వచ్చారు. వాళ్ళకు అపిటైజర్లు అన్నీ టేబుల్ మీద సర్దింది రాజి. వచ్చిన వాళ్ళల్లో ఇద్దరికి రాజి బాగానే పరిచయం. దగ్గరకు వచ్చి పలుకరించారు.

"ఇండియా వెళ్ళాలని లేదా రాజి. వచ్చి చాలా ఏళ్ళు అయ్యింది కదా. మూడేళ్ళకు ఒకసారన్నా వెళ్ళకపోతే ఏమీ బాగోదు నాకు" అంది పావని.

"నా వీసాతో ఇండియా వెళితే ఇక రావటానికి కుదరకపోవచ్చంట. ఏమి చెయ్యాలో మరి" కొంచెం బెంగగా అంది రాజి.

"పిల్లలు అందరూ బేస్‌మెంట్‌లో ఉన్నారు, వెళ్ళి పిలుచుకురా రాజి. స్నాక్స్ తిని వెళతారు" చెప్పింది వాణి.

వాణికి ఇద్దరు బాబులు. పెద్దబాబు పదవ తరగతి, రెండవ బాబు ఆరు చదువుతున్నారు. వచ్చిన వాళ్ళ పిల్లలతో కలిపి మొత్తం ఎనిమిది మందిని పిలుచుకువచ్చి, వాళ్ళందరికి ఏమేమి కావాలో ప్లేటులో పెట్టుకోవటానికి సాయం చేసింది.

"నానమ్మా మీకు ఆలస్యం అవుతుందేమో వీళ్ళతోపాటు భోజనం చెయ్యటానికి ఆగారంటే, ఇప్పుడే స్నాక్స్ తీసుకున్నారు. వెంటనే భోజనం చెయ్యరు కదా. మీకు ప్లేటులో పెట్టి తెచ్చి ఇస్తాను, సరేనా?"

"సర్లే ఇచ్చెయ్యి. ఎందుకో నీరసంగా ఉంది ఇవాళ. కొంచెం పెట్టు, తినాలని కూడా లేదు."

ప్లేటులో అన్నం అన్ని కూరలు కొంచెం కొంచెం సర్ది, ఆవిడ కూర్చున్న చోటే చిన్న టేబుల్ లాగి ప్లేటు దానిమీద పెట్టింది రాజి.

"కొంచెమే పెట్టాలే నానమ్మా. అన్ని కూరలు రుచి చూస్తారని తలా ఒక స్పూన్ పెట్టాను."

అందరూ కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు. వచ్చిన వాళ్ళందరూ రాజికి తెలిసిన వాళ్ళే, ఒకాయన ఎవరో ఎప్పుడూ చూడలేదు. వాళ్ళంతటవాళ్ళు పలుకరిస్తే కానీ మాట్లాడదు రాజి. మనస్సులో ఏదో జంకు, తన స్థానం కాదు అనిపిస్తుంది. వాణి ఎప్పుడూ కట్టడి చెయ్యలేదు అయినా రాజికే బెరుకు. వాళ్ళ ఖరీదైన చీరలు, నగలు, వాటి గురించిన సంభాషణలు - ఇవన్నీ మరింత ఆత్మనూన్యతకు గురి చేస్తాయి రాజిని.

భోజనాలు చేస్తున్నప్పుడు వాణి ఆ కొత్తవ్యక్తిని పరిచయం చేసింది రాజికి. వేణు అని దెవాన్ స్ట్రీట్‌లో ఒక ఇండియన్ గ్రోసరీ స్టోర్ ఉందంట. అందరూ భోజనాలు చేసి, టీ తాగి వెళ్ళిపోయేసరికి దాదాపు సాయంత్రం ఐదు అయ్యింది. కిచెన్ మొత్తం క్లీన్ చేసి బైట తోటలోకి వచ్చి కూర్చుంది. ఆగష్టు నెల కావటంతో ఎండ తీవ్రంగానే ఉంది. ఇంకో మూడు వారాల్లో కాలేజి తెరుస్తారు. అనిత, ప్రియ ఎలా ఉన్నారో, వాళ్ళ కేంటిలే బాగా చదువుకుంటున్నారు. దానికి తగ్గ ఉద్యోగం చేసుకుంటున్నారు, తనలాంటి నష్టజాతకం ఎవ్వరికీ ఉండకూడదు. స్టీవ్ అంటే చాలా ఇష్టమని అనిత ఓసారి చెప్పింది. పెళ్ళిచేసుకుంటారా వాళ్ళు? అనిత వాళ్ళ ఇంట్లో ఒప్పుకుంటారా తెల్ల అబ్బాయిని పెళ్ళి చేసుకోటానికి? కానీ అనిత చాలా మంచిది. తను కోరుకున్నవాడితో జీవితం హాయిగా గడచిపోవాలి.

"రాజి లోపలకు రా కొంచెం మాట్లాడాలి" వాణి పిలిచింది.

అనసూయమ్మకూడా మధ్యాహ్నపు నిద్ర అయిపోయి, సోఫాలో కూర్చుంది వరప్రసాద్ పక్కన.

"ఏమైందబ్బా?" అని అనుకుంటూ వెళ్ళి సోఫాలో కూర్చుంది రాజి.

"ఇందాక పార్టీలో పరిచయం చేశాను వేణు అని గుర్తుందా? ఆయనకు నిన్ను ఇచ్చి పెళ్ళి చేస్తే బాగుంటుందని మా అభిప్రాయం" మొదలు పెట్టింది వాణి.

ఉలిక్కిపడింది. వేణునా? పెద్దగా ఉన్నాడు పైగా ఓ పాప కూడా ఉన్నట్లుంది. అయోమయంగా చూసింది అందరివైపు.

అనసూయమ్మ నెమ్మదిగా నచ్చచెపుతున్నట్లు మొదలుపెట్టింది. "ఎక్కువ కాలం నువ్వు ఈ వీసాతో ఉండలేవంటమ్మా. ఇండియా తిరిగి వెళ్ళి ఏం చేస్తావు? మీ అమ్మవల్ల అవుతుందా నీకు పెళ్ళి చెయ్యటం? ఇక్కడ సిటిజన్‌ని పెళ్ళి చేసుకుంటే నువ్వు కూడా సిటిజన్‌వి అయిపోతావు. మీ అమ్మ కూడా చాలా బెంగ పెట్టుకుంది నీ పెళ్ళి గురించి, నీకా దాదాపు 27 ఏళ్ళు. వేణు మంచివాడని అందరూ అంటున్నారు. నిజమే రెండో పెళ్ళివాడు. ఇద్దరు పిల్లలు. బాబు పుట్టాక ఏదో సుస్తి చేసి భార్య చనిపోయిందంట. మీ ఇద్దరికి ఓ పదేళ్ళు వయస్సు తేడా ఉంది కానీ ఆలోచించు కట్నాల గోల లేదు. ఆర్థికంగా బాగానే ఉన్నాడు. ఇంకేం కావాలి?"

రాజి మాట్లాడకపోవటం చూసి వాణి కుమార్ చేతిని పొడిచింది మాట్లాడమని.

"రాజి నీ మంచి కోరి చెపుతున్నాం. నీకు నీ వీసా స్టేటస్ సంగతి తెలుసు కదా. తెలిసిన లాయర్‌తో ఇన్నాళ్ళు నీ వీసాని రకరకాలుగా మార్పించి తిప్పలు పడ్డాం. ఇదంతా నీకు సాయం చెయ్యాలనే కదా. కానీ ఆయన కూడా చెప్పేశారు

నువ్వు అమెరికా ఉండాలంటే ఇదొక్కటే మార్గమని. నిజం చెప్పాలంటే నువ్వు చాలా అదృష్టవంతురాలివి కాబట్టే వేణు నిన్నుకూడా ఇష్టపడ్డాడు. అతను ఇప్పుడు ఇండియా వెళ్ళి పెళ్ళి చేసుకుంటా అంటే, క్యూలు కడతారు అమెరికా సంబంధం అని. కట్నం ఏమీ అడగకుండా, మా మీద నమ్మకంతో, మీ ఇంటి పరిస్థితిని అర్ధం చేసుకుని ఒప్పుకున్నాడు. రెండో పెళ్ళి అయితే ఏమైందంటా? ఇంతకంటే మంచి సంబంధం నీకు చచ్చినా రాదు. రాత్రికి మీ అమ్మతో మాట్లాడుదాం.''

రాజికి ఏమీ అర్ధంకావటంలేదు. పెళ్ళి గురించి ఇప్పటిదాకా ప్రత్యేకంగా ఆలోచించకపోయినా, ఏ రకమైన ఆశలు కోర్కెలు లేకపోయినా ఎందుకో వేణుని పెళ్ళి చేసుకోటానికి మనస్కరించలేదు. ఇందాకటినుండి అతని మొహం ప్రవర్తన గుర్తు తెచ్చుకోటానికి ప్రయత్నిస్తుంది. అతని కూతురికి ఎనిమిది తొమ్మిదేళ్ళు ఉంటాయేమో. పిల్లవచ్చి ఏదైనా అడుగుతుంటే విసుక్కోవటం, ఆ పాప మిగతా వాళ్ళతో ఆడుకునేటప్పుడు పేచీలు పెట్టటం గమనించింది.

తల్లిలేక, తండ్రి పట్టించుకోక పాప మొండిగా తయారయ్యిందేమో. కేవలం తన పిల్లలను చూసుకోటానికి పెళ్ళి చేసుకుంటున్నాడని అర్ధం అయ్యింది. జీతం, భత్యం, ప్రేమ ఆప్యాయత ఏమీలేని ఒక ఆయా వంటమనిషిలాగా తను ఈ ఇంటినుండి ఆ ఇంటికి ఏమీ తేడాలేదు. వారం రోజులు రకరకాల మాటలు జరిగిపోయాయి. అందరి మధ్య ఇందులో రాజి ప్రమేయం కానీ అభిప్రాయం కానీ ఏమీలేదు. రాజి తల్లి చాలా సంతోషించింది. పెళ్ళి మాత్రం ఇండియాలో చేస్తే తన కళ్ళారా కూతురి పెళ్ళి చూసుకుంటానని బ్రతిమిలాడింది. లాయరుతో మాట్లాడి, ఇక్కడ ఎంగేజ్‌మెంట్‌లాగా చేసుకుని, ఇండియాలో పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించారు.

రాజికి తన మనస్సులోని సంఘర్షణ ఎవరితో చెప్పుకోవాలో అర్ధంకాలేదు. అందరూ ఆనందంగా ఉండటంతో, రాజి మౌనాన్ని అంగీకారంగా తీసుకున్నారు. రాజి తన తల్లితో చెప్పుదామని ఫోన్ చేసింది ఇంట్లో ఎవ్వరూ లేని టైంలో. కానీ ఆవిడ ఆనందంతో తబ్బిబ్బు అవ్వటం, పైగా వరప్రసాద్ తండ్రి స్థానంలో నిలబడి ఈ సంబంధం కుదర్చటం గురించి చెపుతుంటే మాట్లాడబుద్ది అవ్వలేదు.

ఓ రోజు మొహమాటం వదిలించుకుని అనితకు ఫోన్ చేసింది.

''ఎలా ఉన్నావు రాజి. నేనే అనుకుంటున్నా నీకు ఫోన్ చేద్దామని ఆఫీస్‌లో పని ఎక్కువైంది. సాయంత్రం కూడా లేట్ అవుతుంది'' నవ్వుతూ అడిగింది అనిత.

''నాదేముందిలే అనిత. అక్కా బావా బాగున్నారా?''

''అంతా బాగున్నారు. ఏం చేస్తున్నావు ఈ సెలవల్లో, ఇంకా ఎంతపని నెత్తిన వేసుకున్నావు. ఇంకో రెండు వారాల్లో వచ్చేస్తా చికాగో''

''మీరు తిరిగి వచ్చేసరికి నేను ఉండను అనిత. రెండువారాల్లో నేను ఇండియా వెళ్ళిపోతున్నాను. నిన్న నా ఎంగేజ్‌మెంట్ అయ్యింది. ఇండియాలో పెళ్ళి. తిరిగి వీసా మార్చుకుని నేను వచ్చేసరికి ఎన్నాళ్ళు పడుతుందో తెలియదు.''

''పెళ్ళి కుదిరితే ఇంత నిదానంగా చెపుతావేంటి? నువు మరీనూ.. ఎవరతను? ఎక్కడుంటారు? చెప్పు చెప్పు తొందరగా.

రాజి తన కథ అంతా చెప్పింది.

"ఒక్కసారి కూడా అతనితో మాట్లాడలేదా? అలా ఎలా ఒప్పుకున్నావు రాజి. నీకంటే పదేళ్ళు పెద్ద అంటున్నావు. అసలు భార్య ఎలా చనిపోయిందో కనుక్కున్నావా?" ప్రశ్నల వర్షం కురిపించింది.

"లేదు అనిత, అతని గురించి ఏమీ తెలియదు. అందరూ నేను చాలా అదృష్టవంతురాలినని మాట్లాడుతుంటే ఎలా ఎదురు చెప్పేది? చాలామంది ఆడపిల్లలు నాలానే ఉంటారు అనిత. కట్నం ఇవ్వకుండా మన దేశంలో పెళ్ళిళ్ళు కావు. నాకు ఇచ్చే స్థోమత లేదు. మాలాంటి వాళ్ళకు కలలు కనే అర్హత లేదు"

"నీలో అదే నాకు నచ్చనిది. ఎందుకు నీలో నువ్వే కుంచించుకుపోతావు? నిన్ను నువ్వు తక్కువ చేసుకోకు ప్లీజ్"

"ఏం చెయ్యనో చెప్పు అనిత. అమ్మకు చూడు ఎంత స్థిమితంగా ఉందో ఇప్పుడు. నానమ్మ కూడా మంచి సంపాదన ఉంది ఇద్దరు పిల్లలు ఉంటే ఏంటి అని చెపుతుంది."

"నీకు చెప్పలేను రాజి. ఏది ఏమైనా నీ పెళ్ళికి రాలేను కానీ ఒక్కటే చెప్పగలను. ధైర్యంగా ఉండటం నేర్చుకో. అతను మంచివాడు, నిను బాగా చూసుకునేవాడు అవ్వాలని కోరుకుంటున్నా" మనస్ఫూర్తిగా చెప్పింది అనిత.

"ఎప్పటికి చూస్తానో మిమ్మల్ని అనిత. నాకు మళ్ళీ వీసా వచ్చి తిరిగి ఇక్కడికి రావటానికి మీ చదువులు అయిపోయి ఉద్యోగాల్లో ఎక్కడ ఉంటారో."

"ఎన్నాళ్ళు పడుతుందంట నువ్వు తిరిగి రావటానికి"

"తెలియదు అనిత ఒక్కో కేసు ఒకోరకం అంటున్నారు. బాబాయి ఫ్రెండ్ ఒకాయన ఇమ్మిగ్రేషన్ లాయర్ ఆయన సలహాతోనే ఇక్కడ ఎంగేజ్‌మెంట్ చేసుకుని పేపర్లు సబ్‌మిట్ చేశా నిన్న. పెళ్ళి సింపుల్‌గా గుడిలో చేద్దాం అని నిర్ణయించారు."

"అమెరికా వాపసు వచ్చాక అక్కకు ఫోను చెయ్యి రాజి. నేను ఎక్కడ ఉన్నానో చెపుతుంది కదా! కొత్త జీవితంలో సంతోషంగా ఉంటావని ఆశిస్తున్నా రాజి"

"నీ సంగతేంటి - స్టీవ్‌ను ప్రేమిస్తున్నావా?"

"అవును రాజి. నాకు తనతో జీవితాంతం ఉండాలని ఉంది. ఐ రియల్లీ లవ్ హిమ్"

**"వదులుకోకు** అనిత అతన్ని. మనస్సుకు నచ్చిన వాళ్ళను పెళ్ళి చేసుకుంటే సంతోషంగా ఉంటాం. మన దేశం, మన భాష కాకపోయినా, ఎందుకో నిన్ను బాగా చూసుకుంటాడు అనిపిస్తుంది."

చాలాసేపు మాట్లాడుకున్నారు. ఇద్దరి మనస్సులు భారమైపోయాయి, మళ్ళా జీవితంలో ఎప్పుడు కలుస్తామో అన్న చింత పీడించింది రాజిని.

కాలం ఎవ్వరి కోసమూ ఆగదు. సంతోషాలు, దుఃఖాలు, అసంతృప్తిగా ఉన్నా, పనిలో ఉన్నా, ఖాళీగా ఉన్నా దేనికోసం కాలం ఆగదు. కానీ మనస్సులోని ప్రతిస్పందనల వలన సమయం ఎలా గడిచిందనేది బేరీజు వేసుకుంటారు.

నాలుగు సంవత్సరాల తర్వాత తల్లిని అక్కలను చూస్తున్న ఆనందం, తన పెళ్ళికంటే ఎక్కువ సంతోషాన్ని ఇచ్చింది రాజికి. తాను దాచుకున్న డబ్బులు పెళ్ళి ఖర్చులకు కొంత తల్లికి ఇచ్చి, మిగతాది ఆవిడ ఖర్చులకు ఉంచుకోమని చెప్పింది. ఇక మీదట ఈ మాత్రం డబ్బు అయినా చేతిలో ఉంటుందో లేదో?

"ఆ దేశంలో చలికి తెల్లగా ఉంటారంట అందరూ, మరి నువ్వేంటే రంగు తగ్గావు పైగా చిక్కిపోయావు కూడా" కూతురిని చూడగానే కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

"నీ కళ్ళకి ఎప్పుడూ చిక్కినట్లే కనిపిస్తాలే" నవ్వింది రాజి కళ్ళు తుడుచుకుంటూ.

ప్రయాణపు బడలిక తీర్చుకుని కొంచెం స్థిమితపడ్డాక, నెమ్మదిగా అడిగింది రాజిని "ఏమ్మా అతను ఎలా ఉంటాడు. నీకు నిజంగానే నచ్చాడా?"

"నచ్చే కదమ్మా ఒప్పుకున్నాను. ఎందుకీ అనుమానాలన్నీ" తేలికగా అంది.

రాజి చిన్నక్క పూర్ణకు మేనరికం చేశారు. తల్లి కమల అన్న కొడుకు. మేనల్లుడన్న చనువుతో, రాజి అమెరికా వెళ్ళాక, ఊళ్ళో ఉన్న చిన్న ఇల్లు అమ్మేసి వీళ్ళ దగ్గరే ఉంటుంది. అల్లుడికి పోస్టాఫీసులో ఉద్యోగం. ఇద్దరు చిన్నపిల్లలు.

"మీ నాన్నే బ్రతికి ఉంటే ఇలా రెండో సంబంధానికి ఒప్పుకునేవారు కాదు. మీ బాబాయి చెపుతుంటే బాగానే ఉన్నట్లు అనిపించి సంతోషించా, నువ్వు అమెరికాలో సుఖంగా ఉంటావులే అని. మళ్ళీ మనసు పీకుతుంది. ముగ్గురు ఆడపిల్లల్లోకి బాగా చదువుకుని , ఇలా సర్దుకుపోవాల్సి వస్తుంది"

"మనస్సు పాడు చేసుకోకమ్మా. నేను ఎంత పెద్ద ఇంట్లో ఉండబోతున్నానో తెలుసా? నేను వెళ్ళాక నిన్ను కూడా తీసుకువెళతా. నువ్వే చూస్తావుగా నా దగ్గరే ఉండిపోదువుకానీ" తల్లి ఒడిలో తలపెట్టుకుని చెప్పింది రాజి.

తల్లి కమల చాలా భోళా మనిషి. గుట్టుగా ఉన్నదాంట్లో సంసారం నెట్టుకొచ్చింది. ఉన్నంతలోనే ఇంటికొచ్చిన బంధువులకు చక్కగా మర్యాదలు చేసేది. పెద్ద కూతురు దూరంగా విశాఖపట్నంలో ఉంటుంది. ఎవరి కాపురాల్లో వాళ్ళు బాగానే ఉన్నారు. రాజి అమెరికా వెళుతున్నప్పుడు చాలా సంతోషించింది. ఇప్పుడు కూతురిని చూస్తుంటే తల్లి మనస్సుకు అర్థం అయ్యింది రాజి సంతోషంగా లేదని.

"నువ్వు సుఖంగా సంతోషంగా ఉంటే చాలమ్మా నాకు. నీకు తెలియనది కాదు అయినా చెపుతున్నాను. పిన్ని బాబాయి వాళ్ళింట్లో కంటే కూడా ఎక్కువ సర్దుకుపోవాలి నువ్వు ఇప్పుడు. అతని గురించి నువ్వే గమనించుకుని అతని మనస్సుకు తగ్గట్లుగా ప్రవర్తించు. ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. వాళ్ళను బాగా చూసుకో. ఆడవాళ్ళం మనమే ఓపికగా ఉండాలమ్మా, సంసారం అన్న తర్వాత ఏదో ఒక సమస్య తలెత్తుతుంది. అయినా తట్టుకుని నిలబడాలి"

విచిత్రంగా అనిపిస్తుంది రాజికి తన పెళ్ళి సంగతి ఆలోచిస్తుంటే, ఏ భావం కలగట్లేదు ఎందుకో. ఎన్ని పుస్తకాల్లో చదివింది, సినిమాల్లో చూసింది. పెళ్ళి అంటే ఆడపిల్లలు సిగ్గుపడటం, అతనితో జీవితం ఊహించుకోవటం ఏదీ అనిపించటం లేదు తనకు. "అతని మొహం కూడా సరిగ్గా గుర్తురావట్లేదు. భావి జీవితం గురించి ఏమి ఆలోచించాలో కూడా తెలియట్లేదు.

పెళ్ళి దగ్గర పడేకొద్దీ తెలియని కంగారు మొదలయ్యింది. రాజికి కమల, పూర్ణ పట్టుపట్టి ఓ పదిహేను చీరలు కొన్నారు. పెళ్ళికి కావల్సిన పట్టుచీర మాత్రమే కాకుండా అక్కడ కట్టుకోడానికి ఉంటాయని. కేవలం పది చీరలు పెట్టెలో పెట్టుకుని అమెరికా నుండి వచ్చిన రాజిని ఏమీ ప్రశ్నించలేదు కానీ కొంచెం చివుక్కుమంది ఇద్దరికి.

ఎటూ పెళ్ళి సింపుల్‌గానే గుడిలో చేస్తున్నారు కాబట్టి, బంధువులని కూడా ఓ యాభైమందిని మాత్రమే పిలిచారు. కూతుళ్ళ అత్తవారింటి వైపు కూడా కలుపుకుని. పెళ్ళి ముందురోజు కళ్ళు మూసుకుని పడుకున్న రాజికి నిద్రపట్టలేదు. తెలియని వ్యక్తితో తన జీవితాన్ని పంచుకోవటం. ఏమిటో బెంగ.

'భగవాన్! నేను పెద్దగా ఏమీ ఆశించటం లేదు. అతను కాస్త మంచివాడయి నన్ను బాగా చూసుకుంటే చాలు' అప్రయత్నంగా కళ్ళవెంబడి కారే నీటిని తుడుచుకుంది.

'ఏంటి ఇంత బేలగా అయిపోతుంది. ప్రియ, అనిత ఉంటే కోప్పడేవాళ్ళేమో? చిన్నప్పటినుండి సర్దుకుపో అనే పాఠాలు తప్పితే, ధైర్యంగా ఉండమని నేర్పలేదు. ఆర్థిక బలంతో మనోబలం వస్తుందా లేక మనఃస్థత్వాలు వేరేగా ఉండాలేమో? ఛ ఈ ఆలోచనలు వద్దు. కొత్త జీవితంలోకి అడుగుపెట్టబోతుంది. కొంచెం ధైర్యంగా అడుగు వేయాలి. తనకు తానే సమాధానపరచుకుంది.

ఏ రకమైన ఇబ్బందులూ ఆటంకాలు లేకుండా పెళ్ళి జరిగిపోయింది. అమెరికా నుండి వేణు, తల్లి భవాని, కూతురు శృతి వచ్చారు. కొడుకు చిన్నవాడని ఫామిలీ ఫ్రెండ్స్ దగ్గర వదిలి వచ్చారంట. శృతి వేణు పక్కనే కుర్చుని అంతా కుతూహలంగా చూస్తూ ఉంది. భవానిని చూడగానే గుర్తుపట్టింది రాజి. ఆవిడను ఓ రెండు మూడు సార్లు సాయిబాబా గుడిలో చూసింది. వేణు రాజిని చూడటానికి వచ్చినప్పుడు ఆవిడ పెద్దకొడుకు దగ్గరకు కాలిఫోర్నియా వెళ్ళిందట. వాళ్ళు పెళ్ళికి రాలేదు.

పెళ్ళి అయిన వారం రోజులకే వేణు వాళ్ళ తిరుగు ప్రయాణం. పెళ్ళి రిజిస్టర్ చేసుకుని వెంటనే తిరుపతి ప్రయాణం. తిరుపతిలో దర్శనం అయ్యాక వేణు, రాజి చెన్నై వచ్చారు. భవాని, శృతి అటునుండి హైదరాబాదు కోడలి తల్లిదండ్రుల దగ్గరకు వెళ్ళారు.

చెన్నై వచ్చేవరకు రాజి కనీసం పట్టుమని పదిమాటలు కూడా మాట్లాడలేదు వేణుతో. అతను కూడా పెద్దగా కల్పించుకుని మాట్లాడలేదు.

చెన్నైలో దిగి హోటల్‌కు వెళ్ళి స్నానం చేసి రెడీ అయ్యారు.

"నీ వీసా కాగితాలు అన్ని ఇక్కడ కాన్సొలేట్‌లో ఇవ్వాలి. ఆ పని పూర్తి అయ్యాక ఈ మూడు రోజులు చాలా షాపింగ్ చెయ్యాలి. చాలా మంది ఏవేమో లిస్టులు ఇచ్చారు. నీకు షాపింగ్ అంటే సరదానేనా?" అడిగాడు వేణు ఇడ్లీ తింటూ.

"అంత సరదా ఏమీ లేదు" నిదానంగా చెప్పింది.

"షాపింగ్ అంటే ఇష్టంలేని ఆడవాళ్ళు కూడా ఉంటారా?" కొంచెం ఎగతాళిగా నవ్వాడు. ఇదే మొదటిసారి చెన్నై రావటం, బీచ్ చూడాలన్న కోరిక ఎలా వెలిబుచ్చాలో అర్థం కాలేదు.

చాలా షాపింగ్ చేశాడు వేణు. ఎవరెవరికో డాన్సు నగలని, వాళ్ళు అమెరికా నుండి ముందుగానే ఆర్డరు చేసిన డాన్సు డ్రస్సులు, ప్లాస్టిక్ పూలదండలు, డెకరేషన్ వస్తువులు ఇలా ఎన్నెన్నో. సాయంత్రం దాకా తిరిగి అలసిపోయింది రాజి.

హోటల్ కు వచ్చి స్నానం చేసేసరికి కాస్త తెరిపిగా అనిపించింది. అలసటకు తోడు విపరీతంగా తలనొప్పి. ఒక టాబ్లెట్ వేసుకుని నిద్రపోదామా అనిపించింది. కానీ అతను ఏమనుకుంటాడో అని బలవంతాన ఓర్చుకుంది.

భోజనం చేసి తిరిగి రూంకు వచ్చాక మొట్టమొదటి సారిగా అవగతమయ్యింది రాజికి, తాము ఇద్దరే ఉన్నారని ఇది తన మొదటి రాత్రని. ఆ ఆలోచన చాలా ఇబ్బందికరంగా తోచింది. ప్రొద్దుట్నుండి కూడా ఏమీ ప్రత్యేకంగా మాట్లాడుకోకపోవటంతో చాలా కొత్తగా ఉంది.

బట్టలు మార్చుకుని గదిలో ఉన్న కుర్చీలో కూర్చుంది అక్కడ ఉన్న పేపరు చేతిలో పట్టుకుని.

"అక్కడే కూర్చున్నావే? నిద్రరావట్లేదా? వచ్చి పడుకో"

బలవంతాన వెళ్ళి మంచం మీద ఒక పక్కగా పడుకుంది.

"నువ్వు చాలా తక్కువ మాట్లాడతావనుకుంటా" అన్నాడు వేణు భుజం మీద చెయ్యి వేస్తూ.

"కొత్త కదా"

"లేదులే అందరూ చెప్పారు. నువ్వు చాలా నిదానం అని, బాగా పనిమంతురాలివని. లేకుంటే మీ పిన్ని దగ్గర ఇంత ఓపికగా ఉండలేవని అన్నారు. అందుకే చేసుకున్నా" ఏదో గర్వంగా, చాలా గొప్పగా చెపుతున్న భర్తను ఆశ్చర్యంగా చూసింది రాజి.

రాజి మొహంలోని భావాలను పట్టించుకోలేదు వేణు. ఇక పెద్దగా మాట్లాడకుండానే ఆమెను ఆక్రమించుకున్నాడు. రాజి ఇబ్బందిని, సిగ్గును పట్టించుకోకుండా. చాలా రోజుల తర్వాత దొరుకుతున్న సుఖాన్ని ఆత్రంగా అనుభవించాడు.

శరీరం అలసిపోయినా, తలనొప్పి బాధిస్తున్నా చాలాసేపు నిద్రపట్టలేదు రాజికి. ప్రక్కనే సన్న గురకతో ఆదమరచి నిద్రపోతున్న భర్తను చూసింది. మొట్టమొదటిసారిగా పురుష స్పర్శ - ఏమీ అనిపించలేదు. మనస్సు సమాయత్తమవకుండా శరీరం అప్పగించటం ఎంత సర్ది చెప్పుకున్నా నచ్చలేదు. అతనికి ఇది రెండోసారి కదా. ఒక ఆడపిల్లతో ఎలా మెసగాలో అర్ధంకాదా? ఓ సన్న బాధ మొదలయ్యింది రాజి మనస్సులో.

మనస్సుకు సర్ది చెప్పుకుంది. ఇలా నిరాశాజనకంగా తన కొత్త జీవితం మొదలెట్టకూడదని. తనకంటూ చిన్న ప్రపంచం ఏర్పడబోతుంది. అందంగా పొందికగా మలచుకోవాలి. ఆ పొదరింట్లో ఆనందంగా ఉండాలన్న కృతనిశ్చయంతో కళ్ళు మూసుకుంది. ప్రియ

***వసంత ఋతువు -2001 ప్రియ***

కౌన్సిలింగ్ సెంటర్‌లోకి అడుగుపెట్టి, కోటు తీసి కుర్చీమీద పెట్టింది ప్రియ.

"హాయ్ ప్రియ! లోపల గదిలోనుండి బైటకు వస్తూ పలుకరించింది రియ.

"సారీ కొంచెం లేట్ అయ్యింది ఇవాళ"

"నో ప్రాబ్లమ్ వాలంటరీ వర్క్ చేస్తూ నా పని చాలా తగ్గించావు. కాఫీ కావాలా? కాఫీ మెషిన్ దగ్గరకు వెళుతూ అడిగింది రియ.

"నో థాంక్స్. ఇప్పటికే మూడు కప్పులు తాగాను. చాలు ఇవాల్టి డోస్" నవ్వింది ప్రియ.

అది యూనివర్సిటీలోని కౌన్సిలింగ్ సెంటర్. రకరకాల ప్రాబ్లమ్స్‌తో వస్తుంటారు స్టూడెంట్స్, సైకాలజిస్టులు, కౌన్సిలర్లు ఉంటారు. సమస్య తీవ్రత బట్టి సైక్రియాటిస్టులకు కూడా రిఫర్ చేస్తారు.

చదువు ప్రెజర్ వలన టెన్షన్‌తో పానిక్ ఎటాక్స్, పెరిగిపోయే ఏంగ్జయిటీ, వ్యక్తిగత ప్రాబ్లమ్స్ వలన డిప్రెషన్, అకస్మాత్తుగా వచ్చిన స్వేచ్ఛా స్వాతంత్రాలు, తల్లిదండ్రుల కట్టడి లేకపోవటంతో, కంట్రోలు తప్పిన డ్రింక్స్, డ్రగ్స్ అలవాటు - ప్రేమ పేరుతో మోసపోయిన వాళ్ళు ఇలా సమస్య ఏదైనా కౌన్సిలర్‌తో మాట్లాడి, రెగ్యులర్‌గా కౌన్సిలింగ్ తీసుకుని బాగుపడిన వాళ్ళు కోకొల్లలు.

ఎవరు ఏ సమస్యతో వచ్చినా అంతా గోప్యంగా ఉంచుతారు. మరీ డిప్రెషన్‌లోకి వెళ్ళి ఆత్మహత్య, లేక ఇంకెవరినన్నా హాని చేసే ఆలోచనలు ఉన్నట్లు అనుమానం వస్తే వెంటనే హాస్పటల్లో పెట్టి, 24గంటలు మానిటర్ చేస్తారు. మందులు, కౌన్సిలింగ్‌తో తగ్గించటానికి ప్రయత్నిస్తారు.

కాలేజిలో ఇంకో పెద్ద సమస్య - అసాల్ట్ లేదా రేప్‌ని చాలా తీవ్రంగా పరిగణిస్తారు. ఎవరు కంప్లైంట్ చేసినా, దాని గురించి వెంటనే పోలీసులకు చెప్పటం, ఇన్వెస్టిగేషన్ జరుగుతుంది. ఒక్కోసారి కొంతమంది ఈ సౌలభ్యాన్ని తమ స్వార్థానికి కూడా వాడుకుంటారు. బాయ్ ఫ్రెండ్‌తో గొడవపడి, రేప్ చేశాడు అని తప్పుడు కేసులు కూడా పెడతారు.

ప్రియకు కౌన్సిలింగ్ అంటే ఇంట్రస్టుతో సైకాలజీ క్లాస్ తీసుకుంది పోయిన సంవత్సరం. గత నాలుగునెలలుగా ఈ సెంటరులో వాలంటీరుగా చేరింది. వాలంటీరు కాబట్టి జీతం ఉండదు. వారానికి రెండు రోజులు వెళుతుంది. ఒక్కోసారి కౌన్సిలర్స్‌తో కంటే తమ సమవయస్కులతో మనస్సు విప్పి చెప్పగలుగుతారు. అలాంటి వాళ్ళతో స్నేహంగా మాట్లాడుతూ మనస్సులో ఉన్న బాధ తెలుసుకుంటుంది ప్రియ.

"నిన్న సాయంత్రం ఒక అమ్మాయి వచ్చింది. ఏదీ క్లియర్‌గా చెప్పట్లేదు. చాలా డిప్రెషన్‌లో ఉన్నది. అది మాత్రం ఖచ్చితంగా చెప్పగలను. ఇవాళ్ళ మళ్ళీ రమ్మని చెప్పాను. నీకు పరిచయం చేస్తాను. కాజ్యుల్‌గా మాట్లాడు. ముందు నమ్మకాన్ని కల్పించు" చెప్పింది రియ.

గంట తర్వాత ఒక అమ్మాయి చాలా మొహమాటంగా లోపలికి వచ్చింది. బాగా లూజుగా ఉన్న జీన్స్, టీ షర్టు వేసుకుంది. కళ్ళ క్రింద నలుపు, సరిగ్గా దువ్వుకోని జుట్టు - కళావిహీనంగా ఉన్న మొహం.

"హాయ్ నా పేరు ప్రియ. రియ నన్ను నీతో మాట్లాడమని చెప్పింది. నేను ఇక్కడే ఎం.బి.ఏ చదువుతున్నాను. రా ఆ రూంలో కూర్చుని మాట్లాడుకుందాం" నవ్వుతూ పలకరించి లోపలకు తీసుకువెళ్ళింది.

"కాఫీ తాగుతావా? లేక టీ తాగుతావా?" కుక్కీలు ఉన్న ప్లేటు క్లారా వైపు నెడుతూ అడిగింది.

"కాఫీ"

కప్పులో కాఫీ వంపుకుని చేతికి అందించింది ప్రియ.

వేడిగా కాఫీ తాగుతుంటే కొంచెం ధైర్యం వచ్చినట్లుంది. ప్రియ మృదువుగా ప్రశ్నలు అడుగుతుంటే నెమ్మదిగా తన వివరాలు చెప్పింది.

క్లారాకు 19 సంవత్సరాలు. ఒక చిన్న పల్లెటూరు నుండి వచ్చింది. వ్యవసాయ కుటుంబం. చుట్టుపక్కల ఉన్న రెండు మూడు ఊళ్ళకు కలిపి ఓ హైస్కూలు ఉండేది. తల్లిదండ్రులు చాలా స్ట్రిక్ట్ కేథలిక్కులు. హైస్కూలులో మిగతా ఆడపిల్లలు అబ్బాయిలతో చనువుగా ఉండటం, డేటింగ్‌కు వెళ్ళటం చూసి అలా ఉండాలి అని చాలా కోరికగా ఉండేది. కానీ చూడటానికి అతి సామాన్యంగా ఉండటం, చిన్నప్పటినుండి ఇంటి పనులతో బండబారిన చేతులు, ఎండావానకు రాటు తేలిన శరీరం అన్నిటికన్నా ముఖ్యమైనది అబ్బాయిలతో అలా చనువుగా ఎలా మాట్లాడాలో తెలియకపోవటం.

ఇద్దరు అన్నలు కూడా తనకంటే వయస్సులో బాగా పెద్దవాళ్ళు. అంతగా చనువులేదు వాళ్ళతో. పైగా చెల్లెలు చాలా అందగత్తె. వీటన్నిటితో ముడుచుకుపోయేది. క్లారాకు ఉన్న ఏకైక స్నేహం తన పుస్తకాలతోనే. చదువుకుంటుంటే వేరే లోకంలోకి వెళ్ళిపోయేది. ఎలగైనా ఈ చిన్న ఊరునుండి బైట పడి తన తెలివితేటలు గుర్తించే విశాల ప్రపంచంలోకి వెళ్ళాలని, తనను అర్థం చేసుకోని మనుష్యుల మధ్యనుండి పారిపోవాలని విపరీతంగా కష్టపడి చదివింది. మంచి స్కాలర్‌షిప్‌తో కాలేజీ సీటు సంపాదించుకుంది.

క్లారా చెప్పిన దాని బట్టి, చెప్పలేక తడబడిన విషయలోతుల్లోనుండి ప్రియ ఇదంతా సేకరించింది. గంటసేపు మాట్లాడుకున్నారు. చలా బాధ, దుఃఖం, తనమీద తనకే కసి – ఇంత చిన్న వయస్సులో ఇన్ని నెగిటివ్ భావాలు ఉన్నాయంటే, ఇంకేదో బలమైన కారణం ఉండే ఉంటుందని బలంగా అనిపించింది ప్రియకు.

"నాతోకానీ లేదా రియతో కానీ మాట్లాడొచ్చు. నీకు ఎవ్వరితో కంఫర్టబుల్‌గా ఉంటే వారితో మాట్లాడు. కానీ తప్పకుండా రెగ్యులర్‌గా రా" క్లారా బయలుదేరుతుంటే చెప్పింది ప్రియ.

మౌనంగా తలూపి వెళ్ళిపోయింది.

రికార్డు చేసిన టేప్ రియాకు ఇచ్చింది ప్రియ. ఒక రకంగా ఈ కౌన్సిలింగ్ సెంటరుకు రావటం ప్రియకు కూడా మంచే చేసింది. ఇంత మందితో మాట్లాడటం, వాళ్ళ కేసులు వినటం వల్ల, తన జీవితంలో జరిగిన చేదు సంఘటను తీసేసి, పాజిటివ్‌గా ఆలోచిస్తుంది. కొంత సినిసిజం తగ్గింది ప్రియలో.

చిన్నప్పుడు స్కూల్లో ఇచ్చిన కౌన్సిలింగ్‌తో పీడకలలు భయంపోయాయి ప్రియలో.

ఇప్పుడు ఇంకో కొత్త దృక్పథం అలవడింది. జీవితంలోని ఎదురు దెబ్బల్ని ఎలా ఎదుర్కోవాలో ఇదివరకు తెలియక ఒక రకమైన మొండితనం, లేని కఠినత్వాన్ని బైటకు ప్రదర్శిస్తూ – చలాయించుకుంటూ బ్రతికేసింది. నిజమై మానసిక ధైర్యం అంటే ఏంటో, ఆ పరిపక్వత, మానసిక స్థిరత్వం ఎలా సాధించాలో నెమ్మదిగా తెలుసుకుంటుంది.

ప్రతి సమస్యకూడా అనుభవించేవాళ్ళకు చాలా పెద్దదిగానూ, వినేవాళ్ళకు చాలా చిన్నదిగానూ కనిపిస్తుంది. సమస్యల్లో ఉన్న వాళ్ళను చూసి జాలిపడటం కంటే, వారిని అర్థం చేసుకుని, వారి దృక్పథంలో మార్పు తీసుకు వస్తే, సమస్యలను ఎదుర్కునే ధైర్యం ఇవ్వగలితే చాలు.

Being Empathetic is better than Sympathetic.

**"ఇండియన్** అసోసియేషన్ వాళ్ళు స్ప్రింగ్ ఫెస్టివల్ అని చేస్తున్నారంట కదా. ఏంటి స్పెషల్" అడిగింది ప్రియ పిజ్జా తింటూ.

"నువ్వు ఈ మధ్య మరీ బిజీ అయిపోయావు" గునిసింది అనిత.

"ఇంకో నెలరోజుల్లో ఫైనల్స్ ఉన్నాయి కదా. ఉద్యోగం, చదువు.. వీటితో నిజమే చాలా బిజీగా ఉన్నాను. క్యాంపస్ ఇంటర్వ్యూలు అయిపోయాయి కదా. ఆఫీస్ లెటర్స్ కోసం చూస్తున్నాను."

"నీకేంటిలే టాపర్వి, పైగా నువ్వు సమ్మర్ ఇంటర్న్ షిప్ చేసిన కంపెనీలో జాబ్ ఇస్తామన్నారు కదా, ఇంక వేరే ఆలోచన దేనికి" అడిగింది అనిత.

"ఏమో ఇంక వేరే మంచి కంపెనీల్లో వస్తుందేమో ఎవరికి తెలుసు. ఉన్నదాంట్లో తృప్తిపడి ప్రయత్నాలు మానుకుంటామా? సర్లేకానీ ఇంతకీ ప్రోగ్రాం ఏంటి?" కుర్చీలో వెనక్కి వాలి కోక్ తాగుతూ అడిగింది ప్రియ.

"మామూలే సింగింగ్, డాన్సింగ్, ఫాషన్ షో అంట. నేను కూడా  ఒక పాట పాడాలని నిర్ణయించుకున్నా" నవ్వింది అనిత.

"నిజమా నువ్వు పాటలు పాడతావా? ఇన్నాళ్ళ పరిచయంలో నాకు ఎలా తెలియలేదు ఈ విషయం"

"స్టీవ్ బలవంతం చేశాడు. ఓసారి మంచి మూడ్‌లో ఉన్నప్పుడు ఏదో తెలుగుపాట కూనిరాగం తీసా తన దగ్గర. అప్పుడప్పుడు అడిగి పాడించుకునేవాడు భాష భావం అర్ధం కాకపోయినా కానీ. ఈ స్ప్రింగ్ ఫెస్టివల్ సంగతి తెలిసి బాగా గోల చేశాడు పాడమని స్టేజ్ మీద పాడేంత టాలెంట్ లేదు అన్నా వినిపించుకోలేదు. అందుకే ధైర్యం చేస్తున్నా" సిగ్గుగా నవ్వింది అనిత.

"ఒకటి చెప్పనా అనిత. నిన్నూ స్టీవ్‌ను చూస్తుంటే చాలా ముచ్చటగా ఉంటుంది. యు కాంప్లిమెంట్ అండ్ కంప్లీట్ ఈచ్ అదర్. మంచి స్నేహం, గౌరవం, అనురాగం ఉన్నాయి మీ మధ్య. చాలా ఆశ్చర్యంగా ఉంటుంది. ఎక్కడి హైదరాబాదు అమ్మాయి, ఎక్కడ అమెరికా అబ్బాయి ఇలా కలుసుకోవటం ఒక పజిల్‌లోని రెండు వేరు వేరు ముక్కలు అతుక్కున్నట్లు కలిసిపోయి ప్రేమించుకోవటం, తమాషాగా లేదూ?"

ఒకింత గర్వంతో కూడిన చిరునవ్వుతో చెప్పింది అనిత "గ్రాడ్యుయేషన్ అయ్యాక ఉద్యోగంలో సెటిల్ అయ్యి ఇండియా వెళ్ళి అమ్మా నాన్నను చూడాలని ఉంది ఉద్యోగంలో సెటిల్ అవ్వకముందే వెళ్ళేసి వద్దామా అని కూడా ఆలోచిస్తున్నా. పెళ్ళి అని పోరు పెడతారు. స్టీవ్ సంగతి ఎలా చెప్పాలో. నువ్వు వెళ్ళి అమ్మను చూడవా ప్రియ."

"నాకు ఇండియా వెళ్ళాలని లేదు అనిత, కానీ అమ్మను నా గ్రాడ్యుయేషన్‌కు పిలిపిస్తున్నాను అమ్మ కజిన్ ఒకాయన అట్లాంటాలో ఉంటారు ఆయన అమ్మకు విజిటర్ విసా స్పాన్సర్ చేస్తున్నారు. మొట్టమొదటిసారి అమ్మ ఇంత దూరం ప్రయాణం చెయ్యటం. హైదరాబాదులో నా కజిన్‌కు చెప్పా దగ్గరుండి అన్నీ చూసుకోమని. గ్రాడ్యుయేషన్‌కి వస్తే ఇక ఓ ఆరు నెలలు నాతోనే ఉంటుంది."

"చాలా మంచి ఐడియా ప్రియ. నేను కూడా అక్కతో చెప్పా అమ్మా నాన్నను పిలిపిద్దామా అని, కానీ నాన్న రాను అన్నారంట."

"వస్తే కాబోయే అల్లుడిని పరిచయం చేసేదానివా?" చిలిపిగా నవ్వింది ప్రియ.

"ఛ అదేమీ లేదు. స్టీవ్ నేనూ ఎప్పుడూ పెళ్ళి గురించి మాట్లాడుకోలేదు ప్రియ."

"ముందు ఇద్దరూ ఉద్యోగాల్లో సెటిల్ అవ్వండి. పెళ్ళిదేముంది, నెమ్మదిగా మాట్లాడుకోవచ్చు"

ప్రియ ఫోన్ మోగింది - "హాయ్ రియ" నెంబరు గుర్తుపట్టింది ప్రియ

"ప్రియ నీకు క్లారా గుర్తు ఉంది కదా"

"అవును గుర్తు ఉంది. ఓసారి మాట్లాడాను. రెండుసార్లు అపాయింట్‌మెంట్ కాన్సిల్ చేసుకుంది కూడా. ఏమైంది?"

"సూసైడ్ చేసుకుంది. ఇంజనీరింగ్ బిల్డింగ్ పైనుండి దూకేసింది. నేను అక్కడికే వెళుతున్నా. వస్తావా?"

"ఓ మైగాడ్ వెంటనే బయలుదేరుతున్నా" అంటూ లేచి నిల్చుంది ప్రియ.

"అనిత కౌన్సిలింగ్ సెంటరులో కలిసిన ఓ అమ్మాయి సూసైడ్ చేసుకుందంట. నేను వెళ్ళాలి"

"అయ్యో! నేనూ వస్తా పద"

లక్కీగా ఇద్దరూ క్యాంపస్‌లోని అనిత రూంలో ఉన్నారు కాబట్టి పావుగంటలో ఇంజనీరింగ్ బిల్డింగ్ దగ్గరకు వచ్చారు. వీళ్ళు వచ్చేసరికి సెక్యూరిటి కార్స్, దడికట్టినట్టుగా చుట్టూ స్టూడెంట్స్, చాలా హడావిడిగా ఉంది.

రియకు ఫోన్ చేసింది ప్రియ.

"బాడీని తీసుకుని వెళ్ళిపోయారు. కాప్స్ తన రూంలో వెతుకుతున్నారంట. ఎక్కడున్నావు?" అడిగింది రియ.

ఓ పక్కకు వచ్చి నిలబడి గుర్తులు చెప్పింది.

"చాలా అప్‌సెట్‌గా ఉంది. తన సమస్య ఏంటో సరిగ్గా తెలుసుకోలేకపోయాం. ఎందుకంత తీవ్రమైన నిర్ణయం తీసుకుందో? తనకు సహాయం చెయ్యలేకపోయాను" వస్తూనే అంది రియ.

"చాలా బాధలో ఉన్నది అని మాత్రం అర్థం అయ్యింది. కొత్త ప్రదేశం స్నేహితులు లేక ఒంటరితనంతో డిప్రెషనేమో అనుకున్నా. మనం కూడా కాప్స్‌తో మాట్లాడాలి, మనకు తెలిసినదంతా చెప్పాలి కదా" అడిగింది ప్రియ.

"అవును నేను చూసుకుంటాలే అంతా. నీ ఫోన్ నెంబరు ఇస్తాను. నీతో కూడా మాట్లాడతారేమో. ఇక ఇక్కడ ఉండి చేసేది ఏమీ లేదు పదండి వెళదాం" భారమైన గొంతుతో చెప్పింది రియ.

మనసంతా కలచివేసింది అందరికి, ముఖ్యంగా ప్రియ చాలా తల్లడిల్లింది. ఎంతో నిస్సహాయంగా అనిపించింది. తను సహాయం చెయ్యలేకపోవటం వలన క్లారా ఇంత దారుణమైన నిర్ణయం తీసుకుందేమో అన్న బాధ కుదిపేస్తోంది. పదే పదే ఆ పంతొమ్మిదేళ్ళ అమ్మాయి కళ్ళల్లోని నిస్తేజం, దైన్యం గుర్తుకు వస్తూ రాత్రంతా నిద్రపోలేకపోయింది ప్రియ.

యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఈ ఆత్మహత్య ఉదంతంతో అటు మీడియా ఇటు పోలీసులు తీవ్రంగా ఫోకస్ పెట్టారు. ఏ ఇద్దరు కలిసినా ఇదే మాట్లాడుకోసాగారు.

మొదటి రెండురోజుల ప్రాథమిక దర్యాప్తులో భాగంగా క్లారా రాసుకున్న డైరీలు అన్నీ తీసుకెళ్ళి, రియ ప్రియలతో కూడా మాట్లాడారు.

రాత్రి కాండిల్ లైట్ విజిల్ అని పెట్టారు, ఆ అమ్మాయికి తెలిసిన వాళ్ళందరూ, ఎక్కడైతే పడి చనిపోయిందో ప్రదేశంలో మౌనంగా కాండిల్స్ పట్టుకుని నిల్చున్నారు. ఎవరికి తోచిన రీతిలో మౌనంగా ఆమె ఆత్మశాంతికి ప్రార్థించారు.

పంతొమ్మిదేళ్ళ చిరుప్రాయం, చూసిన జీవితం చాలా తక్కువ, ఇంకా అనుభవించాల్సింది, సాధించాల్సింది ఎంతో ఉంది. ఎందుకు ఇంత తొందర పడింది? ఏం జరిగింది తన జీవితంలో ఇంత విరక్తి చెందటానికి. ఏదో చెప్పాలని కౌన్సిలింగ్ కోసం వచ్చింది, మరి పరిష్కారం దొరికేదాకా ఎందుకు ఆగలేకపోయింది?

ఆలోచనలతో సతమతమవుతున్న ప్రియ, భుజం మీద చెయ్యిపడేసరికి ఉలిక్కిపడింది.

"ప్రియ! క్లారా వాళ్ళ పేరెంట్స్ నీతో మాట్లాడాలనుకుంటున్నారు. పర్లేదా ఇప్పుడు" నెమ్మదిగా అడిగింది రియ.

"ఆ పర్లేదు. ఎక్కడున్నారు వాళ్ళు"

"రా వెళదాం"

కాయకష్టంతో బ్రతుకు బండిని ఈడుస్తున్న అలసటో, దానికి తోడు ఎంతో తెలివిగలది అనుకున్న కూతురి అర్థాంతరపు మృత్యువు ఇంకా కృంగదీసిందో వాళ్ళ మొహాల్లో దైన్యం చూసి కడుపులో మెలిపెట్టినట్లు అయ్యింది ప్రియకు.

"ఐ యామ్ రియల్లీ సారీ ఫర్ యువర్ లాస్" క్లారా తండ్రికి చెయ్యి అందిస్తూ అన్నది ప్రియ.

క్లారా తల్లికి కూడా చెయ్యి అందుకోబోతుంటే, ఆవిడ దగ్గరగా వచ్చి హత్తుకుంది. సాటి మనిషి ఓదార్పుతో, ఆ ఆలింగనంలో లేని ధైర్యాన్ని కూడగొట్టుకుంటూ ముందుకు సాగగలిగే శక్తిని తెచ్చుకున్నట్లుగా.

లోపలనుండి వచ్చే వెక్కిళ్ళను దిగమింకుంటూ పక్కకు తొలిగింది ఆవిడ. ఓదార్పుగా ఆవిడ భుజం చుట్టూ చెయ్యివేశాడు భర్త.

"క్లారా కౌన్సిలింగ్‌కు వచ్చిందని మాకు తెలిసింది. నీతో మాట్లాడిందని రియ చెప్పింది. ఒక్క కారణం దొరికినా బాగుండు, సమాధాన పరచుకుంటా మనస్సును" మళ్ళీ వెక్కిళ్ళు పెట్టింది క్లారా తల్లి మరియా.

"రండి పక్కన మెట్లమీద కూర్చుందాం" అంటూ తనకు తెలిసినదంతా చెప్పింది ప్రియ.

"ఎవర న్నా అబ్బాయి గురించి చెప్పిందా?" సాలోచనగా అడిగాడు తండ్రి రాబర్ట్.

"లేదు కానీ అనుమానం వచ్చింది. మళ్ళా రమ్మని చెప్పాం. రెండుసార్లు అపాయింట్ మెంట్ కాన్సిల్ చేసింది. మళ్ళా కలవలేకపోయాను"

"రూమ్మేటు చెప్పింది. ఎవరో టిమ్ అనే అబ్బాయి గురించి చాలా చెప్పేదంట. పోలీసులకు కూడా అదే విషయం చెప్పాం" రాబర్ట్ అన్నాడు.

"ఎప్పుడూ చదువే లోకంగా ఉండేది. ఇంట్లో నాకు ఎంత సహాయం చేసేదో ఎందుకిలా చేసింది. బలవంతాన దేవుడిచ్చిన ప్రాణాన్ని తీసేసుకుంటే ఆ భగవంతుడు క్షమించడు" భర్తను పట్టుకుని ఏడ్చేసింది మరియా.

"మేము రేపు బాడీని తీసుకుని మా ఊరు వెళ్ళిపోతాం. ఇక అంతా అయిపోయింది ఇక్కడ" అని చెప్పి ఆ దంపతులు ఒకళ్ళనొకళ్ళు పట్టుకుని వెళుతుంటే కన్నీళ్ళు ఆగలేదు ప్రియకు.

క్లారా చనిపోయిన వారం రోజులకు తిరిగి కౌన్సిలింగ్ సెంటరుకు వెళ్ళింది ప్రియ.

"ఏంటి రియ అందరూ గోలగా చెప్పుకుంటున్నారు, క్లారా రేప్ చేయబడింది అందుకే ఆత్మహత్య చేసుకుందని. సాయంత్రం ర్యాలీ ఉందంటగా"

"అవును మీడియా వాళ్ళ ఇన్వెస్టిగేషన్ సగం, ఏవేవో ర్యూమర్లు. క్లారా మీద రేప్ జరిగిందని, తను కౌన్సిలర్లతో చెప్పినా పట్టించుకోలేదని గొడవ మన సెంటరు మీద. రూమ్మేటు ఏదో చెప్పిందంట మీడియాతో, కాంపస్ ఛీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌ని తీసుకువెళ్ళారంట మళ్ళా ప్రశ్నించటానికి" తల పట్టుకుని చెప్పింది రియ.

పోలీసుల విశ్వప్రయత్నంతో కథ మొత్తం బైటకు వచ్చింది.

క్లారాకు మొదటినుండి ఒక్క చదువు విషయంలో తప్ప, మిగతా అన్ని విషయాల్లోనూ ఆత్మనూన్యతా భావం, అభద్రత ఎక్కువ. కాలేజీలో టిమ్ అనే తన క్లాస్ మేట్ బాగా మాట్లాడుతుంటే చాలా మురిసిపోయింది చదువులో ఆమె బాగా తెలివిగలదని, నోట్సు హోం వర్కులో సహాయం కోసం వాడుకుంటున్నాడని గ్రహించలేకపోయింది, తనంటే అతనికి చాలా ఇష్టం అనుకుని చనువుగా ఉండేది. ఓ రోజు అతను పార్టీకి పిలిచి, వద్దన్నా వినిపించుకోకుండా తాగించి రూంకు తీసుకువెళ్ళాడు. టిమ్ ఇంకా ఇద్దరు స్నేహితులు ఆమెను అనుభవించి ఫోటోలు కూడా తీశారు. మర్నాడు స్పృహ వచ్చాక తన పరిస్థితి చూసుకుని గుండె ముక్కలయ్యింది క్లారాకి.

టిమ్‌ని నిలదీస్తే, గట్టిగా నవ్వేసి "అందరం ఎంజాయ్ చేశాం. నీకేమీ గుర్తు లేదా ఛిల్" అన్నాడు.

ఏమి చెయ్యాలో తెలియక మర్నాడు సెక్యూరిటీ ఆఫీసులో కంప్లైంటు చేసింది. ఆఫీసరు కూడా నీ దగ్గర సాక్ష్యం ఏమున్నది అని అడిగాడు. ఇక ఏమీ చెయ్యాలో తోచలేదు, రూమ్మేటు ఏంటి డిప్రెస్డ్ గా ఉన్నావని అడిగి కౌన్సిలింగ్‌కు వెళ్ళమని సలహా ఇచ్చింది. ఎలా తెలిసిందో టిమ్‌కు సెక్యూరిటీ ఆఫీసరు దగ్గరకు వెళ్ళటం. ఈ విషయం ఇంతటితో ఆపకపోతే ఫోటోలు కాలేజీలో పంచుతానని బెదిరించాడు.

క్లారా చాలా బెదిరిపోయింది. తనది చాలా సనాతనమైన కాథలిక్ కుటుంబం. పెళ్ళికి ముందు కన్యగా ఉండటం ఎంత ముఖ్యమో వాళ్ళ అమ్మ చిన్నప్పటి నుండి నూరిపోస్తుండేది. అలాంటిది తను ఒంటిమీద స్పృహ లేకుండా ముగ్గురు అబ్బాయిలతో ఉన్న ఫోటోలు బైటకు వస్తే ఎలా అన్న భయంతో, మానసిక సంఘర్షణ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంది.

ఆమెకు తెలియని విషయం ఏంటంటే, టిమ్ క్లారా డ్రింక్‌లో మత్తుమందు కలిపాడని, దానివలన ఏమి జరుగుతుందో తెలియనంతగా స్పృహ కోల్పోయిందని. కేవలం వాళ్ళ సరదా తీర్చుకోటానికి ఒక అమాయకురాలిని బలితీసుకున్నారు.

రేప్ చెయ్యటమే కాకుండా ఫోటోలతో ఆమెను బెదిరించి పరోక్షంగా ఆమెను ఆత్మహత్యకు ప్రేరేపించినందుకు టిమ్, అతని స్నేహితులను అరెస్టు చేశారు. ఒక అమ్మాయి కంప్లైంటు చేస్తే నిజనిజాలు ఏంటో పరిశోధించకుండా ఒదిలేసినందుకు, సెక్యూరిటీ ఆఫీసరును ఉద్యోగం నుండి తొలగించింది యూనివర్సిటీ యాజమాన్యం.

ఫైనల్స్ పరిక్షలు నెలరోజుల్లోకి వచ్చేశాయి. చదువుకోటానికి 24గంటలు సరిపోవట్లేదు.

ఫ్రెండ్స్ అందరూ శుక్రవారం సాయంత్రం కలిసారు కాసేపు రిలాక్స్ అవుదామని.

"నాకు కాలిఫోర్నియాలో జాబ్ వచ్చింది. గ్రాడ్యుయేషన్ అయ్యాక అమ్మతో కలిసి ఛలో కాలిఫోర్నియా. మళ్ళా మనందరం ఎప్పుడు కలుస్తామో" అన్నది ప్రియ.

"నేను కూడా అటే చూసుకుంటున్నా ప్రియ. ఈ చలి నావల్ల కాదు. ఇంటర్వ్యూలు బాగానే చేశాను. వెయిట్ చేస్తున్నా కన్‌ఫర్‌మేషన్ కోసం" చెప్పాడు ఆనంద్.

"మీ లవ్ బర్డ్స్ సంగతేంటి?" నవ్వుతూ అడిగింది ప్రియ.

"చికాగోలో జాబ్ కన్ఫర్మ్ అయ్యింది. మా డాడ్‌కి ఈ మధ్య ఆరోగ్యం సరిగ్గా ఉండటంలేదు. దగ్గర్లోనే ఉండటం మంచిదికదా" బీర్ తాగుతూ చెప్పాడు స్టీవ్.

"అమ్మా నాన్న వస్తే బాగుండేది గ్రాడ్యుయేషన్‌కు, కానీ ఒప్పుకోలేదంట, అక్క చెప్పింది. నాకు ఇప్పుడే ఇండియా వెళ్ళటం కుదిరేటట్లులేదు. బే ఏరియాలో జాబ్ ఫైనల్ అయ్యేట్లుంది. H1 - B కూడా చేస్తామన్నారు. ఇంకేమన్నా ఆఫర్లు వస్తాయేమో చూడాలి" కొంచెం దిగులుగా అన్నది అనిత.

"డోన్ట్ వర్రీ మంచిదే వస్తుందిలే" ధైర్యం చెప్పింది ప్రియ.

"గ్రాడ్యుయేషన్ లోపల నచ్చేది ఏదీ రాకుంటే, అక్క దగ్గరకు వెళ్ళి ట్రై చేసుకుంటా"

"పరిక్షల హడావుడి, వెంటనే గ్రాడ్యుయేషన్ ఇక ఎవరి జీవితాల్లో వాళ్ళం. ఎప్పుడు కలుసుకోగలుగుతామో ఏంటో. కేవలం ఫోన్లు, లేకుంటే మెయిల్ అన్నా ఇస్తారా?" అన్నాడు స్టీవ్.

"అరే ఇంత సెంటీ అవ్వకండి. కమాన్ అందరం మంచి స్నేహితులం. We will deginitely be in touch. ఒకటి మాత్రం చెప్పాలని ఉంది. మీ అందరూ నా జీవితంలో అతి ముఖ్యమైన వ్యక్తులు. మనం భవిష్యత్తులో ప్రతిరోజూ ఫోను చేసుకున్నా, లేకున్నా - అందరం ఒకరి మనస్సులో ఒకరం నిరంతరం మెదులుతూనే ఉంటాం, ఎవ్వరినీ తీసెయ్యలేము మర్చిపోలేము" అనిత భుజం చుట్టూ చెయ్యివేసి అన్నది ప్రియ.

ఆ మాటల్లోని నిజాయితీ, గొంతులోని తడి అందరి మనసుల్ని తాకి మౌనంగా ఉండిపోయారు.

**"అమ్మ వస్తుంది కదా.** అందరిని పరిచయం చేస్తాను. అందరం బోలెడన్ని ఫోటోస్ తీసుకోవాలి. అమ్మకు ఎప్పుడూ మీ గురించి చెపుతాను కదా, తనకు మీరందరూ బాగా తెలుసు" మూడ్ మార్చాలని గబగబా మాట్లాడింది ప్రియ. "మీ అక్క బావా వస్తున్నారుగా అనిత?"

"అవును వస్తారు. అక్క కొంచెం బెంగగా ఉంది. పెళ్ళి అయ్యి ఐదేళ్ళు అయినా ఇంకా పిల్లలు పుట్టలేదని. డాక్టరుకు చూపించుకో అని అత్తగారు వాళ్ళు గోలంట. ఏమి వినాల్సివస్తుందో అని అక్క భయపడుతుంది"

"సరే నేను ఇక వెళతాను, చదువుకోవాలి" లేచి నిలబడుతూ చెప్పింది ప్రియ.

"స్టీవ్ నాతో కాసేపు కూర్చుంటావా?" మూడీగా అడిగింది అనిత.

"ష్యూర్ నీతూ" లేచి నిల్చున్న స్టీవ్ మళ్ళా కూర్చున్నాడు.

అనిత తన అక్క విషయంలో బాధపడుతుందని అర్థం అయ్యింది ప్రియకు.

"ఎందుకో ప్రతి చిన్నదానికి అంత బాధపడుతుంది అనిత, పిల్లలు పుట్టకపోవటం మరీ అంత పెద్ద సమస్యా? ఊరికే దిగులు పడితే ఏం వస్తుంది, పరిష్కారం ఆలోచించాలి కానీ" రూంకు వెళుతూ అనుకుంది ప్రియ.

గ్రాడ్యుయేషన్ రోజున ప్రొద్దున్నే ప్రియ, తల్లి శారద రెడీ అయ్యి అనిత దగ్గరకు వచ్చారు.

"అమ్మా, ఇదిగో నా బెస్ట్‌ఫ్రెండ్ అనిత. వాళ్ళ అక్క కవిత బావ ప్రసాద్ గారు. మా అమ్మ శారద" అందరిని ఒకరినొకరికి పరిచయం చేసింది.

"నమస్తే ఆంటీ పాపం నిన్నే వచ్చారు ఇంత ప్రయాణం చేసి, బడలికగా ఉందేమో కదా?"

"పర్లేదు బాగానే ఉన్నా. మీ అందరి గురించి ఎప్పుడూ చెపుతుంటుంది ప్రియ. దేశంకాని దేశంలో ఇంత మంచి స్నేహితులు దొరకటం ఎంత అదృష్టం" ఎంతో ఆప్యాయంగా అంది శారద.

ప్రియకు అంత అందం ఎవరినుండి వచ్చిందో అర్థం అయ్యింది శారదను చూస్తే.

దాదాపు 50 సంవత్సరాలు ఉండొచ్చు. ప్రియ వయస్సు బట్టి అంచనా వేస్తే. కానీ ఓ పదేళ్ళు చిన్నగా ఉన్నారు. పచ్చటి రంగు, అందమైన ముఖవర్చస్సు. చిరునవ్వే పెద్ద అలంకారం, పెద్ద జడ. తెలుపుకు గులాబీరంగు అంచు ఉన్న పోచంపల్లి పట్టుచీర, మెడలో మంగళసూత్రం ఓ చేతికి జత గాజులు, ఓ చేతికి వాచి, చిన్న దుద్దులు. ఎంతో అందంగా హుందాగా ఉన్నారావిడ.

"మేము ముందే వెళ్ళాలి. మీరందరూ కలిసి రండి. అమ్మా నేను చెప్పింది గుర్తుంది కదా. సెర్మని అయిపోయాక కలుస్తాం మిమ్మల్ని" అంటూ హడావుడిగా అనితను లాక్కుంటూ వెళ్ళింది ప్రియ.

"అయ్యో ఒక ఫోటో తీసుకుందాం అనుకున్నా, ఒకటే హడావుడి పెట్టింది ప్రియ" నొచ్చుకుంది శారద.

"పర్లేదాంటీ అంతా అయిపోయాక టైం ఉంటుంది మనకు. రండి మనం బ్రేక్‌ఫాస్ట్ తిని స్టేడియంకు వెళదాం" అంది కవిత.

కాలేజీ స్టేడియంలో గ్రాడ్యుయేషన్ ఫంక్షన్ జరుపుతున్నారు. అంతా కోలాహలంగా ఉంది. గ్రాడ్యుయేట్ అయ్యేవాళ్ళందరు గౌన్లు, తలపై టోపీతో వాళ్ళకోసం వచ్చిన బంధువులు, పూల బొకేలు, బెలూన్లు అంతా కళ్ళు విప్పార్చుకుని చూస్తూ ఉండిపోయింది శారద.

"మీ అమ్మా నాన్నా కూడా రావచ్చేమో అని చెప్పింది ప్రియ, కుదరలేదామ్మా?" అడిగింది శారద.

"ఈ మధ్య నాన్నకు ఆరోగ్యం బాగోవటం లేదాంటి. అనితకు చెప్పలేదు. ఎగ్జామ్ ముందర ఎందుకు టెన్షన్ అని. హై బీపి, షుగర్. కంట్రోలు అయ్యేదాక ప్రయాణాలు వద్దన్నారు డాక్టర్."

"నేను కూడా రాననే అన్నానమ్మా. ఒక్కదాన్నే ఎప్పుడూ దూరప్రయాణాలు చెయ్యలేదు. కారులో వెళ్ళి వచ్చేంత దూరమే నా ప్రయాణాలన్నీ. కానీ ప్రియ చాలా గొడవ చేసింది. ఇప్పట్లో ఇండియా రానని నన్ను తనతో కొన్నాళ్ళు ఉండమని గోల. ఇప్పటికే రెండేళ్ళయ్యింది కదా తనను చూసి, బాగా బెంగగా ఉంది. అందుకే ధైర్యం చేసి వచ్చేశా తన తెలివితేటలకు మంచి ఉద్యోగం కూడా దొరికింది. ఒక మంచి అబ్బాయిని చూసి తనకు పెళ్ళి చేస్తే నాకు చాలు. ఇక ఏ కోరికలు లేవు. తను సంతోషంగా కాపురం చేసుకుంటుంటే చూడాలి" గొంతు గద్గదికం అవుతుంటే మాటలు ఆపేసింది శారద.

ఏం మాట్లాడాలో అర్ధంకానట్లు మౌనంగా ఉండిపోయారు కవిత, ప్రసాద్.

ఇంతలో గ్రాడ్యుయేట్ అయ్యేవాళ్ళు వరసగా వారికి కేటాయించిన కుర్చీల్లో కూర్చోవటం మొదలుపెట్టారు.

"వీళ్ళల్లో మనపిల్లలు ఎలా కనిపిస్తారు. అందరూ ఒకేరకంగా ఉన్నారు ఇక్కడనుండి చూస్తే" ప్రియ కోసం వెతుకుతూ అన్నది శారద.

"ఇప్పుడు కష్టమేనండి. మధ్యాహ్నం వీళ్ళ డిపార్టుమెంటు గ్రాడ్యుయేషన్ వేరే వుంది కదా అప్పుడు స్టేజి మీదకు వెళతారు. చాలామంది ఉంటారు కదా ఇప్పుడు అందుకని స్టేజి మీదకు పిలవరు" ప్రసాద్ చెప్పాడు ప్రోగ్రాం పేపర్ చూస్తూ.

స్టేట్ గవర్నర్ Commemoration Speechతో మొదలయ్యి స్పెషల్ అవార్డ్స్, వేరే ఎవరెవరివో స్పీచులు ఒక రెండు గంటల కార్యక్రమం. అందరూ బైటకు వచ్చాక ఎక్కువసేపు ఎదురు చూడకుండానే ప్రియ, అనిత వచ్చారు.

ప్రియ శారదను గట్టిగా కౌగిలించుకుని "చాలా సంతోషంగా ఉందమ్మా" అంది.

"నాకు కూడా బంగారం" నుదుటిమీద ముద్దు పెట్టుకుంది శారద.

స్టీవ్ కూడా వచ్చాడు అతని ఫ్యామిలీతో. అందరూ రకరకాల ఫోజుల్లో ఫొటోలు దిగారు.

ప్రియను అంత సంతోషంగా చూసి ఉద్వేగాన్ని ఆపుకోలేక కన్నీళ్ళు పెట్టుకుంది శారద.

"సారీ చాలా ఎమోషనల్ అవుతున్నాను. మీ అందరికి కంగ్రాట్స్" కన్నీళ్ళు తుడుచుకుంటూ చెప్పింది శారద.

"అమ్మ ఎమోషనల్ అవ్వకపోతే ఆశ్చర్యపోవాలి, అయితే కాదు. మా మామ్‌ని చూడండి ఎన్ని టిష్యూలు పారేసిందో ప్రొద్దుటినుండి" నవ్వాడు స్టీవ్.

అందరూ నవ్వేశారు. స్టీవ్ వాళ్ళ పేరెంట్స్ అనితతో చనువుగా మాట్లాడటం కవిత ఆశ్చర్యంగా గమనించింది.

"రండి అందరం లంచ్ తినేసి మన డిపార్ట్‌మెంట్ గ్రాడ్యుయేషన్‌కి వెళ్ళాలి కదా. సాయంత్రం అందరం అనిత రూం దగ్గర కలుద్దాం" అంది ప్రియ.

"అనితా కంగ్రాట్స్ మళ్ళీ చెపుతున్నా నీకు. స్టీవ్ వాళ్ళ సెర్మనీ చూసుకుని మేం వెళ్ళిపోతాం. రాబర్ట్‌కి కొంచెం నలతగా ఉంది. మళ్ళీ ఎప్పుడన్నా కలుస్తాం నిన్ను" అని చెప్పి, మిగతా అందరికి బై చెప్పి మేరి వాళ్ళు వెళ్ళిపోయారు.

"రేపు బయలుదేరి కాలిఫోర్నియా వెళ్ళిపోతున్నా. మళ్ళీ ఎప్పుడు కలుస్తామో అందరం. ఏంటో బెంగగా ఉంది. నాలాంటిదాన్ని కూడా సెంటీ చేసేశావు నువ్వు" దిగులుగా అంది ప్రియ.

ప్రొద్దుటీనుండీ విపరీతంగా బిజీగా ఉండటంతో అందరూ బాగా అలసిపోయారు. కవిత, ప్రసాద్ దగ్గర్లో వున్న హోటల్‌లో రూం తీసుకున్నారు. ప్రొద్దున్నే సామాన్లు అన్నీ తీసుకుని డెట్రాయిట్ వెళతారు అనితతో. శారదను తన రూములో దింపేసి అనిత దగ్గరకు వచ్చింది ప్రియ.

ప్రియకు కాలిఫోర్నియాలోని శాండియాగోలో ఉద్యోగం కన్ఫర్మ్ అయ్యింది. ఆనంద్‌కు కూడా అక్కడే వచ్చింది. ఇద్దరూ శారదతో కలిసి శాండియాగోకు కారులో వెళదామని నిర్ణయించుకున్నారు. మధ్యలో ఏమన్నా చూడాల్సిన ప్రదేశాలు చూసుకుంటూ శారదకు అమెరికా చూపిస్తూ నిదానంగా వారం రోజులు ప్రయాణం చెయ్యాలని నిర్ణయించుకున్నారు.

అనిత మాట్లాడకపోవటం చూసి "స్టీవ్, నువ్వూ ఫ్యూచర్ గురించి ఏమన్నా ఆలోచించారా?" రెట్టించింది ప్రియ.

"ప్రత్యేకంగా పెళ్ళి అని ఏమీ ఆలోచించలేదు, అసలా ఆ టాపిక్ మాట్లాడుకోలేదు. కెరియర్‌లో సెటిల్ అయ్యాకే పెళ్ళి అని తన అభిప్రాయం అనుకుంటా. కానీ మా ఇంట్లో షంటటం మొదలుపెట్టారు."

"ఏదో ఒకటి స్పష్టంగా మాట్లాడుకుని ఒక అభిప్రాయానికి రావాలి కదా అనిత. నువ్వు అడుగు స్టీవ్‌ని. సీరియస్‌గా మాట్లాడు. ఇది నీ భవిష్యత్తు అనిత. ఎందుకు ముసుగులో గుద్దులాట. నీకు ఏం కావాలో కనీసం నీకన్నా స్పష్టత ఉండాలి కదా" కొంచెం గట్టిగా చెప్పింది ప్రియ.

"నన్ను వదిలేస్తాడనా నీ అనుమానం"

"అలాక్కాదు అనిత. తనేదో నీతో ఎంజాయ్ చేసి వదిలేస్తాడు అనటంలేదు. స్టీవ్‌ను ప్రేమిస్తున్నావు తనే నీ జీవితం అని నిర్ణయించుకున్నప్పుడు కాస్త ఓపెన్‌గా మాట్లాడుకోవాలి కదా. నువ్వు అందరిలో మంచితనమే చూస్తావు. నేను కొంచెం సినికల్. లైఫ్ నువ్వు అనుకున్నట్లు బ్లాక్ అండ్ వైట్‌లాగా స్పష్టంగా ఉండదు. చాలా ఎక్కువ శాతం గ్రే గా ఉంటుంది. స్టీవ్‌కు ఇక్కడే చికాగోలో జాబ్ వచ్చింది. నీకు చికాగోలో రాలేదు. ట్రై చేస్తున్నావు. రాకుంటే? ఇద్దరూ కలుసుకోవటం, ఇప్పటిలాగా రోజూ మాట్లాడుకోవటం తగ్గిపోవచ్చు."

అనిత ఏమీ మాట్లాడలేదు.

"నిన్ను భయపెట్టాలని కాదు అనిత. నీకు కూడా ఇంట్లో ఒత్తిడి మొదలయ్యింది.  మరి స్పష్టత లేకుంటే ఎవ్వరికీ ఏమీ చెప్పలేవు."

"అక్కతో చెప్పాను స్టీవ్ అంటే ఇష్టం అని. గట్టిగా మందలించింది, నేను ఏదో ఎట్రాక్షన్‌లో ఉన్నానని అనుకుందేమో. నేను కూడా ఎక్కువ ఏమీ చెప్పలేదు. నేను నా ప్రేమ గురించి ఎక్కువగా ఏమి చెప్పినా ఏదో కారణాలు చెపుతారు. అందుకే ఉద్యోగంలో సెటిల్ అయ్యాక ముందు స్టీవ్‌తో మాట్లాడి తరువాత ఇంట్లో చెపుతాను."

ప్రియ ఫోన్ మోగింది "ఎక్కడున్నావు ప్రియ" ఆనంద్ ఫోన్ చేశాడు.

"అనిత దగ్గర ఉన్నాను. ఏంటి విశేషం?"

"ఏం లేదు నేను స్టీవ్ దగ్గర ఉన్నాను. ఓసారి అందరం కలిసి క్యాంపస్ అంతా తిరుగుదామా అని అడుగుతున్నాడు"

"సరే ఇద్దరూ ఇటు వచ్చేయండి" అని ఫోన్ ఆఫ్ చేసింది ప్రియ.

"రా అనిత బైటకు వెళదాం, నీ హీరో వస్తున్నాడు"

"ఏంటో చాలా బెంగగా ఉంది ప్రియ. కొత్త జీవితం ఎటువైపు వెళుతుందో అనిత మొహం దిగులుగా అయిపోయింది.

"ఏమైంది నీకు ఎప్పుడూ పాజిటివ్‌గా, ఉత్సాహంగా ఉంటావు? ఇవాళ్ళ ఏంటో నిరాశగా ఉన్నావు ఇందాకటినుండి గమనిస్తున్నాను"

"తెలియదు ప్రియ. రాబోయే తుఫానుకు సూచన అంటారే అలాంటిదే ఏదో?"

"ఛ ఏంటా మాటలు. నిన్ను బెదిరించాలనో భయపెట్టాలనో ఇందాక స్టీవ్ గురించి మాట్లాడలేదు నేను అనిత. నువ్వు నాకు అత్యంత ఆప్తురాలివి. నీకు మంచి జరగాలనే కదా. నువ్వు సంతోషంగా ఉండాలని" ఆనంద్, స్టీవ్ రావటం చూసి మాటలు ఆపేసింది ప్రియ.

"హాయ్ గర్ల్స్" అంటూ దగ్గరకు వచ్చారు ఇద్దరూ.

"హాయ్ నీతూ! ఏంటి నీ ఫేస్ ఇలా ఉంది. ఆర్యూ ఓకే" దగ్గరగా హత్తుకుంటూ అడిగాడు స్టీవ్.

"యా! ఐ యామ్ ఫైన్" బలవంతాన నవ్వింది అనిత.

"ఓకే గైస్. ఇంకో రెండుగంటలకంటే ఉండలేను. అమ్మ ఒకత్తే ఉంది రూంలో. ఏం చేద్దాం?"

"క్యాంపస్ అంతా కారులో ఓ రౌండ్ వేద్దాం. మళ్ళీ ఎప్పుడు వస్తామో కదా ఇక్కడికి" అన్నాడు ఆనంద్.

"ఎంత సెంటీ అయిపోయారు అంతా ఇవ్వాళ" నవ్వింది ప్రియ.

రాజి వాళ్ళ కాఫీ షాపు చూడగానే "రాజి ఎలా ఉందో" అన్నది అనిత.

"అస్సలు అమెరికా వచ్చిందో రాలేదో ఇంకా"

"ఈ మధ్య వాళ్ళ పిన్నికి ఫోన్ చేశాను. ఇంకా ఆరునెలలన్నా పడుతుందేమో అన్నారు. అక్క నెంబరు ఇచ్చాను."

"ఇప్పుడే చెపుతున్నా అందరం టచ్‌లో ఉండాలి. ఉద్యోగరీత్యా ఎక్కడ ఉన్నా సరే, ఫోన్‌లో ఎప్పుడూ మాట్లాడుకోవాలి సరేనా?" అందరివంక చూస్తూ చెప్పాడు ఆనంద్.

"ఎందుకు అన్నిసార్లు చెపుతావు. అందరం మంచి స్నేహితులం, ఎందుకు దూరం అవుతాం" భుజం తట్టాడు స్టీవ్.

రెండు గంటలు గిర్రున తిరిగిపోయాయి.

"ఇంక బయలుదేరుతా నేను. రేపు ఫైనల్ ప్యాకింగ్, రూం క్లీనింగ్ అంతా అయ్యి మేము బయలుదేరేసరికి కనీసం తొమ్మిది అవుతుందేమో నేను ఫోన్ చేస్తా ఆనంద్ బయలుదేరేముంది. వారంరోజుల రోడ్ ట్రిప్ భలే ఉంది తలచుకుంటే" చెప్పింది ప్రియ.

"అంతదూరం డ్రైవ్ చేసుకుంటూ వెళుతున్నారు. మధ్య మధ్యలో ఫోన్ చేస్తూ ఉండు" ఖచ్చితంగా చెప్పింది అనిత.

"సరేలే! స్టీవ్ మా అనితను బాగా చూసుకో. ఇక్కడే ఉద్యోగం వెతుకు తనకు కూడా" అనితను, స్టీవ్‌ను ఆప్యాయంగా హత్తుకుంది ప్రియ

కాలచక్రం తిరుగుతూనే ఉంటుంది. ఈ చక్రభ్రమణంలో వెలుగు చీకటి, సంతోషం, దుఃఖం, ఆశ, నిరాశ ఎన్నో మార్పులు. జీవితం కొత్తగా మొదలెడుతున్న ప్రాయంలో ఎన్నో ఆశలు, భవిష్యత్తును తమకు అనుగుణంగా మలచుకోగలమన్న ధీమా ప్రతి ఒక్కరిలోనూ ఉంటుంది.

మంచి స్నేహంతో మమేకమైన వీరందరి జీవితం ఎటువైపు తిరుగుతుందో వేచి చూడాలి. ముగ్గురు ఆడపిల్లలు, మూడు విభిన్న మనఃస్తత్వాలు నుదిటి గీతలను వాళ్ళే దిద్దుకోగలరా? సంతోషంగా ఉండగలరా? ఏమో?

***పదిహేను సంవత్సరాల తరవాత...***

***రాజి***

వేంకటేశ్వరస్వామికి అభిషేకం జరుగుతుంటే భక్తిగా చేతులు జోడించి మైమరచి చూస్తుంది రాజి. నెలలో మొదటి శనివారం రోజు ప్రత్యేక అభిషేకం, అలంకరణ చేస్తారు.

ఎంతో ప్రశాంతంగా ఉంటుంది రాజికి గుడిలో ఉన్నంతసేపు. మన సంస్కృతిలో ఉన్నదో, వేదమంత్ర ఘోషలో ఉన్నదో, ఆ గుడి పవిత్రతలో ఉన్నదోకానీ ఆ దేవదేవుని చూస్తుంటే, ప్రతి చిన్న కష్టం చెప్పుకుంటాం, ప్రతి ఆనందాన్ని పంచుకుంటాం. ఇక్కడికి వస్తే ఇంత విశాల ప్రపంచంలో నేను ఒంటరి కాదు అన్న భరోసా.

పెళ్ళి అయ్యి పదహారు సంవత్సరాలు అయ్యింది. అయినా మానసికంగా ఒంటరే. పెళ్ళితో తన జీవితంలోకి భర్తతో పాటు ఇద్దరు పిల్లలు వచ్చారు. ఎనిమిదేళ్ళ శ్వేత, నాలుగేళ్ళ సాత్విక్.

వేణుది ఒక విచిత్రమైన మనఃస్తత్వం. ఇండియన్ గ్రోసరీ స్టోర్ ఉండటంతో అతనికి పరిచయాలు ఎక్కువే. వ్యాపారరీత్యా అందరితో బాగా కలిసిపోతాడు, అడిగినా అడగకున్నా చనువుగా అందరికి సహాయం చేస్తాడు. దానితో అతని వ్యాపారం బాగా సాగుతుంది.

కానీ ఇంట్లో రాజితో చాలా ముభావంగా, స్ట్రిక్ట్‌గా ఉంటాడు. తను చెప్పిందే చెయ్యాలి, తన కనుసన్నలలో ఉండాలని కాపురానికి వచ్చిన కొత్తల్లోనే చాలా స్పష్టంగా చెప్పాడు. పెళ్ళి అయ్యి ఇన్నేళ్ళయినా రాజికి అతనంటి చాలా బెరుకు.

రెండో పెళ్ళివాడు, తనకంటే పదేళ్ళు పెద్దవాడు అని మొదట్లో ఇష్టపడకపోయినా, వీసా కోసం ఎదురుచూస్తూ ఇండియాలో ఉన్న కాలంలో చాలా ఆలోచించుకుంది. ఇది నా సంసారం, నా భావి జీవితం - దీన్ని ఆనందంగా మలచుకోవాలన్న కృత నిశ్చయంతో స్వచ్ఛంగా అమెరికాలో తిరిగి కాలు పెట్టింది.

అత్తగారు భవాని ఇద్దరు కొడుకుల మధ్య రాకపోకలు సాగిస్తూ ఉండేది. చిన్న పిల్లలంటే చాలా ఇష్టం రాజికి. అందుకే ఆ పిల్లలకు తల్లిప్రేమను పంచాలని చాలా తాపత్రయపడింది. అమెరికా వచ్చేసరికి దాదాపు పదేళ్ళ పిల్ల శ్వేత ఎందుకో మాలిమి కాలేదు. స్టెప్ మదర్ అన్న అభిప్రాయమో, తెలిసీ తెలియని వయస్సులో ఎవరి మాటల ప్రభావమో కానీ ఎంత ప్రయత్నించినా ‘అమ్మ‘ అని పిలిచేది కాదు. ఎలా పిలవాలని వాళ్ళ నానమ్మను అడిగి ‘పిన్ని‘ అని పిలవటం మొదలెట్టింది. ఎందుకో ఆ పిలుపు గుచ్చుకున్నట్లుండేది రాజికి. అత్తగారి ద్వారా చెప్పిద్దామని ప్రయత్నించింది కానీ ఆవిడ పెద్దగా పట్టించుకోలేదు.

''పేరులో ఏముంది? పిల్లలను బాగా చూసుకునేవాళ్ళు రావాలని కోరుకున్నాను. నాకా వయస్సు మీద పడుతుంది, ఈ పిల్లలు పనులు చెయ్యటం, ఆ పరుగులు తియ్యటం నావల్ల కాదు. నువ్వు ప్రేమగా చూసుకుంటే వాళ్ళూ బాగుంటార్లే'' అంది ఆవిడ.

వేణు దగ్గర విపరీతమైన మొహమాటం, ఓ రకంగా భయంకూడా. బెడ్‌రూం దాటి బైటకు వస్తే ఆ మాట్లాడే ఒకటీ అరా మాటలు కూడా ఆగిపోతాయి. చాలా గంభీరంగా ఉంటాడు. తన ఇష్టాలు, అయిష్టాలు ఖచ్చితంగా చెప్పేశాడు. మళ్ళీ చెప్పించుకునే అవకాశం రాకుండా అన్నీ అమర్చటం నేర్చుకుంది రాజి.

పోనీ బెడ్‌రూంలో మాట్లాడదామా అంటే ''అలసిపోయి వచ్చా నన్ను విసిగించకు. ఏదైనా ఉంటే అమ్మతో మాట్లాడు. ఆవిడ చెప్పినట్లు విను'' అని మొరటుగా దగ్గరకు లాక్కునేవాడు.

మాట్లాడటానికి వచ్చే అలసట, శారీరక పొందుకోసం ఎందుకు రాదో ఎప్పటికీ అర్ధంకాదు రాజికి. పెళ్ళి అయ్యి ఇన్నేళ్ళయినా, ప్రతిరోజూ బెడ్‌రూంలో నరకమే రాజికి. చాలా మొరటుగా ప్రవర్తిస్తాడు. పంటి బిగువున బాధ నొక్కిపెట్టేది. పార్టీల్లో తాగి వచ్చిన రోజు ఇక చెప్పనవసరంలేదు.

''ఏమీ తెలియని మొద్దువు. నా కోర్కెలు తీర్చటం కూడా తెలియదు, దేనికి పనికి వస్తావు తింటానికి తప్పితే..'' అని ఇంకా హింసపెట్టేవాడు. తనలోనే ఏదైనా లోపం ఉందేమో అని ఓ రోజు ఇంట్లో ఉన్న కంప్యూటర్లో ఎవ్వరికీ తెలియకుండా రకరకాల సమాచారం వెతికింది. అప్పుడు అర్ధం అయ్యింది భర్తలో లోపం ఏంటో. తనలో లోపాన్ని కప్పిపుచ్చుకోటానికి ఓ శాడిస్టులా మారాడు పడకగదిలో. స్త్రీ మనస్సును ప్రేరేపించకుండా, కేవలం తన కోర్కె తీర్చుకోవాలనుకునే మూర్ఖుడు. భార్యా, భర్తలు మంచి ప్రేమికులుగా ఎలా ఉండాలో, పురుషుడు స్త్రీని పడకగదిలో ఎంత గౌరవించాలో ఎంత ఉత్తేజపరచాలో నేర్పిన కామసూత్రని కేవలం బూతు పుస్తకంగా చూడటం మన దౌర్భాగ్యం కాబోలు.

భర్త ప్రవర్తనతో రాత్రి అయ్యేసరికి అతని రాక్షసత్వాన్ని తట్టుకోలేక మౌనంగా కన్నీరు కార్చేది. రాజిలో సహజంగా ఉన్న సర్దుకుపోయే మనఃస్థత్వం ఇంకా పెరిగిపోయింది. మనస్సులోనే కుంచించుకుపోతూ ఆ ఇంటికి ఒక పనిమనిషి, వంటమనిషి, ఆయాగా మారిపోయింది.

ఇంత నైరాశ్యంలో ఒకే ఒక్క ఆశాకిరణం సాత్విక్, తొందరగా మాలిమి అయ్యాడు రాజికి. పట్టుబట్టి సాత్విక్‌తో మాత్రం 'అమ్మ' అని పిలిపించుకోగలిగింది. రాజిలోని ప్రేమకు కేవలం సాత్విక్ ప్రతిస్పందించాడు.

మాతృత్వం పరిపూర్ణంగా అనుభవించాలన్న కోరిక బలీయంగా ఉండేది. తాను కూడా ఒక పాపో, బాబుకో జన్మ ఇవ్వాలని విపరీతంగా మొక్కలు మొక్కేది.

నాలుగేళ్ళు అయినా ప్రెగ్నెంటు అవ్వట్లేదని ఓసారి నెమ్మదిగా వేణు దగ్గర చెప్పింది 'గైనకాలజిస్టు దగ్గరకు వెళతాను. ఏమన్నా టెస్టులు చేస్తారేమో? ఎందుకో కన్సీవ్ కావటంలేదు నేను."

"ఇద్దరు పిల్లలున్నారు, ఇంకా పిల్లలెందుకు? ఓహో నీ పిల్లలు కావాలనా?" వ్యంగ్యంగా అడిగాడు.

"ఛఛ! పొరపాటున కూడా పిల్లల్ని వేరేగా చూశానా. ఆ ఆలోచన కూడా నా మనస్సులోకి రాదు" కంగారుగా సంజాయిషీ ఇచ్చింది.

"ఇంకెప్పుడూ ఇలా ఆలోచించకు అయితే. అయినా నాకు వేసక్టమీ అయిపోయింది ఎప్పుడో" అంటూ అవతలికి తిరిగి పడుకున్నాడు.

స్తబ్దుగా అయిపోయింది రాజి మనస్సు. ఒకే ఒక్క కోరిక తాను కూడా మాతృత్వంలోని మాధుర్యాన్ని అనుభవించాలని. అదికూడా దక్కదా? ఇంత చెయ్యాలా వేణు. పెళ్ళికి ముందే ఈ విషయం ఎందుకు చెప్పలేదు? ప్రతి ఆడపిల్లలాగానే తనకూ కోరికలు ఉంటాయి కదా? ఇన్నేళ్ళగా అత్తగారు కూడా ఒక్కమాట ఎందుకు అనలేదు. మోసపోయిన భావన.

తేరుకోటానికి చాలా సమయం పట్టింది. నెమ్మదిగా మనస్సుకు నచ్చచెప్పుకోవటం మొదలెట్టింది. ఇద్దరు పిల్లలున్నారు చాలు అనుకుంది. ఎవరన్నా తెలిసిన వాళ్ళో లేక పిన్ని వాణి అడిగినా 'నాకు ఇద్దరు పిల్లలున్నారు ఇంకా ఎందుకు" అని మనఃస్ఫూర్తిగా చెప్పటం మొదలెట్టింది.

హారతి గంటల మ్రోతకు గతంలోనుండి బైటకొచ్చింది రాజి. కళ్ళల్లో చిప్పిల్లిన నీటిని తుడుచుకుంటూ, భక్తిగా కళ్ళు మూసుకుంది.

"భగవాన్! నా చిన్న జీవితంలో ఏ అల్లకల్లోలాలూ సృష్టించకు. వీలైతే కాస్త ప్రశాంతత, కాస్త సంతోషాన్ని ప్రసాదించు" మౌనంగా ప్రార్థించింది.

వేంకటేశ్వర స్వామి దేవాలయంలో పై అంతస్థులో అందరి దేవతా మూర్తులకు చిన్న చిన్న స్థానాలు ఉన్నాయి. వేంకటేశ్వరునిది మాత్రం చాలా పెద్ద విగ్రహం. క్రింద అంతస్థులో భోజనశాల, ఒక స్టోర్ ఉన్నాయి. పూజ అయ్యాక క్రింద క్యాంటిన్‌లో కూపన్లు అమ్మే చోటుకు వెళ్ళి కూర్చుంది రాజి.

జనం రద్దీ పెరిగింది. సుశీల ఒక్కతే సతమతమవుతుంది. ప్రతి శనివారం ప్రొద్దున్నే ఇంట్లో వంట, పని పూర్తి చేసుకుని ఇలా గుడికి వస్తుంది. మధ్యాహ్నం రెండుదాకా సేవ చేసి ఇంటికి వెళుతుంది. ఏ పనిలో సాయం కావాలంటే దాంట్లో సాయం చేస్తుంది. క్యాంటీన్లో, పూలు కట్టేచోట, క్లీనింగ్, ఏ పనైనా సరే.

ఇవాళ్ళ ప్రత్యేక అభిషేకం కాబట్టి రద్దీ బాగా ఎక్కువగానే ఉంది. వేరే ఇంకొకరు క్యాంటీన్లో సాయం చెయ్యటానికి రావటంతో సుశీలతో కలసి పులిహోర పెరుగన్నం తెచ్చుకుని ఇద్దరూ ఒక టేబుల్ దగ్గర కూర్చున్నారు.

సుశీల చాలా కలుపుగోలుగా ఉంటుంది. రాజి కంటే కొంచెం వయస్సులో పెద్దది. యాభై ఏళ్ళు దాటి ఉంటాయి. ఒక ఇన్సూరెన్సు కంపెనీలో పని చేస్తుంది. బాగా భక్తి ఎక్కువ. తనకు రాని స్తోత్రం లేదంటే అతిశయోక్తి కాదేమో? అన్ని ప్రత్యేక పూజల్లోనూ పాల్గొంటుంది.

వీళ్ళ పరిచయం గమ్మత్తుగా జరిగింది. ఆరేడేళ్ళ క్రితం బ్రహ్మోత్సవాల ముగింపురోజు చక్రస్నానంలో పాల్గొనాలని ప్రొద్దున్నే వచ్చింది రాజి. చకచకా అన్నీ అమరుస్తూ తిరుగుతున్న సుశీలను గమనించింది. మొహమాటంగా ఓ పక్కగా నిల్చున్న రాజిని సుశీల గమనించి దగ్గరకు వచ్చి పలుకరించింది.

''ఇదేనా మొదటిసారి రావటం. ఇలా ముందుకు రండి, లేకుంటే సరిగ్గా కనిపించదు'' అంటూ.

పూజ అయ్యాక, పూలు కట్టటంలో సాయం చెయ్యాలనుకునే వాళ్ళను పక్కకు రమ్మంటే రాజి కూడా వెళ్ళింది. అక్కడ గడిపిన రెండు గంటల్లో సుశీలతో పరిచయం ఇంకొంచెం పెరిగింది. సుశీల చనువుగా నెంబరు అడిగి తీసుకుంది.

అలా పెరిగిన పరిచయపు ప్రేరణతో నాలుగేళ్ళనుండి ఇలా శనివారాలు గుడిలో సేవకు రావటం మొదలెట్టింది.

''ఏంటి కబుర్లు? పిల్లలు ఎలా ఉన్నారు?'' పొంగలి తింటూ అడిగింది సుశీల.

''బాగానే ఉన్నారు. ఎవరి బిజీలో వాళ్ళున్నారు. శ్వేత ఎక్కడో కాలిఫోర్నియాలో ఉద్యోగం చేస్తుందిగా, ఎం.బి.ఏ కూడా చేస్తుంది ఇప్పుడు. ఆఫీసు వాళ్ళే స్పాన్సర్ చేస్తున్నారంట. తెలుసుగా తన సంగతి ఫోన్ చేస్తే రెండు ముక్కలు మాట్లాడుతుంది. ఏంటో ఎంత ప్రయత్నం చేసినా ఒక లిమిట్లో ఉంటుంది. సాత్విక్ బాగానే ఉన్నాడు. రెండవ సంవత్సరం కదా కాలేజీలో బాగానే సెటిల్ అయ్యాడు. వారానికోసారి ఫోన్ చేస్తాడు.''

''ఆదివారం ప్రొద్దున్నే యోగాకి వెళతాను నేను. తెలుసుగా నువ్వుకూడా రావొచ్చుకదా. ఎప్పటినుండో అడుగుతున్నాను.''

"వారానికి ఒక్కసారి ఇలా రావటానికీ ఓ నాలుగుసార్లు గుర్తుచేస్తాను. అయినా ఏదో ఒక వంక పెడతారు నన్ను వెళ్ళనివ్వకుండా ఉండటానికి. మళ్ళీ దేవుడంటే నమ్మకంలేక కాదు. తను చెప్పకుండా నా అంతట నేను ఏదీ చెయ్యకూడదు. తనంతే ఇక మారరు."

మానసిక అలసట అంతా రాజి కళ్ళల్లో ప్రతిఫలించింది. నలభై ఐదేళ్ళకే ఇంకో ఐదేళ్ళు పైబడ్డట్లు ఉంటుంది రాజి. నెరిసిన జుట్టు కళ్ళల్లో నైరాశ్యం, కళ్ళక్రింద నల్లటి వలయాలు.

"మరీ అంత మొత్తగా ఉండకూడదు రాజి. మంచితనానికి అసమర్ధత చేతకాని తనం అది అర్ధం తీసుకునే వాళ్ళు చాలామంది. వారి దగ్గర తలదించకూడదు. ఎంతసేపు ఇల్లు, వంట, షాపు చూసుకోవటం అందరి అవసరాలు తీర్చటం, ఇక ఇంతేనా జీవితం, నీకు ఏది సంతోషాన్ని ఇస్తుందో అది ధైర్యంగా చెయ్యి."

ఆడపిల్లల జీవితంలో భర్త అనేవాడు రావటంతో జీవితం మారిపోతుంది. సగటు ఆడపిల్లలు మానసికంగా చాలా ఆధారపడతారు ఆ బంధం మీద. భర్త నిరాదరణ చేస్తే తట్టుకోలేక లోలోపల కుమిలిపోతారు. కొంతమంది గద్దరితనంతో పట్టించుకోకుండా బ్రతికేస్తారు. రాజి అలాంటిది కాకపోవటంతో మనస్సులోనే బాధపడుతూ ఉంటుంది.

ఒంటరిగా ఉన్నప్పుడు అనిత, ప్రియ గుర్తుకు వచ్చేవారు. వాళ్ళతో స్నేహం కేవలం ఒక సంవత్సరమే అయినా ఎందుకో బాగా హత్తుకుపోయిన బంధం. ఈ పెళ్ళి వీసా గొడవల్లో వాళ్ళతో ఉన్న బంధం తెగిపోయింది. అమెరికా తిరిగి వచ్చి కొంచెం స్థిమితపడ్డాక ఫోన్ చేసింది ఓసారి అనితకు. ఫోన్ తియ్యలేదు. అనిత వాళ్ళ అక్కకు కూడా చేసింది. ఆ ఫోను పనిచెయ్యట్లేదు, నెంబరు డిస్‌కనెక్టెడ్ అన్న మెసేజ్ వచ్చింది. ఎక్కడున్నారో అందరూ అని గుర్తు వచ్చినప్పుడల్లా అనుకుంటూ ఉంటుంది.

రాజి పార్టీలకు కూడా పెద్దగా వెళ్ళేది కాదు. వేణు రమ్మని చెపితేనే అతనితో వెళుతుంది. అన్నీ మొహమాటపు పరిచయాలే కానీ ఎవ్వరితోనూ సన్నిహితమైన స్నేహం కుదర్లేదు సుశీల పరిచయం అయ్యేదాక.

పైగా రాజి వంటలు బాగా చేస్తుందని, ఇంట్లోనే కేటరింగ్‌లాగా మొదలు పెట్టించాడు. స్పెషల్ ఆర్డర్లు, ఆంధ్రా స్పెషల్ స్వీట్లు, పిండివంటలు, చేసి పార్టీలకు కేటరింగ్ చేసేవాళ్ళు. అరిసెలు, లడ్డూలులాంటివి ఒక్కతే చెయ్యటం కష్టం కాబట్టి ఆర్డర్లు కూడా ఎక్కువ రావటంతో, ఒకరిని సాయానికి పెట్టుకుంది. ఆర్డర్లు లేని రోజుల్లో వెళ్ళి షాపులో కూర్చుంటుంది.

పెళ్ళి అయిన పదేళ్ళకు తల్లి చనిపోతే ఇండియా వెళ్ళింది అంతే. అక్కల ఇంట్లో శుభకార్యాలకు కూడా వెళ్ళలేదు. అక్క కొడుకు పెళ్ళికి వెళతానంటే ఓసారి, వేణు విసుక్కున్నాడు. ఇంట్లో ఇబ్బంది ఎలా వీలవుతుంది అని. మళ్ళీ ఎప్పుడూ

అడగలేదు. అప్పుడప్పుడు ఫోన్‌లో మాట్లాడుతుంది. వేణు రెండేళ్ళకు ఓసారి ఇండియా వెళతాడు. అత్తగారు చీరల లిస్టు ఇచ్చేవారు. ఆవిడకు రాజికి తీసుకొచ్చేవాడు వేణు లిస్టు ప్రకారం. ఆయన ఏది తెస్తే అవే కట్టుకుంది. ఎప్పుడూ షోషనుగా కట్టి ఎరగదు. అందుకే పార్టీలకు తీసుకు వెళ్ళకపోయినా ఏమీ బాధపడదు.

సాత్విక్‌కు కాస్త చదువులో సహాయం చేసేది. అది కూడా ఆరవ తరగతి దాక. ఆ తరవాత తనంతట తానే హోం వర్కు చేసుకోవటం మొదలుపెట్టాడు. వాళ్ళకు టైంకు వండిపెట్టటం, స్కూలుకు దింపటం, వేరే క్లాసులు ఉంటే వాటికి తీసుకెళ్ళి తీసుకురావటం. బిజీ బిజీగా ఉండేది రాజి. రెండేళ్ళ క్రితం అత్తగారు కూడా చనిపోయారు.

ఏంటి ఇవాళ అంతగా ఆలోచనల్లో మునిగిపోతున్నావు? ఏమన్నా గొడవా?" సుశీల ప్రశ్నతో ఆలోచనలనుండి బైటపడింది రాజి.

"అబ్బే అలా ఏమీ లేదు. ఏవో పాత జ్ఞాపకలు."

"క్రిస్టమస్‌కు పిల్లలు వస్తున్నారా? మా సంగీత వాళ్ళు ఏదో క్రూజ్‌కు వెళుతున్నారంట. రానంది" అడిగింది సుశీల.

సుశీలకు ఒక్కతే కూతురు సంగీత. డాక్టరు న్యూయార్కులో పెళ్ళి అయి రెండేళ్ళయింది.

"సాత్విక్‌కి నెలరోజులు సెలవలున్నాయి కదా, వస్తున్నాడు. శ్వేత కూడా వారం రోజులకు వస్తాను అని చెప్పింది. వచ్చినా ఎక్కువ ఇంట్లో ఉండదు. ఫ్రెండ్స్‌ని కలవటానికి వెళుతుంది."

"ఎలా ఉందంట జాబ్. కాలిఫోర్నియా నచ్చిందా?"

"చేరిన సంవత్సరానికే ప్రమోషన్ వచ్చింది. పెళ్ళి మాట మాత్రం ఎత్తటంలేదు. ఇదిగో ఎం.బి.ఏ కూడా మొదలు పెట్టిందిగా, వాళ్ళ నాన్న అడిగితే ఎం.బి.ఏ అయ్యేదాకా నతింగ్ అని ఖరాఖండిగా చెప్పింది" మంచినీళ్ళు తాగుతూ చెప్పింది.

"ఈ కాలం పిల్లలకు మనం చెప్పేదేమిటి. చక్కగా చదువుకుంటున్నారు, మంచి ఉద్యోగాలు చేసుకుంటున్నారు. వాళ్ళకు నచ్చిన వాళ్ళను వాళ్ళే వెతుక్కుంటారు. మా సంగీత చూడు. రెసిడెన్సీ చేస్తున్నప్పుడు చెప్పింది ఒక అమెరికన్‌ని ప్రేమించానని. ఆ అబ్బాయిని కలిసాం, నచ్చాడు. నా కూతురు సరైన వ్యక్తిని ఎంచుకున్నదని సంతోషించి పెళ్ళి చేసాం. జాన్ మాలో ఎంత బాగా కలసిపోతాడో నీకు తెలుసుకదా, కొడుకు లేని లోటు తీరుస్తున్నాడు. మన వంటలన్నీ తింటాడు, మనతో గుడికి వస్తాడు. ఎంత హ్యాపీగా ఉందో చూడు."

"మీకు చెప్పాగా నా స్నేహితురాలు అనిత గురించి, అప్పట్లో స్టీవ్ అనే అమెరికన్ అంటే చాలా ఇష్టపడేది. ఎక్కడుందో తను. స్టీవ్‌తో పెళ్ళి అయిందో లేదో. ఈ మధ్య చాలా గుర్తుకు వస్తుంది."

"మరీ పిచ్చితనం రాజి నీకు. ఇంటర్నెట్‌లో వెతుకు, అనిత తప్పకుండా దొరుకుతుంది."

ఏదో అనబోతున్న రాజి, ఫోన్ మ్రోగటంతో మాటలాపేసి ఫోన్ తీసింది. వేణు నుండి.

"ఆ చెప్పండి. ఇప్పుడే బయలుదేరబోతున్నా" బ్యాగ్ చేతిలోకి తీసుకుంటూ అన్నది రాజి.

"ఎక్కడికి వెళితే అక్కడే కూర్చుండిపోతావా? రాత్రి పార్టీ వాళ్ళు ఫోన్ చేశారు, ఇంటికి వచ్చి స్వీట్స్ తీసుకు వెళతామని" వేణు గొంతులోని విసుగుకు, కోపానికి చివుక్కుమంది రాజికి.

"ఇంకో అరగంటలో ఇంట్లో ఉంటాను" తినేసిన పులిహోర, పెరుగన్నం గిన్నెలు డస్ట్‌బిన్‌లో పడేసి, సుశీలకు చెయ్యి ఊపి, గబగబా కారు దగ్గరకు వెళ్ళింది రాజి.

దాదాపు పరిగెత్తుతున్నట్లు వెళుతున్న రాజిని చూసి నిట్టూర్చింది సుశీల.

**తలుపు తీసిన** శబ్దం విన్న రాజు, వంటింట్లో పని ఆపేసి చేతులు తుడుచుకుని వస్తుండగానే, శ్వేత లోపలికి వచ్చింది సూట్‌కేస్ లాక్కుంటూ.

"హాయ్ శ్వేతా!" నవ్వుతూ పలకరించింది రాజి.

"హాయి పిన్ని. హౌ ఆర్యూ?" చాలా మర్యాదగా చక్కగా మాట్లాడుతుంది శ్వేత ఎప్పుడూ, కానీ ప్రేమగా, చనువుగా ఉండదు.

"కాఫీ పెట్టు నాకు, మళ్ళీ షాపుకు వెళ్ళాలి" శ్వేత వెనకాల వచ్చిన వేణు అన్నాడు.

శ్వేత క్రిస్టమస్ సెలవులకు వచ్చింది. ఎయిర్‌పోర్టుకు వెళ్ళి తీసుకువచ్చాడు వేణు.

కాఫీ కాయటానికి పొయ్యిమీద పాలు పెట్టింది రాజి. పాలు మైక్రోవేవ్‌లో వేడి చేస్తే కాఫీ తాగడు వేణు.

"శ్వేతా నీకు కూడా కాఫీ ఇవ్వనా, లేక టీ తాగుతావా? గ్రీన్ టీ బాగ్స్ తెచ్చాను నీకోసం" అడిగింది రాజి.

"నేను పెట్టుకుంటా పిన్ని. ఇంకా చిన్నపిల్లనా అన్నీ నువ్వు చెయ్యటానికి" నవ్వుతూ వచ్చి నీళ్ళ కప్పు మైక్రోవేవ్‌లో పెట్టింది. "ఏడీ సాత్విక్, ఇంట్లో లేడా?"

"చిన్న షాపింగ్ ఉందని వెళ్ళాడు" రాజి అంటుండగానే తలుపు తీసిన శబ్దం వచ్చింది.

"హాయ్ అక్కా!" చేతిలో పెద్దపూల బొకేతో గట్టిగా అరుచుకుంటూ వచ్చి శ్వేతను హత్తుకున్నాడు.

"పోరా! అన్నీ వేషాలేస్తావు. ఎయిర్‌పోర్ట్‌కు వస్తానని రాలేదు. ఇప్పుడేమో పూలు తెచ్చావా కాకా పట్టటానికి"

"నీకు తెచ్చానని ఎవరన్నారు? నేను అమ్మకు తెచ్చా" చిలిపిగా నవ్వాడు. వాళ్ళ నానమ్మ ఇంట్లో ఉండటంతో ఇద్దరూ తెలుగు చక్కగా మాట్లాడతారు.

వేణు మరీ పొడువు కాదు కానీ పిల్లలిద్దరూ పొడుగే, శ్వేత దాదాపు 5'6 ఉంటుంది. రెగ్యులర్‌గా జిమ్‌కు వెళుతుంది. ఒళ్ళు రానివ్వదు. భుజాలకు కొంచెం దిగిన జుట్టు, ఛామన ఛాయ అయినా మంచి కళగల మొహం.

సాత్విక్ ఆరడుగులు, ఎత్తుకు తగ్గ లావుతో దృఢంగా ఉంటాడు.

ప్లేటుల్లో లడ్డూలు, గవ్వలు, చెక్కలు పెట్టి అందరికీ ఇచ్చింది రాజి.

"పిన్ని నిన్ను ఒకటి అడగాలి. నువ్వు పెళ్ళికి ముందు ఏదన్నా జాబ్ చేశావా?" లడ్డూ కొరుకుతూ అడిగింది శ్వేత.

అనుకోని ఈ ప్రశ్నకు ఆశ్చర్యంగా శ్వేత వైపు చూసింది రాజి.

"ఇప్పుడు తన గురించి ఎందుకు?" వేణు అడిగాడు.

"పిన్నీ ప్లీజ్ టెల్" కుతూహలంగా అడిగింది.

"జాబ్ అంటే ఏమీ పెద్దగా లేదు. మా బాబాయి వాళ్ళ కాఫీ షాపులో చేసేదాన్ని యూనివర్సిటీ క్యాంపస్‌లో"

"ఓ..సరే" శ్వేత మొహం మీద చిన్ననవ్వు.

"దేనికమ్మా అడిగావు?"

"అబ్బే ఏమీ లేదు పిన్ని ఊరికే. రేపట్నుండి ఓ రెండు రోజుల్లో క్రిస్టమస్ షాపింగ్ అంతా పూర్తి చెయ్యాలి. పిన్నీ నీ కారు తీసుకువెళ్ళనా?"

"అడగాలా తీసుకువెళ్ళు. సరే నేను షాపుకు వెళ్ళి వస్తాను" లేస్తూ చెప్పాడు వేణు.

వేణులో ఈ పదహారేళ్ళల్లో పెద్ద ఏ మార్పు ఏమీలేదు. నెరిసిన జుట్టుకు రంగు వేసుకుంటాడు, పెద్దగా ఒళ్ళు రాలేదు. మొహం కొంచెం మారింది. కళ్ళజోడుతో కొంచెం ముడతలతో. వెళ్ళిపోతున్న వేణును చూసి చిన్నగా నిట్టూర్చింది రాజి. "ఈ ఒక్కరోజన్నా పిల్లలతో గడపొచ్చు కదా. షాపులు చూసుకోటానికి మనిషి ఉన్నాడు కదా."

శ్వేత, సాత్విక్ టేబుల్ దగ్గర కూర్చుని కబుర్లు చెప్పుకుంటుంటే చాలా ముచ్చటగా అనిపించింది. వాళ్ళ చిలిపి పోట్లాటలు, ఉత్సాహం, అల్లరి ఇల్లంతా కళకలలాడుతున్నట్లుగా అనిపించింది. ఇంట్లోని స్తబ్దత అంతా పోయినట్లుగా అనిపించింది. ఉత్సాహంగా రాత్రి డిన్నరుకు బిర్యాని చెయ్యటానికి వంటింట్లోకి వెళ్ళింది.

నిద్రపోయే ముందు వేణుకు టాబ్లెట్లు ఇస్తూ నెమ్మదిగా అడిగింది రాజి. "శ్వేతకు ప్రమోషన్ వచ్చింది కదా. సమయానికి క్రిస్టమస్‌కని మనదగ్గరకు వచ్చింది కదా ఏమన్నా మంచి గిఫ్ట్ ఇస్తే బాగుంటుంది."

"ఏమనుకుంటున్నావో సరిగ్గా చెప్పు."

"డైమండ్ నెక్లెస్ సెట్ తీసుకుంటే బాగుంటుంది అనిపిస్తుంది. ఒక్కో నగ కొంటుంటే పెళ్ళి టైముకి అన్నీ సమకూరుతాయి కదా"

కాసేపు ఏమీ మాట్లాడలేదు వేణు.

"సర్లే. తనకు ఏది ఇష్టమో కనుక్కో. అందరం వెళ్ళి కొందాం రేపు."

"మరి సాత్విక్‌కు?"

"ఒక మంచి సెకండ్ హాండ్ కారు కొందామనుకుంటున్నా, క్రిస్టమస్ ముందు రోజు డెలివరీ తీసుకుంటా."

"కారు కొంటున్నారా? ఏం తొందర అప్పుడే సొంతం 19 ఏళ్ళు లేవు. బాగానే డ్రైవ్ చేస్తాడు కానీ చేతిలో కారుంటే, ఫ్రెండ్స్‌తో..." భయం భయంగా అన్నది రాజి.

"ఏంటీ నాకంటే నీకు ఎక్కువ తెలుసా?" మొహం చిట్లించాడు వేణు.

"అలాక్కాదండి ఇప్పుడు కాలేజీలో అవసరంలేదు కదా. మూడు గంటల దూరంలో ఉన్నాడు. బస్సులో వచ్చేస్తున్నాడు కదా. అందుకని..."

"నీకు అనవసరమైన విషయాల్లో జోక్యం చేసుకోకు. శ్వేతకు నగలు కొనటానికి ఒప్పుకున్నానని అన్నిట్లో తలదూర్చకు. నాకు ఎప్పుడు ఏం చెయ్యాలో బాగా తెలుసు."

ఇక మాటలు పెంచకుండా కళ్ళు మూసుకుంది రాజి.

ఎన్నాళ్ళగానో మనస్సులో పడుతున్న సంఘర్షణను లోపల దాచుకోలేక నలిగిపోతుంది. గత కొన్నేళ్ళుగా గూడు కట్టుకున్న అసంతృప్తి, బాధకు ఏదో కదలిక. ఏంటి తన స్థానం ఈ ఇంట్లో భార్య అంటే ఏంటి? తాళికట్టటం ఒక్కటేనా? అసంపూర్ణ, అస్పష్టమైన ఆలోచనలు.

కాపురానికి వచ్చిన తరవాత ఓ పదేళ్ళు తనని తను ఎంతో బిజీగా పెట్టుకుంది. ఇంటి అవసరాలు, పిల్లల పనులు, క్యాటరింగ్ పనులు పని, పని, పని... వీటన్నిటి మధ్య మనస్సు ఒక తోడు కోరుకునేది, ప్రేమ కోసం తపించేది. అదీ భర్తనుండి.

ఆ వెలితిని పిల్లల ఆప్యాయత కూడా పూరించలేకపోయింది. ఒక్కోసారి అనుకునేది ప్రేమలేకున్నా కనీసం సాటి మనిషిగా ఐనా ఎందుకు చూడడు అని. బైట వాళ్ళందరితో నవ్వుతూ మాట్లాడతాడు. "వేణు చాల హెల్ప్‌ఫుల్" అంటారు. మరి తనతోనే ఎందుకిలా? ఇష్టపడే చేసుకున్నాడు కదా.

తన మనఃస్థత్వం, రూపు, మాట తీరు, ప్రవర్తన వీటిల్లో ఏది నచ్చలేదు వేణుకు? పదే పదే ఇదే ఆలోచన. ఒక్కోసారి మరీ బెంగగా ఉంటుంది. ఇంతేనా నా జీవితం? తనకు నచ్చే ఏ పని చెయ్యటానికి స్వతంత్రం లేదు. ఎంతసేపు అతనికి నచ్చినట్లు ఉండటమే. నాకు ఏమి కావాలి అని అడిగేవాళ్ళు లేరు. కనీసం తను భోజనం చేసిందో లేదో కూడా అడగడు వేణు. ఆలోచనలతో ఎప్పటికో నిద్రపట్టింది రాజికి.

క్రిస్టమస్ రోజు –

పిల్లలు అప్పుడే లేవరు అని తెలిసినా, తన టైం ప్రకారం ఐదుగంటలకే లేచింది రాజి. పాత పాటల సీడీ పెట్టుకుని హెడ్‌ఫోన్స్‌లో ఆ పాటల మాధుర్యం ఆస్వాదిస్తూ కాఫీ తాగింది.

ఇవాళ షాపులన్నింటికీ సెలవు. అందుకే వేణు కూడా ఇంట్లోనే ఉంటాడు.

గత నాలుగురోజులు చాలా బిజీగా గడిచిపోయాయి. శ్వేతకు నచ్చిన నగలు కొందామని అందరూ షాపుకు వెళ్ళారు.

"నగలెందుకు, నేను పెట్టుకోను. ఇండియన్ పార్టీలకు వెళ్ళను కదా అక్కడ." అని శ్వేత మొదట్లో ఒప్పుకోలేదు.

"నీకు నచ్చిందే తీసుకో శ్వేత, పోనీ ఏమన్నా జుంకీలు తీసుకో నీ ఇష్టం" మృదువుగా నచ్చ చెప్పింది రాజి.

ఏమనుకుందో కానీ శ్వేత ఒప్పుకుంది. నగల షాపులో చాలాసేపు వెతికి చివరికి ఒక నెక్లెస్ సెట్ తీసుకుంది. అమెరికన్ ఇంకా ఇండియన్ డ్రస్సుల మీదకు బాగుండేటట్లు.

చిన్నపిల్లలాగా అడిగింది "నాకు ఇది గిఫ్ట్ కదా, క్రిస్టమస్ ట్రీ కింద పెట్టండి"

శ్వేత ప్రవర్తన కొంచెం ఆశ్చర్యంగా అనిపించింది రాజికి. ఎప్పుడూ లేని విధంగా చనువుగా ఉంది రాజితో, అందరిని చాలా ఫోటోలు తీసింది. ముఖ్యంగా రాజిని. అడిగి మరీ స్పెషల్స్ వండించుకుంది.

ఓ రోజు పిన్ని బాబాయి వాళ్ళింటికి తీసుకు వెళ్ళింది పిల్లల్ని. వాళ్ళ పిల్లలు, మనవరాలు వచ్చారు క్రిస్టమస్‌కు.

వాణి, కుమార్ పిల్లలిద్దరికి పెళ్ళిళ్ళు అయిపోయాయి. పెద్ద అబ్బాయి నితిష్‌కు ఒక తెలుగు అమ్మాయితోనే పరిచయం ఏర్పడి - పెళ్ళి చేసుకున్నారు. ఒకరకంగా చెప్పాలంటే తెలిసిన వాళ్ళమ్మాయిని పరిచయం చేసి, పెళ్ళిదాకా ఎంకరేజ్ చేసింది వాణినే, వాళ్ళిద్దరూ డాక్టర్లు, హ్యూస్టన్‌లో ఉంటారు. వాళ్ళకు ఒక ఐదేళ్ళ పాప.

రెండో బాబు రాహుల్ కంప్యూటర్ ఇంజినీర్. ఎప్పుడో ఉద్యోగంలో సెటిల్ అయినా, ఎవ్వరూ నచ్చక పెళ్ళి ఆలస్యం అయ్యింది. చివరకు వాళ్ళ ఆఫీసులోని గుజరాతీ అమ్మాయిని పెళ్ళిచేసుకున్నాడు. ఇంకా పిల్లల్లేరు వాళ్ళకు.

రాజి కాపురానికి వచ్చిన మరుసటి సంవత్సరమే నాయనమ్మ అనసూయమ్మ చనిపోయారు. ఎప్పుడు ఏ సహాయం కావాలన్నా వాణి రాజికి ఫోన్ చేసి పిలుస్తుంది.

"ఎంత అదృష్టవంతురాలివే రాజి. ఆ రోజు మనఃస్ఫూర్తిగా నచ్చలేదు నీకు వేణుని పెళ్ళి చేసుకోవటం. కానీ చూడు ఇవాళ ఎంత బాగా సెటిల్ అయ్యావో. నేను నిన్ను ఇండియా నుండీ తీసుకొచ్చి ఎంత మంచి పని చేశానో కదా. అక్కడే ఉంటే చాలీచాలని జీతాలతో ఎంత ఇబ్బంది పడేదానివి" వాణి మాటలేమీ కొత్తకాదు రాజికి.

కలిసిన ప్రతిసారి ఇదే అర్థం వచ్చేమాటలు అంటుంది వాణి. 'నిజమే పిన్ని' అని రాజి అంటే ఆవిడకు తృప్తి. అవటానికి పిన్నీ బాబాయి అయినా ఒక్కసారి కూడా తన కుటుంబ విషయాలు వాళ్ళతో చెప్పలేదు.

"ఏంటీ శ్వేత, ఇంక ఎవ్వరూ నచ్చలేదా? పెళ్ళి ఎప్పుడు చేసుకుంటావు? వాణి అడిగింది.

"మామ్. ఎందుకు ఎప్పుడూ పెళ్ళి అనే టాపిక్ తప్పితే ఇంకేమీ దొరకదా నీకు, మమ్మల్ని కూడా ఇలాగే సతాయించేదానివి" రాహుల్ మందలించాడు శ్వేత ఇబ్బంది పడటం చూసి.

"నాకు తెలిసిన వాళ్ళ అబ్బాయి ఉన్నాడు శ్వేత. నీకు ఫోటోలు పంపనా? ఇంక ఎన్నాళ్ళు ఆగుతావు. హాయిగా ఉద్యోగం చేస్తున్నావు. ఇంకేంటి?" వాణి డోలాంతరం తనదే, ఎవ్వరి మాటలు పట్టించుకోదు.

"మీరు నాకు పంపండి. నేను శ్వేతతో మాట్లాడతాను" వేణు వెంటనే అందుకున్నాడు.

శ్వేత తండ్రి వంక మొహం చిట్లించి చూసింది. ప్రొద్దున ఇంట్లో ఇదే సంభాషణ.

"నేను వెతుక్కుంటాను నాకు నచ్చినవాడిని. దొరికినప్పుడు పెళ్ళిచేసుకుంటాను. ఇలా మీరు నాకు సెట్ చెయ్యాలని చూడకండి" ఖచ్చితంగా చెప్పింది శ్వేత.

"నేనేమైనా బలవంతం చేశానా? పరిచయం చేస్తాం అని అన్నాను. అది కూడా తప్పేనా?" చిరాకుపడ్డాడు వేణు.

మళ్ళీ వాణి వాళ్ళింటిలో ఇదే టాపిక్, వచ్చే చిరాకును కప్పిపుచ్చుకుని రాహుల్ నితిష్‌తో కబుర్లు చెప్పింది శ్వేత.

గుడ్ మార్నింగ్" శ్వేత గొంతు విని ఆలోచనలనుండి బైట పడింది రాజి.

వెనకాలే సాత్విక్ కూడా వచ్చాడు. లేపినట్లు ఉంది శ్వేత.

"బ్రేక్‌ఫాస్ట్‌కు గారెలు చేస్తున్నా. ముందు గిఫ్ట్‌లు చూస్తారా?"

"డాడీ కూడా లేచాక చూస్తాంలే పిన్ని. చిన్నపిల్లలం కాదుగా? నవ్వింది శ్వేత.

గారెలు చెయ్యటం అవుతుండగా వేణు కూడా లేచి వచ్చాడు. అందరూ కలిసి కబుర్లు చెప్పుకుంటూ గారెలు తిని, కాఫీతాగి గిఫ్ట్లు ముందు కూర్చునే సరికి దాదాపు పది అయ్యింది.

వేణు ఇచ్చిన తాళం చెవి చూసుకుని ఆనందంతో గంతులేశాడు సాత్విక్.

రాజికి ఒక కోట్ కొన్నాడు సాత్విక్. "నీ కోటు పాతదైపోయినా అదే వేసుకుంటున్నావు అమ్మా అందుకే తీసుకున్నా నచ్చిందా?"

"చాలా బాగుంది కన్నా" సంతోషంగా చెప్పింది రాజి.

"పిన్నీ మీతో ఒకటి చెప్పాలి. మీకు నేను ఏ గిఫ్ట్ కొనలేదు" అంది శ్వేత.

"పర్లేదమ్మా నేనేమైనా చిన్నపిల్లనా అది కూడా చెప్పాలా?" నవ్వింది రాజి.

"కానీ ఒకటి చెప్పాలి పిన్ని. మరీ డ్రమెటిక్‌గా ఉంటుందేమో. నా చిన్నప్పటినుండీ నేను మొండిగా పిన్ని అనే పిలిచాను అమ్మ అనమని ఎంత అడిగినా వినలేదు. కానీ నన్ను ఎప్పుడూ చాలా బాగా చూసుకున్నావు. మేము ముగ్గురంకూడా నీకు ఎప్పుడూ ఏదీ చెయ్యలేదు."

"ఎందుకు చెపుతున్నావు ఇదంతా?" వేణు ఆపబోయాడు.

"లేదు డాడీ మీరు ఎప్పుడూ పిన్నిని ఎప్రిషియేట్ చెయ్యలేదు, మనకోసం ఎంత కష్టపడినా, కనీసం ఇప్పుడైనా మారండి. పిన్నీ, మీకు ఏం గిఫ్ట్ ఇస్తే మీరు చాలా సంతోషిస్తారో ఈ మధ్యే తెలుసుకున్నాను. మీకు త్వరలో అందుతుంది."

"శ్వేతా నాకు ఏమీ గిఫ్ట్ వద్దు. మీరిద్దరూ లైఫ్‌లో బాగా సెటిల్ అయ్యి సంతోషంగా ఉంటే అంతే చాలు" ఎందుకో కళ్ళు చెమ్మగిల్లాయి రాజికి. ఇన్నాళ్ళకు శ్వేత తనను అర్థం చేసుకున్నందుకు.

శ్వేత ఫోన్ మోగింది. నెంబరు చూసి ఫోన్ రాజి చేతికి ఇచ్చింది 'మాట్లాడు' అంటూ.

'ఎవరూ...' అంటూ ఫోన్ తీసుకుంది రాజి.

"హాయ్ రాజి! నేనెవరో గుర్తుపట్టు..." అందమైన కంఠం తెలిసీ తెలియనట్లుగా

"ఎవరో తెలియట్లేదండి. ఎవరు మీరు?" మొహమాటంగా అడిగింది.

"అబ్బా! అంత తొందరగా చెప్పేస్తావా? కొంచం ఆలోచించు" అల్లరిగా వినిపించింది.

అయోమయంగా శ్వేత వైపు చూసింది రాజి. నవ్వుతూ తనవంకే చూస్తుంది శ్వేత. ఏంటి ఈ మిస్టరీ అన్నట్లు చూస్తున్నారు సాత్విక్, వేణు.

"ఎవరు అక్కా? అమ్మకు ఏంటి ఈ సర్‌ప్రైజ్" సాత్విక్ అడుగుతున్నాడు.

"నేను చెప్పను తననే కనుక్కోమను" నవ్వింది శ్వేత.

"రాజీ తొందరగా కనుక్కో నా వల్ల కావట్లేదు" ఫోన్‌లో మళ్ళీ అదే అల్లరి.

"సారీ నిజంగా తెలియట్లేదు."

"ఓ పదిహేను సంవత్సరాలు వెనక్కి వెళ్ళు."

ఓ చిన్న క్లూ... అనుమానం అంతలోనే తెలిసిపోయిందన్న ఆనందం అన్నీ చుట్టుముట్టాయి.

"ప్రియా....?"

"అవును. నేనే. హమ్మయ్య గుర్తుపట్టావు" గట్టిగా నవ్వేసింది ప్రియ.

**ప్రియ**

రెండు రోజుల క్రితం...

"ఒకే ఎవ్రీబడీ. మన టార్గెట్ ఏంటో అందరికి తెలుసు, దానితో పాటే డెడ్‌లైన్స్ కూడా. ఇప్పటివరకు మన ప్రోగ్రెస్ బాగుంది. వచ్చేనెలలో ప్రతివారం మీటింగ్స్ ఉంటాయి. ఫిబ్రవరిలో ప్రతిరోజూ స్టేటస్ మీటింగ్స్ ఉంటాయి, మార్చి సగంలో ఎట్టి పరిస్థితుల్లోనూ మన అప్లికేషన్ లాంచ్ అవ్వాలి. అందరూ వాళ్ళ అస్సైన్‌మెంట్ల విషయంలో ఖచ్చితంగా ఉండాలి. ఏదైనా ఇష్యూ వస్తే.. వస్తే కాదు - వస్తుందనే అనుమానం వచ్చి వెంటనే అందరికి చెప్పాలి. ఐ హోప్ యు ఆల్ అండర్‌స్టాండ్" ఒక చేతితో అలవోకగా కారు స్టీరింగ్ కంట్రోలు చేస్తూ మాట్లాడుతోంది ప్రియ.

కారు డ్రైవింగ్ చేసే సమయంలో కూడా ఏదో ఒక మీటింగ్‌లో ఉంటుంది. బ్లూటూత్ ఆఫ్ చేసి, కారు ఆఫీసు పార్కింగ్ లాట్‌లోకి పోనిచ్చింది. శాండియాగోలోని ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో డైరక్టర్‌గా పనిచేస్తోంది.

నలభై ఏళ్ళ వయస్సులో వయస్సు ఏ మాత్రం తెలియనంత అందంగా ఉంటుంది. వయస్సుతో పాటు వచ్చిన కొద్దిపాటి ఒళ్ళు, స్టైలిష్‌గా కత్తిరించిన జుట్టు, లైట్‌గా మేకప్, బిజినెస్ డ్రెస్ వేసుకుని తను నడుస్తుంటే 'వావ్' అని అనుకోని వాళ్ళుండరు.

కారులోని ల్యాప్‌టాప్ బ్యాగ్, హాండ్‌బ్యాగ్ తీసుకుని, కారు లాక్ చేసి బిల్డింగ్ వైపు నడిచింది ప్రియ. ఐదు అంతస్థుల కార్పొరేట్ బిల్డింగ్ అది. నాలుగో అంతస్థులో ప్రియ ఆఫీసు ఉంటుంది.

ప్రొద్దున తొమ్మిదికూడా కాలేదు అప్పుడే రెండు మీటింగులు అయిపోయాయి. ఆఫీసు అంతా కొంచెం ఖాళీగానే ఉంది. మర్నాటి నుండి రెండు రోజులు క్రిస్టమస్ సెలవలు. చాలామంది మధ్యలో రోజులు సెలవలు పెట్టుకుని వారం అంతా వెకేషన్ ఎంజాయ్ చేస్తున్నారు.

లాప్‌టాప్ ఆన్ చేసి కుర్చీలో కూర్చుంది ప్రియ. ఇంకో రెండు గంటలదాకా మీటింగులు ఏమీలేవు. కాస్త ఖాళీ చిక్కింది. కొత్త మెయిల్ వచ్చినట్లు బీప్ అన్నది లాప్‌టాప్. శ్వేత నుండి మెయిల్. ఆత్రంగా ఓపెన్ చేసింది అందులోని ఎటాచ్‌మెంట్‌ని.

రాజి మొహం స్క్రీన్ మీద పెద్దగా కనపడింది.

రాజి పిల్లలతో..

రాజి ఒక్కతే - వంటింట్లో...

రాజి సోఫాలో..

అప్రయత్నంగా ప్రియ మొహం విచ్చుకుంది.

చాలా మారింది రాజి. మరీ గుర్తుపట్టలేనంతగా కాదు, కానీ మారింది. ఒళ్ళు వచ్చింది, జుట్టును ముడిలాగా పెట్టుకోవటంతో పెద్దరికంగా ఉంది. జుట్టు బాగా నెరిసింది. కళ్ళల్లో అదే దిగులు.

ఇన్నాళ్ళ తరవాత రాజిని చూడటం చాలా ఎక్సయిటింగ్‌గా వుంది. రాజీతో మరీ స్నేహం లేకపోయినా ఆ రోజుల్ని గుర్తుచేసిన పరిచయం స్నేహం.

ఎంత విచిత్రమైనది ఈ జీవితం. ఈ ప్రపంచం ఎంతో చిన్నది అనిపిస్తుంది రాజిని ఎలా కనుక్కోగలిగిందో తలచుకుంటే.

ఒక క్రొత్త ప్రాజెక్టు పనిలో భాగంగా శ్వేతను కలిసింది చాలాసార్లు మీటింగుల్లో. శ్వేత ఇంటిపేరు బట్టి తెలుగమ్మాయేమో అనుకుంది.

ప్రాజెక్టు సక్సెస్‌గా లాంచ్ అయిన సందర్భంగా ఇచ్చిన పార్టీలో శ్వేతతో మాట్లాడింది. ఆఫీసు వాతావరణం కానందువలనేమో అందరూ బాగా రిలాక్స్‌డ్‌గా ఉన్నారు. ఏదో మాటల సందర్భంలో శ్వేత చెప్పింది తాను చికాగోలో పెరిగానని.

"ఓ! నేను కూడా అక్కడ యూనివర్సిటీలోనే చదివాను. అఫ్‌కోర్స్. దాదాపు పదిహేనేళ్ళ క్రితం" నవ్వింది ప్రియ.

"నిజమా" ఆశ్చర్యపోయింది శ్వేత.

"ఇండియా నుండి వచ్చి అక్కడ ఎం.బి.ఏ చేశాను. చాలా మంచి స్నేహితులయ్యారు అక్కడ. చాలా మంచి మెమరీస్. కొంతమందితో కాంటాక్ట్ పోయింది. ఎక్కడ ఉన్నారో ఏంటో.. అనిత, స్టీవ్, రాజి.."

ప్రియ మాటలు పూర్తికాకుండానే ఆపింది శ్వేత -"రాజి, మా స్టెప్ మామ్ పేరు కూడా రాజి నే. చికాగోలోనే ఉంటారు."

ఓ క్షణం శ్వేతను పరిశీలనగా చూసింది ప్రియ.

"ఏమనుకోకపోతే తన గురించి చెపుతావా?"

"మా డాడ్‌కి చికాగోలో గ్రోసరీ సోర్సు ఉన్నాయి. నాకు దాదాపు ఎనిమిదేళ్ళప్పుడు మళ్ళీ పెళ్ళిచేసుకున్నారు. తన డిటైల్స్ ఎక్కువ తెలియదు కానీ తను వాళ్ళ అంకుల్ వాళ్ళింట్లో చికాగోలోనే ఉండేది. ఇంతే తెలుసు"

"మీ అమ్మ వివరాలు నీకు తెలియదా?" ఆశ్చర్యంగా అడిగింది ప్రియ.

"అంటే పెద్దగా పట్టించుకోలేదు" ఇంతకాలం రాజి వివరాలు తెలుసుకోటానికి ప్రయత్నించనందుకు మొదటిసారిగా సిగ్గుపడింది శ్వేత.

"ఎందుకో అనిపిస్తుంది మీ అమ్మ, నాకు తెలిసిన రాజి ఒకరే అని. ఫోటో ఏదైనా ఉందా?" హుషారుగా అడిగింది ప్రియ.

అంత పెద్ద పొజిషన్లో ఉన్న ప్రియ, చిన్న పిల్లలాగా అడగటం, అందునా తన దగ్గర రాజి ఫోటోలు ఏమీ లేకపోవటం గిల్టీగా అనిపించింది.

"మంచివి లేవు. వచ్చేవారం వెకేషన్‌కి చికాగో వెళుతున్నాను. అప్పుడు మంచివి తీసి పంపిస్తాను" కంగారు కప్పిపుచ్చుకుంటూ చెప్పింది శ్వేత.

"సర్లే నీ ప్రోబ్లమ్" అని పైకి తేలికగా అనేసినా, ఆ విషయాన్ని అంత తేలికగా తీసుకోలేకపోయింది ప్రియ. శ్వేత మొహంలో కనిపిస్తున్న గిల్ట్ ప్రియ దృష్టిని తప్పించుకోలేదు.

శ్వేతకు రాజికి సత్సంబంధాలు లేవా? పాపం రాజి అసలే చాలా మెతక. తన పెళ్ళి అయ్యాక పరిస్థితులు ఎలా ఉన్నాయో? కనీసం భర్తతో అయినా సంతోషంగా ఉందా? అనిత ఉంటే రాజితో మాట్లాడి అన్ని విషయాలు కనుక్కునేది. అనిత దగ్గర ఎవరైనా సరే మనస్సు విప్పుతారు.

అనితను తలచుకుంటే మనసంతా భారంగా అయిపోయింది. జీవితాంతం స్నేహంగా ఉంటామనుకున్నారు. కానీ పరిస్థితుల ప్రభావంతో జీవితం ఎన్ని మలుపులు తిరుగుతాయో ఎవ్వరూ ఊహించలేరు.

అనిత పెళ్ళి అయ్యాక ఓ రెండేళ్ళ లోపలే ఇద్దరి మధ్యా అన్ని బంధాలు తెగిపోయాయి. అప్పటికీ ఇద్దరి మధ్య బేధాభిప్రాయాలు దాంతో ఇద్దరి మధ్య మానసికంగా దూరం పెరిగింది. ఇన్నేళ్ళల్లో అనితను ఏదో కారణంతో తలచుకుంటూనే వుంది. తనదే తప్పు. ఒక మంచి స్నేహితురాలు కాలేకపోయింది. అనిత మానసిక స్థితి గమనించకుండా తన ధోరణిలో విసుగు, కోపం అన్నీ అనితమీద చూపించింది.

ఇప్పుడు అనిత ఎక్కడుందో కూడా తెలియదు. ఎన్నో ప్రయత్నాలు చేసింది కానీ దొరకలేదు. ఇన్నాళ్ళకు ఒక చిన్న కదలిక. ఏమో ఇది శుభసూచకమేమో, తిరిగి తాను అందరిని కలుస్తుందేమో, ఏంటి ఇంత సెంటిమెంటల్‌గా అయిపోతుంది, కంటి చివర చిప్పిల్లిన జ్ఞాపకాలను తుడుచుకుంది ప్రియ.

మళ్ళీ కంప్యూటర్ స్క్రీన్ వైపు చూసింది. నవ్వుతున్న రాజి మొహం.. అనిత, స్టీవ్ ఎక్కడున్నారో?

సెల్‌ఫోన్ చేతిలోకి తీసుకుని ఆనంద్‌కు ఫోన్ చేసింది.

"బిజీగా వున్నావా?" అడిగింది ప్రియ.

"లేదులే ఈ వారం వెకేషన్‌లో వున్నా. కానీ ఎక్కడికీ వెళ్ళటంలేదు. ఇంట్లోనే ఫుల్ రెస్టు, తినటం పడుకోవటం. ఏమి నీ కబుర్లు?" అడిగాడు ఆనంద్.

"సారీ ఈ మధ్య మరీ పని యెక్కువయ్యింది. నీతో మాట్లాడి దాదాపు మూడు నెలలు అయ్యిందేమో కదా!"

"కాదు కనీసం ఆరునెలలపైనే అయ్యింది. అప్పుడప్పుడు ఒక్కో మెసేజ్ చేస్తావు అంతేగా"

"సర్లే నేను నీకు ఓ ఈ మెయిలు పంపుతాను. లైనులోనే ఉంటాను. అది ఓపెన్ చేశాక చెప్పు.

"ఇదేమి సస్పెన్స్" పక్కనే ఉన్న ల్యాప్‌టాప్ తీస్తూ అన్నాడు ఆనంద్.

"ఆన్ చేస్తున్నానులే కానీ ఏంటి నీ కబుర్లు. ఎప్పుడూ బిజీగానే ఉంటావు. ఏ ఏ దేశాలు తిరిగావు ఈ ఆరునెలల్లో"

"కొత్త ప్రాజెక్టులు, వాటికోసం విపరీతంగా ట్రావెల్ చేశా, ఫ్రాన్స్, రొమేనియా, ఇండియా, సింగపూర్, ఫిలిఫిన్స్, అర్జెంటీనా..." నవ్వింది ప్రియ.

"ఓ రెండు నెలలు ట్రావెల్ లేదులే"

"ఎవరిది ఈ ఫొటో? ఎక్కడో చూసినట్లుంది కానీ గుర్తు రావట్లేదు."

"నీకు రాజి గుర్తుందా? యూనివర్సిటీ కెఫేలో చేసేది. అనితతో మాట్లాడేది"

"ఓ గుర్తు వచ్చింది. చాలా నిదానంగా వుండేది కదా? తనను ఎక్కడ కలిసావు?"

"అప్పట్లోనే తను ఓ రెండవ పెళ్ళి అతన్ని చేసుకుంది గుర్తుందా? ఇద్దరు పిల్లలు అతనికి. ఆ పాప ఇప్పుడు మా ఆఫీసులో చేస్తుంది. అనుకోకుండా మాటల్లో తెలిసింది. ఇట్స్ ఎ స్మాల్ వరల్డ్ కదా"

"చాలా ఆశ్చర్యంగా ఉంది. మాట్లాడావా మరి?"

"లేదు. ఇప్పుడే నాకు కూడా ఫోటో వచ్చింది. క్రిష్టమస్ రోజున ఫోన్ చేస్తా. ఎందుకో చాలా శుభసూచకంగా ఉంది, అని తను కూడా కలుస్తానేమో కదా!"

"స్టీవ్‌తో మాట్లాడను అని భీష్మించుకుని కూర్చున్నావు. సర్లే మన మధ్య ఎప్పుడూ ఉండే గొడవే కదా"

"రాధిక, పిల్లలు ఎలా ఉన్నారు?"

ఆనంద్ శాన్‌హోజేలో ఉద్యోగం చేసేటప్పుడు, తన కొలీగ్ రాధికను ఇష్టపడ్డాడు. తను కూడా తెలుగమ్మాయే. ఇద్దరూ వాళ్ళవాళ్ళ తల్లిదండ్రులను ఒప్పించి పెళ్ళి చేసుకున్నారు. ఇద్దరు పాపలు, లాస్యకు ఎనిమిదేళ్ళు, శ్రావ్యకు ఐదేళ్ళు. ఉద్యోగాలతో రెండు మూడు ఊళ్ళు మారి చివరికి హ్యూస్టన్‌లో ఒక ఫైనాన్సు కంపెనీలో చేస్తున్నాడు.

"అందరూ బాగున్నారు. రాధి షాపింగ్‌కు వెళ్ళింది. నేను బేబి సిట్టింగ్. ఒక్కసారి రాకూడదా ప్రియ. ఎటూ న్యూ ఇయర్ దాకా పెద్ద పని ఉండదు కదా! చాలా రోజులయ్యింది నిన్ను కలిసి"

"నాకు కూడా బ్రేక్ కావాలనిపిస్తుంది ఆనంద్. అలసిపోతున్నా. టిక్కెట్టు కొనుక్కుంటే నీకు చెపుతా. మళ్ళీ మాట్లాడతాను పనివుంది"

"తప్పకుండా రా. ఎదురు చూస్తుంటాను. బై" ఫోన్ పెట్టేశాడు ఆనంద్.

ఎంత విచిత్రమైనది జీవితం. ఆనంద్‌తో కంటే అనితతో బాగా దగ్గరి బంధం తనది. కానీ అనిత దూరం అయ్యింది. ఆనంద్ ఎంతో మంచి స్నేహితుడుగా ఉన్నాడు. తనను అర్థం చేసుకుంటాడు, గౌరవిస్తాడు, తన పిచ్చితనాన్ని మొండితనాన్ని కూడా భరిస్తాడు. తల విదిలించి ఆలోచనల్లో నుండి బైటపడి పనిమీద మనస్సు లగ్నం చెయ్యటానికి ప్రయత్నించింది ప్రియ.

సెలవురోజు కావటంతో అలారం నిద్రలేపలేదు. బద్దకంగా వాచివైపు చూసింది ప్రియ. ఎనిమిది అయ్యింది. వెంటనే గుర్తుకు వచ్చింది ఇవాళ రాజికి ఫోన్ చెయ్యాలని. లేచి బ్రష్ చేసుకుని, కాఫీ మేకర్‌లో తయారుగా ఉన్న కాఫీని కప్పులో పోసుకుని, బాల్కనిలోకి వచ్చింది.

శాండియాగో వాతావరణం ఎత బాగున్నా, డిసెంబరు కాబట్టి చలిగానే వుంది. ప్రియ త్రీ బెడ్రూం కాండోలో ఉంటుంది. ఒక్కతే ఉండటంతో, ఒక బెడ్రూంను ఆఫీసు రూంలాగా మార్చేసింది. వారానికోసారి మెయిడ్ వచ్చి ఇల్లంతా క్లీన్ చేసి వెళుతుంది. ఏదన్నా వంట చేసి పెట్టమని ముందే చెపితే కూడా చక్కగా రుచిగా చేస్తుంది. ప్రియకు ఎక్కువ టైం ఉండదు వంట చేసుకోటానికి, కానీ వంట చెయ్యాలన్న మూడ్ వస్తే మాత్రం ఓపికగా చేస్తుంది.

కాఫీ తాగటం పూర్తిచేసి సోఫాలో కూర్చుని డేవిడ్‌కు ఫోన్ చేసింది.

"మెర్రి క్రిస్మస్ స్వీట్ హార్ట్" ఫోన్ తీస్తూనే అన్నాడు డేవిడ్

"మెర్రి క్రిస్మస్. హౌ ఈజ్ పారిస్?" అడిగింది ప్రియ.

"నువ్వు లేవు కదా చాలా బోరింగ్."

"అందమైన అబద్ధాలు బాగానే చెపుతావు. ఒకోసారి బాగానే ఉంటాయి అవి కూడా" నవ్వేసింది ప్రియ.

"సరే నేను మళ్ళీ ఫోన్ చేస్తాను.చాలా మాట్లాడాలి నీతో" అంటూ ఫోన్ పెట్టేసింది.

శ్వేతకు ఫోన్ చేసింది "హాయ్ స్వేత ఎలా వున్నావు?"

"మెర్రి క్రిస్మస్. ఒన్ మినిట్ ఫోన్ ఇస్తున్నాను."

"హాయ్ రాజి ఎవరో గుర్తుపట్టు.." చిలిపిగా అడిగింది ప్రియ.

"ఎవరో తెలియట్లేదండి. ఎవరు మీరు?" అదే గొంతు, నెమ్మదిగా బెరుకుగా.. ఏమీ మారలేదు రాజి.

"అబ్బా అంత తొందరగా చెప్పేస్తానా? కొంచెం ఆలోచించు."

కొంచెం నిశ్శబ్దం.

"రాజి తొందరగా కనుక్కో"

"నావల్ల కావట్లేదు. సారీ నిజంగా తెలియట్లేదు"

"ఓ పదిహేను సంవత్సరాలు వెనక్కి వెళ్ళు. కాలేజి కేఫే..."

"ప్రియా..." రాజి గొంతులో విపరీతమైన ఆశ్చర్యం, ఆనందం.

"అవును నేనే. హమ్మయ్య గుర్తుపట్టావ్" నవ్వేసింది ప్రియ.

"నేను ఇంకా గుర్తున్నానా? నీకు శ్వేత ఎలా పరిచయం అయ్యింది? ఇంకా నమ్మలేకపోతున్నా" రాజి గొంతులో సంభ్రమం.

"అవన్నీ శ్వేతని అడుగు. ఇద్దరం ఒకే కంపెనీలో చేస్తున్నాం అనుకోకుండా తెలిసింది మీ అమ్మాయిని. ఏంటీ నీ విశేషాలు చెప్పు"

"నాదేముంది మామూలే. ఇంటిపని, పిల్లల పని. ఇద్దరూ పెద్దవాళ్ళయ్యారు. సాత్విక్ కాలేజీలో చదువుతున్నాడు. నీ కబుర్లు చెప్పు. పిల్లలెంతమంది. అనిత ఎక్కడుంది?"

"స్టాప్! స్టాప్! అన్నీ ఒకేసారి అడిగేస్తున్నావు. పెళ్ళి చేసుకోలేదు నేను, సో నో పిల్లలు. ఇకపోతే అనిత ఎక్కడుందో తెలియదు. కాలేజీ అయ్యాక ఓ రెండేళ్ళకే తనతో లింక్ తెగింది. అదొక పెద్ద కథలే. మళ్ళీ ఎప్పుడన్నా చెపుతాలే. నీకు ఎంతమంది గుర్తున్నారో తెలియదు కానీ, అప్పట్లోని నా ఫ్రెండ్స్ అందరిలో ఆనంద్ ఒక్కడితోనే ఇంకా టచ్‌లో ఉన్నా. టెక్సస్‌లో ఉంటాడు తను. ఇద్దరు పిల్లలు."

"చాలా బాగుంది ప్రియ. ఇన్నాళ్ళకు ఇలా మాట్లాడుకోవటం. అప్పటి ఆ రోజుల్ని, మీ స్నేహాన్ని, నువ్వు అనిత నాకు ఎంత ధైర్యం చెప్పేవారో ఇప్పటికీ తలచుకుంటా. మీ అమ్మగారు ఎలా ఉన్నరు ప్రియ?"

"నా ఉద్యోగం వచ్చాక అమ్మ వస్తూ పోతూ ఉండేది. నాకు గ్రీన్ కార్డు తొందరగానే వచ్చింది. సిటిజన్ అవుతూనే అమ్మకు కూడా స్పాన్సర్ చేసి నా దగ్గరే ఉంచుకుందామనుకున్నా. నేను సిటిజన్ అయిన రెండునెలలకు తెలిసింది. అమ్మకు కడుపులో కాన్సర్ అని, ఆఖరి స్టేజ్‌లో కనుక్కున్నారు చివరి రోజుల్లో చాలా బాధపడింది. నేను రెండు నెలలు సెలవు పెట్టి

తన చివరిరోజుల్లో అక్కడే ఉన్నా. ఇది జరిగి నాలుగేళ్ళయ్యింది. అమ్మ వెళ్ళిపోయాక, ఇండియాతో సంబంధం తెగిపోయింది"

"నేను కూడా పెళ్ళి అయ్యాక వీసా మార్చుకుని తిరిగి రావటానికి దాదాపు రెండేళ్ళు పట్టింది. కొత్త కాపురం, పిల్లలు - ఇవన్నీ కాస్త అలవాటయ్యి స్థిమితపడటానికి ఇంకో రెండేళ్ళు. అనిత వాళ్ళ అక్కకు ఫోన్ చేశా, నెంబరు మారిపోయిందని వచ్చింది. వేరే ఎవరి నెంబర్లు తెలియదు" రాజి తన విషయం చెప్పింది.

ప్రియతో మాట్లాడుతూ పిల్లల్ని, వేణును మర్చిపోయి బెడ్రూంలోకి వెళ్ళింది రాజి. పరిచయం ఉన్న రోజుల్లో ప్రియతో ఎక్కువ చనువు లేకున్నా ఇన్నాళ్ళ తరవాత కలిసిన ఆనందంలో ఇద్దరూ ఎంతో ఆత్మీయంగా మాట్లాడుకున్నారు.

"ఎంతో బిజీగా ఉంటావేమో ఉద్యోగంలో. ఖాళీ సమయంలో ఏం చేస్తుంటావు? అసలు ఖాళీ ఉంటుందా?" అడిగింది రాజి.

"ఏవో కొన్ని వ్యాపకాలు ఉన్నాయి రాజి. కొన్ని కౌన్సిలింగ్ కోర్సులు చేశాను. సాయంత్రాలు, వీకెండ్లో ఉమెన్స్ హెల్ప్ గ్రూప్ అని ఉంది, అందులో డొమెస్టిక్ అబ్యూజ్, చైల్డ్ విక్టిమ్స్‌కి కౌన్సిలింగ్ చేస్తాను. ఆ సంస్థ తరపున స్త్రీలకు, చిన్నపిల్లలకు వీలైనంత ప్రొటెక్షన్ ఇస్తాం."

"చాలా మంచి పని చేస్తున్నావు ప్రియ. ఏంటో నేను చెయ్యాలనుకునే చిన్న చిన్న పనులు కూడా చెయ్యలేను. పిల్లలు చిన్నవాళ్ళుగా ఉన్నప్పుడు క్షణం తీరిక ఉండేది కూడా కాదు. సాత్విక్ హైస్కూలుకు వచ్చాక కొంచెం పర్లేదు. కానీ కేటరింగ్‌లో ఎప్పుడూ బిజీనే. సంవత్సరం నుండి ప్రతి శనివారం గుడికి వెళుతున్నాను. అక్కడే చేతనైనంత సేవ చేసుకుందామని. ఆ మాత్రం సమయం నాకోసం ఉంచుకోటానికి తల్లక్రిందులైపోయా" రాజి గొంతులో చిన్నగా నిరాశ.

***

**"నాకు సంసార బాధ్యతలు** లేవు కదా రాజి. అందుకే చేయగలుగుతున్నా" ఓదార్పుగా చెప్పినా, ప్రియకు అర్థం అయ్యింది రాజికి ఇంట్లో పెద్దగా స్వతంత్రం లేదని. తను స్మితీషంగా ఉంటే గొంతులో నిరాశ ఉండేదికాదు. తన సంసారం గురించి తృప్తిగా చెప్పేది. పిల్లల గురించి సంతోషంగానే మాట్లాడింది కానీ ఏదో వెలితి.

మొదటిసారి మాట్లాడినప్పుడే ఇలా నిర్ణయించుకోవటం తప్పుగా అనిపించింది.

న్యూ యియర్ కు ఆనంద్ దగ్గరకు వెళ్ళాలని ఉంది. దాదాపు రెండేళ్ళయ్యింది తనను కలిసి. నిన్ను కలవటం ఫోనులోనే అనుకో చాలా సంతోషంగా వుంది రాజి. తొందరలోనే అనితను కలుస్తాననిపిస్తుంది. చాలాసేపు అలాగే కూర్చుండిపోయింది అనితను తలచుకున్నప్పుడల్లా తను ఒక మంచి స్నేహితురాలిని కాలేకపోయాననే అన్న ఆలోచన కృంగదీస్తుంది. తన ఆలోచనను, అభిప్రాయాన్ని అనిత మీద రుద్దాలని చూసింది. తనలాగ అనిత ఆలోచించటం లేదని పైగా అనిత మీద విపరీతంగా కోపం కూడా వచ్చేది.

ఎందుకు దూరం అయ్యింది. అయ్యాక మర్చిపోగలిగిందా? నలభైఏళ్ళ వయస్సు కనీసం ఇప్పుడన్నా మెచ్యూర్డ్‌గా ఆలోచించాలి. అనితకు ఉన్న మెచ్యూరిటీ తనలో లేదు.

లేచి ల్యాబ్ టాప్ ఆన్ చేసి ఆనంద్ దగ్గరకు టిక్కెట్టు కొనుక్కుని, ఆనంద్‌కి ఫ్లైట్ డిటైల్స్ పంపింది.

ఫ్లైట్ దిగి సూట్‌కేసు, హేండ్‌బ్యాగ్‌తో వస్తున్న ప్రియను చూసి చెయ్యి ఊపాడు ఆనంద్.

"ఇంత గ్లామరస్‌గా ఉంటే ఎలా ప్రియ? వయస్సుతో పాటూ కొంచెం మారాలి. నా కూతురేమో అనుకుంటారు కొన్నాళ్ళు పోతే." ప్రియ భుజాల చుట్టూ ఆపా?య్యంగా చెయ్యివేస్తూ అన్నాడు.

"అంతొద్దులే పద"

ఆనంద్ సిటీకి దూరంగా ఉంటాడు. కాస్త పల్లెటూరి తరహాలో చుట్టూ పొలాలు ఆవులు, గుర్రాలు చూస్తూ "ఎంత బాగుందో ఇక్కడ, కాంక్రిట్ జంగిల్‌కు దూరంగా"

"ఇంకా పెళ్ళి చేసుకోవాలనిపించటం లేదా?"

"ఇదిగో రాగానే మొదలెట్టావా? వెళ్ళిపొమ్మంటావా తిరిగి?" చిరుకోపంతో చూసింది.

"ఏంటి నీ ప్రాబ్లం ఇంటికి రాగానే మనల్ని ప్రేమించే వాళ్ళు, మనం ప్రేమించే వాళ్ళు ఎదురొస్తే ఎంతబాగుంటుందో తెలుసా?"

"సరే ఓ కుక్కపిల్లని పెంచుకుంటాణ అదీ ప్రేమగానే ఉంటుంది. పైగా పోట్లాటలు, అలకలు, సాధింపులు ఉండవు" చిలిపిగా నవ్వింది.

"ఏమంటున్నాడు మీ డేవిడ్" ఓరగా చూస్తూ అడిగాడు.

"అబ్బా ఆపు నీ గోల"

"సీరియస్ ణగా అడుగుతున్నా. డేవిడ్ నీకు కనీస్మ నాలుగేళ్ళుగా తెలుసు ఫన్ లివింగ్, మంచి పొజిషన్లో ఉన్నాడు. నువ్వంటే బాగా ఇష్టం, నేను కలిసాను కదా రెండుసార్లు. నీకు కూడా అతనంటే ఇష్టం అని అతని గురించి మాట్లాడిన ప్రతిసారి అర్థం అవుతుంది. మరి పెళ్ళి చేసుకుని ఒకే ఇంట్లో ఉండొచ్చు కదా"

"నీకు కొన్ని అర్థం కావులే వదిలెయ్యి. పిల్లల కబుర్లేంటి?" బైటకు చూస్తూ మాట మార్చింది.

చిన్నగా నిట్టూర్చాడు ఆనంద్. ఎప్పుడు పెళ్ళిమాట ఎత్తినా ఇలాగే మాట మారుస్తుంది. తనకంటూ ఎవరున్నారూ. కొంచెం సీరియస్‌గా అడిగితే "ఇప్పుడు బాగానే ఉన్నాను కదా. పెళ్ళి చేసుకోవటం మూలాన పొందే లాబం ఏంటి? నాకున్న బిజీ లైఫ్‌లో పిల్లల్ని కని వాళ్ళకు టైం కేటాయించలేను" అని మాట దాటేస్తుంది.

ఇంటికి వెళ్ళేదాక పిచ్చాపాటి మాట్లాడుకున్నారు. ఆనంద్ ఉండేది మంచి లొకాలిటీ. ఎస్టేట్ హోమ్స్ అంటారు. ఎకరం పైగా స్థలంలో పెద్ద ఇల్లు.

గరాజ్‌లో కారు పార్క్ చేసి సూట్‌కేస్ తీసుకుని ఇంట్లోకి వెళ్ళాడు ఆనంద్. అతని వెనకాలే నడిచింది ప్రియ.

తలుపు తీసిన శబ్దంతో లోపలనుండి రాధిక వచ్చింది. జీన్స్, టీ షర్టు జుట్టూ పైకి పెట్టుకుంది క్లిప్పుతో.

"హాయ్ ప్రియ మీరు వచ్చేటప్పటికి కాస్త ఫ్రెష్ అవుదామనుకుంటే కానీ ఈ పిల్లల గోల, బైట ఆటలు" నవ్వుతూ ఎదురొచ్చింది.

"అరే ఏంటీ సంజాయిషీలు. ఎలా ఉన్నావు?" రాధికను ఆప్యాయంగా హత్తుకుంది ప్రియ.

రాధికతో కూడా మంచి స్నేహం ఉంది ప్రియకు. సరదాగా నవ్వుతూ, నవ్విస్తూ ఉంటుంది. ఆనంద్‌కు తగిన సహచరి.

"ఏరి వాళ్ళిద్దరూ?" అడిగాడు ఆనంద్.

"బైట ఆడుకుంటున్నారు. చలిగా ఉంది అని ఇందాకటినుండి అడుగుతున్నా నా వల్లకాదు ఇక వాళ్ళతో" నవ్వింది రాధిక.

ఆనంద్ బైటకు వెళ్ళి ఏమి చెప్పాడో కానీ, పిల్లలు లోపలికి వచ్చారు.

"ఎంత పెద్దవాళ్ళయ్యారు. శ్రావ్య మరీను. మరీ ఇన్నాళ్ళయ్యిందా నేను కలిసి"

పిల్లలు సిగ్గుగా ఆనంద్ వెనకాల ఉండిపోయారు.

"ప్రియ ఆంటీ గుర్తులేదా లాస్యా. హల్లో చెప్పవేంటి" మృదువుగా గుర్తు చేసింది రాధిక.

"మీ కోసం ఏం తెచ్చానో చూడండి కం హియర్" సూట్ కేస్ తెరుస్తూ పిలిచింది ప్రియ.

తాను తెచ్చిన బొమ్మలు, చాక్లెట్లు పిల్లలిద్దరికి ఇచ్చింది.

"ఇన్ని తెచ్చావేంటి? వీళ్ళకు బొమ్మలు ఎక్కువయ్యాయసలు దేనితోనూ రెండు రోజులకంటే ఆడరు. "

"నీకెందుకు మధ్యలో మేమందరం ఒక పార్టీ, ఎంత ముద్దుగా ఉన్నారో. నీ పోలిక రాలేదు అందుకే ఇంత క్యూట్‌గా ఉన్నారు" ఆనంద్ వైపు చూసి నవ్వింది ప్రియ.

"రాధిక – ఈ డ్రెస్సెస్ తెచ్చాను, పిల్లల సైజ్ ఊహించి కొన్నాను, సరిపోతాయో లేదో, లేకుంటే ఇక్కడ మేసీస్‌లో మార్చేద్దాం" అని ప్యాకెట్టు రాధిక చేతికి ఇచ్చింది.

"టీ తాగుతావా ప్రియ లేక కాఫీనా?" ప్లేట్లలో స్వీట్సు, చక్కిలాలు పెడుతూ అడిగింది రాధిక.

"టీ తాగుతా. చాలా రోజులయ్యింది, మన ఇండియన్ అల్లం టీ తాగి. "అంతగా అడగాలా" పిల్లల్ని స్నానం చెయ్యటానికి వాళ్ళ రూమ్స్‌లోకి పంపి వంటింట్లోకి నడిచింది రాధిక.

రాధికతోపాటు వంటింట్లోకి వచ్చింది ప్రియ.

"ఏంటి న్యూయిర్ ప్లాన్స్. ఏమైనా పార్టీలు ఉన్నాయా?" అనుకోకుండా ఈ ట్రిప్ వేశాను.

"అలా ఏమీ లేదు ప్రియ. చాలా హ్యాపీగా ఉంది నువ్వు రావటం. చాన్నాళ్ళయింది కదా మనం కలసి"

అందరూ కలిసి భోజనం చెయ్యటం మధ్య మధ్యలో పిల్లల పేచీలు, రాధిక ఆనంద్ వారిని సముదాయించి నచ్చచెప్పే పద్ధతి ఎంతో ముచ్చటగా అనిపించింది.

పిల్లల్ని నిద్రపుచ్చటానికి తీసుకువెళుతూ చెప్పింది రాధిక "మీ ఇద్దరి కబుర్లు. ఇప్పుడే అవ్వవని తెలుసు. గుడ్ నైట్"

"వైన్ తీసుకుంటావా ప్రియ?"

"యా! గివ్ మి సమ్" సోఫాలో కాళ్ళుపైకి మడతపెట్టుకుని, క్విల్ట్ కప్పుకుని సౌకర్యంగా కూర్చుంది ప్రియ.

వైన్ గ్లాసు ఒకటి ప్రియకు ఇచ్చి, ఒకటి తాను తెచ్చుకుని పక్కనే ఉన్న సోఫాలో కూర్చున్నాడు.

"చెప్పు ఎలా ఉంది నీ జాబ్. బాగా ట్రావెల్ చేస్తున్నావు కదా" వైన్ తాగుతూ అడిగింది ప్రియ.

"ఒక్కోసారి తప్పదు కానీ ఇదివరకటి కంటే తగ్గించా. అందుకే జాబు మారాను. శ్రావ్య చిన్నపిల్లగా ఉన్నప్పుడు రాధిక బాగా ఇబ్బంది పడింది. నేనేమో కన్సల్టెన్సీతో బాగా తిరిగేవాడిని, పాపం ఒక్కతే ఎలా తిప్పలు పడిందో. ఇంటిని చూసుకోటానికి జాబు కూడా మానేసింది కదా. వాళ్ళ అమ్మా నాన్న కొన్నాళ్ళు ఉన్నారు. కానీ రాధీనే కదా బైట పనులు అన్నీ చూసుకోవాలి. అందుకే ఆ పాత జాబు వదిలేసి దీంట్లోకి మారాక బాగుంది.

"నీ ఫ్యామిలీని చూస్తుంటే చాలా ముచ్చటగా ఉంటుంది ఆనంద్. ఐయాం ష్యూర్ మీకు కూడా అందరి జంటల్లాగే పోట్లాటలు, కీచులాటలు ఉండొచ్చుకానీ మీ ఇద్దరి మధ్య ఉండే అవగాహన, ప్రేమ చాలా బాగుంటుంది. రాధిక ఒకసారి చెప్పింది 'ఆనంద్ నా బెస్ట్ ఫ్రెండ్' అని. ఒక భర్తకు ఇంతకంటే మంచి కాంప్లిమెంట్ దొరకదేమో?"

"ప్రేమలో ఉండే మహిమ ఇదేనేమో" నవ్వాడు ఆనంద్

"అవతలి వాళ్ళు ఒకవేళ పొరపాట్లు చేసినా అర్థం చేసుకుంటాం. చాలామంది మొదటి చూపులోనే ప్రేమించాం అంటారు. అది ఆకర్షణ. ఒక వ్యక్తిని ప్రేమిస్తున్నామని మనకు తెలియకుండానే జరిగిపోతుంది. వారి సాంగత్యంలో మనం ఎలా ఉంటున్నామో తెలియాలంటే కొంత సమయం పడుతుంది - అప్పుడే మనకు అర్థం అవుతుంది ఆ వ్యక్తి లేకుంటే మన జీవితం సంపూర్ణం కాదని, కోపం రావొచ్చు, మాట్లాడుకోకుండా కొన్ని రోజులు ఉండొచ్చు, కానీ మానసికంగా దూరంగా ఉండలేరు"

కొద్ది క్షణాలు మౌనంగా ఉండిపోయారు లేచి వెళ్ళి తన గ్లాసులో ఇంకొంచెం వైన్ తెచ్చుకుని కూర్చున్నాడు.

"ప్రియ మనం దాదాపు పదిహేడు సంవత్సరాలుగా స్నేహితులం. నీతో అన్నీ చెప్పగలుగుతాను. రాధికను ప్రేమిస్తున్నా అని మొదట నీకే చెప్పాను. ఇన్నాళ్ళూ నీ అభిప్రాయాలకు గౌరవం ఇచ్చి కొన్ని విషయాల్లో పట్టుపట్టలేదు. కానీ ఇవాళ్ళ అడుగుతున్నా. ఎందుకు నీ జీవితాన్ని డేవిడ్‌తో పంచుకోవు. పోనీ తనంటే నీకు ఇష్టం లేదా అంటే అదీ కాదు. కమిట్ మెంట్ అంటే భయమా?"

చిన్నగా నిట్టూర్చింది ప్రియ.

"నా జీవితంలో చిన్నప్పుడు జరిగిన సంఘటన నీకు తెలుసు. బహుశా ఆ తర్వాత నేను చాలా సినికల్‌గా అయిపోయా. ప్రేమ మీద, రిలేషన్ షిప్స్ మీద నమ్మకం లేదు నాకు. అవసరార్థం ప్రేమ అనే ముసుగు వేసుకుంటారు అనుకునేదాన్ని. మా అమ్మా నాన్న చూడు పెళ్ళి చేసుకున్నారు కాబట్టి ఒకే ఇంట్లో ఉన్నారు. జీవితాంతం కలిసి ఉన్నారు. ప్రేమగా ఉన్నారా? కలిసి ఉండాలి అని సమాజం శాసిస్తుంది, సో .. ఉంటారు. ఇదే నేను చూసిన చాలా కుటుంబాల్లో"

వైన్ గ్లాస్ టేబుల్ మీద పెట్టి మళ్ళీ చెప్పసాగింది.

"మొట్టమొదటి సారి నేను సినికల్‌గా ఆలోచించకుండా గమనించింది అనిత స్టీవ్‌ల ప్రేమ. ఎంత బాగుండేవారు ఇద్దరూ. వారి మధ్య అసూయ, కోపాలు కూడా ఎప్పుడూ చూడలేదు. స్టీవ్‌తో పరిచయం ప్రేమ పెరిగే కొద్దీ అనిత మొహంలో ఒకరకమైన వెలుగుండేది. ఇద్దరూ కలిసి జీవించాలని మనఃస్ఫూర్తిగా కోరుకున్నాను. They were incomplete without each other. కానీ ఏమి జరిగింది. నా నమ్మకం మీద, అనిత అతనిమీద పెంచుకున్న ప్రేమ మీద దెబ్బ కొట్టాడు స్టీవ్. నేను తనను క్షమించలేను. ఇలా గట్టిగా కఠినంగా మాట్లాడుతున్నానని అనిత నన్ను కూడా దూరం పెట్టింది. ఎంత మంచి స్నేహితురాలిని కోల్పోయాను."

"ఎందుకీ మాటలన్నీ ఇప్పుడు ప్రియ. ఎప్పుడో జరిగిందది. ఎవరి పరిస్థితులు ఆలోచనలు వారివి. అందరూ ఒకేలాగా ఆలోచిస్తే ప్రపంచంలో ఇన్ని రకాల మనఃస్తత్వాలు ఎందుకుంటాయి. దానికి డేవిడ్‌తో నీ జీవితం పంచుకోటానికి సంబంధం ఏంటి?" నచ్చచెప్పబోయాడు ఆనంద్.

"ఈ లైఫ్ బాగానే ఉంది కదా. నిజమే ఇద్దరికీ ఒకరంటే ఒకరికి ఇష్టం ఉంది. కామన్ ఫ్రెండ్స్ ద్వారా అయిన పరిచయం చాలా కొద్ది కాలానికి బలపడింది. మంచివాడు, చాలా సరదాగా ఉంటాడు. He respects my work and commitments. ఇద్దరివీ చాలా బిజీ జీవితాలు ఇద్దరమూ విపరీతంగా ప్రయాణాలు చేస్తాం. వారానికి ఓసారి లేకుంటే వీకెండు రెండు రోజులు కలవటానికి మాత్రమే వీలవుతుంది. ఒక్కోసారి అదీ ఉండదు. రెండు వారాలు కలవము. కుదరదు అంతే. కలిసినప్పుడు ఆ టైంను ఎంజాయ్ చేస్తాం. బాగానే ఉంది కదా ఈ ఎరేంజ్ మెంట్ పెళ్ళి చేసుకుంటే ఎక్స్‌పెక్టేషన్స్ పెరిగిపోతాయి. హక్కులు పెరిగి ప్రేమ ఉండదేమో. అవసరమా ఆ చిరాకులు, పోట్లాటలూ?"

ఓ నిముషం మౌనంగా మళ్ళీ చెప్పసాగింది.

"నీకు తెలుసు నేను ఉమెన్స్ హెల్ప్ గ్రూప్‌లో ఎంత ఏక్టివ్‌గా ఉంటానో. ఒక్కోసారి అవసరార్థం అర్థరాత్రి కూడా వెళ్ళి సహాయం చెయ్యవలసి వస్తుంది. ఇంకో వ్యక్తి ఇంట్లో ఉంటే ఆ ఫ్రీడం ఉంటుందా? అసహాయంగా ఉన్న ఆడవాళ్ళు అత్యాచారానికి గురైన చిన్నపిల్లలు, ఆత్మరక్షణ కోస్మ ఇంట్లోనుండి పారిపోయిన వాళ్ళు. ఇలా ఎంతోమంది. నా శక్తి కొద్దీ నేను సహాయం చేస్తున్నా. ఇది నేను ఎవ్వరికోసమూ కాంప్రమైజ్ అయ్యి వదులుకోలేను" తీవ్రంగా అన్నది ప్రియ

"నిజమే ఇది నీ జీవితం. కానీ నీ జీవితం సంగతి డేవిడ్‌కు తెలుసు. అతనితో మాట్లాడు" ఆలోచించు ప్రియ. ఎంతో తెలివిగలదానివి. కానీ నీ పర్సనల్ లైఫ్‌లో ఎస్కేపిజం ఎక్కువగా ఉంది. నీలో ఉన్న ఇన్‌సెక్యూరిటీపై గెలుపు"

ప్రియ ఏమీ మాట్లాడక పోవటం చూసి "పద చాలా లేట్ అయ్యింది. పడుకుందా" అంటు లేచాడు ఆనంద్.

చాలాసేపు నిద్రపట్టలేదు ప్రియకు. ఎన్నో ఆలోచనలు, మనసంతా సంఘర్షణ కలగా పలగమైలన్ ఆలోచనలు.

ఎన్నో నెలలుగా తొక్కిపెట్టిన ఆలోచనలు, ఆనంద్ మాటల వలన, తేనెతుట్టె పై రాయి విసిరితే, తేనెటీగలని ఒక్కసారే దాడి చేసినట్లు.

ఎందుకు డేవిడ్‌తో జీవితం పంచుకోలేకపోతుంది. రెండేళ్ళ క్రితం ప్రపోజ్ చేశాడు. వద్దని తిరస్కరించింది.

తను నిజంగా ఎవ్వరినీ ప్రేమించలేదేమో. కానీ డేవిడ్ అంటే నిజంగానే చాలా ఇష్టం. మరి ఇష్టమైన వారితో జీవితం పంచుకోవాలన్న సహజమైన కోరిక తనలో ఎందుకు లేదు.

టైం చూసుకుంది. శాండియోగోలో పదకొండు అవుతుంది. డేవిడ్ మెలుకువగానే ఉంటాడేమో

"నిద్రపోతున్నావా" అంటూ డేవిడ్‌కు మెసేజ్ చేసింది.

ఓ నిమిషం పాటు ఏమీ సమాధానం రాలేదు. నిద్రపోయాడేమో అని అనుకుంటుండగా ఫోన్ మోగింది.

"సారీ ఊరికే మెసేజ్ చేశా" సంజాయిషీ ఇచ్చింది.

"ఏమైందీ? ఆర్యూ ఓకే?" డేవిడ్ గొంతు నిద్రలో ఉన్నట్లుగా ఉంది.

చాలా గిల్టీగా అనిపించింది ప్రియకు.

"రియల్లీ సారీ నిద్రపట్టలేదు. నువ్వు నిద్రపోయి వుంటావనుకోలేదు"

"ఏమీ పర్లేదు. ఎందుకో తొందరగా నిద్రపట్టేసింది. టివి చూస్తూ సోఫాలో నిద్రపోయా. మంచిదయ్యింది. ఇప్పుడు లేచా లేకుంటే రేపు మెడ పట్టేసేది. నువ్వుకూడా లేవు మెడ మసాజ్ చెయ్యటానికి" తేలికగా నవ్వేశాడు.

**"అయినా నీ ఫ్రెండ్ దగ్గరకు** వెళ్ళావు. కబుర్లు చెప్పుకుంటూ, నన్ను మర్చిపోతావేమో ఈ నాలుగురోజులు అనుకున్నా. పర్లేదే అంత మిస్ అయ్యావా నన్ను" నవ్వుతూ మళ్ళీ తనే అడిగాడు "హౌ ఈజ్ ఆనంద్? ఎనీ ప్రాబ్లమ్?"

"ఏంటో చాలా నాస్టాలజిక్‌గా ఉంది. అన్నీ పాత జ్ఞాపకాలు పైగా కొన్ని విషయాల్లో నా ఇన్‌సెక్యూరిటీలు, అన్నీ కలిపి ఒకేసారి.." ఇక మాట్లాడలేనట్లుగా ఆపేసింది.

డేవిడ్ మౌనంగా వింటూ ఉండిపోయాడు. అతనికి తెలుసు ప్రియ మనస్సులోని విషయాలు తొందరగా చెప్పదు. కానీ చెపుతుంటే మొత్తం విని, చివరికి మాట్లాడటమే ఉత్తమం అని.

"అనితను ఎలాగైనా వెతకాలి డేవ్. మళ్ళీ తనను చూడాలి. ఎలా ఉందో? తన సంఘర్షణ సమయంలో నేను తనకు సరైన సపోర్టు ఇవ్వలేదు. ఇంతమంది పరిచయం లేని ఆడవాళ్ళకు సహాయం చేస్తాను, కౌన్సిలింగ్ ఇస్తాను, కానీ నా ఆప్తురాలికి ఏమీ చెయ్యలేదు. నా దృక్పదంతో ఆలోచించాను కానీ తన పరిస్థితిని అర్థం చేసుకోలేదు. ఎంతో వెతికా, ఫేస్‌బుక్కులో లేదు, కనీసం లింక్‌డిన్‌లో కూడా లేదు" దిగులుగా అయిపోయింది ప్రియ.

"ఏదో ఒకటి తప్పకుండా ఆలోచిద్దాం. ఈ నాలుగు రోజులు హాయిగా ఆనంద్ వాళ్ళ ఫ్యామిలీతో రిలాక్స్ అయ్యిరా"

"థాంక్యూ డేవ్. న్యూ యియర్‌కు నీ దగ్గరలేకుండా ఇలా వచ్చేశాను. ఏం ప్లాను చేస్తున్నావు న్యూ యియర్ పార్టీ?"

"నా ఫ్రెండ్ ఇచ్చే క్రూజ్ పార్టీకి వెళతాను. నా గురించి వర్రీ అవ్వకు. చాలామంది అందమైన అమ్మాయిలు ఉంటారంట ఆ పార్టీలో" చిలిపిగా నవ్వాడు.

"యా! నన్ను మేనేజి చెయ్యటం నేర్చుకో ముందు, తరవాత మిగతా అమ్మాయిలవైపు చూద్దువుకాని..." నవ్వేసింది ప్రియ.

కాసేపు సరదాగా మాట్లాడి ప్రియను నవ్వించాడు డేవిడ్

లేటుగా పడుకోవటం వలనో లేక ఆఫీసుకు వెళ్ళాల్సిన అవసరం లేకో, మెలుకువ వచ్చేసరికి దాదాపు తొమ్మిది కావొస్తుంది.

ఉలిక్కిపడి లేచి, స్నానం చేసి, జీన్స్ స్వెటర్ వేసుకుని కిందకు వెళ్ళింది.

ఆనంద్, రాధిక సోఫాలో పక్కపక్కనే కూర్చుని కాఫీ తాగుతున్నారు. ఆనంద్ ఒక చెయ్యి రాధిక భుజం చుట్టూ ఉంది. రాధిక ఏదో నెమ్మదిగా చెపుతుంది. ఇద్దరూ ప్రియను గమనించుకోలేదు. భలే ఉన్నారు అనుకుంటూ ఫోన్ నుండి ఫోటో తీసింది ప్రియ.

ఆ శబ్దానికి తల ఎత్తి చూశారు ఇద్దరూ.

"సారీ రొమాంటిక్ మూమెంట్‌ను డిస్టర్బ్ చేశా. కానీ భలే క్యూట్‌గా ఉన్నారు ఇద్దరూ."

"ఏమీ డిస్టర్బ్ చెయ్యలేదు కానీ.. రా. బాగా నిద్రపట్టిందా?"

"కాఫీ తెస్తాను" అంటూ రాధిక లేవబోతుంటే ఆపింది ప్రియ.

"ఏమీ హడావుడి లేదు. నువ్వు ప్రశాంతంగా తాగు. ఇంత నింపాదిగా కూర్చుని కాఫీ తాగి ఎన్నాళ్ళయ్యింది నీకు?"

"అమ్మా..." పై గదిలో నుండి శ్రావ్య గొంతు వినబడింది.

"ఇంకేంటి ప్రశాంతత - అయిపోయింది" నవ్వుతూ లేచి వెళ్ళింది రాధిక.

పిల్లలను లేపి రెడీ చేసి తీసుకొచ్చింది రాధిక. వాళ్ళకు పాలు కలిపి ఇచ్చింది.

అప్పటికే ఆనంద్ ప్రియకు కాఫీ కలిపి ఇచ్చి, టివిలో న్యూస్ చూస్తున్నారు. రోజంతా సరదాగా గడిచింది పిల్లలతో ఆటలు, కబుర్లు..

సాయంత్రం పకోడీలు తింటూ, టీ తాగుతుండగా చెప్పాడు ఆనంద్..

"ఒకటి చెపుతా ప్రియా నీకు. ఆవేశపడకుండా ప్రశాంతంగా విను. నిన్న డేవిడ్ విషయం క్లాసు పీకాడు. ఇవాళ స్టీవ్ గురించా అని తిట్టకు. నీకు తెలుసు కదా. నేను స్టీవ్ క్లోజ్ ఫ్రెండ్స్, అలాగే నువ్వూ నేను కూడా. అందుకే నిస్సందేహంగా చెపుతున్నాను. స్టీవ్ విషయంలో నువువ్ కఠినంగా వన్ సైడెడ్ గా ఆలోచిస్తున్నావు.  నేను ఎన్నిసార్లు నీకు చెప్పటానికి ప్రయత్నించినా నువ్వు వినలేదు. కానీ ఇక నేను చూస్తూ ఊరుకోలేను. మనకు మనఃస్పర్ధలు వచ్చినప్పుడు చిన్నవాళ్ళం. అందరం కుడి ఎడంగా నలభై ఏళ్ళ వయస్సులో ఉన్నాం. కనీసం ఇప్పుడన్నా మెచ్యూర్డ్‌గా ఆలోచించలేవా? అందరం కెరియర్‌లో ఎంతో సక్సెస్ అయ్యాం, ఎంతో సాధించాం కానీ ఏమి లాభం? ఈగోలను పక్కకు పెట్టి ఒకరినొకరు అర్థం చేసుకోకపోతే స్నేహానికే అర్థం లేదు. నిజమే స్టీవ్ మనం అందరం అనుకున్నట్లుగా చెయ్యలేదు. కానీ తన పరిస్థితుల వలన ఒక రకమైన నిస్సహాయతలో అతను నిర్ణయం తీసుకున్నాడు."

గట్టిగా ఊపిరి తీసుకుని, కొంచెం ఆవేశం తగ్గించుకుని ప్రియవైపు చూశాడు. చేతిలోని టీ కప్పు వైపు దీక్షగా చూస్తుంది ప్రియ. మొహంలో ఏ భావం కనపడలేదు.

"రేపు స్టీవ్‌ని రమ్మన్నాను ప్రియ. Its high time we all meet"

"స్టీవ్ ఇక్కడే ఉంటాడా?" ఆశ్చర్యంగా అడిగింది.

"లేదు కాలిఫోర్నియా ఫ్రీమాంట్‌లో ఉంటాడు.  ప్రొద్దున ఫోన్ చేశాను. రేపు ప్రొద్దున వస్తున్నాడు. ఒక రెండు రోజులు ఉంటాడు"

ప్రియ మాట్లాడకపోవటం చూసి మళ్ళీ తనే అన్నాడు.

"ప్రియా ఎక్కడెక్కడినుండో వచ్చాం. అందరం కాలేజీలో ఎంతో క్లోజ్ అయ్యాం. కొన్ని స్నేహాలు విడిపోయాక తేలిపోతాయి. మనకు అంతకు ముందూ ఫ్రెండ్స్ ఉన్నారు, తరవాత కూడా కొత్త ఫ్రెండ్స్ అయ్యారు. కానీ మనందరి బంధం చాలా బలంగా అనిపిస్తుంది. మాట్లాడుకున్నా మాట్లాడుకోకపోయినా. ఒప్పుకుటావా?"

"ఎందుకింత క్లాసు పీకుతున్నావు?" టీ కప్పు టేబులు మీద పెడుతూ నవ్వింది ప్రియ.

"హమ్మయ్య నన్ను కొట్టకుండా, అరవకుండా నవ్వినందుకు థాంక్స్"

"మరీ అంత రాక్షసిని కాదులే. ఇన్నాళ్ళ తరవాత స్టీవ్‌ని కలవబోతున్నాను ఏదోలా ఉంది" సాలోచనగా అన్నది ప్రియ.

ఆనంద్ ఏదో అనబోతుండగా పిల్లలతో రాధిక వచ్చింది.

"పిల్లలు బైటకు వెళదాం అని గోల చేస్తున్నారు. ఎక్కడికైనా వెళదామా?"

"ఎక్కడికి వెళదాం కన్నలూ" చిన్న కూతురిని ఒళ్ళోకి లాక్కుంటూ ముద్దుగా అడిగాడు ఆనంద్.

"డిస్నీ మూవీ.."

"అబ్బా నీ ప్రిన్సెస్ మూవీస్ నేను చూడలేనురా.." బుగ్గమీద ముద్దుపెడుతూ చెప్పాడు.

"ప్రిన్సెస్ కాదు నాన్న యానిమల్స్ ఉంటాయి" అక్క చెప్పిన మాటలు గుర్తుపెట్టుకుని చిలకలాగా చెప్పింది శ్రావ్య.

"సరే నేను తీసుకువెళతా మిమ్మల్ని. అమ్మకు కాస్త బ్రేక్ ఇద్దాం. ప్రియా. నువ్వు రాధిక వేరే మూవీకి వెళ్ళండి. వెబ్‌లో చూస్తా ఏమి మూవీస్ ఉన్నామో.

"లేదు మీరందరూ వెళ్ళండి. నేను ఆఫీస్ పని చేసుకుంటా కాసేపు" తప్పించుకోబోయింది ప్రియ.

"రా ప్రియ! పిల్లలతో కార్టూన్లు చూడటమే సరిపోతుంది నాకు. మనం మంచి మూ వీకి వెళదాం" బలవంతం చేసింది రాధిక. బయలు దేరక తప్పలేదు ప్రియకు.

రాధిక కిచెన్‌లో పనిచేసుకుంటుండగా, స్నానం చేసి రెడీ అయిన ప్రియ కిచెన్‌లోకి వచ్చింది.

"ఇంత ప్రొద్దున్నే ఏంటి హడావుడి పడుతున్నావ్"

"హడావుడి ఏమీలేదు. బ్రేక్‌ఫాస్ట్‌కి దోసెలు వేద్దామని, దాంట్లోకి ఆలూ కూర, చట్నీ రెడీ చేస్తున్నా."

"చెప్పు ఏం చెయ్యాలో నేను కూడా సాయం చేస్తాను. ఈ ఉల్లిపాయలు సన్నగా తరగనా?" అంటూ ఉల్లిపాయలు సన్న చీలికలుగా చకచకా తరగటం మొదలెట్టింది.

"అరే! ముందు కాఫీ తాగు ప్రియ" రాధిక వారిస్తున్నా వినలేదు ప్రియ.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ కూర, చట్నీ రెడీ చేసే సరికి, తలుపు తీసిన చప్పుడూ, ఆనంద్ గొంతు వినపడింది. అనుకోకుండా నిటారుగా అయ్యింది ప్రియ. 'స్టీవ్ వచ్చాడు' అనుకుంది.

కొబ్బరి పచ్చడిలో తాలింపు వేస్తూ, ఓరగా ప్రియ వైపు చూసింది రాధిక. ఆనంద్ ద్వారా అంతా తెలుసు రాధికకు కూడా. ప్రియ మొహంలో ఏ ఎక్స్‌ప్రెషన్ లేదు. చేతులు కట్టుకుని, తీవ్ర ఆలోచనలో ఉన్నట్లుగా మొహం సీరియస్‌గా ఉంది.

చేతులు తుడుచుకుని ముందు గదిలోకి వెళ్ళింది రాధిక.

గుండె వేగంగా ఎందుకు కొట్టుకుంటుంది? ముందు గదిలోని మాటలు అస్పష్టంగా వినిపిస్తున్నాయి.

దీర్ఘంగా శ్వాస తీసుకుని వదిలింది ప్రియ. తనను తాను సంభాళించుకుని, ముందు గదిలోకి నడిచింది ప్రియ.

స్టీవ్ – పదిహేను సంవత్సరాల తరవాత –

ప్రియను చూసి చిరునవ్వుతో పలుకరించాడు స్టీవ్.

"హాయ్ ప్రియ. హౌ ఆర్యూ" అదే చిరునవ్వు, అదే ఆప్యాయత.

గొంతు సవరించుకుంది. "ఐ యామ్ ఫైన్. హౌ ఆర్ యు స్టీవ్?"

"రండి అందరం బ్రేక్ఫాస్ట్ చేద్దాం. ఆకలిగా ఉంది" ఇబ్బందిగా ఉన్న వాతావరణాన్ని తేలిక చేయటానికి అన్నాడు ఆనంద్.

రాధిక, ప్రియ వంటింట్లోకి వెళ్ళారు దోశలు వెయ్యటానికి. పిల్లలు కూడా లేవటంతో పిల్లలకు, ఆనంద్, స్టీవ్‌లకు వేడివేడిగా దోశలు వేసి వాళ్ళు కబుర్లు చెప్పుకుంటూ తినేశాక, రాధిక ప్రియ కూడా తినటానికి కూర్చున్నారు.

పిల్లల్ని ఆడుకోటానికి పంపి, అందరికి కాఫీలు తీసుకొచ్చాడు ఆనంద్.

"ఆనంద్ ద్వారా నీ విషయాలు ఎప్పటికప్పుడు తెలుస్తూనే ఉన్నాయి. చాలా ఆనందంగా ఉంది ప్రియ. ముఖ్యంగా ఉమెన్స్ హెల్ప్ గ్రూప్ - వెరీ ప్రౌడ్ ఆఫ్ యూ"

"కానీ నీ విషయాలు ఏమీ అడగలేదు స్టీవ్" గిల్టీగా మనస్సులో అనుకుంది.

"నీ కబుర్లు చెప్పు స్టీవ్"

"ఏముంది రెగ్యులర్ లైఫ్. బే ఏరియాలో ఒక సాఫ్ట్ వేర్ కంపెనీ పెట్టాను. బాగానే ఉంది. దాదాపు ఏడేళ్ళ క్రితం అమ్మ చనిపోయింది. చెల్లెలు లిండా గుర్తుందా? నువ్వు నమ్ముతావో నమ్మవో, తను ఒక ఫార్మర్‌ని పెళ్ళి చేసుకుని నెబ్రాస్కాలో సెటిల్ అయ్యింది. తను సిటీ లైఫ్‌కు దూరంగా ఉంటుందని ఎప్పుడూ అనుకోలేదు. ఎప్పుడూ పార్టీలు, ఫ్రెండ్స్ అంటూ ఉండేది. ఈ మధ్యే తనకు మూడో కొడుకు పుట్టాడు. ఆడపిల్ల పుట్టేదాక కంటూనే ఉంటుందంట" నవ్వుతూ చెప్పాడు స్టీవ్.

మాట్లాడుతున్న స్టీవ్‌ని గమనిస్తుంది ప్రియ. జుట్టు తెల్లబడింది. చిరునవ్వు చెదరలేదు అప్పటిలాగానే. కానీ కళ్ళు తేడాగా ఉన్నాయి. ఆ నవ్వు కళ్ళదాకా చేరటం లేదు. ఏ ఫీలింగ్ లేదు ఆ కళ్ళల్లో. నిర్లిప్తంగా ఉన్నాయి. అనితకు ఎంతిష్టమో ఆ కళ్ళు. ఎంత వర్ణించేదో.

మాట్లాడాలని ఉన్నా గొంతు పెగలటం లేదు ప్రియకు. ఏదో ఉద్వేగం మనస్సును నొక్కుతుంది. ఇంకొంచెం సేపు ఇక్కడే కూర్చుంటే తన కళ్ళల్లో చిప్పిల్లే నీళ్ళు వీళ్ళకు కనపడతాయేమో అన్న భయం వేసింది.

"రాధికకు కిచెన్‌లో హెల్ప్ చేస్తాను. మీరు మాట్లాడుకోండి" అంటూ లేచింది.

"నో ప్రియ నువ్వు కూర్చో. మీ ఇద్దరూ మాట్లాడుకోవాల్సింది చాలా ఉంది. నేను రాధి కిచెన్‌లో ఉంటాం. కాఫీ, టీ, డ్రింక్స్ ఇలాంటివి ఏమన్నా కావాలంటే ఒక కేక పెట్టండి" ప్రియను ఆపేశాడు ఆనంద్.

డైనింగ్ టేబుల్ దగ్గర్నుండి లేచి బైట పాటియోలోకి వెళ్ళారు. వాతావరణం కాస్త బాగానే ఉంది. ఆ రోజు పెద్ద చలిలేదు. పాటియో పక్కన చిన్న సన్‌రూం ఉంది, కేన్ కుర్చీలు ఉన్నాయి. అక్కడ కూర్చున్నారు స్టీవ్, ప్రియ. వెచ్చగా హాయిగా ఉంది ఆ రూం.

దాదాపు ఒంటిగంట అవుతుండగా ఆనంద్ సన్‌రూంలోకి వచ్చాడు.

"ఏంటి ఇద్దరికి తిండీ తిప్పలు వద్దా? కనీసం కాఫీ అడగలేదు. సీరియస్‌గా మాట్లాడుకుంటున్నారని నేను డిస్టర్బ్ చెయ్యలేదు."

స్టీవ్, ప్రియ ఇద్దరూ కూడా ఒక ట్రాన్స్‌లో నుండి బైటపడినట్లు చూశారు.

"ఏవో పదిహేనేళ్ళ కబుర్లు, ఒక్క రోజులో అవుతాయా?" దబాయించింది ప్రియ.

"పోనీలే మాటలతో సరిపుచ్చుకుంటే పర్లేదు. ప్రియ ఎక్కడ కొట్టేస్తుందో స్టీవ్‌ను రక్షించాలని లోపల కాచుకు కూర్చుంటే, నా హీరోయిజం చూపే ఛాన్స్ ఇవ్వలేదు" డ్రమెటిక్‌గా అంటూ నవ్వాడు ఆనంద్.

"రండి లంచ్‌కి, ఇప్పటికే లేట్ అయింది" లోపలనుండి రాధిక పిలిచింది.

"హ్యాపి న్యూ యియర్" అందరూ ఒకేసారి గట్టిగా చెప్పారు.

చిన్నది శ్రావ్య కూడా అర్ధరాత్రి దాకా మెలకువుగా ఉంది, ఏంటో సరిగ్గా అర్ధంకాకపోయినా, అక్క ఎక్సయిటెడ్‌గా ఉంది కాబట్టి తనకూ ఉత్సాహమే.

సుష్టుగా బిర్యానీ, చికెన్ కూర తిని, పిల్లలతో గేమ్స్ ఆడుతూ, టివిలో న్యూ యియర్ సెలబ్రేషన్స్ చూస్తూ కేక్ కట్ చేసి కొత్త సంవత్సరాన్ని ఆహ్వానించారు.

"కమాన్ బేబీస్, అందరికి గుడ్‌నైట్ చెప్పండి. ఇంక పడుకోవాలి మీరు" అని పిల్లలు గునుస్తున్నా కనీ వాళ్ళను బెడ్‌రూంలోకి తీసుకు వెళ్ళింది రాధిక.

అందరికి షాంపైన్ గ్లాసుల్లో పోసి ఇచ్చాడు ఆనంద్. "చీర్స్ టు అవర్ ఫ్రెండ్‌షిప్."

"ఛీర్స్" అంటూ ప్రియ, స్టీవ్ షాంపైన్ సిప్ చేశారు.

"నిద్ర రావట్లేదు నాకు. మీరు అలసిపోతే వెళ్ళిపడుకోండి. నేనేమీ అనుకోను" అన్నది ప్రియ.

"ఎప్పుడూ ఉండే నిద్రేలే. ఇన్నాళ్ళకు కలుసుకున్నాం. నాకూ నిద్రరావట్లేదు" అన్నాడు స్టీవ్.

"న్యూ యియర్ రెసొల్యూషన్ ఏంటి?" అడిగాడు ఆనంద్.

"అనితను వెతకటం" స్టీవ్, ప్రియ ఇద్దరూ ఒకేసారి అంటూ గట్టిగా నవ్వేశారు.

సోఫాలో రిలాక్స్‌డ్‌గా కూర్చున్నాడు స్టీవ్.

"నేను కొన్నాళ్ళు ఏంటో అర్ధంలేని కోపంతో అనితతో మాట్లాడలేదు. దానికి తోడు అభిప్రాయ భేదాలు. ఓ రెండేళ్ళ గ్యాప్ తరవాత ఫోన్ చేస్తే, డిస్‌కనెక్టెడ్ అన్న మెసేజ్ వచ్చింది. తన అక్క నెంబరు కూడా మిస్‌ప్లేస్ అయ్యింది. దానితో ఏం చెయ్యాలో అర్ధం కాలేదు. తను పనిచేసే ఆఫీసుకు ఫోన్ చేశా. ఏమీ తెలియలేదు" నిట్టూర్చింది ప్రియ.

"విపరీతంగా డబ్బు సంపాదించాను. ఇన్నాళ్ళుగా తను ఎక్కడో ఒకచోట సంతోషంగా ఉండే ఉంటుందన్న నమ్మకంతో వెతకలేదు. కానీ నాకు కూడా ఈ మధ్య ఓ తపన మొదలయ్యింది. I want to make sure she is happy. I always prayed for her happiness. ఈ మధ్య ఒక ప్రైవేట్ డిటెక్టివ్ ఏజెన్సీకి అనితను వెతికే పని అప్పచెప్పాను. మనకైతే వెతకటం కష్టం కానీ వాళ్ళకు ఈజీ అవుతుందని నా నమ్మకం" స్టీవ్ చెప్పాడు.

"అరే! నిజమా ఇంతసేపు చెప్పలేదు ఈ విషయం?" సంభ్రమాశ్చర్యాలతో అడిగాడు ఆనంద్.

"నువ్వు నన్ను నమ్మకపోవచ్చు ప్రియ. I love her, whatever I had done was because of my love for her. అప్పటి పరిస్థితుల్లో నేను తనకు ఏమీ ఇచ్చే కండిషన్లో లేను. నేను అనితను తప్పితే ఇంకెవరిని ప్రేమించలేదు. ప్రేమించలేను" బొంగురు పోయింది స్టీవ్ గొంతు.

''అక్క, చెల్లి బలవంతంతో కొందరిని డేట్ చేశాను. కొన్నాళ్ళు సిన్సియర్‌గా ప్రయత్నించాను కూడా. చాలామంది అమ్మాయిలతో పరిచయం అయ్యేది. వాళ్ళంతా కాజ్యువల్ రిలేషన్ షిప్ అంతే. ఒక అమ్మాయితో కొంచెం క్లోజ్ అయ్యాను. తెలివిగలది, నా కథ మొత్తం విని కూర్చోపెట్టి మాట్లాడింది. ఎందుకు లైఫ్ వేస్ట్ చేసుకుంటావు, ప్రేమించింది గతం, భవిష్యత్తు ఆలోచించు అని. సరే నన్ను ఇష్టపడుతుందని పెళ్ళి చేసుకున్నాను. ఏదో వెలితి - నాదే తప్పు అనుకుంటా. మనస్సు లేని కాపురం. రోజుకు 14 గంటల పని. వారానికో డిన్నరు, అప్పుడప్పుడు పార్టీలు, సంవత్సరానికో వెకేషన్. ఓ మూడేళ్ళల్లో ఇద్దరికీ అర్థం అయ్యింది ఇక ఈ నాటకానికి తెర వెయ్యాలని. పోయిన సంవత్సరం విడాకులు తీసుకున్నాను'' కళ్ళజోడు తీసి తుడుచుకున్నాడు స్టీవ్.

''మరీ సీరియస్‌గా మాట్లాడుకున్నాం కదా. రేపు సాయంత్రం ఎవరి ప్రపంచంలోకి వాళ్ళం వెళ్ళిపోతాం. మంచి కబుర్లు చెప్పుకుందాం'' చిరునవ్వుతో చెపుతున్న స్టీవ్ వైపు చూస్తూ బాధపడింది ప్రియ 'ఎందుకు మంచి మనుష్యులకు ఈ పరిక్షలు' అని.

***

***అనిత***

గరాజ్ డోర్ నెమ్మదిగా తెరుచుకుం టుంటే, కారు గరాజ్‌లోకి పోనిచ్చింది అనిత.

కారు వెనుక సీట్లో ఉన్న ల్యాప్‌టాప్ బ్యాగు, హ్యాండ్ బ్యాగు తీసుకుని, గరాజ్ మూసేసి ఇంటి లోపలకి నడిచింది.

వారం రోజుల వెకేషన్ తర్వాత ఆఫీసుకు వెళ్ళటం అంటే, సెలవుల తరవాత బడికి వెళ్ళనని మారాం చేసిన తన చిన్నతనం జ్ఞాపకం వచ్చింది. ఇల్లు నిశ్శబ్దంగా ఉంది.

సోఫా పక్కన బ్యాగ్స్ పడేసి, మ్యూజిక్ సిస్టమ్ ఆన్ చేసింది. దాంట్లో నుండి - ''తొలిసారి మిమ్మల్ని చూసింది మొదలు..'' ఉలిక్కిపడి రిమోట్‌తో ఆపేసింది అనిత. ఎన్నాళ్ళయ్యిందో ఈ సీడీ దీంట్లో పెట్టి, బట్టలు మార్చుకుని వచ్చి కుర్చీలో కూర్చుని హెడ్‌ఫోన్స్ పెట్టుకుంది.

''తొలిసారి మిమ్మల్ని చూసింది మొదలు
కదిలాయి మదిలోన ఎన్నెన్నో కథలు.. ఎన్నెన్నో కథలు..''

హెడ్‌ఫోన్స్‌లో వినపడే పాట, ఏనాటి జ్ఞాపకాలనో తట్టిలేపుతుంది. ఏమైంది ఈవేళ తనకు? చాలా ఏళ్ళ తర్వాత, పాత పాటల సీడీ వింటూంది. తనకు ఇష్టమైన పాటలన్నీ ఏర్చి కూర్చుకున్నది ఈ సీడీలో.

ఏ తెల్లవారు ఝామున శబ్దమే చేయకుండా విచ్చుకునే పున్నాగ పూలను చూసినప్పుడో -

తుషార బిందువుల్ని బద్దకంగా విదిలించుకునే ముద్దబంతిని పలుకరించినప్పుడో హర్ష వర్షంతో పులకరించే ప్రకృతిలో పాలు పంచుకున్నప్పుడో -

సాయం సంధ్యతో ఆకాశరాజుకు, పుడమి కన్నె చాటుగా పంపే లేఖ గురించి తెలిసినప్పుడో -

జంట కోసం ఒంటరి కోయిల పాడే విషాద గీతం, నా కంటి చివర ఆర్ధ్రగీతమైనప్పుడో -

అప్రయత్నంగా మది గదులను తెరచుకుని గతం ముందు నిలుస్తుంది.

ప్రతి మనిషికి ఒక గతం ఉంటుంది. ఆ గతం తాలూకు ప్రభావంకూడా ఉంటుంది. కొన్ని పొరపాట్లు సరిదిద్దుకోలేనంతగా జీవితపు గమ్యాన్ని మార్చేస్తాయి.

ఎంతో కావాలని తపించిన వాటిని సాధించుకునే సత్తాలేక, ఒక రకమైన ప్రేమరాహిత్యంలో కొట్టుకుపోతూ, ఈ మధ్య వయస్సులో ఈ రకమైన ఆలోచనల వలన ఏమిటి ప్రయోజనం?

నాది మధ్య వయస్సా? అంటే జీవితంలో సగభాగం అయిపోయిందా? నిజం చెప్పాలంటే గడచిపోయిన జీవితం ఎంతో ఉత్సాహంగా, సంతోషంగా ఉండవలసింది. ఆ సంతోషపు బలంతో సంతృప్తిగా మిగతా జీవితం గడపాలి.

యవ్వనపు తొలకరిలో ఎంతో గాఢంగా విశ్వసించేదానిని. నా కోసం ఎవరో ఒకరు ఉండే ఉంటారని, నాకోసం నన్ను నన్నుగా నన్ను నేను మరిచిపోయేంతగా ప్రేమిస్తారని. పిచ్చితనం కదూ.

ఎందుకో ఎవ్వరూ ధైర్యంగా నా చెయ్యి అందుకోలేక పోయారు. కాలేజీలో ఉన్నప్పుడు చాలామంది అమ్మాయిలకు ఓ ప్రేమ కథ నడిచేది. ఒక్క ప్రేమలేఖ కూడా అందుకోని అతి కొద్దిమంది ఆడపిల్లల్లో నేనూ ఒకదాన్ని.

ఓ మోస్తరు అందగత్తెను, చాలా చలాకీగా ఉండేదాన్ని, ఎప్పుడూ చుట్టూ స్నేహితులు, హడావుడి, బాగా చదివేదాన్ని – అయినా సరే ఏ ఒక్క అబ్బాయీ ధైర్యం చేసి నాతో అతి చనువు ప్రదర్శించలేరు. దానికి నా స్నేహితురాలి నిర్వచనం – ఎంత స్నేహంగా ఉన్నా. కళ్ళతో ఆమడదూరం నిలబెడతానంట నేను. అందుకే అబ్బాయిలకు భయం అంట నేనంటే.

ఒక రకంగా గర్వంగా అనిపించేది ఆ మాటలకు.

జీవితంలో ఏదో వెలితి, గుండెల్లో శూన్యం. ఎవ్వరితోనూ మాట్లాడాలని లేదు. ఒంటరిగా ఎక్కడికైనా వెళ్ళిపోవాలని ఉంది. ఎందుకీ బంధాలు కాళ్ళకు అడ్డం పడుతున్నాయి?

అనవసరంగా గోరంతను కొండంతలు చేసి బాధపడుతున్నానా? ఈ జీవితంలో నాకు ఇంతే ప్రాప్తం అని సర్దుకుపోనా?

మనఃశ్శాంతి, ఆనందం ఎక్కడున్నాయో తెలిస్తే వెతుక్కుందును. ఇంకా ఎన్నాళ్ళు బ్రతుకుతానో తెలియదు. మానసికంగా, శారీరకంగా అలసిపోయాను.

ఇంకా ఎన్నాళ్ళు పోరాడాలి? ఎవరికోసం పోరాడాలి?

ప్రాప్తమను కోని క్షణమే బ్రతుకులాగా..

కళ్ళ వెంబడి ధారాపాతంగా నీళ్ళు తుడుచుకోవాలన్న ధ్యాస కూడా లేకుండా కూర్చుండిపోయింది.

చికాగో వచ్చి సంవత్సరం అయ్యింది. ఎవ్వరూ పెద్దగా పరిచయం కాలేదు. పరిచయాలు పెంచుకోవాలని కూడా అనిపించటం లేదు ఈ మధ్య.

చికాగో రావటం మూలానేమో, ఈ సంవత్సరంగా తన కాలేజి జీవితం మరీ మరీ గుర్తుకు వస్తుంది. అయినా పిచ్చితనం కాకపోతే, మర్చిపోయింది ఎప్పుడు కనుక. స్తబ్దుగా అయిపోతుంది మనస్సు – ఏంటి ఈ జీవితం? ఏం సాధించింది? ఎందుకు అన్ని చోట్లా తలదించుకుని బ్రతకటం అవసరమా? కనీసం తన కోసం తాను బ్రతకటం కూడా మానేసింది.

ఈ క్షణంలో నేను చనిపోతే ఎవరికి నష్టం? ఎంత హుషారుగా ఉండేది, పుస్తకాలు చదువుకోవటం, పాటలు పాడుకోవటం, సరదాలు, ఫ్రెండ్స్. శిశిరంలో రాలిపోయే ఆకుల్లాగా, అన్నీ రాలిపోయాయి.. ఆలోచిస్తూ మగత నిద్రలోకి జారిపోయింది.

"ఏంటి నీతూ ఇలా అయిపోతున్నావు?" ఎదురుగా నిల్చుని స్టీవ్ అడిగాడు.

"నీకు నేను నచ్చట్లేదు కదా? నాకు నేనే నచ్చట్లేదులే" బేలగా అన్నది అనిత.

"అలా మాట్లాడొద్దు ప్లీజ్. నా నీతూని మళ్ళీ నాకు చూపించవా ప్లీజ్. మార్పు నీ చేతుల్లోనే ఉంది" మృదువుగా అన్నాడు స్టీవ్.

స్టీవ్ చెయ్యి అందుకోబోతుండగా మెలుకువ వచ్చేసింది.

ఎక్కడ ఉందో ఏమిటో ఒక్క క్షణం ఏమీ అర్థం కాలేదు.

ఏంటి ఈ విచిత్రమైన కల ఈ వేళకాని వేళలో –

పదిహేను సంవత్సరాలుగా ఏనాడూ కలలోకి రాని స్టీవ్ ఇవాళ్ళేంటి?

గరాజ్ తెరిచిన శబ్దం విని కళ్ళు తుడుచుకుంది. అన్నం వండలేదని గుర్తుకు వచ్చి గబగబా కిచెన్‌లోకి వెళ్ళి బియ్యం కడిగి కుక్కర్‌లో పెట్టి, క్రితం రోజు అక్క ఇచ్చిన కూరలు ఫ్రిజ్‌లోనుండి తీసి వేడి చెయ్యటం మొదలెట్టింది.

"ఏంటి ఇంట్లో లైట్లు వెయ్యకుండా ఏం చేస్తున్నావ్?" వెనుకనుండి భర్త ప్రదీప్ గొంతు వినిపించింది.

"ఏదో పనిలో పడి చూసుకోలేదు."

"ఏంటి ఇంకా అన్నం రెడీ అవ్వలేదా? చాలా ఆకలిగా ఉంది" గొంతులో విసుగు.

"సారీ ఆలస్యం అయ్యింది. ఇంకో పావుగంటలో రెడీ అవుతుంది" పైకి నెమ్మదిగా చెప్పింది కానీ లోలోపల తన మీద తనకే చిరాకు. విసుగ్గా మాట్లాడుతుంటే ఎందుకు తను సారీ చెపుతుంది. ఒక్కరోజు ఆలస్యం అయితే ఇంత చిరాకు పడాలా? దాదాపు పదిరోజులు అక్క దగ్గరకు వెళ్ళి నిన్న రాత్రి తిరిగి వచ్చింది.

రాత్రి ఏమీ అడగలేదు తనను. ప్రొద్దున్నే రెడీ అయి ఆఫీసుకు వెళ్ళిపోయింది.

కనీసం ఇప్పుడన్నా అక్కవాళ్ళు ఎలావున్నారు? వెన్నెల కబుర్లేంటి? అని అడగొచ్చుకదా. మనసు చిన్నబుచ్చుకుంది.

ప్రదీప్ వెళ్ళి బట్టలు మార్చుకు వచ్చేసరికి అన్నం రెడీ అయింది. గిన్నెలు అన్నీ డైనింగ్ టేబుల్ మీద పెట్టి, భోజనానికి పిలిచింది. టివిలో న్యూస్ పెట్టి వచ్చి టివి కనిపించేట్లు కూర్చుని భోజనం చెయ్యటం మొదలుపెట్టాడు.

అనిత కూడా మౌనంగా తినసాగింది. మౌనం తప్పితే ఈ ఇంట్లో ఇంకేమీ మిగల్లేదు. అనిత పెళ్ళి ఎంతో హడావుడిగా జరిగింది. పెళ్ళిచూపుల తరవాత వారంలో పెళ్ళి, తండ్రి పక్షవాతంతో ఎలాగో పోరాడి, ప్రాణాలు నిలబెట్టుకున్నా, చెయ్యి కాలు పనిచెయ్యమని మొరాయించాయి. తండ్రి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని నెలరోజులు సెలవు పెట్టుకుని ఇండియా వెళ్ళిన అనితను, అందరూ బలవంతం చేసి, ప్రదీప్ అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు మంచి కుటుంబం అని పెళ్ళి చేశారు.

పెళ్ళికి ముందు ఒక్క మాటకూడా మాట్లాడుకోలేదు ఇద్దరూ. వారంలో పెళ్ళి ఇంకో నాలుగురోజులు ఉండి తిరిగి అమెరికా వెళ్ళిపోయాడు ప్రదీప్. పెళ్ళి విషయంలో బలవంతం చెయ్యొద్దని ఎంత బ్రతిమిలాడింది. గుండెలో బాధంతా అక్కకు చెప్పుకుని భోరున ఏడ్చింది అనిత.

"జరిగిందేదో జరిగిపోయింది అనిత. ఒప్పుకో! ఈ పెళ్ళి మూలాన అమ్మా నాన్న చూడు ఎంత సంతోషిస్తున్నారో మంచి సంబంధం అని. నాన్న పరిస్థితి చూడు, ప్రాణాలు ఉన్నాయని సంతోషించాలో లేక ఇలా మంచాన పడ్డారే అని ఏడవాలో అర్థం కావటంలేదు. ప్రాక్టికల్‌గా ఆలోచించు, అప్పుడే జీవితంలో సంతోషంగా ఉంటావు."

పెళ్ళి జరిగిన రోజు మనస్సు గట్టి పరుచుకుంది అనిత. స్టీవ్ ఒక అందమైన జ్ఞాపకం - తన జీవితంలో ఇంకేదో రాసిపెట్టి ఉందేమో అందుకే ఈ పెళ్ళి జరుగుతుందేమో అని.

ప్రదీప్ అమెరికా వెళ్ళిపోయాక, ఇంకో రెండు వారాలకు అనిత కూడా తిరిగి డెట్రాయిట్ వచ్చి ఉద్యోగంలో చేరింది. ప్రదీప్‌కు వర్జీనియాలో ఉద్యోగం. అతనికి దగ్గరలో ఉండాలని తిరిగి ఉద్యోగం, వీసా మార్చించుకునే సరికి ఇంకో ఆరునెలలు పట్టింది.

ఈ ఆరునెలల్లో చాలా కష్టపడింది మానసికంగా ధైర్యంగా ఉండటానికి, నిండు మనస్సుతో వైవాహిక జీవితంలో అడుగుపెట్టటానికి.

మొదట్లో స్టీవ్ మీద చాలా కోపం వచ్చేది. 'నాకంటే మంచి అమ్మాయి దొరుకుతుందా, తనని ఎందుకు కాదన్నాడు' అని.

క్రమేపీ అతని మీద కోపం పోయింది. అతని మీద ప్రేమ కోపాన్ని కరిగించేసింది. ఇక ఇదే నా జీవితం అని మనస్సు స్థిరపరచుకుని కాపురానికి వెళ్ళింది అనిత.

ప్రదీప్. చాలా మొండివాడు. విపరీతమైన కోపం, తన ప్రకారమే అన్నీ జరగాలి అనుకుంటాడు.

అత్తగారు చాలా మురిపెంగా చెప్పింది "వాడిని అర్థం చేసుకుని తన ప్రకారం ఉండు. అసలు మీ మామగారి కుటుంబం అంతా ఇంతే, మహా పట్టుదల మనుష్యులు."

ప్రదీప్‌ని అర్థం చేసుకోటానికి, అతనితో మంచి స్నేహం పెంచుకోటానికి తన శాయశక్తులా ప్రయత్నించింది అనిత.

అనిత సంపాదించే ప్రతి పైసా ప్రదీప్ కంట్రోల్ చేసేవాడు. ఫ్యూచర్ బాగుండాలి, షేర్లు, కొనాలి, ఇండియాలో ఆస్తులు కొనాలి అంటూ ఏమేమో మాట్లాడేవాడు. అనితకు ఈ ఆస్తులు, డబ్బు గోలలు పట్టేవి కావు. పోనీలే ప్రదీప్ తెలివిగా ఫైనాన్షియల్ ప్లానింగ్ చేస్తున్నాడని పట్టించుకునేది కాదు.

రెండేళ్ళు పక్షవాతంతో నరకం అనుభవించి రాజారావు చనిపోవటం ఒక పెద్ద షాక్. పెళ్ళి అయిన నాలుగు సంవత్సరాల దాకా పిల్లలు పుట్టలేదు. అక్క కవితకు కూడా పిల్లల్లేరు. అక్క చెల్లెళ్ళు ఇద్దరికీ పిల్లలు పుట్టే యోగ్యత లేదేమో అని అత్తగారు అనీ అననట్లుగా పదే పదే అదే మాట అంటుంటే పరిక్షలు చేయించుకుందామని ప్రదీప్‌ను బ్రతిమిలాడి తీసుకువెళ్ళింది.

అనితలో ఏమీ ప్రాబ్లం ఏమీలేదు, ప్రదీప్ స్పెర్మ్ కౌంటు తక్కువగా ఉందని రిపోర్టు వచ్చింది. ప్రదీప్‌కు విపరీతంగా కోపం వచ్చింది. రిపోర్టు అనిత మొహం మీద విసిరి కొట్టాడు.

"ఈ చెత్త అంతా చెప్పించి నన్ను తక్కువ చెయ్యటానికి తీసుకువెళ్ళావా?" గట్టిగా అరిచాడు.

పుట్టి బుద్ధి ఎరిగాక అలా ఎవ్వరూ అనిత మీద అరవకపోవటంతో చాలా భయపడింది ప్రదీప్ కోపానికి.

"ఇందులో నేను చేసిన తప్పేంటి ప్రదీప్. నేనేమైన ఈ రిజల్టు ఊహించానా? అయినా పిల్లలు పుట్టరు అని చెప్పలేదు కదా, కొంచెం ఆలస్యం అవుతుందేమో అన్నారు" నెమ్మదిగా నచ్చచెప్పింది.

మొత్తానికి ఓ సంవత్సరం తరవాత అనిత ప్రెగ్నెంట్ అన్న కబురు విని అందరికంటే కవితే ఎక్కువ సంతోషించింది. మొదటినుండి చాలా కాంప్లికేషన్సు ఉండేవి. ఉన్నట్లుండి విపరీతంగా కడుపులో నొప్పి, వాంతులు. బెడ్ రెస్టు తీసుకోమన్న డాక్టరు సలహాతో ఉద్యోగం మానేసింది అనిత.

నాలుగో నెలలో కవిత తన దగ్గరకు తీసుకుని వెళ్ళి కాస్త ఆరోగ్యం కుదుట పడేదాకా జాగ్రత్తగా చూసుకుంది. డెలివరీ కూడా కాంప్లికేటే అయ్యింది. నాలుగువారాల ముందే నొప్పులు వచ్చాయి.

కొంచెం బలహీనంగా ఉన్నా చక్కటి పాప పుట్టింది. ముందుగా స్కానింగ్‌లో తెలుసుకోలేదు పాపో, బాబో అని. కానీ మనస్సులో పాప కావాలని చాలా అనుకుంది. కవిత మాత్రం మనిద్దరం ఆడపిల్లలం అందుకని ఒక బాబు పుట్టాలి అనేది.

పాపను చూడగానే చెప్పింది అనిత 'నా చిన్నారి వెన్నెల. ఆ పేరే తనకు ఒప్పుతుంది' అని.

ఒక నాలుగు వారాలు హాస్పటల్లోనే ఉంచారు. ప్రీమెచ్యూర్ అని. మానసికంగా శారీరకంగా చాలా ఒత్తిడికి లోనయ్యింది ఆ నాలుగు వారాలు. కవిత సహాయం చెయ్యటానికి రావటంతో కొంత ఊరట కలిగించింది.

ఇన్‌క్యుబేటర్‌లో ఉంచటం మూలాన అనితను ఎక్కువ ఉండనిచ్చేవారు కాదు. ప్రొద్దున్నే ప్రదీప్ ఆఫీసుకు వెళుతూ దింపేసి వెళితే, పదకొండు గంటలకు కవిత వచ్చి ఇంటికి తీసుకు వచ్చేది. భోజనం చేసి కాసేపు రెస్టు తీసుకుని మళ్ళీ కవితతో హాస్పిటల్‌కు వెళ్ళేది. సాయంత్రం తిరిగి వచ్చేస్తుంటే ప్రాణం పోయినట్లు ఉండేది, దానికి తోడు బ్రెస్ట్ పంప్‌తో పాలు తీయటం – మానసికంగా సంతోషంగా లేకపోవటంతో శారీరకంగా బాగా నలిగిపోయింది.

దాదాపు నెల తరవాత ఇంటికి పంపుతూ డాక్టరు చెప్పింది.

"పాప ఎదుగుదల కొంచెం స్లోగా ఉంది. మోటార్ స్కిల్స్ కూడా. కానీ ప్రీమెచ్యూర్డ్ బేబీస్ కొంతమందిలో ఇది సహజం. వర్రీ అవ్వకు. పుస్తకాలు చదివి మిగతా పిల్లలతో పోల్చుకుని కంగారు పడకు."

పాపను ఇంటికి తెచ్చే సమయానికి అత్తగారు వచ్చారు సాయానికి. నిజానికి అదే నిజమైన డెలివరీ డేటు, దాని ప్రకారమే ఆవిడకు ఎప్పుడో టిక్కెట్టు కొన్నారు. అనితకు తన తల్లిని తెచ్చుకోవాలని ఉండేది కానీ ప్రదీప్ ఒప్పుకోలేదు, వాళ్ళ అమ్మను మొదట అమెరికాకు తేవాలని పట్టుపట్టాడు.

"ఇదేంటి నువ్వు చెవులకు ఏమీ కట్టుకోవు. బాలింతపు పథ్యం లేకుండా అన్నీ తినేస్తున్నావేంటి?" అంటూ అనిత ఏది చేసినా ఏదో వంకలు పెట్టేవారు ఆవిడ.

ఏదో పెద్దావిడ, ఆవిడ అనుభవంతో చెపుతున్నారని తాను డాక్టర్ల దగ్గర తెలుసుకున్నది చెప్పబోయేది అనిత.

"నాకేమీ తెలియదనుకుంటున్నావా ఏంటి? ముగ్గుర్ని కన్నాను" గట్టిగా అనేది ఆవిడ.

పాప విషయంలో మాత్రం అనిత ఎవ్వరిమాట వినేది కాదు. తన అనుమానాలన్నీ డాక్టరుతో పంచుకుని, ఆవిడ చెప్పిన ప్రకారం తు.చ తప్పకుండా పాటించేది వెన్నెలను కంటికి రెప్పలా చూసుకునేది.

వెన్నెలకు నాలుగునెలలు వచ్చినా ఎవ్వరినీ గుర్తుపట్టేదికాదు, నవ్వేది కాదు.

అత్తగారు కంగారు పడుతుంటే నచ్చచెప్పటానికి ప్రయత్నించింది అనిత. "పాప ఎదుగుదల మిగతా పిల్లల్లాగా ఉండదని చెప్పారు అత్తయ్యా. అంతే కానీ పాపలో లోపం లేదు" తన వెన్నెల గురించి ఎవ్వరు నెగెటివ్‌గా మాట్లాడినా తల్లి ప్రాణం గిలగిలలాడేది.

ప్రదీప్ అయినా తల్లికి నచ్చచెపుతాడు, అలా పొద్దస్తమానం పాపగురించి నెగెటివ్‌గా మాట్లాడవద్దని చెపుతాడేమోనని, ఒంటరిగా ఉన్నప్పుడు మొత్తుకునేది.

ప్రదీప్ అనిత బాధను సీరియస్‌గా తీసుకునేవాడు కాదు.

"నీకంటే అమ్మకు ఎక్కువ తెలుసు కదా ఎందుకు రాద్ధాంతం చేస్తావు?"

"ప్రదీప్ ప్లీజ్ అర్థం చేసుకో. నేను రాద్ధాంతం చెయ్యట్లేదు. పాప అసలే ప్రీమెచ్యూర్డ్, ఇంటికి వచ్చాక కూడా తన ప్రోగ్రెస్ చాలా ఆలస్యం అవుతుంది. నా హెల్త్‌కూడా బాగోటం లేదు. డాక్టరు దగ్గరకు వెళ్ళిన ప్రతిసారి ఆవిడ నా గురించి ఎక్కువ కన్సర్న్‌గా ఉన్నారు. నాకు ఈ సమయంలో సంతోషం, ధైర్యం ఉత్సాహం కలిగించేట్లు ఉండాలి. కానీ ఆవిడ మాటిమాటికి ఏవో పుల్లవిరుపు మాటలు నా గురించో, వెన్నెల గురించో, నిజంగా నా పిల్లలో లోపం ఉన్నా కానీ అలా ఎత్తి చూపకూడదు కదా ప్రదీప్. లోపం ఉందని డాక్టరు చెపితే వైద్యం చేయించుకుందాం. మన పాప ప్రదీప్.. మనమే కదా తనకు ఉన్నది" ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడ్చేసింది.

**కాసేపు ఏమీ** మాట్లాడలేదు ప్రదీప్, ప్రదీప్‌కు సున్నితంగా ఉండటం రాదు. అంటే అనునయంగా మాట్లాడటం కానీ, ఓదార్చటం కానీ... వెక్కిళ్ళు పెడుతున్న అనితను దగ్గరకు తీసుకుని ఓదార్చలేదు.

"ఎందుకు అతిగా ఆలోచిస్తావు. నాకు అనుమానంగానే ఉంది. డాక్టరు దగ్గరకు వెళదాం."

"నా పాపలో ఏమీ ప్రాబ్లం లేదు. బలహీనం మూలాన అందరిలాగా లేదు. అంతే" పాపను గుండెలకు హత్తుకుంది అనిత.

పాపకు ఆరునెలలు నిండాయి. అనిత దగ్గరకు తప్పితే ఎవరి దగ్గరకు వచ్చేది కాదు. ఎత్తుకుందామని ప్రయత్నించినా. ప్రదీప్‌కు ఆడించడం తెలిసేది కాదు. నవ్వుతూ కేరింతలు కొడుతుంటే ఎలా ఉండేవాడో ప్రదీప్ కానీ పాప మౌనంగా చూస్తుంటే ఏమి చెయ్యాలో తెలిసేది కాదు అతనికి.

వీసా అయిపోవటంతో అత్తగారు ఇండియా తిరిగి వెళ్ళిపోయారు. పాపే అనిత ప్రపంచం అయిపోయింది. కవిత నెలకోసారి వచ్చి ఓ వారం ఉండి వెళుతుండేది.

వెన్నెల మొదటి పుట్టినరోజు ఎంతో ఆనందంగా సెలబ్రేట్ చేసింది అనిత. తెలిసిన వాళ్ళందరిని పిలిచింది. ఇప్పుడిప్పుడే పాప పట్టుకుని అడుగులు వేస్తుంటే ఎంతో సంబర పడింది అనిత.

మొదటి సంవత్సరం చెకప్‌కు వెళ్ళినప్పుడు డాక్టరు అనితను కూర్చోబెట్టి తన అనుమానం వ్యక్తం చేసింది. ఏవో టెస్టులు చేసి చివరకు తేల్చారు. మైల్డ్ ఆటిజం అని.

స్తబ్దుగా అయిపోయింది అనిత.

ముందు తనను తాను నిందించుకుంది. ఏదో తెలియక తాను తప్పు చేసిందేమో అందుకే పాప ఇలా అయ్యిందేమో అని. ప్రెగ్నెన్సీలో ఏదైనా తప్పు మందులు వేసుకుందా? సరైన జాగ్రత్తలు తీసుకోలేదా? ఇలాంటి వెయ్యి అనుమానాలతో తనను తాను హింసించుకుంది.

డాక్టరు చాలా నచ్చచెప్పింది. వెన్నెలకు ఉన్నది చాలా తక్కువ అని. ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే చాలని, వెన్నెలకు రెండు మూడేళ్ళు వచ్చేదాకా జాగ్రత్తగా గమనించి తనకు ఎలాంటి హెల్ప్ అవసరమో అప్పుడు నిర్ణయించవచ్చు అని చెప్పింది. వెన్నెల పెరిగే కొద్దీ ఏమన్నా మార్పులు వస్తాయేమో అని చాలా జాగ్రత్తగా గమనించేది. వెన్నెల పేరుకు తగ్గట్లుగానే చాలా చక్కగా ఉండేది. అమాయకమైన పెద్ద కళ్ళు. కానీ ఎవ్వరి కళ్ళల్లోకి చూసేది కాదు, ఆకలి అవుతుందేమో అని అనిత గమనించుకుంటే తప్ప ఆకలి అని ఏడ్చేది కాదు.

తన ప్రేమనంతా రంగరించి ఎలాగైనా వెన్నెలకు మామూలు జీవితం ఇవ్వాలని చాలా తాపత్రయపడేది. ఆటిజం మీద పుస్తకాలు చదివేది, ఎలా నేర్పితే వాళ్ళు నేర్చుకుంటారో తెలుసుకుని, చిన్న చిన్న మాటలు పలికించటం, ఆటలు ఆడించటం వెన్నెలతోనే తన ప్రపంచం అయిపోయింది.

పాపకు మూడేళ్ళు వచ్చేదాకా గమనించుకోలేదు ప్రదీప్ ప్రవర్తన చాలా మారిందని.

వెన్నెలను అస్సలు దగ్గరికి తీసేవాడు కాదు. కనీసం పలకరించేవాడు కూడా కాదు. ఆటిజమ్ వున్న పాప పుట్టటం అనిత తప్పులాగా మాట్లాడేవాడు.

ఎవరైనా పార్టీలకు పిలిస్తే "ఏం వెళతాంలే ఈ పిల్లను తీసుకుని అక్కడ అందరూ మన గురించే మాట్లాడుకోవాలా" అనేవాడు.

పోనీ వెన్నెల ఏమన్నా ఏడ్చి సీన్ క్రియేట్ చేస్తుందా అంటే అదీలేదు. కొత్తవాళ్ళు ఉంటే తల్లిని హత్తుకుని ఒడిలో నుండి దిగేదికాదు, పేచీలు పెట్టేదికాదు.

ప్రదీప్ ప్రవర్తనతో ఉన్న నలుగురు ఫ్రెండ్స్ కూడా దూరమయ్యారు. అనిత ఎవ్వరింటికీ వెళ్ళటం మానేసింది.

చివరికి ఓ రోజు తన మనస్సులో మాట బైట పెట్టాడు.

"ఇలాంటి వాళ్ళకు, ఏవీ ఇనిస్టిట్యూట్స్ వుంటాయంట కదా. అక్కడ పెట్టేద్దాం. వాళ్ళు చూసుకుంటారు అప్పుడప్పుడు వెళ్ళి చూసి వద్దువుకానీ. మళ్ళీ ఉద్యోగంలో చేరునువ్వు. గ్రీన్ కార్డు ద్వారా వర్క్ పర్మిట్ కూడా వచ్చింది కదా నీకు" అనితకు ఓ క్షణం అర్థం కాలేదు ఏమి మాట్లాడుతున్నాడో, తన చెవులను తానే నమ్మలేకపోయింది.

"ప్రదీప్ మన పాప తను, ఏం మాట్లాడుతున్నావు నువ్వు. దాదాపు మూడేళ్ళు వచ్చాయి. ఇప్పుడు చిన్న చిన్న మాటలు చెపుతుంది మోటర్ స్కిల్స్ బాగానే డెవలప్ అవుతున్నాయి కదా, ప్లే స్కూల్లో చేర్పించుదాం అని నేను అనుకుంటుంటే ఇలా మాట్లాడతావేంటి?"

"ఈ పిచ్చిపిల్ల పుట్టినప్పటినుండి నీకు తనే ప్రపంచం అయిపోయింది. ఒక సరదాలేదు నాకు. నాకు మామూలు పిల్లలు కావాలి. ఈ పిల్ల ధ్యాసలో పడి నా మొహమే చూడటంలేదు. మూడు నెలలకో, నాలుగు నెలలకో ఓసారి మన మధ్య... ఎన్నాళ్ళిలా?"

ఏనాడు పెద్ద గొంతుతో మాట్లాడడం ఎరుగని అనిత, మొట్టమొదటిసారి సివంగిలా లేచి గట్టిగా పోట్లాడింది.

ఆ అరుపులకు బెదిరిపోయి వెన్నెల ఏడుస్తుంటే తనను తాను సంభాళించుకుని పాపను హత్తుకుని గదిలోకి వెళ్ళి తలుపు వేసుకుంది.

ఇన్నాళ్ళుగా లోపల దాచుకున్న అభిప్రాయం ఓసారి బైటకు వచ్చాక, ఇక ప్రదీప్ ప్రతిరోజు ఇదే మాట, ఇదే పోట్లాట.

తట్టుకోలేక అక్కతో చెప్పి విపరీతంగా ఏడ్చేసింది అనిత.

"ఛ! ఏంటి ఇంత బేలగా అయిపోతున్నావు అనిత. ఈ వీకెండ్ నేను బావ వస్తాం. ప్రదీప్‌తో మాట్లాడుతాం. బెంగపడకు. వెన్నెల జాగ్రత్త" కవిత నచ్చచెప్పింది.

"ఏంటి ప్రదీప్ ఇలాంటి మాటలు. చూడు అనిత ఎంత బాధపడుతుందో. ఏ తల్లికైనా ఇటువంటి పరిస్థితుల్లో అందరికంటే ఎక్కువ బాధ ఉంటుంది. అంత కఠినంగా ఉండకు" నచ్చచెప్పటానికి ప్రయత్నించాడు ప్రసాద్.

అప్పటికి ఓ గంట నుండి తిరగా బోర్లాగా ఇవే మాటలు.

"నేనేమైనా చంపేస్తున్నానా పాపను. ఏదో రాక్షసుడిలాగా చిత్రీకరిస్తున్నారు నన్ను. తనను ఎక్కడైనా సేఫ్‌గా పెడితే స్పెషలిస్టులు ఉంటారు కదా అని అంటున్నాను. ఒక సరదాలేదు నాకు. చిరాకేస్తుంది ఈ గోలంతా."

"పాపకున్న ఆటిజం చాలా మైల్డ్. ఇనిస్టిట్యూట్‌లో పెట్టటానికి తనకేమీ మెంటల్ ప్రోబ్లంలు లేవు" తీవ్రంగా అన్నది అనిత.

ప్రసాద్ ఏదో చెప్పబోతుంటే ఆపింది అనిత

"నాకు నా పాప చాలా ఇంపార్టెంట్. మనం సెపరేట్ అవుదాం ప్రదీప్" స్థిరంగా చెప్పింది అనిత.

"అనితా! ఏంటా తొందరపాటు" కవిత అనిత చెయ్యి పట్టుకుంది.

"లేదక్కా నేనే పిచ్చిదాన్ని. తన మనస్సులో పాప పట్ల ఓ రకమైన ద్వేషం నిండిపోయిందని గమనించుకోలేదు. ఏ రోజూ పాపను ఆడించలేదు. ఒక్కదాన్నే రేయింబవళ్ళు కళ్ళల్లో ఒత్తులు వేసుకుని చూసుకున్నా. జ్వరం వచ్చినా, ఏదన్నా నలతగా ఉన్నా కాస్త కూడా సాయం చేసేవాడు కాదు. నిజంగా ఎవరన్నా ఇంత దుర్మార్గంగా ఉంటారా సొంత కూతురి విషయంలో."

"ఏంటీ బెదిరిస్తున్నావా, విడాకులు కావాలని? అంత సరదాగా ఉందా?" అరిచాడు ప్రదీప్.

"చాలు ఇక ఊరుకోండి ఇద్దరూ. మీ ఇద్దరు వెన్నెల విషయంలో చాలా స్ట్రెస్ అయ్యారు. ముందు కామ్‌గా ఉండండి. నేనూ కవిత ఇక్కడికి వచ్చే ముందేబాగా ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చాం. మీకు అభ్యంతరం లేకుంటే మేము వెన్నెలను పెంచుకుంటాం."

"బావా నేను వెన్నెలకు దూరంగా ఉండలేను" బేలగా అన్నది అనిత.

"అనిత నా మాట విను. నీకు మళ్ళీ పిల్లలు పుడతారు. నాకు పిల్లలు పుట్టరు అని డాక్టర్లు చెప్పేశారు. ఐవిఎఫ్ లాంటివి ట్రై చేసి ఏమవుతుందో అని ఎదురుచూడటం కంటే ఇదే మంచిది కదా అందరికీ. నా ప్రాణం లాగా చూసుకుంటాను వెన్నెలని. నా మీద నమ్మకం ఉంచు ప్లీజ్" చెల్లికి నచ్చచెప్పింది కవిత.

"అక్కా! వెన్నెల నా దగ్గర ఉన్నా నీ దగ్గర ఉన్నా ఒక్కటే, నువ్వు బాగా చూసుకోవని కాదు. కానీ.." అనిత మాటలకు అడ్డుపడ్డాడు ప్రసాద్.

"అనిత, అందరికోసం ఈ నిర్ణయం తీసుకున్నాం. మాకు పిల్లలు లేరు అనే కొరత ఉండదు. వెన్నెల కూడా మీ సంఘర్షణల మధ్య పెరగటం మంచిది కాదు. ప్లీజ్ కాదనకు."

ప్రదీప్‌కు చాలా నచ్చింది ఈ అయిడియా.

అనిత దగ్గరే వుండి వెన్నెలను బాగా అలవాటు చేసుకుంది కవిత. ఓ రెండు నెలల తరవాత వెన్నెలను తీసుకుని తన ఇంటికి వెళ్ళిపోయింది కవిత.

మనసంతా శూన్యంగా అయిపోయింది అనితకు. మనసు మళ్ళించుకోటానికి మళ్ళీ ఉద్యోగం వెతుక్కుంది. నెమ్మదిగా ఒక రొటీన్‌లో పడిపోయింది అనిత.

వెన్నెల కూడా కవితకు బాగా అలవాటయ్యింది. పిల్లలు ప్రేమకు ప్రతిస్పందిస్తారు. చిన్న చిన్న మాటలు చెప్పటం మొదలుపెట్టింది. కొన్ని మాటలకు స్పష్టత లేకున్నా కవితకు మాత్రం అన్నీ అర్థం అయ్యేవి.

వెన్నెల కవిత దగ్గరకు వెళ్ళిన సంవత్సరం తరవాత పాపపై లీగల్ అధికారాలన్నీ కవిత, ప్రసాద్‌లకు దక్కాలని లీగల్‌గా దత్తత ఇచ్చేసింది అనిత.

మళ్ళీ మామూలు పిల్లలు కావాలని ఓ ఐదేళ్ళు ప్రదీప్ చాలా తాపత్రయపడ్డాడు. కానీ అనిత మనస్సు ఎదురు తిరగటం మూలానేమో, శరీరం కూడా సహకరించలేదు. మళ్ళీ కన్సీవ్ అవ్వలేదు. ప్రదీప్ విషయంలో అనిత మనస్సు చాలా గాయపడింది.

కానీ వెన్నెల అక్కవాళ్ళ దగ్గర ప్రేమగా పెరగటం, తను ఆనందంగా ఉండటం చూసి మనస్సు నెమ్మదించింది అనితకు.

క్రమేపీ అనిత ప్రదీప్ కేవలం అవసరార్థం మాత్రమే మాట్లాడుకోవటం మొదలు పెట్టారు.

ఓ రచయిత అన్నట్లు పటిష్టమైన కోటగోడలు బద్దలు కొట్టడానికైనా ఫిరంగులు ఉంటాయేమోకానీ, భార్యభర్తల మధ్య ఉన్న నిశ్శబ్దపు గోడలు పగలగొట్టటానికి ఏ శక్తీ చాలదు.

ఒకే ఇంట్లో వుంటూ ఏంటిదంతా, పోనీ కనీసం స్నేహితుల్లా మాట్లాడుకుందమని ప్రదీప్‌తో మాట్లాడటానికి ప్రయత్నించేది అనిత.

'ఏమున్నాయి మాట్లాడుకోటానికి? ఏమన్నా చెప్పు నీకు చెప్పాలనిపిస్తే' అనేవాడు టివి మీదనుండి చూపు మరల్చకుండా.

అర్ధరాత్రి దాకా టివి చూసి అప్పుడు బెడ్రూంలోకి వచ్చి నిద్రపోతున్న అనితను ఆక్రమించుకునేవాడు. వద్దని వారించబోతే కోపం, విసుగు.

సంవత్సరానికి ఓ రెండుసార్లు వెళ్ళి వెన్నెలతో ఓ వారం, పదిరోజులు గడిపి వచ్చేది. స్కూలుకు పంపుతున్నారు. మామూలు స్కూలులోనే స్పెషల్ నీడ్స్ కిడ్స్ వుండే క్లాసుకు వెళుతుంది.

తల విదిలించి ఆలోచన్లనుండి బైట పడింది అనిత. వంటిల్లు సర్దేసి, టివి చూస్తున్న ప్రదీప్ పక్క సోఫాలో కూర్చుంది.

"ప్రదీప్ నీతో మాట్లాడాలి కొంచెం సౌండ్ తగ్గిస్తావా?"

"చెప్పు వింటున్నా" టివి మీద నుండి దృష్టి మరల్చకుండానే జవాబిచ్చాడు.

"ఈ మధ్య నేను సరిగ్గా చూసుకోవట్లేదు, ఏంటీ సేవింగ్స్‌లో డబ్బులేమీ లేవు ఏమైంది డబ్బు అంతా"

"ఏంటి లెక్కలు అడుగుతున్నావు కొత్తగా"

"లెక్కలు కాదు ప్రదీప్. మధ్యలో ఒక పదేళ్ళు తప్పితే నేను పెళ్ళి అయినప్పటినుండి మంచి ఉద్యోగాల్లోనే ఉన్నాను. మనిద్దరిది మంచి జీతం, ఏమైపోయింది డబ్బు అని అడుగుతున్నా"

"ఇండియాలో ఇన్వెస్ట్ చేశా"

"ఇండియాలోనా? ఏం కొన్నావు? ఎప్పుడూ నాకు చెప్పలేదే?"

"అన్నీ నీకు చెప్పాలా? అయినా నువ్వు ఫైనాన్సు ఎప్పుడూ పట్టించుకోవు కదా మంచి డీల్స్ దొరికాయి, ఏవో ప్లాట్లు కొన్నాను"

"మరి రిజిస్ట్రేషన్ ఎప్పుడు అయ్యింది. నేనేమీ సంతకాలు చెయ్యలేదే, కనీసం నీకు పవర్ ఆఫ్ ఎటార్నీ కూడా ఇవ్వలేదు కదా"

ఇరుక్కుపోయినట్లు తడబడ్డాడు.

"అంటే నువ్వు ఈ మధ్య ఇండియా రావట్లేదు కదా అందుకే నా పేరు మీద రిజిస్టరు చేయించా."

"నిజం చెప్పు. ఏమేం కొన్నావు? నాకు డీటైల్స్ కావాలి. అంత డబ్బులు ఇన్వెస్టు చేసి నాకు మాట మాత్రంగానైనా ఎందుకు చెప్పలేదు. అలా ఎలా చెయ్యగలిగావు ప్రదీప్. కనీసం నా జీతం మీద నాకు హక్కు లేదా? సేవింగ్స్‌లో ఓ ఐదువేలు ఉన్నాయి. ఏదన్నా ఎమర్జెన్సీకి కావాలంటే ఎలా?"

అసలే అంతంత మాత్రంగా ఉన్న వాళ్ళ బంధం, ఈ సంభాషణతో సాంతం పగిలిపోయింది.

ప్రదీప్‌కు విపరీతంగా కోపం వచ్చింది. కోపానికి అసలు కారణం తాను పట్టుబడిపోవటం. నిజానికి అనితకు ఈ విషయం చెపుదామని ఎప్పుడూ అనుకోలేదు. అనిత ఎప్పుడూ బ్యాంకు వ్యవహారాలు పట్టించుకోదని అతనికి తెలుసు.

హైదరాబాదులో రెండు అపార్టుమెంట్లు, గుంటూరు దగ్గర ఫ్రెండ్స్‌తో కలిసి రెండు ఎకరాలు, కొన్నాడు. ఏదీ పట్టించుకోని అనిత ఇన్ని ప్రశ్నలు అడుగుతుందని అనుకోలేదు. ఈ సంవత్సరంలో రెండు అపార్ట్‌మెంట్ల పేమెంట్ అయిపోతుంది. కొంత బ్యాంకు బాలెన్సు నింపుకుని మళ్ళీ ఏదైనా స్థలం కొందాం అన్న ఆలోచనలో ఉన్నాడు.

ఇప్పుడు అనితకు దొరికిపోయేసరికి ఆ కోపంతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడాడు.

"నేను నీ మొగుడినేగా, ఇలా నిలదీస్తావా నన్ను. ఏ ఆ మాత్రం హక్కులేదా నాకు? పెళ్ళి అయినప్పటినుండి నీతో ఏమి సుఖపడ్డాను నేను? పిల్లలు లేరు, సుఖం లేదు. ఏముంది నాకు. పెళ్ళికి ముందు ఎవరినో ప్రేమించావు కదా అందుకే నాతో సరిగ్గా లేవేమో ఎవరికి తెలుసు. పుట్టిన ఒక పిల్లకూడా ఓ పిచ్చిది అంతా నీ మూలానే"

ఆపకుండా చెప్పిందే చెపుతూ, అరుస్తూ అరగంటసేపు అనితను నోరు ఎత్తనీయలేదు.

అతను మాట్లాడే విధానం, ఆ మాటలకు ఎంత షాక్‌కి గురిచేసిందంటే నిజంగా ఈ వ్యక్తి నాకు తెలుసా, ఇతనిలో ఇంత వికృతమైన కోణం కూడా ఉన్నదా అన్న నమ్మశక్యం కాని ఈ ప్రవర్తనతో ఏమి సమాధానం చెప్పాలోకూడా తోచలేదు అనితకు.

"ప్రదీప్ ఎందుకలా అరుస్తున్నావు. నెమ్మదిగా మాట్లాడు. నాతో ఒక్కమాట కూడా చెప్పలేదు. డబ్బు అంతా అయిపోయింది అని అడిగాను కానీ ఇన్నేళ్ళలో ఎప్పుడన్నా నేను పట్టించుకున్నానా. ఎందుకంత వికారంగా మాట్లాడతావు?"

"నేను వికారంగా మాట్లాడుతున్నానా?" తప్పులన్నీ నాలోనే ఉన్నాయా? ఏదో నువ్వే చాలా మంచిదానివైనట్లు"

"ఓకే ప్రదీప్. ఇంక ఈ మాటలు అనవసరం. నువ్వు ఆవేశంలో ఉన్నావు. నీ ఆవేశం తగ్గి మామూలుగా అయ్యాక మాట్లాడుకుందాం" లేచి బెడ్రూంలోకి వెళ్ళిపోయింది అనిత.

**మెదడంతా** నొక్కినట్లు విపరీతంగా తలనొప్పి వచ్చేసింది అనితకు. తాను ఏమి మాట్లాడాలని మొదలెట్టింది, టాపిక్ ఎటు తిప్పాడు. ఎవరినో ప్రేమించి, ప్రదీప్‌కు ఏమి తక్కువ చేశాను? ఎంత ఎటన్షన్ ఇచ్చాను? మనఃస్ఫూర్తిగా ఇది నా సంసారం, నా భర్త, నా పిల్ల అనే కదా ఇంత శ్రద్ధగా కాపురం చేశాను. ప్రతిసారి ఎందుకిలా ఓడిపోతుంది తను? గొడవ అయిన ప్రతిసారి తానే సర్దుకుపోతుంది. ఇదా ప్రతిఫలం?

అక్కవాళ్ళ ఇంటికి వెళ్ళినప్పుడు ప్రసాద్ చెప్పాడు, తాను మూడు నెలల క్రితం ఇండియా వెళ్ళినప్పుడు తెలిసినాయన ఎవరో అన్నారంట 'మీ తోడల్లుడు మా అబ్బాయి స్నేహితుడితో కలిసి ఓ రెండెకరాలు కొన్నాడు. బాగా సంపాదిస్తున్నాడనుకుంటే చాలా కొంటున్నాడు' అని

ప్రసాద్ కాజువల్‌గా అడిగాడు - "ఏ ఏరియాలో కొన్నారు అనిత. అపార్టుమెంట్లు అద్దెకు ఇచ్చారా"

"నాకేమీ తెలియదు బావా ఈ విషయాలు ప్రదీప్ ఏమీ అనలేదే"

కవిత, ప్రసాద్ ఒకరిమొహం ఒకరు చూసుకున్నారు. తరవాత ఒంటరిగా ఉన్నప్పుడు కవిత అన్నది.

"అన్నీ అలా ఒదిలెయ్యకు అనిత. కాస్త డబ్బు విషయాలు పట్టించుకో. అన్ని విషయాలు తెలుసుకోవాలి కదా! తను సమర్థవంతంగా ఇన్వెస్టు చేయొచ్చు కానీ కనీసం ఏవి ఎక్కడున్నాయో తెలియాలి కదా"

అడిగినందుకు జరిగిన పర్యవసానం ఇది.

బలవంతాన కళ్ళు మూసుకుని నిద్రకు ఉపక్రమించింది.

ఓ పదిహేను రోజులు ఎడ మొహం పెడమొహంగానే ఉన్నారు ఇద్దరు. ఈ పదిహేను రోజుల్లో విపరీతమైన స్ట్రెస్‌కు గురైయ్యింది అనిత. దానితోపాటు తన జీవితం గురించి, ఆత్మావలోకనం చేయసాగింది.

ఏంటి ఈ జీవితం. దెబ్బమీద దెబ్బ తగులుతూనే ఉంది. ఎప్పటికి నేను సొంతం ముక్కలైపోతానా అని దేవుడు ఇంకా పరిక్షలు పెడుతున్నాడా?

ప్రాణంగా ప్రేమించింది స్టీవ్‌ని. పెళ్ళి చేసుకోలేకపోయింది. ఎంత ధైర్యం, స్థైర్యంతో ముందుకు అడుగువేసింది తను. తనలోని ఏదో ఫైర్ స్టీవ్‌తోనే పోయిందేమో. ఎంత కాన్ఫిడెంట్‌గా ఉండేది, ఎంత ఖచ్చితంగా మనస్సులోని మాట చెప్పేది.

ఎందుకు అనవసరంగా గొడవలు, వాదనలు అని సర్దుకుపోయేది. వీలైనంతవరకు ప్రశాంతమైన జీవితం కోసం పోరాడింది. ప్రతిసారి అతన్ని కించపరిచే మాటలు. మనస్సును తూట్లు పొడిచేవి. ఫ్రెండ్స్ ఎవరైనా అనిత వంట మెచ్చుకున్నా, లేక ఇంకే విషయంలో పొగిడినా భరించగలిగేవాడు కాదు ప్రదీప్. ఏదో వంకపెట్టి ఫ్రెండ్స్ ఎదురుగానే తుస్కరించేవాడు. ఎందుకలా మాట్లాడావు అని ఓసారి పార్టీ అయ్యాక నిలదీస్తే - "అరే జోక్ చేశా అంతే" అన్నాడు.

తరవాత వెన్నెల విషయంలో ముక్కలైపోయింది. ఆడపిల్ల పెళ్ళికి ముందు ఎలా ఉన్నా, ఎంత గారాబంగా పెరిగినా పెళ్ళి అయిన క్రొత్తలో కొద్దిగా ఎడ్జెస్టు అవ్వటానికి ఇబ్బంది పడినా క్రొత్త వాతావరణం, క్రొత్త వ్యక్తులతో ఇమిడిపోటానికి శాయశక్తులా ప్రయత్నిస్తుంది.

ఇది చాలామంది అమ్మాయిలకు వర్తిస్తుంది. అనితకూడా తనని తాను అలానే మలచుకుంది.

కానీ ఎన్నో ఏళ్ళుగా చిన్న విషయాలు, పెద్ద విషయాలు అన్నీ కలిపి మనస్సును ఛిద్రం చేస్తుంటే ఆ ముక్కల్లో తన అస్తిత్వాన్ని కోల్పోతూ క్రమంగా ఒక వ్యక్తిగా కూడా మిగలకుండా అయిపోతుందో, అప్పుడు కొందరాడపిల్లలు జీవశ్చవాలుగా మిగిలిపోతారు.

కానీ కొంతమంది తమని తాము ప్రశ్నించుకోవటం మొదలు పెడతారు. అలానే అనిత కూడా తనని తాను ప్రశ్నించుకుని, ఆలోచించటం మొదలెట్టింది. ఈ క్రమంలో తాను మళ్ళీ జీవితం ఆనందం పొందగలదా? కాలమే నిర్ణయించాలి.

"ఏంటి నీ జీతం ఈసారి డిపాజిట్ అవ్వలేదు" ఇంటికి వస్తూనే అడిగాడు ప్రదీప్.

"నేను వేరే ఎకౌంటు ఓపెన్ చేశాను. ఇకనుండి నా జీతం దాంట్లోకి వెళుతుంది" షాక్ కొట్టినట్లు ఆగిపోయాడు ప్రదీప్.

"ఇవన్నీ నీ ఆలోచనలేనా, ఎవరన్నా ఎక్కిస్తున్నారా?" నొసలు చిట్లించి గట్టిగా అడిగాడు.

మానసికంగా ఎప్పుడో సిద్ధపడింది ఈ సంభాషణకి, అందుకే స్థిరంగా ఉంది.

"నాతో ఒక్కమాట చెప్పకుండా ఇండియాలో ఆస్తులుకొని, నీ పేరున రాయించుకోమని ఎవరు నీకు సలహాలు ఇచ్చారో వాళ్ళే నాకూ ఇచ్చారు"

అనిత గొంతులో దుఃఖం లేదు, బాధలేదు. కోపం అంతకంటే లేదు. చాలా మామూలుగా, "బైట భోజనం చేసి వచ్చాను" అన్నంత మృదువుగా చెప్పింది.

ఒక్కక్షణం ఏమీ అర్థంకాలేదు ప్రదీప్‌కు. అనితలో ఒక క్రొత్త మనిషిని చూస్తున్నట్లుగా ఉంది. అనిత బాధపడుతున్నా, ఏడుస్తున్నా, లేక కోపం తెచ్చుకున్నా ప్రదీప్‌కు ఎలా హేండిల్ చెయ్యాలో తెలుసు. గట్టిగా అరిచేవాడు. అనితను తన అరుపులతో భయపెట్టేవాడు. కానీ ఈ అనిత ఎవరు?

ఒకటి మాత్రం అర్థం అయ్యింది. మళ్ళీ డబ్బు చేతికి చిక్కాలంటే, ఈసారి కోపం తెచ్చుకోవటంలాంటి పనులు మానేసి అనితను మంచి చేసుకోవాలని.

"ఎందుకిలా అన్నిటికీ విపరీతంగా ఆలోచిస్తావు? ఓవర్ రియాక్ట్ అవుతున్నావు. మన ఫ్యూచర్ కోసమే కదా ఆ డబ్బు ఇన్వెస్టు చేసింది" పక్కనే కూర్చుని చెయ్యి పట్టుకోబోయాడు.

చెయ్యి వెనక్కి లాక్కుంది అనిత "ఏ వ్యక్తి అయినా ఒకసారి, లేక రెండుసార్లు మోసపోవచ్చు పదే పదే ఒక వ్యక్తి వలన మోసపోతే - అది మోసం చేసేవాడిది కాదు, మోసపోయిన వాళ్ళదే తప్పు."

"ఏం మోసం చేశాను?"

"మన పెళ్ళి అయ్యాక నువ్వు ఏ విషయంలో నా భర్తగా, నా సహచరిగా ఉన్నావు ప్రదీప్? నాకు ఎప్పుడైనా ఎమోషనల్‌గా తోడుగా నిలిచావా? ఆలస్యం అయిన ప్రెగ్నెన్సీ, దాని వలన మీ అమ్మతో పడిన మాటలు, వెన్నెల విషయం ఏదైనా ఒక్క విషయం చెపుతావా నువ్వు నాకు తోడుగా నిలిచిన సంఘటన, వీటికి తోడు అందరిలో నన్ను కించపరచటం, అవమానంగా మాట్లాడటం."

ప్రదీప్ సమాధానం చెప్పకపోవటం చూసి మళ్ళీ తనే అన్నది.

"ఎప్పుడైనా నేను నీ డబ్బు, నా డబ్బు అని మాట్లాడానా? ఒక్కసారైనా క్యాజువల్‌గా ఇండియాలో ఇన్వెస్టు చేస్తున్నా అని చెప్పావా? రెండు ఇళ్ళు, స్థలం ఎవరిపేరు మీద తీసుకున్నావు ప్రదీప్? ఏంటి దీని అర్థం?"

"చిన్నప్పటినుండి నన్ను అందరూ చలాకీగా ఉంటాను, అనవసరంగా ఎవ్వరితోనూ గొడవలు పెట్టుకోను కానీ మాట పడను అనేవారు. పెద్దయ్యాక నా ఫ్రెండ్స్ అందరూ, నేను అన్నీ బాగా ఆలోచిస్తాను, ఏ సమస్య అయినా చక్కగా విశ్లేషించి పరిష్కారం చూపుతాను, అందరితో ఆత్మీయంగా ఉంటాను అనేవారు. ఇవి స్వహతాగా నాలో ఉండే లక్షణాలు నా కోర్ బిహేవియర్. కానీ నా లక్షణాలు, నా వ్యక్తిత్వం ఎప్పుడు కోల్పోటం మొదలెట్టానో కూడా తెలియదు. ప్రతి చిన్న విషయంలో సర్దుకుపోవటం, ఆ క్రమంలో ఒక వ్యక్తిగా కూడా మిగలకుండా అయిపోతున్నా"

"ఏం మాట్లాడుతున్నావు నువ్వు?" ప్రదీప్‌కు అనిత మాటలు ఏమీ అర్థంకావట్లేదు. అసలు అనితే కొత్తగా ఉంది.

"నేను ఏనాడూ నీకు అర్థం కాలేదు ప్రదీప్. ఒక భార్యగా కాదుకదా కనీసం ఇంట్లో ఉండే సహచరిగా కూడా నన్ను అర్థం చేసుకోటానికి ప్రయత్నించలేదు. నా మనస్సు విరిగిపోయింది ప్రదీప్. ఇన్నాళ్ళూ కలిసి ఉన్నాం, అయినా ఈ క్షణం ఎంతో నిర్లిప్తంగా ఉంది. ఏ ఎమోషన్స్ లేవు" లేచి బెడ్రూంలోకి వెళ్ళిపోయి తలుపు వేసుకుంది అనిత.

"ఈ వీకెండ్ తెలుగు అసోసియేషన్ ఫంక్షను ఉంది. మీరు ఈ ఏరియాకు క్రొత్త కదా అందుకని చెపుతున్నా. రండి మంచి కాలక్షేపం. ఇండియానుండి సింగర్స్ వస్తున్నారంట" ఆఫీసులో అనితతోపాటు పనిచేసే సుమన చెప్పింది.

"నాకు పెద్ద ఇంట్రెస్టు ఉండదు ఇవన్నీ" మొహమాటంగా చెప్పింది అనిత. దాదాపు ఒక సంవత్సరంగా కలిసి పనిచేస్తున్నారు. చాలామంది ఇండియన్లు పనిచేస్తున్నారు ఈ కంపెనీలో. సుమన కూడా తన ప్రాజెక్టులోనే చెయ్యటంతో పరిచయం పెరిగింది.

"సరే ఆలోచించుకోండి. లెమాంట్ టెంపుల్లో, శనివారం సాయంత్రం ఆరుగంటలకు."

సుమన ఇంకేదో చెప్పబోతుండగా, అనిత ఫోన్ మోగటంతో చెయ్యి ఊపి వెళ్ళిపోయింది.

నెంబరు ఏదో కొత్తగా ఉంది. తీసి "హలో" అన్నది

"హలో మేడం. మీ పేరు అనిత. మీరు షికాగో యూనివర్శిటీలో 2001లో గ్రాడ్యుయేట్ అయ్యారా?" అవతలి నుండి ఒక మగగొంతు వినిపించింది.

"అవును. ఇంతకీ ఎవరు మీరు?"

"మేము ఆ యూనివర్సిటీ అల్యుమిని అసోసియేషన్ నుండి. చాలామంది ఎన్‌రోల్ చేసుకున్నారు. చేసుకోని వాళ్ళను వెతికి ఎన్‌రోల్ చేసుకోమని చెపుతాం."

"నా ఫోన్ నెంబరు ఎవరు చెప్పారు?"

"కొంచెం కష్టపడ్డాం కానీ మా పని ఇదే కదా మాడమ్. చిన్న కన్ఫర్మేషన్ చెప్పండి. మీ అడ్రస్సు చెపితే, మా డిటైల్సు అన్నీ మెయిలు చేస్తాం."

"సారీ పర్సనల్ ఇన్ఫర్మేషన్ అడుగుతున్నారు."

"ఓకే మేడం సారీ ఇబ్బంది పెట్టాను. మేం ఒక ఫంక్షను చెయ్యబోతున్నాం. ఆ వెబ్‌సైట్ రెడీ అవ్వగానే మీ ఫోన్‌కు మెసేజ్ వస్తుంది. థాంక్స్ మేడం" అని పెట్టేశాడు.

వింతగా అనిపించింది అనితకు. ఏదైనా మోసమున్నదా అని ఆలోచించింది కాసేపు.

ఈసారి తన పుట్టినరోజు వీకెండు రావటంతో, అక్క వెన్నెల దగ్గరికి వెళ్ళాలని నిర్ణయించుకుంది అనిత. అప్పుడే మూడు నెలలయ్యింది వెన్నెలను చూసి.

ఎంత ముద్దుగా ఉంటుందో వెన్నెల. ఆటిజం వాళ్ళకు కళ్ళు తేడాగా ఉంటాయి అంటారు. వెన్నెల కళ్ళు చాలా పెద్దవి, అమాయకంగా, స్వచ్ఛంగా ఉంటాయి.

మొదటినుండి అనితను అమ్మ అని పిలిచేది. కవిత పెంచటం మొదలెట్టాక అనితను అమ్మ అని, కవితను మమ్మీ అని పిలవటం అలవాటు చేసింది కవిత

ఇంట్లో మరీ ఒంటరిగా బెంగగా అనిపిస్తుంది. శుక్రవారం బయలుదేరి వెళ్ళాలని నిర్ణయించుకుంది. రెండున్నర గంటల ప్రయాణం, పెద్ద ప్రయాస కూడా ఉండదు.

ఈ మధ్య తన ఫ్రెండ్స్ అందరూ బాగా గుర్తువస్తున్నారు. ప్రియ, ఆనంద్ - ముఖ్యంగా స్టీవ్. ఎలా ఉన్నాడో తను. కెరియర్ బాగానే ఉండి ఉంటుంది. పర్సనల్ లైఫ్ ఎలా ఉందో. ఎవర్ని పెళ్ళి చేసుకున్నాడో, పిల్లలెందరో. అన్నిటికంటే ముఖ్యంగా.. ఐ హోప్ హి ఈజ్ హాపీ.

ప్రియ స్టీవ్‌ని తిడుతుంటే భరించలేకపోయేది. క్రమంగా మాటలు తగ్గించేసింది. తను పెళ్ళి చేసుకోవటం కూడా నచ్చలేదు ప్రియకు. నా పరిస్థితి ఇది అని ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోలేదు ప్రియ. కొన్నాళ్ళకు ఫోను మార్చాల్సి వచ్చినప్పుడు ప్రియ నెంబరు సేవ్ చేసుకోలేదు.

అప్పట్లో అందరికి దూరంగా ఉంటే కానీ మనస్సును కంట్రోలు చేసుకోలేనని భయపడింది అనిత. ఆ జ్ఞాపకాలను మర్చిపోవాలి, క్రొత్త జీవితలో ఇమిడిపోవాలి. ఇదే ఆలోచన, ఇదీ పోరాటం. చాలా కష్టపడి మనస్సు మరల్చుకునేది.

ఉద్యోగరీత్యా రకరకాల ఊళ్ళు మారారు. ఎంతో నిగ్రహించుకునేది స్టీవ్ ఆలోచనలు దరిదాపుల్లోకి రానివ్వకుండా ఉంచటానికి.

అట్లా అని స్టీవ్‌ను ద్వేషించలేదు అనిత. క్రమంగా స్టీవ్ ఒక అందమైన స్నేహం, ఓ మంచి జ్ఞాపకం, ఒక బలం, ఒక ఆలంబనగా మిగిలిపోయాడు. ప్రదీప్‌తో మనఃస్ఫూర్తిగా ఒక మంచి ఇల్లాలుగా ఉండటానికి తన శక్తి అంతా ఉపయోగించింది కానీ ప్రదీప్ ప్రవర్తనతో మనస్సు విరిగిపోయింది.

ఎంత బండరాయి అయినా, సుత్తితో కొడుతూ ఉంటే ఎప్పుడో అప్పుడు పగిలిపోతుంది. తొంభై తొమ్మిది గట్టి దెబ్బలు తట్టుకున్న రాయికూడా వందో దెబ్బ చిన్నదైనా, ఇక తట్టుకునే శక్తిలేక పగిలిపోతుంది.

ప్రియ, స్టీవ్ తరవాత అనిత జీవితంలో సన్నిహిత స్నేహితులంటూ ఎవ్వరూ లేరు. ఏవో పరిచయాలు, కాలక్షేపం అంతే. తన మనస్సును అర్ధం చేసుకునేవాళ్ళు లేరు, ఆ కొరతా రానానూ ఎక్కువైపోయింది ఈ పదిహేనేళ్ళల్లో.

లోలోపల నుండి ఒక తపన, అనిశ్చిత, రెస్ట్‌లెస్‌నెస్. తన జీవితంలో ఆనందంగా ఉండే ప్రాప్తం లేదా? తనేమీ చెడ్డదికాదేఁ మరి ఎందుకు తనకు ఇన్ని పరిక్షలు. ఎందుకు ఆనందం, సంతోషంలాంటివి తన దరిదాపుల్లోకి రావటంలేదు. ఏమి తప్పు చేసింది తను? మనఃస్ఫూర్తిగా నవ్వి ఎన్నాళ్ళయ్యింది?

అనితకు ఆలోచనలతో తలనొప్పి మొదలయ్యింది.

''గుడ్ మార్నింగ్ అమ్మా.. మమ్మీ'' కబుర్లు చెప్పుకుంటున్న కవిత అనిత దగ్గరికి వచ్చి విష్ చేసింది వెన్నెల.

''గుడ్‌మార్నింగ్ బంగారం. దా నా దగ్గరకు'' ముద్దుగా పిలిచింది అనిత.

దగ్గరకు వచ్చిన వెన్నెలను ఒడిలో కూర్చోపెట్టుకుంది అనిత.

''ఇవాళ ఏం రోజని చెప్పాను నీకు'' మృదువుగా గుర్తుచేసింది కవిత.

''తెలుసు నాకు. హ్యాపీ బర్తడే అమ్మ''

''అరె, భలే గుర్తుపెట్టుకున్నావు. చాలా థాంక్స్ బంగారం'' వెన్నెల నుదుటిమీద ముద్దుపెట్టుకుంది అనిత.

''తొందరగా పాలు తాగెయ్యి. మనం అమ్మ బర్త్‌డే సెలబ్రేట్ చెయ్యాలి కదా''

''బద్ధకంగా ఉంది అక్కా! అలవాటు ప్రకారం తొందరగా మెలకువ వచ్చేసింది. బైట వర్షం పడుతుంది - హాయిగా దుప్పట్లో దూరి పడుకోవాలని ఉంది. వెచ్చగా'' సోఫాలో ముడుచుకుంటూ చెప్పింది అనిత.

''గుర్తుందా చిన్నప్పుడు వర్షంలో తెగ ఆడేదానివి, తరవాత అమ్మ పకోడీలు చేసేదాకా ఊరుకునేదానివి కాదు'' నవ్వింది కవిత.

"నిజమే కదా" కాసేపు ఆగి సాలోచనగా అన్నది అనిత

"ఆఖరిసారి వర్షంలో ఎప్పుడు తడిచానో తెలుసా? స్టీవ్‌తో కలిసి జలుబు చేస్తుందని తను కోప్పడుతున్నా వినిపించుకోకుండా తనను కూడా లాగాను. ఆ వర్షంలో.." తర్వాత మాటలను మింగేసింది అనిత.

"ఇప్పటికీ నువ్వు స్టీవ్ గురించి చెపుతుంటే అదే చిరునవ్వు. ఇంకా మర్చిపోలేక పోతున్నావా స్టీవ్‌ని" నెమ్మదిగా అడిగింది కవిత.

"ఎలా మరిచిపోతానక్కా నీకు గుర్తుందా మన చిన్నప్పుడు, బహుశా నాకు ఓ పదేళ్ళు ఉంటాయేమో. మన పక్కింటి అబ్బాయి అంటే చాలా కోపంగా ఉండేవాళ్ళం. మనల్ని చాలా ఇరిటేట్ చేసేవాడు. ఒక రెండేళ్ళే ఉన్నాం ఆ ఇంట్లో కానీ ఇప్పటికీ అతను గుర్తుకు వస్తే వెధవ తెగ విసిగించేవాడు అని గుర్తు చేసుకుంటాం. అవునా?"

"అవును అయితే ఏంటి?"

"అంత చిన్న ఇరిటేషన్ గుర్తు ఉన్నప్పుడు, దానికంటే చాలా చాలా బలమైన, అందమైన బంధం కదా ప్రేమ. అదెలా మర్చిపోతాం అక్క. స్టీవ్ ఒక అందమైన భాగం నా జీవితంలో. నన్ను పెళ్ళి చేసుకోనంత మాత్రాన అతన్ని అతని అందమైన జ్ఞాపకాలను ద్వేషించాలా? ఏదో ఒక సంఘటన, ఏదో మాట, వర్షం చూసినప్పుడో, ఏ వెన్నెల రాత్రిలోనో అలా ఒక పిల్ల తెమ్మెరలాంటి జ్ఞాపకం. ఒక చిన్న సంతోషం."

**కవిత ఏదో** అనబోతుండగా అనిత ఫోన్ మోగింది

"ఎవరిదీ ఈ నెంబరు, ఇంత ప్రొద్దున్నే" అంటూ 'హలో'" అంది అనిత.

"హాపీ బర్త్‌డే టు యు" రాగయుక్తంగా వినిపించింది.

"హూ ఈజ్ దిస్.." ఆశ్చర్యపడుతూ అడిగింది అనిత.

"అరే! ముందు థాంక్స్ చెప్పవోయ్" నవ్వుతూ వినిపించింది.

"ప్రియా.. ఓ మైగాడ్" గట్టిగా అరిచేసింది అనిత.

ఆశ్చర్యంగా చూసింది కవిత – ఇన్నేళ్ళగా దూరం అయిన ప్రియ?

"నమ్మలేకపోతున్నా, నా నెంబరు ఎలా తెలిసింది?" గట్టిగా నవ్వుతున్న ప్రియను అడిగింది.

"ఏవో నా తిప్పలు నేను పడ్డాలే ఎలా ఉన్నావు? ఏమి చేస్తున్నావు నీ బర్త్‌డేకి."

"ఇప్పుడు అక్క దగ్గర ఉన్నాను. నేను మళ్ళీ చికాగో వచ్చేశా. దాదాపు సంవత్సరంన్నరగా అక్కవాళ్ళు పియోరియాలో ఉంటున్నారు. నీ కబుర్లు చెప్పు."

"నేను కొన్నాళ్ళు బే ఏరియాలో పనిచేసి, తిరిగి శాండియాగో వచ్చేశాను. ఇక్కడ బాగా నచ్చుతుంది. చాలా చాలా మాట్లాడాలి నీతో. ఎక్కడ మొదలెట్టాలో అర్థం కావట్లేదు. చాలా హ్యాపీగా ఉంది, ఎమోషనల్‌గా కూడా. ఫోన్ ఇంకెవరికో ఇస్తున్నా, ఎవరో గుర్తుపట్టు" అన్నది ప్రియ.

"హాయ్ అనిత! ఎలా ఉన్నావ్?" మగగొంతు తెలుగులో, ఒక్క క్షణం పట్టింది అనితకు –

"ఆనంద్? నువ్వు ప్రియకు దగ్గర్లోనే ఉంటావా? ఇద్దరూ కలిసి ఇలా సర్‌ప్రైజ్ చేశారు నన్ను" ఎంతో ఉద్వేగంగా ఉంది అనితకు.

ఈ మధ్యకాలంలో మరీ ఒంటరి అయిన భావనలో ఉన్న అనితకు తిరిగి వీళ్ళు తన జీవితంలోకి రావటం, ఒక అనిర్వచనీయమైన భావనతో కళ్ళు చమర్చాయి.

"ఇంతకీ ఎలా కనుక్కున్నారు నన్ను."

"అల్యుమిని అసోసియేషన్ అని ఎవరైనా ఫోన్ చేశారా? అది మేము హైర్ చేసిన డిటెక్టివ్ నిన్ను కనుక్కోటానికి" నవ్వింది ప్రియ.

దాదాపు ఓ గంట మాట్లాడుకుంటూ ఉండిపోయారు.

"రాజి మీ ఊరిలోనే ఉంది తెలుసా. తన నెంబరు పంపిస్తాలే"

స్టీవ్ గురించి అడుగుతుందేమో అని ప్రియ, ఆనంద్ ఎదురు చూశారు. వాళ్ళే చెపుతారని అనిత ఎదురు చూసింది. స్టీవ్ టాపిక్ ఎవరు ముందు మొదలెట్టాలో అర్థంకానట్లు ఆగిపోయారు.

అనితకు తెలియని విషయం ఏంటంటే స్టీవ్ ప్రాయ్‌త్నాల వలనే తనను కనుక్కోగలిగారని, పైగా స్టీవ్ ప్రియ పక్కనే కూర్చుని స్పీకర్‌లో ఈ సంభాషణ అంతా వింటున్నాడని.

"సర్లే అనిత నీ ఫ్యామిలీ గడపనీయకుండా చాలాసేపు మాట్లాడాం. ఇకనుండి రెగ్యులర్‌గా మాట్లాడుకుందాం" అన్నది ప్రియ.

"ప్రియ...! అనిత గొంతులో ఓ తడబాటు 'స్టీవ్ ఎలా ఉన్నాడో తెలుసా?'"

కాసేపు ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు.

"తెలుసు అనిత. ఏం చేస్తున్నాడో, ఎక్కడ ఉన్నాడో కూడా. మళ్ళీ మాట్లాడతాను నీతో, చాలా మాట్లాడుకోవాలి మనం" మృదువుగా చెప్పింది ప్రియ.

"సరే ఆనంద్ నెంబరు, రాజిది కూడా పంపు. ఐ యామ్ వెరీ హాపీ. చాలా మంచి పుట్టినరోజు గిఫ్ట్. చెప్పచ్చో లేదో ప్రొద్దుటినుండి మనం కాలేజీలో ఉన్నప్పుడు స్టీవ్ లేక దగ్గర అర్థరాత్రి నా బర్త్‌డే సెలబ్రేట్ చేసినదే గుర్తుకు వచ్చింది. ఇంతలో మీ ఫోన్. ఇది నిజమేనా అనిపిస్తుంది. సర్లే మరీ ఎమోషనల్ అవుతున్నా "బై" పోన్ పెట్టేసి అలాగే కూర్చుండిపోయింది అనిత.

ప్రియనుండి మెసేజ్ వచ్చింది –

'నాకు నిన్ను చూడాలని ఉంది. వచ్చేవారం సెలవు పెట్టుకుని వస్తున్నా నీకు వీలవుతుందా. అప్పుడు రాజిని కలుద్దాం."

"తప్పకుండా రా! నేనూ సెలవు పెడతాను. "

రెండు రోజులు వెన్నెలతో గడిపితే మనసంతా ఎంతో తేలికగా, హాయిగా అనిపించింది. తన పనులన్నీ బాగానే చేసుకుంటుంది. బ్రైన్ డెవలప్‌మెంట్ బాగుంటుంది రెండు భాషలు నేర్చుకుంటే అని తెలుగు, ఇంగ్లీషు రెండూ నేర్పించారు చిన్నప్పటి నుండి.

పుట్టిన రోజున గుడికి వెళదాం అని కవిత అంటే, అందరూ గుడికి వెళ్ళారు. పట్టులంగాలో బుట్టబొమ్మలాగా తయారయ్యింది వెన్నెల. గుడిలో, ఆ ప్రశాంతమైన వాతావరణంలో కొత్త ధైర్యం, ఓ రకమైన స్థిరత్వం లభించాయి అనితకు.

ఆదివారం ప్రొద్దున ఇండియాలో ఉన్న తల్లికి ఫోన్ చేశారు. తండ్రి పోయాక, ఓ రెండుసార్లు అమెరికా వచ్చింది ఆవిడ. ఇక ఇంతదూరం ఒంటరిగా ప్రయాణాలు చెయ్యలేనని చెప్పి రావటం మానేసింది. తనలాగే వంటరిగా ఉంటున్న ఆవిడ అక్కతో కలిసి ఒకే చోట ఉంటున్నారు.

ప్రసాద్, వెన్నెల షాపింగ్ కని వెళ్ళారు.

"నేను ప్రదీప్‌తో విడిపోదామనుకుంటున్నా అక్క" ప్రశాంతంగా చెప్పింది అనిత.

ఉలిక్కిపడింది కవిత. ఇద్దరి మధ్య సఖ్యత లేదని తెలిసినా, అనిత ఈ నిర్ణయం తీసుకుంటుందని అనుకోలేదు.

"ఏం సాధిస్తావు అనిత ఈ నిర్ణయంతో ఒంటరిగా మిగిలిపోతావా? నాకు తెలుసు నువ్వు ప్రదీప్ విషయంలో చాలా దెబ్బతిని ఉన్నావని. కానీ ఏంటిది, నచ్చచెప్పు అనిత. మారతాడేమో?"

"లేదక్కా చాలా ప్రయత్నించా. ఇంత జరిగాక కూడా ఇంకా తానే కరెక్టు, నేను దేనికి ఇంత రాద్ధాంతం చేస్తున్నానో అనుకుంటాడు తప్పితే, నేను అనవసరంగా గొడవలు పెట్టుకునే టైప్ మనిషినా, కాదా అని, ఎందుకు ఇంత బాధపడుతున్నానో అర్థం చేసుకోడు, బహుశా నేను ఈ పదిహేనేళ్ళగా ఆలోచించటం మానేశా. ఇప్పుడిప్పుడే మళ్ళీ ఆలోచిస్తున్నా. గత మూడు నెలలుగా, కనీసం నాకు విషయం అంతా తెలిసిపోయింది. తన పేరు మీద ఆస్తులు కొనుక్కున్నానే అన్న పశ్చాత్తాపం ఏమీలేదు, పోనీ నా పేరు మీదకూడా మారుస్తానన్న మాట కూడాలేదు. పైగా నా జీతం వేరే పెట్టుకున్నా, ఖర్చులన్నీ సగం సగం చేసుకుందాం అన్నానని బండెడు కోపం. చాలా విరక్తిగా ఉందక్కా! నేనేదో సమస్యను డీల్ చెయ్యటం చేతగాక పలాయనవాదంతో మాట్లాడటం లేదు. నాలో చాలా అంతర్మధనం మొదలయ్యింది."

"నాకు అర్థం అవుతుంది అనిత నీ బాధ. కానీ అన్ని పెళ్ళిళ్ళలోనూ ఏవో సమస్యలు ఉంటాయి, కొన్ని చిన్నవి కొన్ని పెద్దవి. నీ ఆలోచనలని కించపరచాలనికాదు. కానీ ఇంత పెద్ద నిర్ణయం" ఎలా చెప్పాలో అర్థంకాలేదు కవితకు.

"నిజం చెప్పక్కా. నాకంటే పెద్దదానివి, నువ్వు కూడా ఎంతో అనుభవించావు. పిల్లలు లేరనే బాధ, కానీ అంత బాధలోనూ నీకు నిజంగా ఎవరు తోడుగా ఉన్నారు. బావే కదా! అమ్మ, నేను నిన్ను ఎంత అర్థం చేసుకున్నా బావ ఎప్పుడూ నిన్ను ప్రేమించారు., గౌరవించారు. ఆయన నీ వెంటే ఉన్నారన్న ధైర్యంతో అన్నీ తట్టుకోగలిగావు. అలాగే ఆయన ధైర్యం ఆలంబన కూడా నువ్వే. పిల్లలు పుట్టలేదని మీ అత్తగారు అనే మాటలకు ఎంత బాధపడ్డావు నువ్వు, వెన్నెలను దత్తత తీసుకునేటప్పుడు కూడా ఆవిడకుససేమిరా ఇష్టంలేదు కానీ బావ ఏం చెప్పారో, ఎలా చెప్పారో ఆ సూటిపోటి మాటలు ఆగిపోయాయి కదా! వైవాహిక జీవితంలో ఒకరిపై ఒకరికి ప్రేమ, గౌరవం కనీసం ఇష్టం కూడా లేకుంటే ఇంక ఆ బంధంలో ఏం మిగిలింది?"

ఏదో చెప్పబోతున్న కవితను ఆపేసింది అనిత.

"ప్లీజ్ అక్కా నన్ను మాట్లాడనీ. అన్ని బంధాల్లోకి పవిత్రమైనది భార్యాభర్తలది. ఒకే ఇంట్లో వీళ్ళిద్దరే ఎక్కువకాలం ఉంటారు. శారీరకంగా, మానసికంగా ఒకరికొకరు సమర్పించుకోవాలి. నేనేదో రొమాంటిక్ ఆలోచనలతో, పుస్తకాల్లోలాగా ఉండాలని మాట్లాడటంలేదు. పెళ్ళి అయిన క్షణం నుండి ఇదే ఇక నా జీవితం అని నన్ను నేను ఎంతో మార్చుకున్నాను. కానీ కాస్త గౌరవం, ప్రేమకు కూడా నోచుకోనంత తప్పు నేను ఏం చేశానక్కా? అంత చెడ్డదాన్నా?"

దుఃఖంతో గొంతు వణికింది అనితకు.

ఏమీ మాట్లాడకుండా అనిత చెయ్యి పట్టుకుంది కవిత. తనను తాను సంభాళించుకున్నది అనిత.

"ఇంక గడుసుగా ఉండటం లేదా గద్దరితనంతో మేనిప్యులేషన్స్ నావల్ల కాదక్కా. మా ఫ్రెండ్ ఒకమ్మాయి ఇదివరకోసారి చెప్పింది. మొగుడిని బుట్టలో వేసుకోవాలంట. అదే తెలివిగల అమ్మాయిలు చేయాల్సిందంట. వద్దక్కా నాకు ఆ తెలివితేటలు, ఎత్తులు పై ఎత్తులు. నేను పైకి ఒకలాగా లోపల ఇంకోరకంగా ఉండలేను. నా వల్లకాదు ఇంక, విడిగా వేరే ఎపార్టుమెంట్‌లో ఉండదలచుకున్నాను.."

ఇంకేదో చెప్పబోతుండగా షాపింగ్‌కు వెళ్ళిన వెన్నెల, ప్రసాద్ తిరిగి వచ్చారు .

"ఏ షాపింగ్ చేశారు ఇంతసేపు" కవిత అడిగింది.

"అమ్మకు గిఫ్ట్"

"నాకెందుకు బంగారం గిఫ్ట్" పక్కన కూర్చోపెట్టుకుంటూ అడిగింది అనిత.

ఏమీ మాట్లాడకుండా చిన్న బాక్సు చేతిలో పెట్టింది వెన్నెల.

తీసి చూస్తే, సన్న చైన్, రెండు హార్టు గుర్తులు ఒకదాంట్లో ఒకటి విడిపోనట్లుగా లాకెట్టు. ఎంతో అందంగా ఉంది.

"ఎంత బాగుందో. ఎందుకు నచ్చింది నీకు" బుగ్గమీద ముద్దు పెట్టుకుంటూ అడిగింది అనిత.

"ఇది నీ హార్టు, ఇంకా నా హార్టు" కాసేపు ఆలోచించి చెప్పింది వెన్నెల.

"నువ్వు నమ్మవు అనిత, ఎన్ని షాపులు తిప్పిందో ఏదీ నచ్చలేదని. చివరికి ఇది చూడగానే తీసుకుంది. మన వెన్నెల ఎంత తెలివిగలదో, ఎంత సెన్సిటివ్‌గా ఆలోచించిందో కదా. నువ్వు నిన్నటినుండి ఏదో మూడ్ ఆఫ్‌లో ఉన్నావని గ్రహించింది" మురిపెంగా చెప్పాడు ప్రసాద్.

గుండె బరువెక్కింది అనితకు. వెన్నెలను హత్తుకుని అలాగే కూర్చుండిపోయింది కాసేపు.

"ఇక బయలుదేరతా. రేపు ఆఫీసు ఉందిగా"

"రేపు ప్రొద్దున్నే వెళ్ళు అనిత. ఎంత ట్రాఫిక్ ఉన్నా కానీ ఎనిమిదిగంటలకల్లా వెళ్ళిపోగలవు" వారించాడు ప్రసాద్.

"లేదులే బావ. వెళతాను. రాత్రికి రెస్టు తీసుకోవచ్చు."

బ్యాగ్ తీసుకుని "బై బంగారం" అంటూ వెన్నెలను హత్తుకుని నుదుటి మీద ముద్దు పెట్టింది అనిత.

***

***అనిత, ప్రియ, రాజి***

ఫ్లైట్ దిగి సూట్ కేసు తీసుకోటానికి బ్యాగేజ్ క్లెయిమ్ దగ్గరకు వస్తుంటే, "హాయ్ ప్రియ" గట్టిగా వినపడింది.

నవ్వుతూ ఎదురొస్తోంది అనిత. చాలా మారింది అనిత. బొద్దుగా అయ్యింది. మొహం గుండ్రంగా ఉంది. కళ్ళజోడు కూడా పెట్టుకుంది. ఫోటో చూసింది కాబట్టి వెంటనే గుర్తుపట్టగలిగింది ప్రియ.

"ఏమీ మారలేదు నువ్వు" దగ్గరికి వచ్చి హత్తుకుంది అనిత.

ఇద్దరికి కళ్ళు చెమ్మగిల్లి, గుండె బరువెక్కింది.

"సెంటిమెంటల్ చేసేస్తావోయ్ నువ్వు. అది మాత్రం మారలేదు" నవ్వింది ప్రియ కళ్ళు తుడుచుకుంటూ.

"ఎంత హ్యాపీగా ఉందో నాకు. పద సూట్‌కేస్ తీసుకుని బైటపడదాం."

ఇద్దరూ సూట్‌కేసు తీసుకుని బైటకు వచ్చి కారులో పెట్టారు.

"ముందు మా ఇంటికి వెళ్ళి, లంచ్ తిని అప్పుడు రాజి దగ్గరకు వెళదాం. సరేనా."

"అలాగే, రాజి మనిద్దరిని చూసి బాగా షాక్ అవుతుందేమో"

"నువ్వు వచ్చాక కలుద్దాం అన్నావని నేను ఫోన్ కూడా చెయ్యలేదు. ఎలా ఉందో? కలవాలని చాలా ఆత్రంగా ఉంది"

"చికాగో చాలా మారిపోయినట్లుగా అనిపిస్తుంది. గ్రాడ్యుయేషన్ అయ్యాక మళ్ళీ రాలేదు" కారులోనుండి పరిసరాలు గమనిస్తూ అంది ప్రియ.

ఇన్నేళ్ళ తరవాత కలసిన ఆనందం ఇద్దరినీ ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. మనఃస్పర్ధలతో విడిపోయి ఎన్నో సంవత్సరాలయినా, అంతర్లీనంగా ఇద్దరిలో ఒకరిపైన ఒకరికి ఉన్న ఆప్యాయత చెక్కుచెదరలేదు.

పిచ్చాపాటి కబుర్లు చెప్పుకుంటూ, అనిత వాళ్ళు ఉండే టౌన్ హోమ్‌కు వచ్చారు.

ఎయిర్‌పోర్ట్‌కు అరగంట దగ్గరలోనే ఉంది అనిత వాళ్ళ ఇల్లు..

చకచకా కూరలు వేడిచేసింది అనిత. ఎయిర్‌పోర్ట్‌కు వచ్చేముందే కుక్కర్‌లో బియ్యం పెట్టి వచ్చింది.

"రాజి వాళ్ళు ఏ ఏరియాలో ఉంటారు?"

"అరోరా అని చెప్పింది. నీకు ఎంతదూరం?" బెండకాయ వేపుడు అన్నంలో కలుపుకుంటూ చెప్పింది ప్రియ.

"ఓ అదా? ఆ చుట్టుపక్కల ఇండియన్స్ ఎక్కువ. అయినా ఏ ఏరియాలో ఉండట్లేదులే. చికాగో పెద్ద సిటీ కదా! అన్ని సబర్బ్స్‌లోనూ బాగా ఇండియన్స్ కనిపిస్తారు. ఓ గంట పడుతుందేమో, ట్రాఫిక్ బట్టి వాళ్ళింటికి వెళ్ళటానికి."

"వంట చాలా బాగా చేశావు అనిత. ఎప్పుడు నేర్చుకున్నావు ఇంత బాగా చెయ్యటం. నాకు ఓ నాలుగు రకాలు వచ్చు. కాస్త కాన్ఫిడెంటుగా అవే చేసుకుంటా. ఈ వారం రోజులు ఇలాగే తిన్నానంటే ఇక కొత్త బట్టలు కొనుక్కోవాలి"నవ్వింది ప్రియ.

"అంతలేదులే, మరీ ఎక్కువ పొగడకు. కానీ నువ్వు ఏమీ మారలేదు ప్రియ. చక్కగా మెయింటెన్ చేస్తున్నావు. నేను చూడు ఎంత లావయ్యానో కదా" తనవైపు చూసుకుంటూ అంది అనిత.

"కొంచెం ఒళ్ళు వచ్చింది కానీ ఏమీ పర్లేదు. పిల్లల పనులు, సంసార బాధ్యతలతో చాలామంది ఆడవాళ్ళు తమని తాము పట్టించుకోరు. జిమ్‌కు వెళ్ళటం మొదలుపెట్టు, ఒక్క సంవత్సరంలో ఫిట్‌గా అవుతావు."

"ఆనంద్ ఎలా ఉన్నాడు? తన ఫ్యామిలి గురించి చెప్పు"

"చెపుతాలే రాజిని కలిశాక, లేకుంటే మళ్ళీ అన్నీ రిపీట్ చెయ్యాలి."

అనిత చేసిన మ్యాంగో మూస్ తింటూ "చాలా బాగుంది ఈ స్వీట్ అనిత"

"వెన్నెలకు బాగా ఇష్టం" చిరునవ్వుతో చెప్పింది అనిత.

"అమ్మ, అక్క ఎలా ఉన్నారు?"

"అందరూ బాగున్నారు. నాన్నపోయిన తరవాత ఓ రెండుసార్లు వచ్చింది. ఇక్కడే ఉండిపోవటానికి గ్రీన్ కార్డు స్పాన్సర్ చేస్తామంటే ససేమిరా ఒప్పుకోలేదు. పెద్దమ్మతో కలిసి ఉంటుంది. నా వంకనైనా ఇండియా వచ్చి పోతుండండి అంటుంది."

"అమ్మను పోగొట్టుకోవటం నాకు పెద్ద దెబ్బ అనిత. తన జీవితం అంతా నా కోసమే బ్రతికింది. తీరా తనను ఇక్కడికి పర్మెనెంటుగా తెచ్చుకుందాం అనుకునే లోపల..."

"మరి మీ నాన్నగారు?"

"ఏమో అమ్మతోనే ఆ ఇంటితో సొంతం తెగిపోయింది. అమ్మ చివరి రోజుల్లో తన దగ్గర ఉన్నప్పుడు, ఆయన నాతో మాట్లాడటానికి ప్రయత్నించాడు. నేను పట్టించుకోలేదు. వేరే ఫ్యామిలీ లేదు కాబట్టి ఇక మా మధ్య వార్తలు మోసేవాళ్ళు కూడా లేరు. నా మట్టుకు నేను ఆ విషయంలో హాయిగా ఉన్నా. నా బ్రతుకు, నాకు ఇష్టం వచ్చినట్లు బ్రతుకుతున్నా."

ప్రియ ఫోన్ మోగింది. 'రాజి'

"నన్ను ఎయిర్‌పోర్ట్‌కు రావద్దు అన్నావు. ఇంకా రాలేదేంటి అని చూస్తున్నా."

"చెప్పాగా రాజి. సాయంత్రం అవుతుందని. ఇక్కడ ఒకరిని కలవాలని అన్నాను కదా. కాసేపట్లో బయలుదేరతాను" ఫోన్ పెట్టేసింది.

"అనిత నాకు ఈ వారం రోజుల మనం కలిసి ఉండాలని ఉంది, ఏ డిస్టబెన్స్ లేకుండా. రాజికి కూడా చెప్పాను ఈ విషయం. ఇక్కడికి దగ్గర్లోని ఒక వెకేషన్ హోం బుక్ చేశాను. నాకు తెలుసు మీరిద్దరూ మీ ఇళ్ళల్లో ఉండమని గొడవచేస్తారని. ప్రదేశం మారితే అందరం మరింత రిలాక్స్ అవ్వొచ్చు, మనస్సు విప్పి మాట్లాడుకోవచ్చు అనిపించింది."

**"ఎక్కడ తీసుకున్నావు?** ప్రదీప్ రాత్రిపూట లేటుగా వస్తాడు. రోజంతా మనవే కదా!"

"అయినా సరే ఈ వంటలు గోల లేకుండా హాయిగా ఉందాం. నువ్వు వెకేషన్‌కు వెళ్ళి ఎన్నాళ్ళయింది? నేను నెట్‌లో చూసి బుక్ చేసేశా. ఇక్కడి నుండి ఓ రెండు గంటల ప్రయాణం. ఒక పెద్ద లేక్ ఉంది. దాని దగ్గర వెకేషన్ హోమ్. ప్లీజ్ కాదనకు. ప్రదీప్ ఏమైనా అనుకుంటాడా?"

"ప్రదీప్ గురించి కాదులే. సర్లే నాకు కూడా ఛేంజ్‌గా ఉంటుంది. మరి రాజికి ప్రాబ్లం ఏమీ లేదా? ఒప్పుకుంటుందా?"

"ఒప్పిద్దాములే మనిద్దరం" నవ్వేసింది ప్రియ.

"రేపు ప్రొద్దున్నే బయలుదేరదాం. కమాన్ బట్టలు సర్దుకో" హడావుడి చేసింది.

"సర్లే ఏమీ మారలేదు నువ్వు నీ హడావుడి" ప్రియ వంక ఆప్యాయంగా చూస్తూ నవ్వింది అనిత.

వంటిల్లు అంతా సర్దేసి ప్రదీప్‌కు ఫోన్ చేసింది అనిత.

"ఏంటి? ఎత్తుతూనే అడిగాడు ప్రదీప్. ఇద్దరూ కనీసపు మాత్రం మాట్లాడుకొని ఓ మూడు నెలలయ్యిందేమో.

"నా స్నేహితురాలు వచ్చింది. ఇంకో ఫ్రెండ్‌ను కలుసుకోటానికి వెళుతున్నాం. ఒక వారం తరవాత వస్తాను. ఇదే చెపుదామని చేశాను" అని పెట్టేసింది అనిత.

ప్రియకు ఆ సంభాషణ వినిపిస్తూనే ఉంది. ఏమీ చెప్పకుండానే అంతా అర్థమ్మట్లుగా ఉంది. అనిత బట్టలు సర్దుకుంటుంటే పక్కనే కూర్చుంది ప్రియ. బెడ్‌రూం అంతా పరికించిన ప్రియకు అర్థం అయ్యింది. అనిత బట్టలు సర్దుకుంటుంటే పక్కనే కూర్చుంది ప్రియ. బెడ్‌రూం అంతా పరికించిన ప్రియకు అర్థం అయ్యింది. ఇది అనిత రూం మాత్రమే అని, ప్రదీప్‌కి సంబంధించిన వస్తువులేవీ డ్రెస్సర్ మీద లేవు.

"ప్రియా నీ మనస్సులో సందేహాలన్నీ నిజమే నాకూ ప్రదీప్‌కు మధ్య సత్సంబంధాలు లేవు. చెపుతాలే నెమ్మదిగా. వారం రోజులు భరించటానికి సిద్ధపడ్డావుగా" పొడిగా నవ్వింది.

"చనిపోయే లోపల ఒకసారి స్టీవ్‌ని చూడాలని ఉంది ప్రియ. నన్ను కలవటానికి ఇష్టపడతాడో లేదో కానీ ఒక్కసారి.. ప్రియ నిజం చెప్పు తను బాగానే ఉన్నాడు కదా? సంతోషంగా ఉన్నాడా? తను ఎప్పుడూ సంతోషంగా ఉండాలి. నాకంతే చాలు."

ప్రియ కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి అనిత మాట్లాడిన విధానంకు. స్టీవ్ అనితను ఇప్పటికీ ఎంత ప్రేమిస్తున్నాడో తెలిస్తే అనిత ఏమైపోతుంది?

"ప్రేమ విషయం పక్కనే పెడితే స్టీవ్ చాలా మంచి స్నేహితుడు. తనతో ఉంటే నాకు ఏ సంకోచాలు, భయాలు ఉండేవి కాదు. నాతో నేను ఎలా ఉంటానో తనతోనూ అంతే. తనను నేను ప్రేమించాను. తనకు లేదు అలా. నా ప్రాప్తం ఇంతే, సర్లే ఈ మాటలు ఎప్పుడూ ఉండేవే. పద బయలుదేరదాం. సాయంత్రం ట్రాఫిక్ పెరుగుతుంది."

ప్రియవైపు చూడకుండా సూట్‌కేసు జిప్ వేసి, సూట్ కేసు మోసుకుంటూ బయటకు వచ్చింది.

అనిత గొంతులోని మార్పు గమనించింది ప్రియ. వచ్చే ఏడుపును బలవంతాన ఆపుకుంటుందని గ్రహించింది. ఏమీ రెట్టించదలచుకోలేదు. ఈ వారంలో అనిత మనస్సులో, జీవితంలో ఉన్నదంతా తెలుసుకోవాలని ముందే నిర్ణయించుకుంది ప్రియ. తన మానసిక స్థితి బట్టి స్టీవ్ గురించి చెపుదాం అనుకుంది.

కారులోని జిపిఎస్‌లో రాజి అడ్రస్సు ఫీడ్ చేసి కారు పోనిచ్చింది అనిత.

డోర్ బెల్ మోగగానే, దానికోసమే ఎదురు చూస్తున్నట్లుగా రాజి వెంటనే తలుపు తీసింది. చిరునవ్వుతో తలుపు తీసిన రాజిని చూసి "హాయ్ రాజి" అని అరిచేసింది ప్రియ.

"ఎప్పటినుండి ఎదురుచూస్తున్నానో తెలుసా. రారా లోపలికి" పక్కకి తొలిగింది రాజి.

"ముందు ఇటు చూడు, నాతో ఎవరిని తీసుకుని వచ్చానో చూడు." పక్కగా నిల్చున్న అనితను ముందుకు లాగింది ప్రియ.

ఒక్కసారిగా స్టన్ అయినట్లుగా నోటికి చెయ్యి అడ్డుపెట్టుకుని అలాగే చూస్తూ ఉండిపోయింది రాజి.

జీన్స్ మీద కుర్తీ వేసుకుని, జుట్టుకు చిన్న క్లిప్ పెట్టి వదిలేసింది. నవ్వుతూ ఎదురుగా నిల్చుంది అనిత అని గుర్తుపట్టటానికి రెండు సెకండ్లు పట్టింది కానీ నిజంగా అనితనే చూస్తున్నా అనన్ విషయం బుర్ర గ్రహించటానికి కాస్త ఎక్కువ టైమే పట్టింది.

''ఇంత పెద్ద షాక్ ఇస్తే నా గుండె తట్టుకోవద్దూ'' నవ్వుతున్న ఇద్దరిని కోప్పడింది రాజి.

''రండి లోపలికి. అనిత ఎక్కడ ఉంటున్నావు. ఎప్పుడు కలుసుకున్నారు? ఇద్దరూ కలిసి నాకు ఇలా సర్‌ప్రైజ్ ప్లాను చేశారు కదా! క్షమించకూడదు మిమ్మల్ని. ఇంకా గుండె దడ తగ్గలేదు'' ఆనందంలో గబగబా మాట్లాడేస్తుంది రాజి.

''ఓయ్! కాస్త ఊపిరి పీల్చుకో'' నవ్వింది ప్రియ.

అందరూ లోపలికి వచ్చి ఫ్యామిలీ రూంలో కూర్చున్నారు.

''కాఫీనా, టీనా లేక జ్యూస్ తాగుతారా?'' హడావుడి పడింది రాజి.

''అరె ఏంటా కంగారు. మాకు మర్యాదలు చెయ్యాలా? కూర్చో ముందు'' నవ్వింది అనిత.

''ఏదో ఒకటి తాగుతూ కబుర్లు చెప్పుకోవచ్చు కదా. చెప్పండి.''

''సరే అయితే అందరికి టీ పెట్టు'' అంది ప్రియ.

టీ పెడుతూ, అందరికి ప్లేట్లో పకోడీలు, జిలేబీ సర్దింది రాజి.

''ఏంటిది ఇన్ని పెట్టావు. అసలే లంచ్ హెవీ అయ్యింది'' ఆ ప్లేట్లు చూస్తూ అన్నది ప్రియ.

''ఏమీ మాట్లాడొద్దు. ఏది పెడితే అది తినాల్సిందే ఇది బెల్లం జిలేబీ స్పెషల్‌గా తెప్పించా. ఒకే ఒక్క స్వీట్ షాపులో చేస్తారు'' కప్పుల్లో టీ పోస్తూ చెప్పింది రాజి.

''మీ ఇల్లు బాగుంది రాజి. పిల్లలు బాగున్నారు. ప్రియ చెప్పింది. శ్వేత ద్వారా నిన్ను కనుక్కున్నా అని'' గోడ మీద ఉన్న శ్వేత, సాత్విక్ ఫోటోలు చూస్తూ అన్నది అనిత.

''ఇంక ఇప్పుడు చెప్పండి అసలు కబుర్లు. అనిత ఎక్కడుంటున్నావు'' టీ కప్పులు చేతికి అందిస్తూ అడిగింది రాజి.

''అతి కష్టం మీద ఓ రెండువారాల క్రితం అనితను కన్నుక్కున్నాం. పోయిన వారం తనతో మాట్లాడను, ఇదిగో ఇప్పుడు కలిసాను. తనూ ఇక్కడే ఉంటుంది''

''నేను ఇక్కడికి వచ్చి ఓ సంవత్సరంన్నర అయ్యిందేమో. ఎక్కువ పరిచయాలు లేవు'' అన్నది అనిత.

''ఏం కబుర్లు చెప్పుకోవాలి. ఎక్కడ మొదలెట్టాలో అర్థం కావట్లేదు. ఎంత సంతోషంగా ఉందో''

''ఇదిగో సెంటీ అయ్యి నన్ను ఏడిపించారంటే మాత్రం ఊరుకోను'' కోప్పడింది ప్రియ. నవ్వేశారు అందరూ.

''సరే కబుర్లు తరవాత – రాజి నిన్ను ఓ వారం రోజులు కిడ్నాప్ చేస్తున్నా, మీ ఆయనతో ఏం చెప్పుకుంటావో, ఎలా ఒప్పిస్తావో మాకు తెలియదు, రేపు ప్రొద్దున్నే ప్రయాణం. రాత్రికి ఇక్కడే ఉంటాం. మీ ఆయనకు ఛాయిస్ లేదులే ఒప్పుకుంటారు మేం కూడా అడుగుతాం'' ప్రియ తన ప్లాను అంతా చెప్పింది.

''వారం రోజులా? హమ్మో ఒప్పుకోరు. అయినా ఇంతిల్లు ఉంది కదా.''

''నువ్వు ఏమీ మాట్లాడకు. కమాన్ బాగుంటుంది సరదాగా ఓ వారం గడుపుదాం. ఇన్నేళ్ళ తరవాత కలిసాం కదా. ప్లీజ్ ప్లీ వేణుగారిని ఒప్పించు'' చిన్నపిల్లలాగా ప్రియ అడిగే విధానంకు గట్టిగా నవ్వేసింది రాజి.

ప్రభాతపు తొలి వెలుగులో కారు మెత్తగా వెళుతుంది.

"తేరే బినా జిందగీ సే కోయీ షికనా తో నహీ.." ఆర్ద్రంగా వినిపిస్తుంది కిషోర్ కుమార్ గొంతు కారు సీడీలో నుండి.

అనిత, ప్రియ, రాజి ఎవరి ఆలోచనల్లో వాళ్ళు ఉండిపోయారు. మౌనంగా ఆ పాత పాటల మాధుర్యం ఆస్వాదిస్తూ.

తెల్లవారుఝామున నాలుగు గంటలకే బయలుదేరారు. ఇంకో అరగంటలో వెళ్ళాల్సిన చోటు ఉంది.

"ఎంత అందమైన బాధాకరమైన ఆలోచన కదా. నువ్వు లేని జీవితం మీద నాకు పిర్యాదు లేదు. నువ్వు లేని జీవితం ఉంది కానీ అందులో జీవం లేదు. ఒకప్పుడు ఇలాంటి పాటలు విని ఏంటీ పిచ్చిగోల అనుకునే దాన్ని కానీ ఆ బాధ, వేదన ఇప్పుడిప్పుడే అర్ధం అవుతున్నాయి" కళ్ళు తెరవకుండానే నెమ్మదిగా అన్నది ప్రియ.

కారు డ్రైవ్ చేస్తున్న అనిత మృదువుగా నవ్వింది.

"ఎవరో కవి అన్నట్లు ప్రేమలో ఓడిపోయినా, కనీసం ప్రేమను ఆస్వాదించగలిగే వరం దొరకటం అదృష్టమేమో. చాలామందికి ఆ ప్రేమ ఎలా ఉంటుందో కూడా తెలియకుండా జీవించేస్తారు" అన్నది రాజి.

జిపిఎస్ మార్గం చూపుతుంటే కారును వెకేషన్ హోమ్ ఆఫీసు దగ్గర ఆపింది. ప్రియ లోపలికి వెళ్ళి సంతకం చేసి తాళాలు తీసుకుని వచ్చింది. తిరిగి కారులో కూర్చుని వాళ్ళు ఇచ్చిన మ్యాపు ప్రకారం వెళ్ళారు.

చుట్టూ చెట్లు, చెట్ల మధ్య దూరదూరంగా దుంగతో చేసిన ఇళ్ళు, మధ్యలో పెద్ద సరస్సు - ఏదో కలలాగా ఉంది.

కారు దిగి ముగ్గురూ నోటమాట రానట్లుగా ఉండిపోయారు.

నీటి మీద పల్చగా పరచుకున్న మంచు తెర, స్వాగతిస్తున్న చిరుగాలి, ఈ ప్రకృతికి మేమే కాపలా అన్నట్లు ఎత్తుగా పెరిగిన పైన్ చెట్లు, లేలేత చిగుళ్ళతో సింగారించుకుంటున్నా ప్రకృతి కాంత, గాలిలో గమ్మత్తైన అడవి వాసన.

ఆ అద్భుతాన్ని కలుషితం చేయకూడదు అన్నట్లు మౌనంగా ఉండిపోయారు ముగ్గురూ.

ఇంటి బైట కూర్చోటానికి చెక్కతో చేసిన పిక్నిక్ టేబుల్, బల్లలు ఉన్నాయి. దానిమీద కూర్చున్నారు ముగ్గురు.

"ఎంత బాగుంది ప్రియ. బైట వేరే ప్రపంచం ఉన్నదన్న విషయం గుర్తుకు రాదేమో ఇక్కడుంటే" మౌనాన్ని ఛేదిస్తూ అన్నది రాజి.

"రండి అన్నీ లోపల సర్దుకుని, కాసేపు వాకింగ్‌కి వెళ్ళి వద్దాం" తపో సమాధి నుండి లేస్తున్నట్లుగా అన్నది అనిత.

మూడు బెడ్ రూంలు, కిచెన్, లివింగ్ రూం, అన్ని సదుపాయాలు ఉన్నాయి.

సూట్‌కేసులతో పాటు తెచ్చుకున్న తినుబండారాలన్నీ సర్దేశారు లోపల.

"ఆకలి ఆకలి. వీళ్ళు ఇచ్చిన మ్యాప్ ప్రకారం, ఓ పదిహేను నిమిషాల్లో ఒక చిన్న టౌన్ ఉంది. రెస్టారెంట్లు ఉంటాయన్నారు కదా! వెళదామా?"

"మనం తెచ్చుకున్న కాఫీపొడి, బ్రెడ్, ఎగ్స్, ఫ్రూట్స్ - ఇన్ని ఉన్నాయి కదా ఆమ్లెట్లు వేసుకుని తిందాం. మధ్యాహ్నం లంచ్‌కి వెళదాంలే, నాకు లేక్ చుట్టూ తిరగాలని ఉంది" అన్నది అనిత.

వంటకు సరంజామా అన్నీ ఉండటంతో బ్రెడ్ టోస్ట్, ఆమ్లెట్లు చేసి, కాఫీ మగ్గులు తెచ్చుకుని ముగ్గురూ బైట టేబుల్ దగ్గర కూర్చున్నారు.

అప్పటికి బాగా వెలుతురు వచ్చేసింది. సరస్సు చుట్టూ సన్నటి బాట ఉంది నడవటానికి, కుందేళ్ళులాంటి చిన్న జంతువులు తప్పితే భయపడాల్సింది ఏమీ లేదని ముందే చెప్పారు రిసార్టు వాళ్ళు. లేచి బాట మీద నడవటం మొదలు పెట్టారు.

"ఇక నావల్ల కాదు అడగకుండా ఉండటం, స్టీవ్‌ను నువ్వు ఎందుకు పెళ్ళి చేసుకోలేకపోయావు అనితా?" అడిగింది రాజి.

"చాలా పెద్ద కథ పరిస్థితులు అనుకూలించలేదు. అంతకంటే ఏముంటుంది?" సన్నగా నవ్వింది అనిత.

"నీకు ఈ టాపిక్ మాట్లాడాలని లేకుంటే ఫోర్సు చెయ్యను అనిత. ప్రియ చెప్పేదాకా తెలియదు కదా నాకు, అంతవరకూ మీ ఇద్దరూ పెళ్ళి చేసుకునే ఉంటారనుకునేదాన్ని."

"సర్లే చెపుతా... స్టీవ్, నేనూ చదువు అయిపోయాక ఉద్యోగాల్లో చేరిపోయాం. స్టీవ్ చికాగోలో, నాకు డెట్రాయిట్‌లో. తనతో బంధం ఎంతో అందంగా ఉండేది. ప్రేమలో పడిన ప్రతి ఒక్కరూ చెప్పేమాటేనేమో. ఇద్దరమూ ఏనాడు పెళ్ళి గురించి మాట్లాడుకోలేదు. తను లేని జీవితం నేను ఊహించలేదు. వీలైనప్పుడు కలిసేవాళ్ళం. రోజూ ఫోనులు. నాన్నకు ఒంట్లో బాగోటం లేదని తెలిసి అక్క ఇండియా వెళ్ళింది. ఇండియా వెళ్ళాక తెలిసింది స్ట్రోక్ వచ్చిందని, ఎడమవైపు చచ్చుపడిపోయి మంచాన పడ్డారు నాన్న. మాట స్పష్టత ఉండేది కాదు. అక్క నెలరోజులున్నా, పరిస్థితిలో ఏమీ మార్పు రాలేదు.

అప్పుడే కొత్తగా నేను హెచ్-1 బి వీసా చేయించుకున్నాను ఒక ఇండియన్ కన్సల్టెంట్ దగ్గర. ఓ రెండు నెలలు కూడా కాలేదు అక్కడ చేరి. నాన్న పరిస్థితి వివరించి ఒక నెలరోజులు సెలవు పెట్టి ఇండియా టిక్కెట్టు కొనుక్కున్నా. విపరీతమైన ఒత్తిడి నామీద, ఇండియా నుండి ఫోన్లు నా పెళ్ళి గురించి. స్టీవ్‌కు ఎప్పటికప్పుడు చెపుతూనే ఉన్నా అన్ని విషయాలు, నామీద ఇంట్లో వాళ్ళ ప్రెషర్ అంతా.

వెళ్ళేముందు ఫోన్ చేశా.

"చాలా బెంగగా ఉంది స్టీవ్. నాన్నను ఆ స్థితిలో చూడగలనా?"

"భయపడకు. ఫిజియోథెరపీ చేయిస్తున్నారని అన్నావు కదా. తగ్గిపోతుందిలే" ఓదార్పుగా అన్నాడు స్టీవ్.

నా ధైర్యం అంతా స్టీవ్. తనతో మాట్లాడితే ఎక్కడలేని ధైర్యం వస్తుంది. కానీ కొద్దిరోజులుగా కొంచెం దిగులుగా వుంటున్నాడు. దిగులు అనేది సరైన పదం కాదేమో. ఏదో తెలియని టెన్షన్ తన మాటల్లో. ఏంటి అని అడిగితే ఏమీ చెప్పేవాడు కాదు టాపిక్ మార్చేసేవాడు.

ఇండియా వెళ్ళాక నాన్నను ఆ స్తితిలో చూడలేకపోయా. దాదాపు మూడేళ్ళు అయ్యింది నాన్నను చూసి. బరువు తగ్గి, మొహం పీక్కుపోయి, మంచాన నిస్సహాయంగా ఉన్న వ్యక్తి నాకు గుర్తున్న నాన్నకాదు.

వెళ్ళగానే నా పెళ్ళి గురించి పోరు మొదలయ్యింది. దాచేదేముందని స్టీవ్ సంగతి చెప్పేశా. అతనినే పెళ్ళి చేసుకుంటానని అన్నాను.

"నీకు మాటిచ్చాడా పెళ్ళి చేసుకుంటానని" ముద్దముద్దగా అడిగారు నాన్న.

"ప్రత్యేకంగా పెళ్ళి గురించి మాట్లాడుకోలేదు, నాకెంత వయస్సని. ఇప్పుడేగా జాబ్‌లో సెటిల్ అయ్యాను. కానీ అతనికి నేనంటే చాలా ఇష్టం. చాల్ మంచివాడు. అక్క కూడా తెలిసింది కావాలంటే అడగండి."

"అతనిది మన ప్రాంతం కాదు, మన అలవాట్లు పదతులు కావు అంత నమ్మకంతో ఎలా చెపుతావు. కనీసం ఒక్కసారైనా ఫ్యూచర్ గురించి మాట్లాడుకోలేదు. ఇంత స్టుపిడ్ కూతుర్ని కన్నానా?" నాన్న అంత కఠినంగా మాట్లాడటం అదే మొదటిసారి. అసలే అనారోగ్యం, పైగా మాట సరిగ్గా రావట్లేదు ఆ ఆవేశంలో బీపీ పెరిగితే ఎంత నష్టం.

అప్పటికే ప్రదీప్ సంబంధం అందరికి నచ్చేసింది. అతను వారం రోజుల్లో ఇండియా వస్తున్నాడంట, రెండువారాల్లో పెళ్ళి అయిపోవాలని ప్రెషర్.

భరించలేక స్టీవ్‌కు ఫోన్ చేశా మాట్లాడదామని. నేను చెప్పేది మౌనంగా విన్నాడు. ఇప్పుడూ మాట్లాడే పరిస్థితుల్లో లేను. మళ్ళీ ఫోన్ చేస్తాను అని పెట్టేశాడు.

నాలుగు రోజులు ఏ ఫోనూ లేదు. నా మానసిక స్థితి ఊహించుకో. నా స్టీవ్ ఇలా ప్రవర్తిస్తాడా అని నమ్మబుద్ది కాలేదు. ఇంట్లో వాళ్ళ ప్రశ్నార్ధకమైన చూపులు. అమ్మా అక్క గుసగుసలు – నరకం చూశాను.

స్టీవ్ ఫోన్ చేశాడు –

"అనిత నువ్వు నాకు చాలా మంచి స్నేహితురాలివి. కానీ నేను పెళ్ళికి సిద్ధంగా లేను. అస్సలు అంతదూరం ఆలోచించలేదు నేను. ఇంత చిన్నవయస్సులో ఆ ఝంఝూటంలో పడాలని లేదు. మనకి వర్కవుట్ అవ్వదు. ప్రాక్టికల్‌గా ఆలోచించి మీ పేరెంట్స్ చూసిన అబ్బాయిని చేసుకో. మీ అక్కలాగా హ్యాపీగా ఉంటావు. నేను ఒక స్నేహితుడిని అంతే, అంతకంటే ఇవ్వలేను. ప్లీజ్ ఇక ఈ విషయం గురించి విశ్లేషించటం, సంవాదించటం కూడా అనవసరం. నిదానంగా ఆలోచించుకో. ఆవేశంతో నా మీద కోపం తెచ్చుకున్నా నీకు అసంతృప్తి, దుఃఖం మాత్రమే మిగులుతాయి. కానీ సొల్యూషన్ దొరకదు. నిన్ను ఎప్పుడూ ఒక ఆత్మీయురాలిగా గుర్తుపెట్టుకుంటాను. నీలో చాలా ఆశలు కల్పించాను. ఐ యామ్ రియల్లీ సారీ. వి ఆర్ నాట్ మెంట్ టు బి టుగెదర్ నీతూ. గుడ్ లక్"

అంతే పెట్టేశాడు. ఒక్కమాట కూడా మాట్లాడలేకపోయా. స్తబ్దుగా అయిపోయా. నా స్టీవ్ ఇలా మాట్లాడాడా? ఎన్ని కలలు కన్నాను మా భవిష్యత్తు గురించి – నా చిన్ని ప్రపంచం, ఎంతో అందంగా ప్రేమగా కట్టుకున్న పొదరిల్లు.

స్టీవ్ అలా మాట్లాడినందుకు ఎవరు ఎన్ని కామెంట్లు చేసినా ఎందుకో మనస్సు ఒప్పుకోలేదు. అఫ్‌కోర్స్ మొదట్లో, బాధ, కోపం, అవమానం రకరకాలుగా ఫీలయ్యాను. నెమ్మదిగా ఆ కోపం తగ్గింది. నా ప్రేమ మీద పిచ్చి నమ్మకం ఏమో? ఏదో కారణం ఉంది లేకుంటే అలా మాట్లాడేవాడు కాదు అన్న నమ్మకం.

నాన్న ఆరోగ్యం ఇంకా దెబ్బతింది ఈ స్ట్రెస్‌లో. ఆహారం కూడా సరిగ్గా తీసుకోలేకపోయేవారు. ఈ పరిస్థితుల్లో పెళ్ళివద్దని ఎంత మొత్తుకుని ఏడ్చినా ఎవ్వరూ నా మాట వినలేదు.

ప్రదీప్ రావటం, పెళ్ళి చూపులు ఓ ఫార్మాలిటీ, ఆరోజే లగ్నపత్రిక రాసేసుకున్నారు. వారం రోజుల తరవాత పెళ్ళి ఇంకో నాలుగురోజులకు ప్రదీప్ అమెరికా వెళ్ళిపోయాడు.

అక్క ఇండియాలో ఇంకో రెండు మూడు నెలలు ఉంటానని చెప్పటంతో, నేను కూడా పెళ్ళి అయిన రెండువారాలకు అమెరికా వచ్చాను. ప్రదీప్ ఉన్నచోటే ఉద్యోగం వెతుక్కుని కాపురానికి వెళ్ళేసరికి ఇంకో ఆరునెలలు పట్టింది.

ఇదేనేమో నా జీవితం అని మనఃస్ఫూర్తిగా దాంట్లో ఇమిడిపోటానికి ప్రయత్నించా. కానీ ఫెయిల్ అయ్యా''

గట్టిగా నిట్టూర్చింది అనిత.

పెళ్ళి తరవాత జీవితం, వెన్నెల గురించి, ఈ మధ్య జరిగిన గొడవదాకా అంతా చెప్పేసింది. అక్కతో అన్నీ చెప్పుకున్నాకానీ, ఇన్నేళ్ళ తరవాత అంతా చెప్పేసరికి మనసు తేలికగా అయి, ఏదో భారం తీరినట్లు అయ్యింది.

ప్రియ, రాజి మౌనంగా ఉండటం చూసి ''రండి లంచ్‌కు వెళదాం. ఆకలేస్తుంది'' కూర్చున్న చోటునుండి లేచి జీన్స్‌కు అంటిన మట్టి దులుపుకుంది అనిత.

**చుట్టుపక్కల అంతా** చిన్న చిన్న ఊళ్ళు, ఎక్కువగా టూరిజం మీద ఆధారపడిన ఊళ్ళు. లేక్ మిఛిగన్‌కి దగ్గర్లో కాబట్టి టూరిస్టుల రద్దీ ఎక్కువే. చాలా చోట్ల ఇలా వెకేషన్ హోమ్స్, క్యాంపింగ్ సైట్లు ఉన్నాయి. పల్లెవాతావరణం, సిటీ లైఫ్‌కు దూరంగా ఉండటంతో ఇంత ఆకర్షణ.

వీళ్ళు ముగ్గురు కారు ఒక చోట పార్కు చేసి నడుచుకుంటూ మెయిన్ స్ట్రీట్‌లోకి వచ్చారు. షాపులు, రెస్టారెంట్లు అన్నీ ఈ వీధిలోనే ఉన్నాయి. ఒక రెస్టారెంటు ఎన్నుకుని లోపలికి వెళ్ళారు. లంచ్ రద్దీ తగ్గినట్లు ఉంది. వెంటనే టేబుల్ దొరికింది.

''ఏంటీ మీ స్పెషల్స్'' టేబుల్ దగ్గరకు వచ్చిన వెయిట్రెస్‌ను అడిగింది ప్రియ.

''మా దగ్గర మెన్యూలో ఉన్నవన్నీ బాగుంటాయి. మరీ ఎక్కువ ఐటమ్స్ ఉండవు. దాదాపు వందేళ్ళ క్రితం ఓపెన్ చేశారు, ఫ్యామిలీ బిజినెస్ - తరతరాలుగా వస్తుంది'' అన్నది డోరిస్.

టూరిస్టులు బాగా వస్తారు కాబట్టి, కొత్తవాళ్ళతో ఎలా మాట్లాడాలో, ఏమేమీ చెప్పాలో బాగా అలవాటయ్యినట్లుంది డోరిస్‌కి చక్కగా నవ్వుతూ అన్నీ వివరించింది.

''రాజీ ఇక నీ వంతు. ఈ పదిహేనేళ్ళు నువ్వేం చేశావో చెప్పు'' ఆర్డరు చేసినవి అన్నీ వచ్చాక తినటానికి ఉపక్రమిస్తూ అడిగింది అనిత.

కబుర్లు చెప్పుకుంటూ, అక్కడే రెండు గంటలు గడిపారు అందరూ.

నెమ్మదిగా నడుచుకుంటూ, డోరిస్ సలహా ప్రకారం ప్రక్క వీధిలోకి వెళ్ళారు. అక్కడ వీధి వెంబడి చిన్న చిన్న స్టాల్స్ ఉన్నాయి. చిన్న చిన్న హ్యాండీ క్రాఫ్ట్స్ ఫంకీ జ్యూయిలరీ, లోకల్ ఆర్టిస్టుల పెయింటింగ్స్.

సాయంత్రం దాకా సమయం ఎలా గడిచిపోయిందో కూడా తెలియలేదు.

''లోకల్ టేస్టులంటూ ఎన్ని చిరుతిళ్ళు తినేశామో. పొట్టలో ఖాళీ లేకపోయినా ఐస్క్రీం వదిలిపెట్టట్లేదు చూడు'' నవ్వింది అనిత ఐస్ క్రీంతింటూ.

''ఈ ఊళ్ళో తినాల్సినందంతా ఐపోయింది. రేపు ఇంకో ఊరికి వెళదాం'' నవ్వింది రాజి.

''తిరిగి తిరిగి కాళ్ళు నొప్పులు వచ్చేశాయి. చీకటి పడింది. ఇంక వెళ్ళిపోదామా?'' అడిగింది అనిత.

ఇంటికి వచ్చి స్నానం చేసి రిలాక్స్‌డ్‌గా కూర్చున్నారు.

"ఒక ప్రశ్న అడుగుతాను అనిత ఏమనుకోవద్దు" కాస్త మొహమాటంగా అడిగింది రాజి."

"అరే! అలా ఎప్పుడూ అనుకోకు ఏమనుకుంటాను?"

"ఇప్పుడు స్టీవ్‌ని చూస్తే సరిగ్గా మాట్లాడగలుగుతావా? తనని క్షమిస్తావా?"

అనిత మొహం మీద విచ్చుకున్న అందమైన చిరునవ్వు చూసి ప్రియ, రాజి ఆశ్చర్యపోయారు.

"స్టీవ్ నా గత జీవితంలోని ఒక మధురమైన జ్ఞాపకం. నిజమే తనతో జీవితాంతం ఉందామనుకున్నా. ఆ అదృష్టం నాకు లేదు అంతే. ఎన్నో అందమైన జ్ఞాపకాలు మిగిల్చిన అతని మీద కోపం ఎందుకు?"

"నీతో క్లోజ్‌గా ఉండి, పెళ్ళి చేసుకోను అని ఖచ్చితంగా చెప్పటం మోసం కాదా" ప్రియ అడిగింది.

"పెళ్ళి గురించి మేము ఎప్పుడూ మాట్లాడుకోలేదు. పోనీ అది కేవలం టెక్నికాలిటీ, కలిసి తిరిగాము కదా అనుకోవచ్చు. స్టీవ్ నన్ను ఖచ్చితంగా ప్రేమించాడు. సందేహంలేదు. కానీ ఎందుకు అలాంటి నిర్ణయం తీసుకున్నాడో తెలియదు. నాకు తెలియని విషయం గురించి ఏవేవో ఆలోచించి అతన్ని ద్వేషించగలనా?

"నా తలరాత బాలేదు అంతే. ఫేట్, డెస్టిని ఏ రాయి అయితేనేం పళ్ళూడగొట్టుకోటానికి"

ప్రియ పెదవుల మీద ప్రయత్నంగా చిరునవ్వు విసిరింది.

ఇప్పుడిప్పుడే విడిపోతున్న చీకటి తెరలు పల్చటి మంచు తెరను మేలినుసుగుగా వేసుకున్న ప్రకృతి కన్య.

తొలి ఉషస్సులో ప్రకృతి, యవ్వనపు బింకంతో, కవ్వించే కన్నెపిల్లలాగా ఉంటుంది.

మధ్యాన్నం ప్రౌఢత్వంలోని ముగ్ధత్వం మూర్తీభవించిన స్త్రీ మూర్తిలా ఉంటుంది. సాయం సమయంలో జీవితానుభవాలన్నింటిని అనుభవించిన తీక్షణత, గంభీరత నిండిన తేజోమయిలా ఉంటుంది.

రాత్రిపూట మనసిచ్చినవాడు, మనస్సుకు నచ్చిన వాడి చేతిలో అలసిన దేవేరి రసికత కనిపిస్తుంది.

ఎన్ని అందాలు, ఎన్నెన్ని సొబగులో..

"ఏంటీ ప్రొద్దున్నే లేచావు? కొత్త ప్రదేశమని నిద్రపట్టలేదా?"

రాజి గొంతు విని, వరండాలో కూర్చొని ఉన్న అనిత ఉలిక్కిపడి ఆలోచనల నుండి చేరుకుంది.

"ఎంత అందంగా ఉందో చూడు ప్రకృతి, ఏ కల్మషం లేకుండా స్వచ్ఛంగా"

"కానీ ఇదే ప్రకృతి కోపంతో విలయతాండవం చేస్తే, ఆ శక్తికి ఎవ్వరూ ఎదురొడ్డలేరు" వెనక్కి తిరిగి చూశారు అనిత, రాజి. గుమ్మం దగ్గర చేతులు కట్టుకుని నిల్చుంది ప్రియ.

"స్త్రీని ప్రకృతితో పోల్చారు కదా. ఎందుకో తెలుసా ఎంతో అందంగా ఉంటుంది. అందరికి చేతనైనంత సాయం చేస్తుంది, ఆకలి తీరుస్తుంది, అవసరాలకు ఆదుకుంటుంది. కానీ మెత్తగా ఊరుకుంటుంది కదా అని హింసిస్తే తిరగబడుతుంది - తుఫానులు, సునామీలు..

"ఏంటీ ప్రొద్దున్నే ఇంత గంభీరంగా మాట్లాడుతున్నావు?" అడిగింది రాజి.

"ప్రియ చెప్పింది నిజం రాజి ఆడవాళ్ళకు సహజంగానే మృదు స్వభావం, సహనం, ప్రేమ, క్షమలాంటి లక్షణాలు ఎక్కువ మోతాదులో ఉంటాయి. ఒక కొత్త కుటుంబాన్ని, అందులోని వ్యక్తులను సమర్ధవంతంగా ఎదుర్కునే పాతాలు ఎక్కడా ఎంతో శక్తిమంతురాలు. దురదృష్టవశాత్తు అది చాలా మంది ఆడవాళ్ళకు కూడా తెలియదు తమలో ఎంత శక్తి ఉందో" అన్నది అనిత.

"ఏం శక్తో ఏమో? చిన్నప్పటి నుండి సర్దుకు పోవటమే నేర్పారు. అమ్మ, అమ్మమ్మ, అక్కలు అందరూ ఇలానే బ్రతికారు. అదృష్టం కొద్దీ, కాస్త అర్ధం చేసుకునే భర్త వస్తే బ్రతుకు బాగుంటుంది లేకుంటే పరిస్థితులతో రాజీ పడి బ్రతకటమే. ఇలా ఉండు, అలా మాట్లాడకు ఎంతసేపు ఇవే. ధైర్యం, వ్యక్తిత్వం ఇవన్నీ ఏమీ తెలియవు" దిగులుగా మాట్లాడింది రాజి.

"రండి వాకింగ్ చేస్తూ మాట్లాడుకుందాం" లేచింది అనిత.

"నిజమే మనవాళ్ళు మొదటినుండి అమ్మాయిలకు ఆలోంచించట నేరరు. సర్దుకుపొమ్మని చెపుతారే కానీ, సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని చెప్పరు. నీ సంగతి చూడు ఇంతకంటే మంచి మొగుడొస్తాడా అని సర్దుకుపొమ్మన్నారు, కానీ మనస్ఫూర్తిగా ఇష్టపడని వాడిని పెళ్ళి చేసుకుని జీవితాంతం ఎలా ఉంటారు అని ఆలోచించరు. అదే నువ్వు వేణుని నిజంగా ఇష్టపడి పెళ్ళి చేసుకుంటే రెండో పెళ్ళివాడైనా ఏమీ అభ్యంతరం ఉండదు కదా నీకు. పెళ్ళి ఒక సోషల్ ఆబ్లిగేషన్ అయిపోయింది."

ప్రియ మాటల్లో పదను ఉంది, కానీ ఆలోచింపచేసేట్లుగా ఉంది.

"నా జీవితంలో జరిగిన సంఘటన, చూసిన మనుష్యులు మూలాన ప్రేమ ట్రాష్ అనుకునేదాన్ని. సెక్సువల్ నీడ్ కోసం వేసుకునే ముసుగు అనే నమ్మాను. అనిత స్టీవ్‌లను చూశాక ప్రేమించుకుంటే ఇంత సంతోషంగా ఉంటారా అనిపించేది. జెలసీలు, పెత్తనాలు లేని మంచి బంధం. నాలోని సినిసిజంను, బండతనాన్ని కరిగించింది మీ ప్రేమ. కానీ అంతలోనే మీరు విడిపోయారు. నా నమ్మకం మీద దెబ్బ కొట్టాడు స్టీవ్ అనిపించింది. విపరీతంగా కోపం పెంచుకున్నాను అతని మీద. ఆ కోపంలో నీ బాధ గుర్తించలేకపోయాను అనిత. ఐ యామ్ రియల్లీ సారీ"

బాధపడుతున్న ప్రియ భుజం ఓదార్పుగా తట్టింది అనిత.

"నీ గురించి చెప్పు ప్రియ."

"ఎక్కడో చిన్న ఆశ ఉండేది అనిత, నన్ను నన్నుగా ఇష్టపడే వ్యక్తి రావాలి, వస్తాడు అని. నేను ఎవ్వరికీ లొంగిపోకూడదు అన్న మొండితనం డామినేట్ చేసేదేమో? ఒక పరిధి మించి ముందుకు వెళ్ళలేక పోయేదాన్ని. ఆఫీసు సర్కిల్స్ తప్పితే బైట ఫ్రెండ్స్ తక్కువ. అలా నచ్చిన వాళ్ళు ఓ ఇద్దరు ముగ్గురితో కొంచెం క్లోజ్ అయ్యాను కానీ నేనే కట్ చేసుకున్నా. తప్పు నాలోనే ఉందేమో? అవతల వాళ్ళు ఒక్క అడుగు నావైపు వేస్తే నేనే పది అడుగులు వెనక్కి వేసానేమో? కొన్నాళ్ళు ఈ గోలంతా వదిలేసి సీరియస్‌గా కెరియర్, నా కౌన్సిలింగ్ మీదే మనస్సు పెట్టా. చాలా హ్యాపీగా ఉన్నాను. నాలైఫ్, నా ఇష్టం వచ్చినట్లుగా బ్రతుకున్నా."

"ఎవ్వరినీ డేట్ చెయ్యట్లేదా ఇప్పటికి? నీకంటూ మంచి కెరియర్ ఉంది, కానీ ఒక మనిషి కూడా, నీ వాళ్ళు అంటూ ఉండాలని లేదా?" అడిగింది అనిత.

"డేటింగ్ అంటే.. డేవిడ్ అని..." చిన్నగా నవ్వి డేవిడ్ గురించి చెప్పింది ప్రియ.

"రండి బ్రేక్‌ఫాస్ట్ చేద్దాం. ఆకలి దంచేస్తుంది" అంటూ లోపలికి దారి తీసింది ప్రియ.

ఆమ్లెట్లులోకి ఉల్లిపాయలు కోస్తూ అన్నది రాజి - "నువ్వు చెప్పేది నిజమే ప్రియ. నాకు ధైర్యం త క్కువ. ఎప్పటికప్పుడు పరిస్థితులతో రాజీపడటమే. నా పేరే అది కదా! కొంతమంది ఎంతో గడుసుగా భర్తల్ని తమ కంట్రోల్లో పెట్టుకుంటారు. మా పిన్ని ఒక ఉదాహరణ. నాకు అది చేతకాదు. నోరు మూసుకుని వేణుకు నచ్చినట్లుగా ఉంటే ఇంట్లో ప్రశాంతంగా ఉంటుంది అని నోరు మూసుకోవటం అలవాటు చేసుకున్నాను. అలాగే ఇన్నేళ్ళూ గడిచిపోయాయి."

"అందరి మనస్థత్వాలు ఒకే రకంగా ఉండవు కదా నా వరకూ పెళ్ళి అనేది ఒక ప్రత్యేకమైన బంధం. ఇద్దరు వ్యక్తులు, మానసికంగా, శారీరకంగా ఒకరికొకరు అర్పించుకోవటం. ప్రియ అన్నట్లుగా పెళ్ళి అనేది ఒక సోషల్ ఆబ్లిగేషన్ అయిపోయింది. ఒక వయస్సు రాగానే తప్పకుండా పెళ్ళి అయిపోవాలి. కుటుంబం అంటే ఇద్దరు వ్యక్తులు కలిసి ఆనందంగా ఆప్యాయంగా జీవితాంతం కలిసి ఉండాల్సిన బంధం అని తెలుసుకోవట్లేదు. డబ్బులు కోసం కట్నం చావులు, ఒకళ్ళ మీద ఒకళ్ళు పట్టు సాధించాలని పెత్తనాలు. వీటన్నిటి మధ్య ప్రేమ, గౌరవం ఇవన్నీ మరుగున పడుతున్నాయి." నిట్టూర్చింది అనిత.

"నువ్వు అన్నది నిజం అనిత. ఎంతమంది జీవితాన్ని వృధా చేసుకుంటారో, మనకున్నది ఒకటే జీవితం. ఇంకో జన్మ ఉందో లేదో ఎవరు చూడొచ్చారు. మరి ఈ చిన్న జీవితం, ఎందుకు ఆనందంగా జీవించకూడదూ."

మాట్లాడుకుంటూ తినటం పూర్తి చేశారు. కాఫీ తీసుకుని బైటకు వచ్చి కూర్చున్నారు.

"చాలా ఒంటరిగా అనిపించేది. ఏమి చెప్పుకోవాలన్నా ఆత్మీయులంటూ ఎవ్వరూ ఉండేవాళ్ళు కాదు. మీతో పరిచయం కొద్దికాలమే అయినా బాగా తలుచుకునేదాన్ని. ప్రియ కలిశాక కొంచెం ధైర్యం వచ్చింది, నా గురించి నిజంగా ఆలోచించేవాళ్ళు ఉన్నారన్న ధైర్యం. ఇప్పుడు అనిత కూడా ఉంది. మీరు నిజంగా మంచి స్నేహితురాళ్ళు. ప్రతి ఒక్కళ్ళకి ఏవో సమస్యలు ఉంటూనే ఉంటాయి. కానీ నిజమైన స్నేహితులు, మేమున్నామనే ధైర్యాన్ని ఇస్తారు, సమస్యకు పరిష్కారం చూపకపోయినా పర్లేదు., జడ్జ్‌మెంటల్‌గా ఉండకుంటే చాలు" ఎమోషనల్‌గా అన్నది రాజి.

ప్రశాంతంగా ఉన్న చిన్న సరస్సు. గాలికి అల్లల్లాడే గడ్డిపూలు. తదేకంగా అటు చూస్తూ ప్రియను అడిగింది అనిత.

"ఎందుకు డేవిడ్‌తో కమిట్ అవ్వట్లేదు. పెళ్ళి అయితే ఈ ప్రేమ, ఆప్యాయత దూరం అవుతాయని నీకు భయం. ఇన్‌సెక్యూరిటీ కదా"

"ఇన్నేళ్ళు మనం మాట్లాడుకోపోయినా, ఎంత చక్కగా, కరెక్టుగా ఊహించావు. అందుకే నువ్వంటే అంత ఇష్టం నాకు."

గట్టిగా నవ్వేసింది ప్రియ.

"నిజమే అనిత ఇప్పుడు లైఫ్ బాగానే ఉంది కదా. మంచి కెరియర్, నాకు నచ్చిన పనులు చేసుకుంటూ, మధ్యలో డేవిడ్‌తో వీలైనంత సమయం గడుపుతూ హాయిగా ఉన్నా కదా. అయినా పెళ్ళే నా జీవితానికి పరమార్ధమా"

"పెళ్ళే జీవితానికి పరమార్ధం కాదు. పెళ్ళి నీ అస్థిత్వానికి కొలబద్దకాదు. కానీ డేవిడ్ నీ జీవితంలో లేకుంటే ఉండగలవా? అతని గురించి మాట్లాడేటప్పుడు నీ మొహంలోని మెరుపు చూశాను. అనవసరమైన భయాలతో అందమైన జీవితాన్ని దూరం చేసుకోకు ప్రియ. అందరికి ప్రేమ దొరకదు. దొరికినప్పుడు ఆ అమృతాన్ని దోసిళ్ళతో అపురూపంగా పట్టుకుని, ఆస్వాదించాలి."

"ఎంత అందంగా చెప్పావు అనిత"

"జీవితం అంటే పూలపాన్పు కాదు, రొమాన్సు నవల్లోలాగా ఉండదని నాకు తెలుసు. కానీ ప్రదీప్‌తో అన్నీ చేదు అనుభవాలే. మానసికంగా, శారీరకంగా అలసిపోయాను. ఏం తప్పు చేశానని నా జీవితం ఇలా అయ్యింది? ఎన్నాళ్ళనుండో ఇదే ప్రశ్న నన్ను వేధిస్తుంది. ఐ గేవ్ ఆ00 శాతం. మరి నాకెందుకీ శిక్ష" గద్గదమైంది అనిత గొంతు.

"నీ తప్పు ఏమీ లేదు అనిత. పరిస్థితులకు తగ్గట్టు నువ్వు నిన్ను మార్చుకున్నావు. కానీ నీకు సరైన వ్యక్తి భర్తగా రాలేదు. నీలాంటి అమ్మాయి భార్యగా రావటం ఎంత అదృష్టమో గ్రహించలేని మూర్ఖుడు. పెళ్ళి చేసుకుని ఒంటరి జీవితం గడిపావు. మానసికంగా ఒంటరై చేదు పరిస్థితుల్ని తట్టుకోవటం చాలా కష్టం. నిన్ను నువ్వు బ్లేమ్ చేసుకోవటం మానెయ్యి. నువ్వేదో తప్పు చేశావని ప్రదీప్ నీతో అలా ఉన్నాడా? అతను తన రకంగానే ఉన్నాడు."

"మీకో ముఖ్యమైన విషయం చెప్పాలి. ప్రదీప్ నుండి విడిపోదామని నిర్ణయించుకున్నాను. ఆ శూన్యంలో నేనింక ఉండలేను" చాలా ప్రశాంతంగా చెప్పింది అనిత.

రాజి, ప్రియ షాక్ కొట్టినట్లుగా ఏమీ మాట్లాడలేకపోయారు. పరిస్థితులు బాగోలేదని అర్ధం అయ్యింది కానీ ఈ నిర్ణయం ఊహించలేదు.

"రాత్రంతా నిద్రపోలేదు నేను. ఎటుపోతుంది ఈ జీవితం అని ఆలోచించా. ఇది ఇవాల్టి నిర్ణయం కాదు. ఎప్పట్నుండో ఆలోచిస్తున్నా. మానసికంగా చితికిపోయాను. నన్ను నేను రిపేరు చేసుకోవాలి. తిరిగి వెళ్ళాక వేరే అపార్ట్‌మెంట్ చూసుకుంటా" వీళ్ళ మొహాలు చూసి చిన్నగా నవ్వింది అనిత.

"నీకు చెప్పగలిగేదాన్ని కాదు. కానీ ఆలోచించు అనిత. పోనీ అక్క బావను, ప్రదీప్‌తో మాట్లాడమను" నచ్చచెప్పబోయింది రాజి.

"లేదు రాజి గత పదిహేనేళ్ళుగా ప్రయత్నిస్తూనే ఉన్నాను. ప్రతిసారి తలదించుకుంటూనే ఉన్నాను. నాకు కూడా సంతోషంగా ఆనందంగా ఉండే హక్కు ఉంది కదా, ఆత్మగౌరవం, ఆత్మ విశ్వాసం నా నుండి ఎప్పుడో జారిపోయాయి. మళ్ళీ నన్ను నేను నిర్మించుకోవాలి."

ప్రియ మౌనంగా ఉండిపోయింది. అనిత ఎంత డిప్రెషన్‌లో ఉందో అర్ధం అవుతుంది. నవ్వుతూ, సంతోషంగా ఉండే అనితకు ఇప్పుడు కనిపించే అనితకు పోలికలేదు. తను అన్నట్లు తనను తాను మళ్ళీ నిర్మించుకోవాలి, ఒక స్నేహితురాలిగా ఎంత చెయ్యగలదో అంత చేస్తుంది. ఒకప్పుడులాగా తన అభిప్రాయాలు అనిత మీద రుద్దకూడదు. అనితకు మా అందరి స్నేహం ఒక బలం అవ్వాలి. అందరం ఒకరికొకరు బలం అవ్వాలి. ఒకప్పుడు స్టీవ్ స్నేహంతో విచ్చుకున్న అనిత మొహం గుర్తొచ్చి ఒక నిర్ణయానికి వచ్చింది ప్రియ.

"ఏంటంత సీరియస్‌గా అయిపోయారు. రండి ఏదో ఏంటిక్ స్టోర్ ఉందని నిన్న తెలిసింది కదా, స్నానం చేసి అక్కడికి వెళదాం" తెచ్చిపెట్టుకున్న ఉత్సాహంతో లేచింది అనిత.

"అరే! ఇక్కడేదో స్పా ఉందే బాడీ మసాజ్ చేయించుకుందామా. రండి అపాయింట్‌మెంట్ అడుగుదాం" రోడ్డుమీద నడుస్తుంటే "బ్లిస్ డే స్పా" అన్న బోర్డు చూసి లాక్కెళ్ళింది ప్రియ.

ఇది టూరిస్టు ప్రదేశం కావటంతో చాలా పెద్ద స్పా ఉంది. లోపల చాలా అధునాతనంగా ఉంది.

"నేనెప్పుడూ ఇలాంటి వాటికి వెళ్ళలేదు, నావల్లకాదు ప్రియ" రాజి గొణుగుతుంటే కూడా పట్టించుకోలేదు ప్రియ.

"మా ముగ్గురికి బాడీ మసాజ్‌కి అప్పాయింట్‌మెంటు కావాలి. ఇవాళ ఖాళీ ఉందా?" రిసెప్షనిస్టుని అడిగింది ప్రియ.

"ఇవాళ, రేపు ఖాళీ లేవు. ముగ్గురికీ కావాలంటే ఎల్లుండి రావొచ్చు మీరు. పర్లేదా?"

"పర్లేదు. మీ సర్వీసెస్ అన్నీ చెప్పండి. ఒక ప్యాకేజ్‌లాగా తీసుకుంటాం."

లిస్ట్ అంతా చూసి మానిక్యూర్, పెడిక్యూర్ చేయించుకుని, రెండు రోజుల తరవాత ఫేషియల్ బాడి మసాజ్‌కి అప్పాయింట్ మెంట్ తీసుకున్నారు.

"ప్రియ, నా మాట అస్సలు వినట్లేదు నువ్వు. ఇవన్నీ నాకు అలవాటు లేదు." పెడిక్యూర్ కుర్చీలో కూర్చుని, కాళ్ళు వేడినీళ్ళల్లో పెడుతూ ఇబ్బందిగా అన్నది రాజి.

"ఇంతకు ముందు అలవాటు లేకుంటే ఇప్పుడు చేసుకో. మసాజ్ చేస్తుంటే ఎంత బాగుంటుందో తెలుసా. నేను కనీసం రెండు నెలలకోసారి వెళతాను. మన గురించి మనం శ్రద్ధ చూపకపోతే ఎవరు చూపిస్తారోయ్. రిలాక్స్ అవ్వమంటే గిల్టీగా ఫీలవుతావేంటి?" కోప్పడింది ప్రియ.

కబుర్లు చెప్పుకుంటూ ముగ్గురూ మానిక్యూర్ పెడిక్యూర్ చేయించుకుని బైటకు వచ్చారు.

"ఏ మాటకామాటే ఆ అమ్మాయి నా పాదాలు రుద్దుతుంటే కాస్త సిగ్గుగా మొహమాటంగా అనిపించింది కానీ, కాళ్ళు నొక్కుతుంటే ఎంత సుఖంగా ఉందో" నెయిల్ పాలిష్‌తో కొత్తగా ఉన్న తన చేతులను, పాదాలను చూసుకుంటూ అన్నది రాజి.

"నేను చెప్పాకదా నన్ను నమ్మవోయ్"

రోడ్డు పక్కనే పెయింటింగ్స్ అమ్ముతుంటే, మంచి సీనరీలు మూడు తీసుకుంది అనిత.

"మన ఈ ట్రిప్ జ్ఞాపకార్థం ఇవి అందరి దగ్గర ఉండాలి" మిగతా ఇద్దరి చేతుల్లో పెట్టింది అనిత.

**"రండి** ఆ రెస్టారెంట్లో డిన్నరు తిందాం. బైట కూర్చుంటే, సూర్యాస్తమయం చూడొచ్చు" ముందుకు దారి తీసింది. ప్రియ.

రెస్టారెంటు చుట్టూ ఆరు బైట టేబుల్స్ వేశారు. అక్కడనుండి వ్యూ చాలా బాగుంది. దూరంగా కొండలు, పచ్చని చెట్లు.

"వుడ్ యు లైక్ టు ఆర్డర్ సమ్ డ్రింక్స్" వెయిట్రెస్ వచ్చి అడిగింది.

"నాకు కోక్" చెప్పింది రాజి.

"కోక్ లేదు ఏమీ లేదు. ఇవాళ్ళంతా నా ఇష్టం. వి విల్ హావ్ సమ్ వైట్ వైన్. ఏమి ఛాయస్‌లు ఉన్నాయి?" అడిగింది ప్రియ.

"బాబోయ్ వైనా? నా కొద్దు నాకొద్దు" కంగారుగా ఆపింది రాజి.

"నేనెప్పుడూ తాగలేదు"

"అరే అందుకేనోయ్ మనం అందరం ఇన్నాళ్ళకు కలశాం. మన గురించి మనం ఆలోచిస్తున్నాం. లెట్స్ సెలబ్రేట్"

వైన్ పేరు చెప్పి బాటిల్ తీసుకు రమ్మంది ప్రియ.

"నన్ను చంపకు. తాగి పిచ్చి పిచ్చిగా వాగుతానేమో" రాజి కంగారు చూసి గట్టిగా నవ్వేసింది ప్రియ.

"అలాగా! చూద్దాం. ఎప్పుడూ నిదానంగా ఉండే రాజి తాగేసి ఏమి చేస్తుందో? ఎవరినన్నా తిడుతుందో, కొడుతుందో చూడాలి."

"హు నీకు తమాషాగా ఉందా? అనిత నువ్వైనా చెప్పు."

"నాకు ఎప్పటినుండో క్యూరియాసిటీ ఉంది. ఇన్నాళ్ళకు తీర్చుకుంటున్నా" కుర్చీలో వెనక్కి వాలుతూ చెప్పింది అనిత.

"సినిమాలు చూసి అతిగా ఊహించుకోకు రాజి. ఏమవ్వదు. అయినా మనమేమయినా విపరీతంగా తాగేస్తున్నామా? ఒక్క గ్లాస్ అంతేకదా" అన్నది ప్రియ.

"అంటే.... వేణు తాగి వచ్చిన రోజు... నాతో.." చెప్పలేక ఆగిపోయింది రాజి.

రాజి చెయ్యి మీద చెయ్యి వేసి నొక్కింది అనిత.

వెయిట్రెస్ వచ్చి మూడు గ్లాసుల్లో పోసి, అపిటైజర్లు కూడా టేబుల్ మీద పెట్టి వెళ్ళింది.

"ఛీర్స్ - ఒక అద్భుతమైన స్నేహానికి" గ్లాస్ పైకి ఎత్తి చెప్పింది ప్రియ.

మొహం చిట్లించుకుని ఒక్క చిన్న గుటక వేసింది రాజి.

"ఎలా ఉంది రాజు?" అడిగింది అనిత.

"బాగానే ఉంది. తియ్యగా కొంచెం వగరుగా.."

నవ్వేసింది ప్రియ.

రెస్టారెంట్లో మ్యూజిక్ బాండ్ ఏదో వినిపిస్తుంది. రెండు రోజుల్నుండి సీరియస్‌గా మాట్లాడుకుంటూ ఉన్న వాళ్ళ ముగ్గురికి, ఈ సాయం సంధ్యలో ఏ ఆలోచనలు లేకుండా, రిలాక్స్‌డ్‌గా కూర్చుని, కబుర్లు చెప్పుకోవటం చాలా ప్రశాంతతను ఇచ్చిమి.

"ఈ ఫిష్ చాలా టేస్టీగా ఉంది" తింటూ అన్నది ప్రియ.

"లోకల్ ఫ్రెష్‌గా దొరుకుతాయేమో కదా. హ్యాపీగా ఇలాంటి చోట రిటైర్ అయితే ఎంత బాగుంటుందో కదా! ప్రశాంతమైన వాతావరణం. లోకల్‌గా పండించే కూరగాయలు" ప్రేమగా అన్నది అనిత.

"ఒకసారి వెన్నెలను తీసుకురావాలి ఇక్కడికి. లేక్ దగ్గర బాగా ఎంజాయ్ చేస్తుంది."

"వెన్నెలను కలవాలని ఉంది అనిత, ఈసారి నువ్వు అక్క దగ్గరకు వెళ్ళినప్పుడు నీతో కూడా రావచ్చా?" అడిగింది రాజి.

"తప్పకుండా, నేను వేరే అపార్టుమెంటు తీసుకున్న తరవాత, సెలవులకు నా దగ్గరకు వచ్చి ఉండమని చెపుతాను అక్కకు. మళ్ళా అందరం కలుసుకోవచ్చు."

కాసేపు మ్యూజిక్ వింటూ, నిదానంగా డిన్నరు ఎంజాయ్ చేశారు ముగ్గురూ.

"ఎందుకు భగవంతుడు సరైన జోడిని కలపడు? ఎందుకిన్ని ప్రాబ్లమ్స్ పెడతాడు. సరైన వాళ్ళతో జీవితం కుదిరితే, అంతా సంతోషంగా ఉంటారు కదా?"

అనిత మనస్సులో ఏళ్ళ తరబడి పేరుకుపోయిన బాధ ఆ ప్రశ్నలో ప్రతిఫలించింది.

కాసేపు మౌనంగా ఉన్నారు అందరూ.

"నిజంగా దేవుడే కలపటం, విడగొట్టటం చేస్తున్నాడా? లేక అన్నిటికి దేవుడిపై నెట్టటం మన పలాయనవాదమా?" సూటిగా ప్రశ్నించింది ప్రియ.

అర్ధం కానట్లు చూశారు రాజి, అనిత.

"రండి ఇంక వెళదాం. ఇంటికి వెళ్ళేదాక ఆలోచించండి సమాధానం" బిల్ ఒపే చేస్ లేస్తూ అన్నది ప్రియ.

ఇంటికి వెళ్ళేదాకా ఏమీ మాట్లాడలేదు అనిత. కారులో కూడా ఏదో ఆలోచిస్తున్నట్లుగానే కళ్ళు మూసుకుని కూర్చుంది ప్రియ డ్రైవ్ చేస్తుంటే.

అందరూ బట్టలు మార్చుకుని వరండాలోకి వచ్చికూర్చున్నారు. కీచురాళ్ళు చప్పుడు తప్ప అంతా నిశ్శబ్దంగా ఉంది.

"స్టీవ్‌తోమాట్లాడుతావా అనిత."

పక్కన బాంబు పడినా అంతగా ఉలిక్కిపడేది కాదేమో అనిత. ఆ చిన్న ప్రశ్న అనిత జీవిత గమనాన్ని మార్చేస్తుందని అడిగిన ప్రియకు కూడా ఆ క్షణంలో తెలియలేదు.

ఏమీ మాట్లాడకుండా, లేచి బైట లాన్‌లో ఉన్న చెక్క బల్లపై కూర్చుంది అనిత.

ఎందుకు స్టీవ్ పేరు వినగానే ఇంత అలజడి. క్యాజువల్‌గానే ఉండాలి తను. అసలు నాతో మాట్లాడతాడా? పెళ్ళి అయిందా? తను సంతోషంగా ఉండాలి. అంతే. జీవితంలో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా తన కళ్ళలో నవ్వు అలాగే ఉండాలి. అయినా ఇలా ఆలోచిస్తుందేంటి తను.

భుజం మీద చెయ్యి పడటంతో ఉలిక్కిపడింది అనిత.

"నీకు మాట్లాడటం ఇష్టం లేకపోతే వద్దులే అనిత. నిన్ను అప్‌సెట్ చెయ్యటం నా ఉద్దేశం కాదు."

"ఛఛ అదేమీ కాదు ప్రియ. మన స్నేహితులందరిని కలుస్తున్నాను. తనూ అంతే. ఇన్నేళ్ళ తరవాత తను నాతో మాట్లాడతాడా, నేను సరిగ్గా మాట్లాడగలనా? తన డీటైల్స్ ఏమీ చెప్పలేదు నువ్వు. ఎక్కడుంటున్నాడు?"

"నేను కూడా స్టీవ్‌ను పోయిన సంవత్సరమే కలిశాను. మిగతా డీటైల్స్ తననే అడుగు. మీ ఇద్దరి మధ్య మంచి స్నేహం ఉండేది అనిత. మాట్లాడు. ఇదిగో నెంబరు మేము లోపలికి వెళతాం. వరండాలో కూర్చుని మాట్లాడు. ఈ చీకట్లో వద్దు" అంటూ అనిత ఫోన్‌లో నెంబరు ఫీడ్ చేసి లోపలికి వెళ్ళింది ప్రియ.

చేతిలో ఫోను వైపు చూస్తూ కూర్చుండిపోయింది కాసేపు. తర్కించుకోవటం కూడా చేతకావటం లేదు.

గట్టిగా ఊపిరి వదిలి ఫోన్ చేసింది అనిత. రింగవుతుంది ఎవ్వరూ ఎత్తలేదు. నాలుగు రింగుల తరవాత ఫోన్ కట్ చేసింది.

ఎక్కడున్నాడో? నిద్రపోతున్నాడేమో? భార్యతో ఉన్నాడేమో? ఈ కొత్త నెంబరు ఎవరిదో అని తియ్యలేదేమో? లక్ష అనుమానాలు.

ఫోను మోగింది. స్టీవ్

"హల్లో స్టీవ్. హౌ ఆర్యూ?" ఫోన్ ఎత్తుతూనే పలుకరించింది అనిత. కొన్ని క్షణాల మౌనం "మే ఐనో హూ ఈజ్ దిస్"

కాస్త ఏడిపిద్దామా అన్న ఆలోచనను ఆపుకుంది.

అనిత మౌనంగా ఉండటంతో, మళ్ళీ స్టీవ్ "అనిత?" గొంతులో తడబాటు.

గుర్తుపడతాడని అస్సలు అనుకోలేదు. గుండె గొంతుకు అడ్డం పడి మాట పెగల్లేదు. గుండెలోని చెమ్మ కంటిదాకా చేరనివ్వకూడదన్న విశ్వ ప్రయత్నం మధ్య "...ఊఁ..." అంది.

కొద్ది క్షణాలు మౌనం - గొంతు సవరించుకున్న ధ్వని.

"హాయ్ నీతూ! ఎలా ఉన్నావ్?"

"బాగానే ఉన్నాను. నేను చికాగోలో ఉంటున్నాను ఇప్పుడు. ఒక పాప. అక్క దగ్గర ఉంటుంది. నీ విషయాలు చెప్పు. ఎక్కడుంటున్నావు? ఏం చేస్తున్నావు? మీ పేరెంట్సు బాగున్నారా? లిండా ఎలా ఉంది?"

కంగారు, తడబాటు కప్పి పుచ్చుకోటానికి ప్రశ్నల వర్షం కురిపించింది.

"కాలిఫోర్నియాలో, బే ఏరియాలో ఉంటున్నాను. డాడ్, మామ్ ఇద్దరూ చనిపోయారు."

"ఐ యామ్ సో సారీ స్టీవ్. దే వర్ వెరి నైస్ కపుల్" అన్నది.

కాలం స్థంభించిందో లేక పరుగులు తీసిందో తెలియదు.

పదిహేనేళ్ళ క్రితపు జ్ఞాపకాల పుప్పొడి అద్దుకుని మరింత అందాన్ని సంతరించుకున్న మమకారపు పూదోటలు.

గుండెలో ఎగసిపడే ఆనందపు కెరటాల్ని ఎంతగా నొక్కిపెడుతున్నా ఆ ప్రయత్నంలో ఓడిపోయిన ఓటమిలో ఆనందమ్మ.

ఎంతసేపు మాట్లాడుకున్నారో తెలియదు. చివరికి అనితే "సారీ చాలాసేపు మాట్లాడాను, నువ్వు బిజీగా ఉన్నావేమో కూడా కనుక్కోలేదు."

"పర్లేదు ఇంట్లోనే ఉన్నాను. నీకు బాగా ఆలస్యం అయ్యింది. ప్రియ, రాజీతో బాగా ఎంజాయ్ చెయ్యి మళ్ళీ మాట్లాడుకుందాం. గుడ్‌నైట్."

ఫోన్ చేతిలో పట్టుకుని అలానే కూర్చుండిపోయింది. ఎన్నో కబుర్లు. కాలేజి రోజులు, అప్పటి జోకులు దాదాపు పదిహేనేళ్ళ క్రితం విడిపోయామని, అందునా స్టీవ్ బ్రేకప్ చెప్పాడని ఏమీ గుర్తురాలేదు ఇద్దరికి. నిన్న మొన్న మాట్లాడుకున్న స్నేహితులుతో మాట్లాడినంత ఫ్రీగా మాట్లాడుకున్నారు. ఎంత విచిత్రం.

నెమ్మదిగా లోపలికి నడిచి తలుపు లాక్ చేసింది అనిత.

సోఫాలో కూర్చుని పుస్తకం చదువుతున్న ప్రియ అనితను చూసి లేచి వచ్చింది.

ప్రశ్నార్థకంగా అనిత వైపు చూస్తూ కనుబొమ్మలు పైకి లేపింది ప్రియ.

దగ్గరకు వచ్చి ప్రియను గట్టిగా హత్తుకుని బుగ్గమీద ముద్దుపెట్టుకుంది అనిత 'థాంక్స్' అని చెప్పి తన రూం వైపు వెళ్ళింది.

"ఓయ్ ఇవాల్టికి వదిలేస్తున్నా రేపు అన్ని డీటైల్సు చెప్పాలి, లేకపోతే క్షమించను" వెనకాల నుండి ప్రియ నవ్వు విని 'గుడ్‌నైట్' అని చెప్పింది అనిత నవ్వుతూ.

మెసేజ్ వచ్చిన శబ్దం విని ఫోన్ చూస్తున్న అనిత వైపు చూసి "ఇక లాభం లేదమ్మాయి. ఇది నా వెకేషన్, స్టీవ్ లాగేసుకుంటున్నాడు ఉండు పోట్లాడుతా" తెచ్చి పెట్టుకున్న కోపంతో కసిరింది ప్రియ.

ఆ మాటలు విననట్లుగా మెసేజ్‌కి సమాధానం ఇచ్చింది అనిత.

"వీడియో కాన్ఫరెన్సుకు డీటైల్స్ పంపుతాడంట. రేపు ప్రొద్దున్నే మనం బయలుదేరుతున్నాం కదా అందుకే ఇవాళ్ళ రాత్రి ఎనిమిదికి కాన్ఫరెన్సు అంటున్నాడు. ఆనంద్‌కు కూడా పంపిస్తాను అన్నాడు"

"సర్లే కానీ ఏంటి తెగ మెసేజ్‌లు చేసుకుంటున్నారు" కుతూహలంగా అడిగింది ప్రియ.

"ఏం లేదు కాజువల్, ఉద్యోగం, వెన్నెల, తన కంపెనీ గురించి అంతే. ప్రియ, రాజి నాకు చాలా సంతోషంగా ఉంది. నేను చాలా డిప్రెషన్‌లో ఉన్న ఈ టైంలో మళ్ళీ నా స్నేహితులు అందరూ నా జీవితంలోకి వచ్చారు. నా మీద నాకే నమ్మకం కలిగేట్లు చేశారు. ఒక రకమైన మానసిక బలం వచ్చింది. ఇదే నేను ఇండియాలో ఉండి ఉంటే చుట్టాలూ, తెలిసిన వాళ్ళు - అందరూ తాటాకులు కట్టేవారు. మొగుడిని వదిలేసింది. అదీ ఇదీ అంటూ.. కానీ నన్ను మీరు ఎవ్వరూ తప్పు పట్టలేదు. మీ అందరూ కేవలం నా సంతోషం కోరుకున్నారు. ఇంత మంచి ఫ్రెండ్స్ ఉన్న అదృష్టవంతురాలిని."

రాజి, ప్రియను ఆప్యాయంగా హత్తుకుంది అనిత.

రాజి

"రేపు శ్వేత వస్తుంది పదకొండు గంటల ఫ్లైట్‌కు. మీకు చెప్పమంది. ఎయిర్‌పోర్టుకు రమ్మంది."

సాయంత్రం వేణు ఇంటికి రాగానే చెప్పింది రాజి.

"నాకు చెప్పలేదేంటి?" వేణు బృకుటి ముడిపడింది.

కాసేపు మౌనంగా ఉండి "తన ఫ్రెండ్‌తో వస్తున్నానని చెప్పమంది"

"ఫ్రెండ్ అంటే..? ఓ.. అతనా?" వేణులో పెల్లుబికే చిరాకును గమనించి ఏమీ మాట్లాడలేదు రాజి.

"భోజనానికి రండి" టేబుల్ మీద ప్లేట్లు పెడుతూ పిలిచింది రాజి.

ఇద్దరూ యధావిధిగా మౌనంగా భోజనం చేశారు. భోజనం అయిన తర్వాత అన్నాడు వేణు.

"ఈ మధ్య నువ్వు చాలా మారిపోయావు. ఇదివరకు లాగా లేవు. అన్నీ నాకు వ్యతిరేకంగా చేస్తున్నావు."

ఏమీ రెట్టించదలచుకోలేదు రాజి. గత ఆరేడు నెలలుగా ఇంట్లో వస్తున్న చిన్న చిన్న మార్పులను భరించలేక పోతున్నాడు వేణు.

పెళ్ళి అయినప్పటినుండి అన్నీ వేణూ ఇష్టప్రకారమే జరిగేవి. రాజి ఎక్కడికి వెళ్ళాలి, కేటరింగ్ ఆర్డర్లు, రాజి బట్టల దగ్గర్నుండి. మొట్టమొదటి సారి ఫ్రెండ్స్‌తో కలిసి వారం రోజులు మాయమయ్యింది. అది కూడా ఫ్రెండ్స్ అడిగారు. వాళ్ళ ఎదురుగా ఏమీ అనలేక ఒప్పుకున్నాడు.

రాజీ ఏనాడూ తన ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపలేదు. పని...పని.. పని అంతే. దాదాపు ఐదు నెలల క్రితం ప్రియ అనితలను కలిసిన రెండు నెలల తరవాత ఓ రోజు రాజి కళ్ళు తిరిగి పడిపోయింది.

అదృష్టవశాత్తు ఇంట్లో సాత్విక్ ఉన్నాడు. వెంటనే అంబులెన్స్‌లో హాస్పటల్‌కు తీసుకు వెళ్ళాడు. మైల్డ్ హార్ట్ ఎటాక్, విపరీతమైన షుగర్ లెవల్స్. షుగర్ లెవల్స్ కనుక ఇంకొన్నాళ్ళు అలానే ఉంటే కోమాలోకి వెళ్ళిపోయేది అన్నారు డాక్టర్లు.

ఒక నెలరోజులు డాక్టర్లు ఇచ్చిన మందులు వేసుకుంటూ, ఆహార జాగ్రత్తలు తీసుకుని తర్వాత మళ్ళీ చెకప్‌కు రావాలని. నెమ్మదిగా తన జీవన విధానంను ఎలా మార్చుకోవాలో న్యూట్రిషనిస్టులు, డాక్టర్లు చెప్పారు.

విషయం తెలిసి అనిత వెంటనే వచ్చి, రాజితోనే ఉన్నది. హాస్పిటల్ నుండి మూడు రోజుల తరువాత పంపిస్తూంటే, వేణుతో మాట్లాడి తన దగ్గర ఓ వారం ఉంచుకుంది.

ప్రియ అప్పుడు ఆఫీసు పనిమీద యూరప్‌లో ఉంది. రెగ్యులర్‌గా ఫోనులు చేస్తూ ధైర్యం చెప్పింది. రాజి చాలా బెంబేలు పడింది. ఏమంత వయస్సయిపోయిందని ఈ జబ్బులు అనుకుంటూ.

"ఎప్పుడూ నేను శారీరక శ్రమకు భయపడలేదు. బద్ధకించలేదు. నాకు ఈ హార్టు ప్రోబ్లం ఏంటి? షుగర్ ఏంటి? ఏంటో చాలా బెంగగా ఉంది."

"ఛ! ఏమీ బెంగ పడకు. ఇలా బైటపడటం మంచిదయ్యింది కదా మరీ ముదరకముందే. ఈ రోజుల్లో షుగర్ లేనివాళ్ళు ఎంతమంది ఉన్నారు. ఇక నుండి వేళకు తినటం, మానసిక ఒత్తిడి తగ్గించుకో, ఇలాంటి వాటి మీద శ్రద్ధపెట్టు." సుశీల, అనిత, ప్రియ ఇంతమంది ఆశాజనకంగా తనను ప్రోత్సహించటంతో రాజి తొందరగానే మానసిక ధైర్యాన్ని తెచ్చుకుంది. దానికి తోడు శ్వేతకూడా వయసు తెచ్చిన మెచ్యూరిటీతో ఆప్యాయంగా మాట్లాడటం మొదలు పెట్టింది. సాత్విక్, శ్వేత మూలంగా ఇంట్లో కొంచెం మనఃశ్శాంతిగా ఉండగలిగింది రాజి.

ఏ మార్పూ పెద్దగా లేనిది వేణూలోనే. రాజి కొంచెం కోలుకునేదాకా సుశీల, అనిత కూరలు పంపారు. ఓ రెండు వారాలు అయ్యాక రాజీనే వండటం మొదలు పెట్టింది. ఎందుకంటే వేణుకు ప్రతిరోజూ వంట ఫ్రెష్‌గా ఉండాలి. ఫ్రిజ్‌లో పెట్టి వేడి చేస్తే తినడు.

జీవితంలో జరిగే సంఘటనల ప్రభావం ప్రతి వ్యక్తి మీద వేరే వేరేగా ప్రభావం చూపుతుంది. కాస్త అనారోగ్యానికే కృంగిపోతారు కొందరు. కొందరికి జీవితం విలువ అర్థం అయ్యి నిండుగా తృప్తిగా జీవించాలనుకుంటారు. అటువంటి మార్పే రాజీలోను వచ్చింది.

తన స్నేహితులనుండి లభించే స్నేహబలంతో తన జీవనశైలిని మార్చుకుంది. వేణుతో ధైర్యంగా మనస్సులో మాట చెప్పటం నేర్చుకుంది.

"మీతో కొన్ని విషయాలు మాట్లాడాలి" ఒక ఆదివారం టిఫిన్ తిన్న తరవాత పేపరు చదువుతున్న వేణుతో చెప్పింది రాజి.

"ఏంటి?" పేపరులోనుండి తల ఎత్తకుండానే అడిగాడు.

"కాస్త పేపరు పక్కన పెడతారా?"

ఆశ్చర్యంగా చూశాడు వేణు. ఇలా ఎప్పుడూ మాట్లాడలేదు రాజి.

"నేను నా జీవితంలో కొన్ని మార్పులు తెచ్చుకోవాలి. ముఖ్యంగా ఆరోగ్య విషయంలో. ఎందుకంటే నాకు ఇప్పుడే చనిపోవాలని లేదు. ఇన్నాళ్ళూ నేను కేటరింగ్ చేశాను. ఇంక ఆ పనులు ఆపేద్దామనుకుంటున్నా. మనకు డబ్బులు ఇబ్బంది లేదు, పైగా పిల్లలిద్దరూ నన్ను స్ట్రెయిన్ అవ్వొద్దని ప్రామిస్ చేయించుకున్నారు.

"ఏం చేస్తావు రోజంతా ఇంట్లో కూర్చుని" వేణుకు నచ్చలేదు రాజి మాటలు. నిజం చెప్పాలంటే తన రెండు షాపుల మీద వచ్చే ఆదాయంతో పోలిస్తే రాజి కేటరింగ్ ద్వారా వచ్చే ఆదాయం ఓ వంతు మాత్రమే. అయినా సరే తన పర్మిషన్ అడగకుండా రాజి నిర్ణయించుకుని తనకు చెప్పటం నచ్చలేదు.

"ఏమో ఏమి చెయ్యాలో నిర్ణయించుకోలేదు. ఖాళీగా అయితే కూర్చోను."

వేణు మౌనంగా ఉండటం చూసి లేచి వెళ్ళిపోయింది రాజి.

వేసవి మొదలవ్వటంతో రోజూ ప్రొద్దున, సాయంత్రం ఖచ్చితంగా వాకింగ్‌కు వెళ్ళటం మొదలుపెట్టింది. మొదట్లో ఒక మైలు నడవటం చాలా కష్టంగా అనిపించేది. ఆహారంలో కూడా మార్పులు చేసుకుంది.

ప్రియ వలన తనకు తెలియని విషయాలు కొన్ని తెలుసుకుంది. అనితతో రెగ్యులర్‌గా ప్రతివారం మాట్లాడూతుంటే తన ప్రపంచపు పరిధి పెరిగినట్లుగా అనిపించేది.

ఆరోగ్యం, షుగర్ లెవెల్స్ కంట్రోల్లోకి వచ్చాక వారానికి మూడు రోజులు సూప్ కిచెన్‌లో పేదవారికి ఆహారం పెట్టేచోట, వంటలో సాయం చెయ్యటానికి వెళ్ళటం మొదలు పెట్టింది. కాస్త తోటపని, వారాంతాలలో గుడిలో సేవ.. నెమ్మదిగా రాజి మనస్సులోని నెగెటివ్ ఆలోచనలు తనను తాను తక్కువ చేసి ఆలోచించుకోవటంలాంటివి తగ్గిపోయాయి. తన ఆలోచనా సరళి ఎంతో మారింది. కుంచించుకు పోకుండా పిల్లలతో నవ్వుతూ మాట్లాడటం మొదలుపెట్టింది.

శ్వేత కూడా రాజి విషయంలో చాలా మారింది. ప్రియతో మాట్లాడిన తరవాత శ్వేత చాలా సిగ్గుపడింది. తను సవిత తల్లి అయితే మాత్రమేంటి? చిన్నప్పటినుండి చక్కగా తనకు అన్నీ సమకూర్చుంది. కానీ తను ఎన్నడూ రాజి గురించి ఎక్కువ ఆలోచించలేదని విశ్లేషించుకుని, రాజితో ఫోన్‌లో మాట్లాడటం మొదలుపెట్టింది.

శ్వేత రెండు నెలల క్రితం చెప్పింది తానొక అబ్బాయిని ఇష్టపడుతున్నానని అతనినే పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. అది కూడా చాలా క్యాజువల్‌గా థాంక్స్ గివింగ్‌కి ఇంటికి వచ్చినప్పుడు భోజనం చేస్తూ చెప్పింది.

సాత్విక్‌కు ముందే తెలుసనుకుంటా ఈ విషయం మౌనంగా భోజనం మీదే పూర్తి ఏకాగ్రత చూపుతూ తినడం మొదలుపెట్టాడు.

వేణు మనస్థత్వం తెలిసిన రాజి భయపడింది. రాబోయే యుద్ధం తలచుకుని, ఇన్ని సంవత్సరాలుగా అమెరికాలో ఉంటున్నా చాలా పాత పద్దతిగా ఆలోచిస్తాడు. ఎప్పుడో చెప్పేశాడు శ్వేతకు. తానే సంబంధం చూస్తానని ఒప్పుకోవాలని. శ్వేత హైస్కూలు ప్రామ్ డాన్సుకు వెళ్ళే విషయమై ఎంత గొడవయ్యిందో ఇంకా గుర్తుంది రాజికి. దాదాపు రెండేళ్ళనుండి ఏవో సంబంధాలు చూస్తున్నాడు. కొన్ని అవతల నుండి కుదరలేదు. కొన్ని శ్వేత ఒప్పుకోలేదు.

"ఎవరా అబ్బాయి?" కాసేపటికి అడిగాడు వేణు.

"మా ఆఫీసులోనే చేస్తున్నాడు. నేను ఉద్యోగంలో చేరినప్పటినుండీ పరిచయం, స్నేహం. అమెరికన్" క్లుప్తంగా చెప్పింది. అక్కడ పేలబోయే అగ్నిపర్వతం గురించి మానసికంగా ఎప్పుడో సిద్దపడింది శ్వేత,

శ్వేతకు తన తండ్రి మనస్థత్వం బాగానే తెలుసు. చిన్నప్పటినుండీ నానమ్మ, నాన్న ప్రభావంతో కొంచెం సంకుచిత మనస్థత్వంతో పెరిగినా కానీ కాలేజ్‌కి బైటకు వెళ్ళి స్వంతంగా బ్రతకటం మొదలుపెట్టాకే, మనుష్యులను సరిగ్గా అర్ధం చేసుకోవటం, ఎదుటి వాళ్ళతో ఎలా ప్రవర్తించాలి, తన మానసిక పరిధులను పెంచుకోవటం మొదలు పెట్టింది. నెమ్మది నెమ్మదిగా తనలో మంచి పరివర్తన వచ్చింది.

"ఇలాంటి వేషాలే వద్దని నీకు ఎన్నోసార్లు చెప్పాను. అమెరికా వచ్చినంత మాత్రాన మన జాతి సంకరం చెయ్యటానికి నేను ఒప్పుకోను. మన వాళ్ళల్లోనే నేను ఎన్ని మంచి సంబంధాలు చూపించాను నీకు. నేను చూపిన వాటిల్లోనే ఏదో ఒకటి ఒప్పుకో. అంతే. ఒక తెల్లవాడిని మాత్రం అల్లుడిగా ఒప్పుకోను" ఖచ్చితంగా చెప్పాడు.

ఓ క్షణం తండ్రి వైపు తీక్షణంగా చూసింది శ్వేత. శ్వేత మొహం గమనించి కాస్త వాతావరణం తేలికగా మార్చాలని అడిగింది రాజి - "ఆ అబ్బాయి వివరాలేంటి శ్వేత? పేరేంటి, పేరెంట్సు ఎక్కడుంటారు?"

"చూడు నాన్న - ఇదీ అడగాల్సిన పద్దతి. నేను ఒకరిని ఇష్టపడుతున్నానంటే, అతని వివరాలేంటి? నేను ఎందుకు ఇష్టపడుతున్నాను, ఎలాంటివాడు అని అడగాలి. అంతేకాని ఏ జాతివాడు అని కాదు" శ్వేత ఎప్పుడూ ఖచ్చితంగా మాట్లాడుతుంది. అందులోను గత ఏడేళ్ళుగా బైట ప్రపంచంలో బ్రతకటంలో, స్వతంత్రంగా అన్ని నిర్ణయాలు తీసుకోవటం అలవాటు అవ్వటంతో, తండ్రి మాటలు పద్దతి చాలా చిరాకును కోపాన్ని కలిగించాయి.

వేణు మాట్లాడబోతుంటే ఆపింది శ్వేత.

"ముందు నేను చెప్పేది వినండి. విలియం నేనూ ఒకే టీంలో పనిచేస్తున్నాం. ఇద్దరం ఎం.బి.ఏ కూడా చేస్తున్నాం ఇప్పుడు. వాళ్ళ అమ్మ అరిజోనాలో ఉంటారు. ఇద్దరు అన్నలు. తండ్రి వీళ్ళ జీవితంలో లేడు. వీళ్ళ చిన్నప్పుడే విడాకులు అయిపోయాయి. చాలా మంచివాడు, కష్టపడే స్వభావం, నేనంటే చాలా ప్రేమగా ఉంటాడు. మన ఇండియా అన్నా, సాంప్రదాయాలన్నా చాలా ఇష్టం తనకు. గమ్మత్తుగా నాకంటే ఎక్కువ కారం తింటాడు. అవుట్ డోర్ యాక్టివిటీస్ బాగా ఇష్టం. హైకింగ్, సైక్లింగ్ ఇలా వీకెండు వస్తే ఏదో ప్లాను చేస్తాడు."

తండ్రి మొహం వైపు చూసింది. ఏమీ మాట్లాడలేదు వేణు. "ఇదిగో తన ఫోటో" ఫోనులో ఉన్న ఫోటోని రాజికి చూపింది.

చక్కగా ఉన్నాడు. చురుగ్గా ఉన్న కళ్ళు, నవ్వు మొహం, ఎత్తుగా ధృఢంగా ఉన్నాడు. ఫోన్ వేణుకు ఇచ్చింది రాజి. వేణు తీసుకోలేదు.

"తల్లితండ్రులు విడిపోయారు తండ్రి ఎక్కడున్నాడో తెలియదు. ఇలాంటి ఫ్యామిలీ నుండి వచ్చిన వాడికి కుటుంబం గురించి ఏమి తెలుస్తుంది? కుటుంబ విలువలు ఏమి తెలుస్తాయి? నిన్నూ అలాగే వదిలెయ్యడని గ్యారెంటీ ఏంటి?" వ్యంగ్యంగా అన్నాడు వేణు.

సాత్విక్, శ్వేత చివ్వున తలెత్తి వేణువైపు చూశారు. ఇంత ఘోరంగా కూడా మాట్లాడగలడా అని ఆశ్చర్యపడ్డారు.

శ్వేత మాట్లాడబోతుంటే సాత్విక్ ఆపాడు.

"ఇలా ఎలా మాట్లాడుతున్నావు నాన్నా. అతని కుటుంబంలో ఉన్న ప్రాబ్లమ్స్ మనకు తెలియదు. తల్లిదండ్రులు ఏ పరిస్థితుల్లో విడిపోయారో తెలియదు. అతనికి కుటుంబ విలువలు లేవని ఎలా తేల్చేశారు? తల్లి ఎంత కష్టపడి అందరిని పెంచింది, విలియం ఎంత కష్టపడి చదువుకుని అక్కతోపాటు ఉద్యోగం చేస్తున్నాడని అర్థం కావట్లేదా? పైగా అక్క చిన్న పిల్లకాదు, అమాయకురాలు కాదు, లోకం తెలియనిది కాదు. తనేమీ తొందరపాటు నిర్ణయాలు తీసుకోదు. ఇద్దరూ ఒకరినొకరు ప్రేమించుకుంటున్నామని చెప్పింది. అతనితో తను హ్యాపీగా ఉందని చెప్పింది. ఇది అర్థం చేసుకోకుండా, అక్క ఫీలింగ్స్‌కి గౌరవం లేకుండా మాట్లాడటం నాకేమీ నచ్చలేదు. రా అక్కా! ఏదైనా మూవీకి వెళదాం" అంటూ విసురుగా లేచి వెళ్ళిపోయాడు సాత్విక్. అతని వెనకే శ్వేత కూడా.

"ఏంటీ వీళ్ళ ప్రవర్తన. ఇలాగేనా నాతో మాట్లాడేది? నేను వీళ్ళ చెడు కోరతానా? ఎందుకు సంపాదిస్తున్నాను ఇదంతా. వాళ్ళ కోసం కాదా? మన పద్ధతులు సాంప్రదాయం అంటూ ఏమీ లేదా? వీళ్ళ చిన్నప్పటినుండి ఎంత కష్టపడ్డాను అమెరికన్ల మాదిరిగా ఉండకూడదు అని - ఇద్దరూ కూడబలుక్కుని, ఇలా ఎదురు తిరుగుతున్నారు. ఏమి తక్కువ చేశాను వీళ్ళకు? ఎంత మంచి సంబంధాలు చూశాను శ్వేత సుఖపడుతుందని."

వేణు కోపంతో అరుస్తుంటే ఏమీ మాట్లాడలేదు రాజి.

శ్వేతకూడా పంతం పట్టినట్లు వాళ్ళ నాన్ననే ఎయిర్‌పోర్ట్‌కు రమ్మని పిలిచింది. వెళ్ళను అని మొండికేస్తాడేమో అని రాజి కంగారు పడింది. విలియం ముందు శ్వేత చులకన అయిపోతుందేమో అని. ఒకటికి రెండుసార్లు గుర్తు చేసింది ఎయిర్ పోర్ట్‌కు వెళ్ళాలని.

వేణు వెళ్ళి ఇద్దరిని ఇంటికి తీసుకువచ్చాడు. ఎటూ భోజనం వేళ కాబట్టి లంచ్ రెడీ చేసింది రాజి.

"తన కోసం అమెరికన్ ఫుడ్ ఏమీ వద్దు పిన్ని, ఇండియన్ ఫుడ్ ఇష్టపడతాడు" అని శ్వేత ముందే చెప్పటంతో అన్నీ తెలుగు వంటలే చేసింది.

సాత్విక్ కూడా ఉదయం వచ్చాడు.

"అమ్మా! డోన్ట్ వర్రీ అంతా బాగానే అవుతుంది" రాజి మొహంలో టెన్షన్ చూసి అనునయించాడు సాత్విక్.

కూరలన్నీ సాత్విక్, రాజి టేబుల్ మీద సర్దుతుండగా, తలుపు తీసిన శబ్దం వినబడింది.

దానితో పాటే "హాయ్ ఎవ్రీ బడీ" అన్న శ్వేత గొంతు వినపడింది.

రాజి చేతులు తుడుచుకుంటూ ముందు గదిలోకి వచ్చింది.

"రండి కూర్చోండి" మర్యాదగా అంది విలియంను చూస్తూ.

"దిసీజ్ మై మామ్" అంటూ పరిచయం చేసింది శ్వేత. చాలా ఆనందంగా అనిపించింది రాజికి, మొట్టమొదటిసారి శ్వేత అలా అనటం.

"నమస్తే" చేతులు జోడించి చక్కగా చెప్పాడు విలియం. అప్రయత్నంగా చేతులు జోడించింది రాజి.

ముచ్చటగా అనిపించాడు, ఆరడుగుల పొడవు, మరీ తెల్లగా లేడు. కాలిఫోర్నియా ఎండల వలనేమో. జుట్టు మాత్రం లేత గోధుమ రంగు.

"చాలా బాగున్నాడు శ్వేత" శ్వేతకు మాత్రమే వినిపించేట్లు చెప్పింది రాజి.

"వాట్సప్ డ్యూడ్" సాత్విక్ భుజం చరుస్తూ అన్నాడు విలియం. ఇద్దరికీ పరిచయం ఉందన్న విషయం స్పష్టంగా అర్ధం అయింది.

ఇంతలో వేణు కూడా లోపలికి రావటం చూసి "శ్వేత విలియంకు గెస్ట్ రూం చూపించు. ఇద్దరూ ఫ్రెష్ అయ్యి రండి లంచ్ తింటూ మాట్లాడుకోవచ్చు. ఇప్పటికే లేట్ అయ్యింది" అన్నది రాజి.

అందరూ టేబుల్ దగ్గర కూర్చున్నాక, ఆ వంటల పేర్లు చెప్పింది శ్వేత - "పులిహోర, బెండకాయఫ్రై, గుత్తివంకాయ, మామిడికాయ పప్పు, చికెన్, ఎగ్, రైస్." ఒక్కో గిన్నె మూత తీస్తూ చెప్పింది.

"మిమ్మల్ని చాలా కష్టపెట్టాను. నాకోసం ఇన్ని చేశారు" చాలా మర్యాదగా నొచ్చుకున్నట్లు అన్నాడు విలియం.

"నాకు ఏమీ కష్టంలేదు. వంట చెయ్యటం ఇష్టం. పైగా ఫ్యామిలీ కోసం చెయ్యటం ఇంకా సంతోషంగా ఉంటుంది."

ఫ్యామిలీ అనేమాట కావాలనే అన్నది రాజి, విలియం కూడా ఈ కుటుంబంలో ఓ భాగమే అన్నట్లు.

ఆ మాటకు శ్వేత మొహం విచ్చుకోవటం, వేణు మొహం చిట్లించటం ఒకేసారి జరిగింది.

రాజి వేణు మొహంలోని మార్పులు పట్టించుకోదలచుకోలేదు. శ్వేత అతనితో సంతోషంగా ఉంది అది చాలు.

భోజనం చేస్తూ ఒక్క మాట కూడా మాట్లాడలేదు వేణు. పిల్లలు ముగ్గురు చాలా సరదాగా మాట్లాడుకున్నారు. విలియం మాట్లాడే పద్ధతి, మర్యాద ఎంతో నచ్చింది రాజికి. అన్ని వంటలు రుచి చూశాడు.

"ఎన్నో ఇండియన్ రెస్టారెంట్స్‌లో తిన్నాను కానీ ఇవే కూరగాయలుతో చాలా డిఫరెంట్‌గా ఉన్నాయి. మీ ఫ్యామిలీ రెసిపీలా ఇవన్నీ? ఎంత రుచిగా ఉన్నాయో. చాలా ఎక్కువ తినేశాను." అన్నాడు విలియం.

అందరూ తినేసి ఫ్యామిలీ రూంలో కూర్చున్న తరువాత అందరికి ఫ్రూట్ కస్టర్డ్ తెచ్చింది, చిన్న చిన్న కప్పుల్లో సర్ది.

"అమ్మో పిన్ని ఇంకేంటో తెచ్చావు. నా వల్లకాదు" శ్వేత రాజిని చూస్తూనే అంది.

"ఏమీ లేదు ఫ్రూట్స్ అంతే" టేబుల్ మీద పెట్టింది. "తీసుకోండి అందరూ" అంటూ

"మిస్టర్ అండ్ మిసెస్ ఘంటా! నా గురించి మీతో అంతా చెప్పానని శ్వేత చెప్పింది. ఇంకా నా గురించి ఏమన్నా తెలుసుకోవాలంటే, అనుమానాలు ఉంటే నన్ను అడగండి. నాకు శ్వేత అంటే చాలా ఇష్టం. తనను చాలా బాగా చూసుకుంటాను. మీ బ్లెస్సింగ్స్‌తో తనను పెళ్ళి చేసుకోవాలని అనుకుంటున్నాను."

చెప్పాల్సింది చెప్పేసినట్లు గట్టిగా ఊపిరి వదిలాడు విలియం.

"మీ అమ్మా నాన్నా విడిపోయారని చెప్పింది శ్వేత..."

"అవును. అందుకేనేమో నాకు భార్యాభర్తల రిలేషన్ ఎంత బాగుండాలో, ఎంత ప్రేమగా గౌరవంగా ఉండాలో బాగా తెలుసు."

వేణు ఏదో అనబోతుండగా శ్వేత ఆపింది.

"నాన్నా! మేము మిమ్మల్ని గౌరవిస్తున్నాం అందుకే మీ ఆశీర్వాదం అడిగాం. నేను విల్‌తో చాలా సంతోషంగా ఉన్నాను. ఆ సంతోషాన్ని ఒదులుకోలేను. మీరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా మా పెళ్ళి జరుగుతుంది. ఒప్పుకుంటే అందరం ఇంకొంచెం ఎక్కువ సంతోషంగా ఉంటాం. విల్ వాళ్ళ మదర్‌ను నేను కలిశాను, ఆవిడ ఎంతో బాగా మాట్లాడారు. మీరు కూడా విల్‌తో మంచిగా ఉంటారని ఆశిస్తున్నాను."

వేణు కాసేపు ఏమీ మాట్లాడలేదు. "సరే మీరు రెస్ట్ తీసుకోండి నేను షాపుకు వెళ్ళాలి" అని వెళ్ళిపోయాడు.

నిట్టూర్చింది. కిచెన్ సర్దుతుంటే శ్వేత వచ్చి ఖాళీ అయిన గిన్నెలు డిష్ వాషర్‌లోపెట్టి, క్లీనింగ్‌లో హెల్ప్ చెయ్యసాగింది.

"డోంట్ వర్రీ శ్వేత. ఒప్పుకుంటారులే. నేను కూడా రాత్రికి మాట్లాడతాను మళ్ళీ" ఓదార్పుగా అంది రాజి.

"చాలా థాంక్స్ పిన్ని" ఆనందంగా చెప్పింది శ్వేత,

"ఇదివరకెపుడన్నా చికాగో వచ్చావా విలియం?" వాతావరణం తేలిక చెయ్యడానికి అడిగింది రాజి.

"ప్లీజ్ నన్ను విల్ అని పిలవండి. ఫ్రెండ్స్ అందరూ అలానే పిలుస్తారు. చికాగో రావడం ఇదే మొదటిసారి."

"రేపు సాయంత్రం తిరిగి వెళ్ళిపోతున్నారు కదా! డౌన్ టౌన్ చూపించవా శ్వేతా?" అడిగింది రాజి.

"నిజమే! లెట్స్‌గో" అన్నాడు సాత్విక్.

"రాత్రికి లేట్ అవుతుంది పిన్ని ఫోన్ చేస్తాను. మేము డిన్నరు బైట తినేసి వస్తాం" వెళుతూ చెప్పింది శ్వేత.

రాత్రి ఇంటికి ఆలస్యంగా వచ్చాడు వేణు. పిల్లలు ఇంట్లో లేరన్న ధైర్యంతో భోజనం చేశాక అడిగింది రాజి.

"ఏమి చెప్పదలచుకున్నారు శ్వేతకు?"

"ఏమి చెప్పాలి? అమెరికా వచ్చినందుకు కనీసం ఎవరో ఒకరు ఇండియన్ అయితే చాలు అనుకున్నా ఈ రెండేళ్ళుగా శ్వేత మొండితనం చూసి. కానీ ఏకంగా వేరే మతం, వేరే భాష - ఎలా ఒప్పుకోవాలి? అయినా నువ్వేంటి తెగ సమర్ధిస్తున్నావు. నాకు ఇష్టం లేదన్న విషయం తెలిసి కూడా నన్ను వ్యతిరేకిస్తున్నావా?"

"మీరు కూడా ఒకటి ఆలోచించండి. మన కులంలోని అబ్బాయితో శ్వేత పెళ్ళి చేస్తే, ఇంత సంతోషంగా ఉండగలదన్న గ్యారెంటీ ఇవ్వగలరా? పోనీ శ్వేత ఏమన్నా పదహారేళ్ళ పిల్లా? మెచ్యూరిటీ లేకుండా ఆలోచిస్తుందా? నిజం చెప్పండి. మన రిలేషన్ ఎలా ఉందో ఎప్పుడైనా ఆలోచించారా? మనస్ఫూర్తిగా ఏనాడైనా మాట్లాడుకున్నామా? ఇన్నేళ్ళకి మీకు వ్యతిరేకంగా నోరు విప్పాను అదీ పిల్లల కోసం. ఆలోచించండి, పెళ్ళికి ఒప్పుకుని మీ గౌరవాన్ని నిలుపుకుంటారో లేక, మనకు ఎంతో మర్యాద ఇచ్చిన పిల్లలకు, మనకు సరైన సంస్కారం లేదని నిరూపిస్తారో మీ ఇష్టం."

ఇక చెప్పేది ఏమీ లేనట్లుగా బెడ్‌రూంలోకి వెళ్ళిపోయింది రాజి.

"మొత్తానికి కథ సుఖాంతం అయ్యిందన్నమాట" అడిగింది అనిత.

వీకెండులో ప్రియ, అనితతో కాన్ఫరెన్స్ కాల్ చేసి అంతా చెప్పింది రాజి.

"వింత మనస్థత్వం తనది. చాలారోజులు నేను, ఏంటి ఇలాంటి పెంపకం, అత్తగారు ఇంత మూర్ఖత్వంతో పెంచారు అనుకున్నా. కానీ తరవాత నాకే అనిపించింది, తల్లి కొంత పునాది మాత్రమే వేస్తుంది. అసలు వ్యక్తిత్వం బైట ప్రపంచంలోకి వచ్చినప్పుడు పెరుగుతుంది. కూతురు ఎదురు తిరిగి మీ గౌరవం కాపాడుకోండి అన్నందుకు ఒప్పుకున్నారు. పెళ్ళి సింపుల్‌గా చేసుకుంటాను అన్నది శ్వేత."

"నీకు ముందే చెప్పాగా రాజి. విల్ మంచి అబ్బాయి. నిజాయితీగా ఉంటాడు. అతని గురించి నువ్వు చెప్పాక, గమనించాను బాగా" చెప్పింది ప్రియ.

"పెళ్ళి వచ్చే సమ్మర్‌లో అని అంటున్నారు శ్వేత, విల్. ఈ లోపల ఇండియా వెళదాం ఒసారి పెళ్ళికి షాపింగ్ చేసినట్లు ఉంటుంది, విల్‌కి తాజ్‌మహల్ ఢిల్లీ ఇలా ఏమైనా చూపిద్దాం అంటుంది శ్వేత. వేణు వచ్చేదాకా నమ్మకం లేదు"

"వాళ్ళతో నువ్వు వెళ్ళు రాజి. ఎప్పుడో వెళ్ళావు కదా ఇండియా, అందరిని చూసిరా నువ్వు కూడా" నచ్చ చెప్పింది అనిత.

"నేను కూడా అదే అనుకుంటున్నా. మీకు తెలుసుగా అక్కవాళ్ళింట్లో ఏ శుభకార్యానికి వెళ్ళలేదు. అమ్మ పోయాక తిరిగి వెళ్ళనే లేదు. వేణుతో కొంచెం ధైర్యంగా మాట్లాడటం నేర్చుకుంటున్నా. ఆయన మారరు, కానీ నేను కూడా మరీ ఇదివరకు లాగా ఉండదలచుకోలేదు. నేను ఆ ఇంట్లో పోవలసిన దానినే. అది నా ఇల్లు కూడా కదా! ఇద్దరు పిల్లలు ప్రేమగా ఉంటున్నారు. నాకు అది చాలు" స్థిమితంగా చెప్పింది రాజి.

డోర్ బెల్ మోత విని కీ హోల్‌లో నుండి చూసింది ప్రియ. బైట పోలీస్ ఆఫీసర్లు కనిపించారు.

తలుపు సొంతం తెరవకుండా చైన్ వేసి కొంచెం తెరిచింది. వాళ్ళు రావచ్చేమో అన్న అనుమానం ఉన్నాకానీ, జాగ్రత్తగా ఉండటం అలవాటయ్యింది.

తలుపు సందులోనుండి వాళ్ళిద్దరు చూపిన బ్యాడ్జిలు జాగ్రత్తగా చూసి లోపలకు రానిచ్చింది ప్రియ. ఒక ఆడ, మగ ఆఫీసర్లు వచ్చారు. ఇద్దరూ పేర్లు చెప్పి పరిచయం చేసుకున్నారు. డిటెక్టివ్స్ వాళ్ళిద్దరూ.

"కూర్చోండి" సోఫా చూపించింది ప్రియ.

"ఒక్కరే ఉంటారా ఇక్కడ?" డిటెక్టివ్ బెట్సీ క్లార్క్ అడిగింది చుట్టూ పరిశీలనగా చూస్తూ. దాదాపు ప్రియ ఎత్తు ఉంది ఆమె.

"అవును"

"పాయింట్‌కి వద్దాం. లోలా గురించి మాట్లాడటానికి వచ్చాం" డిటెక్టివ్ జాక్సన్ అడిగాడు. ఇద్దరిలోకి ఇతను కఠినంగా కనిపించాడు.

"చెప్పండి" లోలా నాకు తెలుసు అన్నమాట వాడకుండా జాగ్రత్త పడింది ప్రియ. ఎన్నోసార్లు పోలీసులతో, లాయర్లతో మాట్లాడిన అనుభవం.

"మిమ్మల్ని ప్రియ అని పిలవచ్చా?" స్నేహంగా అడిగింది బెట్సీ

"మమ్మల్ని తప్పుగా అనుకోవద్దు. మాకు లోలా గురించి చాలా తక్కువ సమాచారం తెలుసు, అందుకే అన్నీ తెలుసుకోవాలని వచ్చాం. లోలా ఎన్నో ఏళ్ళుగా భర్తతో హింసలు పడుతుంది. స్పానిష్ భాష తప్పితే ఇంగ్లీషు రాదు, అందుకే ఎవ్వరితోనూ తన విషయం చెప్పుకోలేదు. చర్చిలో ఫాదర్ సాయంతో తప్పించుకుని హెల్ప్ సాయంతో ఎక్కడా భర్తకు దొరకకుండా దాక్కుంది. ఎలాగో భర్తకు తెలిసి ఆమె దగ్గరకు వచ్చి విపరీతంగా కొట్టాడు. ఆ క్రమంలో అతనిని కత్తితో పొడిచి పారిపోయింది. అతను చనిపోయాడని భయపడుతుందేమో, ఇది మర్డరు కేసు కాదు కేవలం అసాల్ట్ కేసు అంతే, అతను కేసు పెట్టాడు భార్య హత్యా ప్రయత్నం చేసిందని. అందుకే వెతుకుతున్నాం"

"అయితే ఇప్పుడు లోలాని అరెస్టు చేస్తారా? అతను కొట్టిన దెబ్బలకు ఆమె పరిస్థితి ఏమై ఉంటుందన్న ఆలోచన ఉందా మీకు"

"చూడండి ప్రియ మేము మా డ్యూటీ చెయ్యాలి. ఆమెకు రక్షణ కల్పిస్తాం. కానీ ప్రస్తుతానికి ఆమెను కోర్టులో హాజరు పరచాలి, మీరు సహకరించి ఆమె ఆచూకి చెప్పండి"

"మీకు తెలుసు డిటెక్టివ్స్! ఎబ్యూస్డ్ ఆడవాళ్ళను, పిల్లలను చాలా సేఫ్‌గా ఉంచుతాం. అలాంటిది భర్త ఎలా కనుక్కున్నాడో తెలియదు కానీ, వచ్చి దాడి చేశాడు, రెండు పక్కటెముకలు విరిగిపోయాయి. అయినా ఇదంతా కేవలం నేను విన్న సమాచారం. నాకు తెలియదు లోలా ఎక్కడుందో" మొండిగా చెప్పింది ప్రియ.

"ప్రియా మీరు మాతో సహకరిస్తే లోలాకి తప్పకుండా రక్షణ కల్పిస్తాం" నచ్చచెపుతున్నట్లుగా అంది బెట్సీ.

ప్రియ ఫోన్ మోగింది. అప్పటికే డేవిడ్ నుండి మూడు మిస్డ్ కాల్స్.

"హాయ్ డేవ్! నేను ఇప్పుడు మాట్లాడలేను. బిజీగా ఉన్నాను"

"ఎందుకు ఫోన్ లిఫ్ట్ చెయ్యట్లేదు, కనీసం మెసేజ్ కూడా చెయ్యట్లేదు"

"ఒక కేస్ విషయంలో బిజీ ఉన్నా బై" అంటూ పెట్టేసింది.

"సరే లోలా ఎక్కడుందో నాకు తెలుసనే అనుకుందాం. అప్పుడేమవుతుంది, కోర్టుకేసు, ఆమెకు ఏదో శిక్ష ఇంతేగా. లోలా ఎప్పుడూ మొగుడు గురించి పోలీసు కంప్లైంటు ఇవ్వలేదు కాబట్టి అతను తప్పించుకుంటాడు. కట్టు బట్టలతో ఇంట్లోనుండి పారిపోయింది, తన ప్రాణాలు రక్షించుకోటానికి."

"ప్రియా మేము లోలా శత్రువులం కాదు. మా డ్యూటీ మేం  చెయ్యాలి తరువాత లాయర్లు చూసుకుంటారు"

"చూడండి లా ఎంత ముఖ్యమో, వ్యక్తి స్వాతంత్ర్యం కూడా అంతే ముఖ్యం. లోలా సేఫ్టీ చాలా ముఖ్యం నాకు. తనను ఎలా కాపాడుతారో నాకు ముందు ఏడిఏ తో చెప్పించండి. పైగా లోలా దగ్గర చాలా, ముఖ్యమైన సమాచారం ఉంది హ్యూమన్ ట్రాఫికింగ్ మీద"

డిటెక్టివ్స్ ఇద్దరూ ఉలిక్కిపడ్డారు. ఏదో భార్యాభర్తల మధ్య గొడవ అనుకుంటే ఇదేంటి అని.

లోలాతో మాట్లాడిన కొద్దీ చాలా విషయాలు తెలిసాయి, ఆమె భర్త డ్రగ్స్, హ్యూమన్ ట్రాఫికింగ్‌లో ఎలా సాయం చేస్తాడో. మర్నాడు లాయర్‌తో పాటు వచ్చి ఏడీతో మాట్లాడుతానని. ఈ లోపల తన రక్షణ గురించి అంతా ఫైనల్ ప్లాన్ రెడీ చేసుకుని మర్నాడు చెప్పాలన్న ఒప్పందం చేసుకుంది పోలీసులతో ప్రియ.

పోలీసుల్తో ఈ విషయాలు మాట్లాడి పంపించేశాక తర్వాత లాయర్‌తో మాట్లాడి అంతా ప్లాను చేసేసరికి దాదాపు అర్ధరాత్రి అయ్యింది.

అప్పుడు గుర్తు వచ్చింది డేవిడ్ ఫోను తాను కట్ చేసిన విషయం. గిల్టీగా అనిపించింది.

"మనం కలిసి ఎన్నాళ్ళయ్యిందో గుర్తుందా నీకు. నన్ను కలవటం ఇష్టం లేకపోతే క్లియర్‌గా చెప్పు"

ఫోనులో డేవిడ్ గొంతు చాలా కోపంగా వ్నిపించింది.

"సారీ డేవ్, ఒక పెద్ద కేస్‌లో ఇన్‌వాల్వ్ అయ్యా, చాలా బిజీగా ఉంటున్నా"

"నీ ఆఫీసు పనులు కానీ వేరే ఏ పనులు కానీ వదులుకోమని చెప్పట్లేదు నేను కానీ నా జీవితంలో నా స్థానం ఏంటో అర్థం కావట్లేదు. కలిసినప్పుడు ప్రేమగా నాకొక మంచి వ్యక్తి ప్రేమ దొరికింది అని మురిసిపోయేంతలో మాయమైపోతావు. ఏంటిది? ఏ రకమైన రిలేషన్ షిప్ ఇది?"

"రియల్లీ సారీ డేవ్ నీకు తెలుసు కదా నువ్వంటే నాకెంత యిష్టమో" ప్రియ మాటలను మాటలను కట్ చేసాడు డేవిడ్.

ఏమో ప్రియ నాకేమీ అర్థం కావట్లేదు. రెండు నెలలయ్యింది నిన్ను కలిసి. వారానికోసారి ఫోన్‌లో మాట్లాడుకుంటున్నాం. ప్రతిసారీ నువ్వేదో వంకలు చెపుతున్నట్లుగా ఉంది. బాగా ఆలోచించుకో నీకు ఏమి కావాలో" చిరాకుగా ఫోన్ పెట్టేశాడు డేవిడ్.

చాలాసేపు అలాగే కూర్చుండిపోయింది ప్రియ. నిజమే డేవిడ్ చాలా ఓపికగా ఉంటాడు తనతో. ఇద్దరికి కుడి ఎడంగా నలభై ఏళ్ళు, ఈ వయస్సులో అందరికి సెటిల్ అవ్వాలని ఉంటుంది కదా!

అనితకు ఫోన్ చేసి డేవ్ అన్నదంతా చెప్పింది ప్రియ.

"ముందు నీకేం కావాలో నిర్ణయించుకో ప్రియ. డేవిడ్ ఒక్ అకాజ్యుల్ రిలేటన్, దానికి అంత ప్రాముఖ్యత ఇవ్వాల్సిన అవసరం లేదు అంటావా?"

"అలా అని అనటంలేదు. నాకు డేవిడ్ అంటే చాలా ఇష్టం. పాపం నాతో చాలా ఓపికగా ఉంటాడు, నన్ను నవ్విస్తాడు, నా ఫ్రస్ట్రేషన్స్ చాలా ఓపికగా వింటాడు. కానీ తను కూడా అర్ధం చేసుకోవాలి కదా ఒక్కోసారి ఉమెన్స్ హెల్ప్ సెంటర్‌లో పనుల మూలాన తనకు అంత టైం ఇవ్వలేను"

"నీకు ఉద్యోగం, హెల్ప్ సెంటర్ రెండూ ముఖ్యమే. మరి డేవిడ్ ముఖ్యం కాదా? తనూ అదే అడుగుతున్నాడు – తను ముఖ్యమో కాదో తేల్చుకోమని.

"అరే నువ్వు కూడా ఏంటి అనిత"

"నో ప్రియ నేను చెప్పేది సరిగ్గా విను. అతనంటే ప్రేమ ఉంటే, అతనికి కూడా సమయం ఇవ్వాలి. అంతే ఇద్దరి మధ్య ప్రేమని చాలా జాగ్రత్తగా కాపాడుకోవాలి.

ఒక చిన్న మొక్క బ్రతకాలంటే, రోజూ నీళ్ళు పోస్తాం. బాగా పూలు రావాలంటే ఎరువులు వేస్తాం. మరి రిలేషన్‌షిప్ అంటే ఎందుకు టేకింగ్ ఫర్ గ్రాంటెడ్? నీ స్వేచ్ఛకు అడ్డు పడే వ్యక్తికాదు. అలాంటి వ్యక్తిని నువ్వు పక్కన పడేస్తున్నావు. ఎక్కడికి పోతాడులే అన్న భరోసానా?"

"ఛ! మరీ నేను అంత రాక్షసిని కాదు అనిత."

"సీరియస్‌గా ఆలోచించు ప్రియ. నీకు ఈ రిలేషన్ వద్దనిపిస్తుందా, సరే ఆ విషయమే డేవిడ్‌తో చెప్పేసెయ్యి. లేదా ఏంటి నీ ప్రాబ్లం అని ఆలోచించు. నిజంగా పని ఒత్తిడేనా, లేక నీ ఇన్‌సెక్యూరిటీతో తనతో కమిట్‌మెంటుకు ఇష్టపడటం లేదా అని ఆలోచించు."

"ఒక రకంగా భయం అనిత" మెల్లగా ఒప్పుకుంది ప్రియ.

"ఛ పిచ్చిదానా! నువ్వు తనను ప్రేమిస్తున్నావు. లేకుంటే ఎప్పుడో విడిపోయేవారు పైగా నాతో ఈ డిస్కషన్ పెట్టేదానివి కాదు. డేవిడ్ నీలో ఈ ఆలోచనలు రేకెత్తించటానికే అలా మాట్లాడాడేమో? ప్రశాంతంగా ఆలోచించు. నీ ఇన్‌సెక్యూరిటీస్ పక్కన పెట్టు. సరేనా?"

అనితతో మాట్లాడాక తన ఆలోచనలు, భయాల మీద తనకే చిరాకు వచ్చింది. ఇంత స్టుపిడ్‌గా ఎలా ఆలోచిస్తుంది దేవ్ గురించి అని.

డేవిడ్‌కి ఫోన్ చేసి చాలా సేపు మాట్లాడింది ప్రియ. మర్నాడు రాత్రికి డిన్నరుకి ఇంటికి రమ్మని పిలిచింది.

"ఏంటి ఏం స్పెషల్స్ చేస్తున్నావు. భలే వాసనలు వస్తున్నాయి" ఇంట్లోకి అడుగుపెడుతూనే అడిగాడు డేవిడ్. దగ్గరికి వచ్చిన ప్రియను ఆప్యాయంగా హత్తుకున్నాడు. ప్రియకు చాలా ఎమోషనల్‌గా అనిపించింది. తాను ఎంత తప్పు చేసిందీ, డేవిడ్‌ను ఎంత బాధపెట్టిందో అర్ధం అయ్యి గట్టిగా హత్తుకుంది

చిన్నగా నవ్వుకున్నాడు డేవిడ్, ప్రియ మానసిక స్థితి అతనికి బాగా తెలుసు.

తాను తెచ్చిన గులాబీలు, లిల్లీల బొకే ప్రియ చేతిలో పెట్టాడు.

"వావ్! ఎంత బాగున్నాయో. ఏంటి స్పెషల్? పూలు తీసుకొచ్చావు?" పూల వాసన చూస్తూ అడిగింది.

"స్పెషల్ ఫ్లవర్స్ ఫర్ మై స్పెషల్ గర్ల్. నువ్వు కూడా చాలా స్పెషల్‌గా తయారయ్యావు ఈ రోజు. చాలా బాగున్నావు" మళ్ళీ దగ్గరికి లాక్కుని ముద్దు పెట్టుకున్నాడు డేవిడ్.

చుడీదార్ వేసుకుని, చేతినిండా గాజులు, బొట్టు, పెద్ద చాంద్‌బాలీలుతో ప్రియ చాలా అందంగా ఉంది.

"నీకోసం..  ఏమీ కాదులే. మంచి మూడ్‌లో ఉండి తయారయ్యాను" చిలిపిగా నవ్వింది.

"వంట అయిపోయింది. వైన్ లేదా ఇంకేమన్నా డ్రింక్స్ తీసుకుంటావా?" పూలు వేజ్‌లో పెడుతూ అడిగింది ప్రియ.

"వైన్ చాలు. చాలా ఆకలిగా ఉంది. లంచ్ కూడా తినలేదు, చాలా బిజీ మీటింగ్స్ ఇవాళ"

డేవిడ్ కంపెనీల మెర్జర్స్ పనుల మీద ఎప్పుడూ చాలా బిజీగా ఉంటాడు.

"ఏం స్పెషల్స్ ఇవాళ?" అంటూ గిన్నెల మూత తీసి "వావ్ పాలక్ పనీర్" అన్నాడు.

"నీకు ఇష్టం కదా అందుకే చేశా, చికెన్ కర్రీ, రైస్ చేశాను. డోంట్ వర్రీ ఎక్కువ కారం వెయ్యలేదు" నవ్వుతూ చెప్పింది ప్రియ.

"నిన్ను ప్రేమించటానికి ఇది ఇంకొక కారణం కూడా" టీజ్ చేశాడు.

కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేసి, టేబుల్ క్లీన్ చేసి ఇద్దరూ వచ్చి సోఫాలో కూర్చున్నారు.

ప్రియ చెయ్యి పట్టుకున్నాడు డేవిడ్

"నీకు దూరంగా ఉండటం ఇక నా వల్ల కాదు ప్రియ. నా ప్రతి ఉదయం నీతో మొదలవ్వాలి, ప్రతి రాత్రి నిన్ను హత్తుకుని నిద్రపోవాలి. ప్రతిరోజు మన జీవితం ఓ అందమైన అనుభవం అవ్వాలి. విల్ యూ మేరీ మీ?" ప్యాంటు జేబులో నుండి ఓ బాక్స్ తీసి దాంట్లో నుండి ఉంగరం తీశాడు డేవిడ్.

"ఓ మైగాడ్ దేవ్ ఏంటిది?" డేవిడ్ ఆర్ధ్రంగా చెప్పిన మాటలకు కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి.

"నువ్వు ఒప్పుకోముందు" చిలిపిగా నవ్వాడు.

"ఒప్పుకుంటున్నాను"

ప్రియ చేతికి ఉంగరం తొడిగి ప్రియ మొహాన్ని దగ్గరకు తీసుకుని ఘాఢంగా చుంబించాడు. మనస్సులోని ప్రేమ, ఎన్నో ఏళ్ళ స్నేహ బంధం కానీ రకరకాల అనుమానాలతో ఇన్నాళ్ళూ అతన్ని దూరం పెట్టింది. కొద్దికాలంగా స్నేహితుల ప్రోద్భలంతో కొంత మార్పు వచ్చినా, క్రితం రోజు అనిత మాటలతో డేవిడ్‌ను కోల్పోతానేమో అన్న భయం మొట్టమొదటిసారిగా ప్రియలో కలిగింది.

కానీ ప్రపోజ్ చేస్తాడని అస్సలు ఊహించలేదు. అతని కౌగిలిని, ఆ దగ్గరితనాన్ని ఆస్వాదిస్తూ మౌనంగా ఉండిపోయింది.

"ఏంటి ఇంత మౌనంగా ఉండిపోయావ్?" ప్రీయ చుబుకం ఎత్తి అడిగాడు.

"నువ్వు దబాయిస్తూ మాట్లాడుతుంటేనే బాగుంటావు నాకు"

"ప్రేమించిన వ్యక్తితో జీవితం పంచుకోవటంలోని ఆనందం ఇప్పుడిప్పుడే అర్థం అవుతోంది. డేవిడ్ కళ్ళల్లోని ప్రేమను చూసి ఇన్నాళ్ళూ పిచ్చి అనుమానాలతో ఎంత విసిగించానో అయినా నా మీద ప్రేమ తగ్గలేదు" అనుకుంది. "ఉండు ఒక్క క్షణం" అంటూ అనితకు మెసేజ్ చేసింది డేవిడ్ ప్రపోజ్ చేశాడని.

"కంగ్రాట్స్ బోత్ ఆఫ్ యూ" అంటూ అనిత మెసేజ్ చేసింది, "రేపు మాట్లాడతాను. ఇవాళ రాత్రి డేవిడ్‌కి ఇచ్చేశా" స్మైలీతో మెసేజ్ చేసింది అనిత.

"ఇంతకీ మనం పెళ్ళి ఎప్పుడు చేసుకుందాం?" తన కౌగిట్లో ఒదిగిపోయిన ప్రియ నుదుటిపై ముద్దు పెడుతూ అడిగాడు.

"భయంగా ఉంది డేవ్ పెళ్ళి అంటే..."

"పిచ్చి అనుమానాలతో భయాలతో ఇన్నాళ్ళూ నన్ను దూరం పెట్టావు. ఇంకా ఏంటి నీ భయాలు"

"ఊహూ ఏమీ లేదులే, కానీ పెళ్ళి ఇప్పుడే వద్దు. ఇద్దరం ఒకే చోట ఉందాం డేవ్. తరువాత పెళ్ళి సంగతి ఆలోచిద్దాం"

"సర్లే ఇది ఒప్పుకున్నావు చాలు ప్రస్తుతానికి. నిన్నెలా మాయ చేయాలో నాకు తెలుసులే" ఇంక ప్రియకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదు డేవిడ్.

**అనిత**

జీవితంలో ఎన్ని ఎదురు దెబ్బలు తగిలినా, మనస్సుకు ఊతం ఇచ్చి, మనలో పాజిటివ్ ఎనర్జీని నింపే వ్యక్తులు మన జీవితంలో ఉంటే, ఆ దెబ్బల నుండి తొందరగా కోలుకుంటాం.

మానసికంగా బాగ కృంగిపోయిన స్థితిలో ఉన్న అనితకు, సరైన సమయంలో తన స్నేహితులందరూ తిరిగి జీవితంలోకి రావటంతో కొత్త శక్తి వచ్చినట్లయింది.

అనిత ప్రదీప్ నుండి వేరుపడి అపార్టుమెంటు అద్దెకు తీసుకుంది. ఆ విషయంలో ప్రదీప్‌తో ఎన్ని గొడవలైనా, అతను ఎంతగా బెదిరించినా అనిత లొంగలేదు, బెదరలేదు. మొదట్లో కొంచెం ఇబ్బంది పడింది. అన్ని విషయాలు తనే మేనేజ్ చేసుకోటంతో, కానీ తొందర్లోనే ఆ ఇబ్బందుల నుండి బైటపడింది. ముఖ్యంగా ఇంట్లో ఒక కొత్త ఎనర్జీ నిండినట్లుగా అనిపించసాగింది.

నెమ్మది నెమ్మదిగా పూర్వపు అనితలా పొరలు చీల్చుకుని బైటకు వచ్చిన సీతాకోక చిలుకలాగా మారింది. ఆరు నెలల్లోనే చాలా ఉత్సాహం, ఉత్తేజం నిండిన మనస్సుతో వికసించింది అనిత.

స్టీవ్‌తో దాదాపు రోజూ ఏదో రకంగా మాట్లాడుతుంది – మెసేజ్‌లు కానీ, వీలైతే ఫోన్‌లో, అన్ని రకాల టాపిక్‌లు మాట్లాడుకునేవారు. పాలిటిక్స్, పుస్తకాలు, సినిమాలు. కానీ పర్సనల్ విషయాలు ఏమీ అడిగేవాడు కాదు. అనిత చెపితే మౌనంగా వినేవాడు. ప్రదీప్‌తో విడిపోయా అని మాత్రం చెప్పింది. వెన్నెల గురించి చాలా చెప్పింది. స్టీవ్‌లో అదే చిలిపితనం, అదే శ్రద్ధ, అదే ఆప్యాయత.

"ఒక్క వారం రోజులు సెలవు పెట్టి కాలిఫోర్నియా రా నీతూ. ఇక్కడ నాకొక చిన్న వైనరీ ఉంది. చాలా బాగుంటుంది. ప్రియ, ఆనంద్ కూడా వస్తామన్నారు నువ్వు వస్తే" ఎప్పటినుండో అడుగుతున్నాడు స్టీవ్. కానీ ఎందుకో బెరుకుగా ఉంది మళ్ళీ స్టీవ్‌ని కలవాలంటే.

గత ఆరునెలల్లో మానసికంగా ఎంతో దగ్గరయ్యారు. అతనితో మాట్లాడుతుంటే తన వయస్సు కూడా మర్చిపోతుంది అనిత. కాలేజ్ ఉన్నప్పుడూ ఎంత మనస్ఫూర్తిగా నవ్వేదో, ఎంత స్వచ్ఛంగా ఉండేదో అలాంటి అనుభూతి. స్టీవ్‌తో మళ్ళీ తనకు ఏదో రొమాంటిక్ రిలేషన్‌షిప్ మొదలవుతుందేమో అన్న ఆలోచన కానీ, కోరిక కానీ లేదు.

ఈ వయస్సులో తనను చూసి మోహిస్తాడన్న ఊహ కూడా రాలేదు అనితకు. తను ఒకప్పటిలా లేదు. లావయ్యింది, కళ్ళక్రింద నలుపు. రోజూ అద్దంలో వాస్తవికతను గుర్తుచేస్తున్న వర్తమానం. దానికి భిన్నంగా కలల ప్రపంచంలో ఏమీ లేదు అనిత.

చివరికి ఎలాగో ఇప్పుకుని అందరూ కలిపి ఏ రోజుల్లో వీలవుతుందో తేల్చుకుని, స్టీవ్ దగ్గరకు బయలుదేరింది. ఎన్నోసార్లు చెప్పాడు తన వైనరీ గురించి. అంతా నేను ప్లాను చేస్తాను, ఏరోజున వస్తారో అందరూ చెప్పండి చాలు అన్నాడు.

శాన్‌ఫ్రాన్సిస్కోలో విమానం దిగి సూట్‌కేస్ తీసుకుని వచ్చేసరికి, ఒక డ్రైవర్ అనిత పేరు ఉన్న కార్డు పట్టుకుని నిల్చున్నాడు. ముందే చెప్పాడు స్టీవ్, డ్రైవర్‌ని పంపుతున్నానని, తిన్నగా ఫామ్ కి వచ్చెయ్యమని.

సిటీ వదిలి కారు వెళుతుంటే ఏదో తెలియని గాబరా. అర్ధం కాని ఎమోషన్స్. ఒక్క క్షణం కంగారు, మరు క్షణం తెలియని బాధ గుండెను నొక్కిపెడుతున్నట్లు. ప్రియ సాయంత్రం వస్తానంది, ఆనంద్ మర్నాడు ప్రొద్దున. చుట్టూ ఉన్న అందమైన ప్రకృతి చూస్తూ మనస్సుకు కొంచెం నిదానించుకుంది అనిత.

ఒక వైపు ద్రాక్ష తోటలు, కొంచెం దూరంలో ఇల్లు, ఇంటి చుట్టూ పూలమొక్కలు, గుత్తులు గుత్తులుగా విరబూసిన గులాబీలు. కారు దిగుతూనే స్టీవ్ లోపలి నుండి వచ్చాడు. గుండె వేగం పెరిగిందో లేక ఆగిపోయిందో అర్ధం కాని పరిస్థితి.

డ్రైవర్ సూట్‌కేసు తీసుకుని లోపలికి వెళ్ళి పెట్టి, తిరిగి వెళ్ళిపోవటం కూడా తెలియలేదు ఇద్దరికి. స్టీవ్ దగ్గరకు వచ్చి భుజం చుట్టూ ఆప్యాయంగా చెయ్యి వేశాడు. ఒక రెండు సెకన్లు అంతే. ఎందుకో ఇద్దరిలోనూ ఇబ్బంది, టెన్షన్.

"ఏమీ మారలేదు నువ్వు నీతూ. You are as aluring as ever"

స్టీవ్ జుట్టు బాగానే తెల్లబడింది, కొంచెం ఒళ్ళు వచ్చింది, కళ్ళ దగ్గర ముడతలు.

"నువ్వు మాత్రం మారావు. ఇదవరకట్లాగా కళ్ళు సరిగ్గా కనిపించటం లేదు. అందుకే నేను ఏమీ మారలేదు అంటున్నావు" టీజింగ్‌గా నవ్వింది అనిత.

గట్టిగా నవ్వేశాడు స్టీవ్.

ఇంటి చుట్టూ వరండాలాగా ఉంది. రెండు కుర్చీలు, టేబుల్ ఉన్నాయి. దాని మీద ఐస్‌టీ, ఏవో స్నాక్స్ పెట్టి ఉన్నాయి.

"రా కూర్చో, ఐస్‌టీ తాగుతావా? చాలా వేడిగా ఉంది కదా లంచ్ ఇప్పుడే తినేద్దామా లేక ఆగుతావా?" స్టీవ్‌కు కూడా కంగారుగానే ఉంది, అనిత ఎదురుగా ఉంటే ఏం మాట్లాడాలో అర్ధం కావట్లేదు.

"థాంక్స్, చాలా బాగుంది ఇల్లు, తోట.." గ్లాసు చేతిలోకి తీసుకుంది. చల్లటి టీ తాగుతుంటే ప్రాణానికి చాలా హాయిగా ఉంది.

"నాలుగేళ్ళ క్రితం ఎవరో అమ్ముతుంటే కొన్నాను. ప్రతి వీకెండ్ వస్తాను. ద్రాక్ష ఇక్కడ దగ్గర్లోని వైన్ తయారీ దారులకు అమ్ముతాను. ఇంకోవైపు ఆర్గానిక్ కూరగాయలు పండిస్తాము. ఎప్పట్నుండో ఇక్కడే ఉండిపోయిన మంచి స్టాఫ్ ఉన్నారు. వాళ్ళే ఇక్కడి నా కుటుంబం."

"ఆకలౌతుందేమో నీకు. ప్రొద్దున్నే బయలుదేరావు. రా నీ రూం చూపిస్తాను. ఫ్రెష్ అవుదువు" లోపలికి దారి తీసాడు స్టీవ్. లివింగ్ రూములో ఉన్న అనిత సూట్‌కేస్ చేతిలో పట్టుకుని పైకి దారి తీశాడు. మౌనంగా అతని వెంట నడిచింది.

పై అంతస్తులో మూడు బెడ్‌రూంలు ఉన్నాయి. ఒక దాంట్లో సూట్‌కేసు పెట్టాడు. చాలా నీట్‌గా ఉంది రూం. పెద్ద బెడ్, డ్రెస్సర్, బట్టలకు గోడలోనే షెల్ఫ్.

"పక్కనే బాత్రూం ఉంది. ఫ్రెష్ అవ్వు. లంచ్ తిందాం" అంటూ అనిత వైపు చూసాడు.

నెమ్మదిగా అనితను దగ్గరకు తీసుకుని నుదుటి మీద ముద్దు పెట్టుకున్నాడు. కళ్ళు ఎత్తి స్టీవ్ వైపు చూసింది. ఆ కళ్ళల్లో ఏ భావాలు కనిపించాయో.

"మై డార్లింగ్ ఇన్ని సంవత్సరాలు నిన్ను ఎంత మిస్ అయ్యానో "గొంతు గద్గదమైంది, స్టీవ్‌కు.

కట్టలు తెంచుకున్న ప్రేమ ప్రవాహంలో కొట్టుకుపోయారు ఇద్దరూ.

ఆప్యాయతతో మొదటి ముద్దు – అనురాగంతో రెండో ముద్దు... కవిగారు అన్నట్లు –

నాలుగు పెదవులు రెండైనాయి, రెండు మనసులు ఒకటైనాయి –

గుండె నిండా ఎన్నో ఏళ్ళుగా దాచిన ప్రేమ, కంటి చివర ఆర్ద్ర గీతమై, ఎవరి కన్నీళ్ళో అర్ధం కాని మమేకం

అనిత కళ్ళు తుడిచాడు స్టీవ్.

"నీకు మాట ఇస్తున్నా నీతూ, నా మూలాన ఇంకెప్పుడూ కన్నీళ్ళు పెట్టుకునే పరిస్థితి తీసుకురాను"

మాటలు అవసరమా? కళ్ళల్లో ప్రతిఫలించే ప్రేమ, మనస్సులో ఉప్పొంగే ఆనందపు తరంగాలు అవధాలు లేని అనుభూతులు. ఎంత సమయం గడిచిపోయిందో కూడా తెలియలేదు ఇద్దరికి.

స్టీవ్ ఛాతిపై తల పెట్టుకుని కళ్ళు మూసుకుంది అనిత. అనిత చుట్టూ చేతులు వేసి ఒక అపురూపమైన అద్భుతాన్ని పట్టుకున్నట్లుగా పొదుపుకున్నాడు స్టీవ్.

సెల్‌ఫోన్ మోగటంతో ఇద్దరూ ఒకేసారి కళ్ళు తెరిచారు. ఫోన్ వైపు చూసి పక్కన పడేశాడు.

"సారీ నీతూ ఆకలవుతుందేమో నీకు... లేద్దామా?"

"లేవాలని లేదు."

సన్నగా నవ్వాడు స్టీవ్. అనిత మొహం మీద పడిన జుట్టు, పక్కకు నెట్టి "నాకు కూడా లేదు. కానీ తప్పదు, తర్వాత నువ్వే పోట్లాడతావు, అంత ప్రయాణం చేసి వస్తే కనీసం లంచ్ కూడా పెట్టలేదని"

నవ్వి "సరే ఫ్రెష్ అయి వస్తా" అంది

అనిత బాత్రూంలోకి వెళ్ళి చల్లటి నీళ్ళలో మొహం కడుక్కుని, బట్టలు మార్చుకుని చీర కట్టుకుని క్రిందకు వచ్చింది.

టేబుల్ మీద అన్నీ సర్ది ఉన్నాయి. కిటికీ దగ్గర నిలబడి బైటకు చూస్తున్నాడు స్టీవ్. అడుగుల చప్పుడు విని వెనక్కి తిరిగి చూశాడు.

"వావ్! నా కోసం చీర తెచ్చుకున్నావా? ఇంకా గుర్తుందా నాకెంత ఇష్టమో."

సిగ్గుగా నవ్వింది అనిత అతని చూపు కూడా ఒంట్లో పులకరింతలు రేపుతుంది.

"నీ దగ్గరకు రాను, కాస్త దూరంగా కూర్చోవాలి, లేకుంటే నిన్ను లంచ్ తిననివ్వను" చిలిపిగా నవ్వి టేబుల్ మీద ఉన్న సలాడ్ ప్లేట్లలో వడ్డించాడు.

లంచ్ తినేసిన తరవాత అంతా సర్దేశాడు స్టీవ్. సాయం చేస్తానన్నా వినిపించుకోలేదు.

"నా హౌస్ కీపర్ వస్తుంది. సాయంత్రం డిన్నరు తయారు చెయ్యటానికి. మధ్యాహ్నం రావద్దన్నాను నీతూ. ఎన్నాళ్ళ తరవాతో మనం కలుసుకుంటున్నాం, ఎమోషనల్ అవుతామేమో, వేరొకరు ఇంట్లో ఉంటే ఇబ్బందిగా ఉంటుందని.."

సాయంత్రం ఐదు దాటింది, తోటల్లో పనిచేసేవాళ్ళు వెళ్ళిపోయారనుకుంటా, ఎవ్వరూ కనిపించటంలేదు. ఎండ తీవ్రత తగ్గినా వేడిగానే ఉంది.

"నువ్వు చెపుతుండేదానివి, నీ చిన్నప్పుడు ఇండియాలో ఫెస్టివల్స్‌కి మీరు పల్లెల్లో ఎలా ఎంజాయ్ చేసేవారో అలానే ఉంది కదా ఇక్కడ.."

"చాలా బాగుంది స్టీవ్. ఎన్ని టెన్షన్లు ఉన్నా ఇంతటి ప్రశాంతత మధ్య అంతా మర్చిపోతాం" కాసేపు తోటలో నడుద్దామా?"

"అంతా నడవలేము, రా! నా గోల్ఫ్ కార్ట్ ఉంది దాంట్లో వెళదాం"

చీకట్లు ముసురుతుండగా తిరిగి ఇంటికి చేరుకున్నారు. పొలాలకు దగ్గరలో చిన్న చిన్న ఇళ్ళు ఉన్నాయి. సూపర్‌వైజర్‌ను పరిచయం చేశాడు.

ఇంట్లోకి అడుగుపెడుతూనే మంచి వంటకపు వాసనలు చుట్టుముట్టాయి.

వీళ్ళ మాటలు విని వంటింట్లో నుండి సుమారు ఓ అరవై సంవత్సరాలున్న ఆవిడ, ఏప్రన్‌కు చేతులు తుడుచుకుంటూ వచ్చింది.

"హాయ్! ఆర్యూ అనిత స్టీవ్ చాలా చెప్పాడు నీ గురించి" దగ్గరకు వచ్చి ఆప్యాయంగా హత్తుకుంది.

"నా హౌస్ కీపర్ మిసెస్ డోరీ. ఎప్పటినుండో ఇక్కడే ఉంటున్నారు. చెప్పాగా తన భర్త ఇక్కడ్ సూపర్‌వైజర్. తనములానే నాకు పొట్ట వచ్చింది" నవ్వాడు స్టీవ్.

"వెనకాల పాటియోలో టేబుల్ సర్దాను. మీరు ఫ్రెష్ అయ్యే లోపల సర్దేస్తాను"

"ఓ పదినిమిషాలు, మొహం కడుక్కుని వచ్చేస్తాను" అంటూ అనిత వెళ్ళింది.

ఎండ వేడికి స్నానం చెయ్యాలనిపించి, స్నానం చేసి తెల్ల చుడీదార్ వేసుకుని వచ్చింది.

"వావ్! ఎప్పుడూ ఇంతగా ఎలా బాగుంటావు?" అనిత చెయ్యి పట్టుకుని ఇంటి వెనకాల పాటియోలోకి తీసుకెళ్ళాడు.

ఆకాశం సిగ్గుతో కందారిన ప్రియురాలిలా ఉంది. దూరంగా ఆకాశానికి, భూమికి వారధి అవుతున్న కొండలు, వారి మధ్య సందేశాలు తీసుకు వెళుతున్న మేఘమాలలు.

ఆనందంగా ఉన్న మనస్సు ప్రకృతిని ఇంకా అందంగా చూపిస్తుందా?

అనిత భుజాల చుట్టూ చెయ్యి వేశాడు స్టీవ్, ఆమె అనుభూతులు అతను కూడా శ్వాసిస్తునట్లు, ఆత్మలు కలిస్తే మాటల అవసరం లేదు.

"ఎంత రొమాంటిక్‌గా ఉందో కదా" పరవశంగా అన్నది అనిత.

"వైన్ రెండు గ్లాసుల్లో పోసి తీసుకొచ్చాడు స్టీవ్.

"వద్దు తాగను" అనుకుంది.

"సారీ అలవాట్లో పొరపాటు. అందరూ వైన్ తీసుకుంటారనుకోవటం నాదే తప్పు"

"అలా అని ఏమీ లేదు. ఇది తాగకుంటేనే నా మనస్సు నా మాట వినటంలేదు. తాగితే ఏమైపోతానో అని.." చిలిపిగా నవ్వింది.

"నీతో చాలా మాట్లాడాలి నీతూ! ఒక్కసారి కూడా నన్ను అడగలేదు నువ్వు ఎందుకు నిన్ను దూరం చేసానో, నా పర్సనల్ విషయాలు కూడా ఏమీ అడగలేదు. నాకు విడాకులు అయ్యాయి అని మాత్రమే తెలుసు నీకు. ధైర్యం తెచ్చుకోటానికి ఐ నీడ్ ఎ డ్రింక్ నీతూ"

"ఎందుకు అడగాలి స్టీవ్. నీకు చెప్పాలి అనిపించినప్పుడు చెపుతావు. నీతో ఇన్ని సంవత్సరాల జీవితం మిస్ అయ్యానన్న బాధ చాలా ఉంది, అది ఏ కారణం వలన జరిగినా, కనీసం మళ్ళీ మనం కలుసుకోగలిగాం అన్న ఆనందం ముందు ఆ గడిచిన కాలం గుర్తురావట్లేదు."

"ఎందుకింత మంచిదానివి నీతూ.." స్టీవ్ గొంతు వణికింది.

స్టీవ్ కళ్ళలోకి దీర్ఘంగా చూసింది అనిత. తనకెంతో ఇష్టమైన ఆ కళ్ళు తనతో చిలిపిగా, నవ్వుతూ కబుర్లు చెప్పే కళ్ళు, తాను ధైర్యం కోల్పోయినప్పుడు భరోసా ఇచ్చే కళ్ళు. కానీ ఈ రోజు ఆ కళ్ళల్లో తెలియని కంగారు, అనిశ్చిత సందిగ్ధత భరించలేకపోయింది అనిత.

స్టీవ్ మొహాన్ని రెండు చేతుల మద్య పొదుపుకుని, సున్నితంగా ముద్దు పెట్టుకుంది. ఆ చుంబనంలో కోర్కె లేదు, ప్రేమ మాత్రమే ఉంది. తనలోని శక్తిని, ధైర్యాన్ని స్టీవ్‌లోకి పంపుతున్న వారధి అయ్యింది ఆ ముద్దు.

"రా డిన్నరు తిందాం. మర్చిపోయాను అడగటం ప్రియ వచ్చేసుండాలి కదా"

"ఇందాక ఫోన్ చేసింది. రావట్లేదని. ఆనంద్ కూడా రాడు. మీరిద్దరూ మాట్లాడుకోవాల్సింది చాలా ఉంది, అని చెప్పి పెట్టేసింది" నెమ్మదిగా పాస్తా తింటూ అన్నాడు.

"నీతూ! మీ నాన్నకు బాగోలేదని టెన్షన్ పడుతున్న సమయంలో మా డాడ్‌కు హార్ట్ ఎటాక్ వచ్చింది. అంతా బాగానే ఉందని ఇంటికి తీసుకొచ్చాం. నువ్వు అసలే టెన్షన్‌లో ఉన్నావు, డాడ్‌కు మైల్డ్ హార్ట్ ఎటాక్ కదా ఎందుకు చెప్పటం అని దాచాను నీ దగ్గర. నువ్వు ఇండియా వెళ్ళాక చాలా తీవ్రంగా ఎటాక్ వచ్చింది. ఓ మూడు రోజులు వెంటిలేటర్ మీద పెట్టారు అయినా లాభం లేకుండా పోయింది. అమ్మకు ఇది కోలుకోలేని దెబ్బ. అమ్మ ఒక్క క్షణం కూడా వదల్లేదు. పక్కనే కూర్చుని కబుర్లు చెప్పేది, ఏదో మాట్లాడేది. ఒక రకంగా పిచ్చిదైపోయింది.

నువ్వు ఫోన్ చేసినప్పుడే ఫ్యునరల్ నుండి ఇంటికి తిరిగి వచ్చాం. ఇంటి నిండా జనం. బొమ్మలా అయిపోయిన అమ్మ. ఎంతో నిస్సహాయంగా అనిపించింది. నాన్న హాస్పటల్లో ఉన్న రోజుల్లో చాలా తెలుసుకున్నాను. ఇన్నాళ్ళూ నాన్న మాదగ్గరదాచిన విషయాలు. ఆర్థిక మాంద్యం వలన నాన్నకు ఆరునెలల క్రితమే ఉద్యోగం పోయిందంట. అందరి దగ్గర దాచారయన ఈ విషయం. రోజూ లంచ్ బాక్స్ తీసుకుని ఉద్యోగానికి వెళుతున్నట్లే వెళ్ళి వేరే ఉద్యోగాల కోసం ప్రయత్నించినా ఏమీ రాలేదంట. సేవిగ్స్ ఏమీ లేవు. చెల్లెలు కాలేజీకి వెళ్ళాలి. ఈ టెన్షన్లు ఆయన తట్టుకోలేకపోయారు"

"ఆ టైంలో నిన్ను ఎంతో కావాలనుకున్నాను. నువ్వు నా పక్కన వుంటే ధైర్యంగా ఉండేది అనుకున్నా. అంతలో నువ్వు ఫోన్ చేసి పెళ్ళి విషయం అడిగావు. ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. చాలా ఆలోచించా. ఇదీ పరిస్తితి అని నేను నీకు చెపితే నాకోసం తప్పకుండా ఆగుతావని తెలుసు. కానీ మీ నాన్న ఆరోగ్యం కూడా బాలేదు, నేనేమి నీకు ఇవ్వగలనో అర్థంకాలేదు.

ఎంతో అందమైన జీవితం ఇవ్వాల్సిన నీకు కష్టాల్లోకి ఎలా తీసుకురాను? అమ్మ బాహ్యప్రపంచంతో సంబంధం లేనట్లుగా అయిపోయింది. ఒక చిన్న పిల్లను చూసుకున్నట్లు సేవలు చేశాం నేనూ, లిండా. నా ఒక్కడి జీతం మీదే అమ్మ వైద్యం, లిండా చదువు. ఏమని చెప్పేది నీకు నాకు తెలుసు నువ్వు కృంగిపోతావని. కానీ కనీసం నువ్వున్నా సంతోషంగా

ఉండాలి. నీకు ఒక మంచి జీవితం ఉండాలి, మీ పేరెంట్స్‌కు నచ్చిన వ్యక్తి, మీ బావలాగా నిన్ను బాగా చూసుకునే వ్యక్తి వస్తాడని అంత కఠినమైన నిర్ణయం తీసుకున్నాను.

నువ్వు ఎంత బాధపడతావో తెలిసి కూడా అప్పటి పరిస్థితుల్లో అదే సరైన నిర్ణయం అనుకున్నాను. నన్ను నేను ఎప్పటికీ క్షమించుకోలేను నీతూ.

అది పలాయనవాదనేమో కానీ నీ ప్రేమ మీద దెబ్బ కొట్టాను. ఇదంతా ఏదో నా మీద సానుభూతి సంపాదించుకోవాలని చెప్పట్లేదు నీతూ. నీకు చెప్పాల్సిన బాధ్యత ఉంది నాకు" గొంతు బొంగురు పోయింది స్టీవ్‌కు.

**లేచి గ్లాసులో** ఇంకొంచెం వైన్ ఒంపుకుని, పాటియో అంచు దగ్గరకు వెళ్ళి నిల్చున్నాడు.

అతనిలోని దుఃఖతరంగాలు అలల మాదిరిగా అనితను తాకాయి. వెళ్ళి స్టీవ్ పక్కన నిల్చుంది. కనీసం ముట్టుకునే ప్రయత్నం చెయ్యలేదు. అతనిని తాకితే తనలోని దుఃఖం కట్టలు తెంచుకుంటుందేమో అన్న భయం. ఏదో బలమైన కారణం ఉంది అని ఊహించింది కానీ ఎంత బాధపడ్డాడో, ఒంటరిగా అతను ఎదుర్కున్న సంఘర్షణ తలచుకుంటే కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి అనితకు.

లోపలనుండి వచ్చే దుఃఖాన్ని మింగటానికేమో గ్లాసు ఎత్తి ఒక్కసారే పెద్ద గుక్క వేయటంతో పొరబోయి విపరీతంగా దగ్గటం మొదలు పెట్టాడు.

మృదువుగా అతని వీపుపై తడుతూ, "ఏంటిది, నెమ్మదిగా కూర్చో ముందు. మంచినీళ్ళు తాగుతావా?" అని అడిగింది.

ఆమె కంఠంలోని మృదుత్వానికి, ప్రేమకు విచలితుడై గట్టిగా హత్తుకున్నాడు. "నీ జీవితం నాశనం చేశాను. నువ్వు ప్రదీప్‌తో ఎంత కష్టపడ్డావో ప్రియ చెప్పింది. వెన్నెలను దూరం చేసుకున్నావు. కానీ ఇప్పుడు కూడా నాకు ధైర్యాన్నిస్తున్నావు. మధ్యాహ్నం కూడా నన్ను నేను కంట్రోలు చేసుకోలేక..." ఆ పై మాట్లాడలేకపోయాడు.

"షటప్ స్టీవ్! ముందు ఈ గిల్టీ మాటలు ఆపు. నీకు ఆ క్షణంలో సరైనది అనిపించిన నిర్ణయం తీసుకున్నావు. నా జీవితం బాగుండాలి అనుకున్నావు. ప్రదీప్‌తో అలా అవ్వటం నా ఫేట్. నీకు దానితో సంబంధం లేదు. ఇకపోతే మధ్యాహ్నం మనిద్దరం మనసా వాచా కర్మణా ఒకటయ్యాం. నేను వద్దు అని ఒక్క కనుసైగ చేసినా నువ్వు ఒక్క అడుగు ముందుకు వేసేవాడివి కాదు అని తెలుసు. చట్టరీత్యా నాకు విడాకులు అవ్వలేదు. సమాజం ఏమనుకున్నా ఐ డోంట్ కేర్, మొట్టమొదటిసారి పరిపూర్ణంగా అనిపించింది."

"ఐ లవ్ యు స్వీట్‌హార్ట్" స్టీవ్ నోటివెంట ఆ మాట. అలసిన గుండెకు ఎంతో ఓదార్పును ఇచ్చింది, మధురమైన అనుభూతి.

"నాకు తెలుసు" చిలిపిగా నవ్వింది స్టీవ్ ముక్కుపట్టుకుని ఊపుతూ.

గట్టిగా నవ్వేశాడు. సెంటిమెంటల్‌గా అవుతుందేమో అనుకున్నాడు.

"మనస్ఫూర్తిగా నవ్వటం ఎలా ఉంటుందో దాదాపు మర్చిపోయా నీతూ"

టేబుల్ మీద ఉన్న స్పానిష్ స్వీట్, ఫ్లాన్, చిన్న చిన్న కప్పుల్లో పెట్టింది మిసెస్ డోరీ. తీసుకొచ్చి స్టీవ్ చేతికి ఒక కప్పు చేతిలో పెట్టింది అనిత.

"దాదాపు రెండేళ్ళు నరకం చూసింది అమ్మ. విపరీతమైన డిప్రెషన్, డాడ్ లేని జీవితం అందులో అంత అర్ధాంతరంగా పోతారని అనుకోలేదేమో, తట్టుకోలేకపోయింది. ఏదో ఆలోచనల్లో ఉండేది, ఒకోసారి విపరీతంగా ఏడ్చేది. ఇల్లు అమ్మేసి, అమ్మను, లిండాను నాతోపాటు ఉంచుకున్నా. ఆ ఇంటినుండి బైటకొస్తే కొంచెం తేరుకుంటుందేమో అనుకున్నా. పాపం ఇంత గొడవలో లిండా ఎలా చదువుకునేదో. ఆఖరి సంవత్సరం హైస్కూలు. నర్సును పెట్టా. లిండా కాలేజికి వెళ్ళిపోయింది. తర్వాత అమ్మకూడా నిద్రలోనే వెళ్ళిపోయింది. ఒక రకంగా తన బాధనుండి విముక్తి."

"తరువాత లిండా చదువు, కాలేజీలోనే ఒక అబ్బాయి పరిచయం, పెళ్ళిదాకా వచ్చింది, మంచివాడు. నెబ్రాస్కాలో కుటుంబపు వ్యవసాయమే తనూ చూసుకుంటాడు. సంతోషంగా ఉంది లిండా. తర్వాత కాలిఫోర్నియా వచ్చేశా. నెమ్మదిగా డబ్బు కొంచెం కూడబెట్టి, ఫైనాన్సు తీసుకుని ఒక కంపెనీ పెట్టాను. మధ్యలో పెళ్ళి. ఇమడలేకపోయాను. విడాకులు. పైకి చూస్తే అంతా ఉన్నట్లే ఉంటుంది కానీ ఆ వెలితేంటో నాకు మాత్రమే తెలుసు. ఎక్కడో చోట నువ్వు సంతోషంగానే ఉండి ఉంటావనుకున్నాను. ఆ తృప్తితో చాలా ఏళ్ళు ఉన్నా కానీ తరవాత ఏదో తపన, తెలియని ఆరాటం. నిజంగా సంతోషంగా ఉన్నావా లేదా తెలుసుకోవాలని. తర్వాత జరిగింది నీకు తెలుసుకదా! "నీ గొంతు మొదటిసారి వింటుంటే మాత్రం నా గుండె పేలిపోతుందేమో అన్న ఉద్విగ్నత..."

స్టీవ్ మాట్లాడుతుంటే మధ్యలో ఏమీ మాట్లాడలేదు. తన చూట్టూ కోటలాగా ఉన్న స్టీవ్ చేతుల మధ్య, కళ్ళు మూసుకుని మౌనంగా ఉండిపోయింది. ఇవాళ అతని గుండెల్లోని బాధ బైటకు రావటం అవసరం. వేరే వాళ్ళతో తన బాధ పంచుకోవటం, వేరు ఎవరి కోసమైతే తపిస్తూ ఉన్నాడో ఆమెతో చెప్పుకోవటం వేరు.

"రా లోపలికి వెళదాం, చల్లగాలి వేస్తుంది."

"అమ్మో టైం పదకొండు అయ్యింది. ఇంతసేపు బైట కూర్చున్నామా?" టేబుల్ మీద గిన్నెలన్నీ ఫ్రిజ్‌లో పెట్టి, ఖాళీ ప్లేట్లు సింక్‌లో పెట్టేశారు. తలుపులన్నీ లాక్ చేసి స్టీవ్ పైకి వచ్చేసరికి, నైట్ డ్రెస్‌లోకి మారింది అనిత.

తలుపు మీద మునివేళ్ళతో కొట్టాడు స్టీవ్.

"తలుపు తీసే ఉందిగా – రా" చేతులకు క్రీమ్ రాసుకుంటూ పిలిచింది అనిత.

"నీతూ నేను చాలా ఓపెన్‌గా చెపుతున్నాను. నీకు దూరంగా ఉండటం నావల్ల కాదిక. కానీ నామూలాన నీ జీవితం ఇంకా చిన్నాభిన్నం చెయ్యలేను. నామూలాన నువ్వు అనుభవించిన బాధ చాలు."

కొన్ని క్షణాలు మౌనంగా స్టీవ్ వంక చూసింది. ఏమి చెపుతుందో అని ఆత్రంగా ఎదురు చూస్తున్నాడు. అనిత పెదవులపై సన్న చిరునవ్వు చూసి మనస్సు తేలిక పడింది .దగ్గరకు వచ్చి స్టీవ్ మెడచుట్టూ చేతులు వేసింది.

"నీ ప్రేమ కావాలి స్టీవ్. నువ్వే నా నిజం. గడచిన కాలం ఒక పీడకల. భవిష్యత్తు ఏ మలుపులు తిరుగుతుందో నాకు తెలియదు, కానీ నీ ప్రేమ లేకుండా ఇంక్ బ్రతటం నావల్లకాదు."

"పద నీతూ నా బెడ్రూములోకి వెళదాం, ఇకనుండి అది మన రూం"

స్టీవ్ బెడ్‌రూం పక్కనే టేబుల్ మీద పదహారేళ్ళ క్రితం తీసిన ఫోటో ఒకటి ఉంది. ప్రియ అప్పట్లో ఒక కెమేరా కొనుక్కుని తెగ ఫోటోలు తీసేది. స్టీవ్, అనిత ఒకరి చెయ్యి ఒకరు పట్టుకున్నారు. అనిత ఏదో చెపుతుంటే స్టీవ్ చాలా శ్రద్ధగా వింటున్నాడు. ఇద్దరికీ తెలియకుండా తీసింది ప్రియ. ఎంతో సహజంగా ఉంది.

"ఈ ఫోటో ఎప్పుడూ నాతోనే ఉంటుంది నీతూ. నా పెళ్ళి అయిన ఆ మూడేళ్ళూ లోపల పెట్టేశాను. మళ్ళీ యధాస్థానంలోకి వచ్చేసింది."

మరు మాట్లాడకుండా అతన్ని హత్తుకుపోయింది అనిత.

అనితకు ఇంత మానసిక ప్రశాంతత ఎప్పుడూ దొరకలేదు. ఎవ్వరికైనా చెప్పినా నవ్వుతారేమో. మితిమీరిన రొమాంటిక్ ఆలోచనలు అని. కానీ అనుభవించిన వారికే అర్థం అవుతాయి ఆ భావాలు.

మానసిక కలయిక ఉంటే చిన్న చిరునవ్వుతోనే అవతల వ్యక్తి స్పందిస్తారన్న విషయం ఎంతమంది భార్యాభర్తలకు తెలుసు.

స్త్రీ సహజమైన సిగ్గుతో దగ్గరకు వచ్చిన భర్తను గోముగా తిరస్కరిస్తే, అందులోనే ఆమె కోర్కెకూడా వ్యక్తమవుతుంది. ఆమెను లాలించి, ప్రేరేపించి కలిసిన ఆనందం ఇద్దరిలోనూ ఆవర్ణమతుంది. కానీ లాలిత్యం లోపించిన కలయికలో శారీరక ఒరిపిడి తప్ప ఏమీ ఉండదు.

కంపాటబిలిటీ కంటే కాంపిటీషన్, డామినేషన్ మిగులుతున్నాయి చాలామంది వైవాహిక జీవితాల్లో.

ప్రతిరోజూ కలసి పనిచేసే సహోద్యోగులతో ఎంతో బాగుంటాం, కోపం వచ్చినా దిగమింగుకుని, అర్థం చేసుకోటానికి ప్రయత్నిస్తాం, కానీ భార్యాభర్తల మధ్య ఎందుకు ఓపిక ఉండదు? ఆఫీసులో ఫ్రెండ్స్ కొత్త డ్రస్సు వేసుకుని వచ్చారని వెంటనే గమనిస్తాం కానీ భార్యను ఎందుకు గమనించరు.

రకరకాల ఆలోచనలు అనిత మనస్సులో, స్టీవ్‌తో గడిపిన ఏడురోజులు ఏడు జన్మలకు సరిపోయేంత ఆనందం ఇచ్చింది.

మొదటిరోజు తరవాత, తానే వంట చేస్తానని పట్టుబట్టింది. కావాల్సినవన్నీ లిస్ట్ రాస్తే అన్నీ తెప్పించాడు స్టీవ్.

ప్రొద్దున్నే లేచి కాసేపు వాకింగ్‌కు వెళ్ళి బైట కుర్చీల్లో కూర్చుని కాఫీ తాగుతూ కబుర్లు చెప్పుకునే వాళ్ళు. ఒక్కోసారి ఏమీ మాట్లాడుకునేవారు కాదు. మౌనంగా ప్రకృతిలో మమేకమై, గాలిలో తేలివచ్చే పూలవాసనను ఆస్వాదిస్తు, పక్షుల సుప్రభాత గీతికల మధ్య ఒక అలౌకిక ప్రపంచం.

ఒక్కోసారి స్టీవ్‌కు ఏవో మీటింగులు ఉండేవి. మొదట్లో ఆ మీటింగ్ సమయంలో లేచి పక్కగదికి వెళ్ళబోతుంటే ఆపేశాడు స్టీవ్, తన పక్కనే కూర్చోమన్నాడు. ఇక అదే అలవాటయ్యింది. ఏదైనా పుస్తకం చదువుతూ కూర్చునేది.

వచ్చిన రెండో రోజే అక్కతో మాట్లాడింది అనిత. అనిత గొంతులోని దాచినా దాగని ఆనందం అందరూ పసికట్టారు. స్టీవ్ వెన్నెలతో కూడా మాట్లాడాడు. క్రొత్తవాళ్ళతో మాట్లాడటానికి సహజంగానే సిగ్గుపడే వెన్నెల, రెండు రోజుల్లోనే నెమ్మదిగా అడిగిన వాటికి సమాధానం ఇవ్వటం మొదలుపెట్టింది.

అనిత చాలా ఆశ్చర్యపడింది. వెన్నెల ఇంత త్వరగా అందులోనూ చూడని వ్యక్తితో మాట్లాడటం అందునా ఆటిజమ్ వలన చాలా బెరుకు వెన్నెలకు.

"ఏం మాయ చేశావు వెన్నెల మీద, ఇంత త్వరగా ఎవ్వరితోనూ మాట్లాడదు."

"చాలా స్వీట్ కిడ్. నేను తన అమ్మను చాలా ప్రేమిస్తున్నాను అని గ్రహించింది. అందుకే నేను నచ్చానేమో?"

స్టీవ్ మాటలు ఎంత అలవాటు అయ్యాయి అనుకున్నా కొన్ని కొన్నిసార్లు అప్రయత్నంగా సిగ్గుపడుతుంది ఓ కొత్త పెళ్ళికూతురిలా.

మర్నాడు తిరుగు ప్రయాణం అనగా, ఆ రాత్రి బైట పాటియో మీద ఒత్తుగా బొంతలు వేసుకుని, నక్షత్రాల వెలుగులో అలసిన తనువులు సేద తీరుతున్నవేళ –

"మనం పెళ్ళెప్పుడు చేసుకుందాం నీతూ?"

స్టీవ్ గుండెల మీద తలపెట్టి, మూతలు పడుతున్న వేళ ఈ ప్రశ్న. చివ్వున తలెత్తి చూసింది అనిత.

"ఏంటి అంత షాక్ కొట్టిందా, అలా చూస్తున్నావు?"

ఏమీ మాట్లాడకుండా కళ్ళు మూసుకుంది అనిత.

తన సమాధానం కోసం స్టీవ్ ఎదురు చూస్తున్నాడని తెలుసు. ఏమి చెప్పగలదు?

లీగల్‌గా తను ఇంకా ప్రదీప్ భార్య. కానీ ఇదే మనసా వాచా కర్మణా సక్రమ సంబంధంలా ఉంది.

సమాజం తనను ఎలా చూస్తుందో, తన ప్రవర్తన మీద ఎటువంటి పదాలు ఉపయోగిస్తారో తెలుసుకోలేనంత అమాయకురాలు కాదు. విడాకులు తీసుకోకుండా వేరొకరితో ఉండటం హర్షించరు.

ఏది అక్రమం, ఏది సక్రమం?

వివాహ వ్యవస్థ మీద గౌరవం ఉంది కాబట్టే పదిహేను సంవత్సరాలు ఆ బంధం ఉనికిని కాపాడుకోటానికి పోరాడింది.

కేవలం కలిసి ఉంటేనే సంసారమా?

ఒకరితో ఒకరు మాట్లాడుకోరు. స్తబ్దత తప్ప ఏమీ మిగలని బంధం.

కష్టాల్లో, మానసిక సంక్లిష్ట పరిస్థితుల్లో తోడు నిలవని బంధం వివాహం ఎలా అవుతుంది.

భార్యతో బాధలు పడుతూ వేరే ఆమెతో సంబంధం పెట్టుకుంటే పాపం ఏమి చేస్తాడు, ఇలాంటి దాన్ని పెళ్ళి చేసుకుని ఏమి సుఖపడ్డాడు. అందుకే ఇంకొకరి దగ్గరకు వెళ్ళాడు అంటారు.

అదే ఆడది చేస్తే? భర్తతో విడిపోయినా సరే..

"ఏంటి అంతలా ఆలోచిస్తున్నావు నీతూ?" నుదుటి మీద ముద్దుపెడుతూ అడిగాడు స్టీవ్.

"మనస్ఫూర్తిగా చెపుతున్నాను స్టీవ్. ఈ వారం రోజుల్లో నాలో కొత్త జీవం పోసావు. ఎవ్వరికీ అర్ధంకాదు నేను చెప్పినా ఇదంతా ఓ కలేమో అన్నంత భయం కూడా వేస్తుంది. ఇంత ఆనందంగా ఉండొచ్చా అన్న ఆశ్చర్యం. నేను సరిగ్గా చెప్పలేకపోతున్నాను. You made me feel beautiful – both inside and out. కానీ రియాలిటీ ఏంటంటే నాకు ఇంకా విడాకులు కాలేదు వెళ్ళాక అప్లై చెయ్యాలి. అది అయ్యాక మాట్లాడుకుందాం స్టీవ్"

"నాకు తెలుసు స్వీట్‌హార్ట్. ఇన్ని సవత్సరాలు పట్టింది మన సంగమానికి, ఇంకొంచెం ఆగలేమా? దేవుడికి మనిద్దరి మీద జాలి వేసి మనకు ఈ రెండో అవకాశం ఇచ్చాడు. ఇంత అరుదైన వరం, విడిపోయిన ఎంతమంది ప్రేమికులకు దక్కుతుంది. గతం ఓ పీడకల. ఆ పీడకల నుండి వచ్చిన అందమైన బహుమతి వెన్నెల."

తన చుట్టూ పెనవేసుకున్న చేతుల మధ్య తనను అమితంగా ప్రేమించే ఆ గుండె చప్పుడు వింటుంటే దారి తప్పిపోయిన పావురం తిరిగి గూటికి చేరుకున్నంత నిశ్చింత.

సమస్యల వలయంలో కొట్టుకుపోతున్నప్పుడు ఎటు చూసినా అంధకారం కనిపిస్తుంది. బ్రతుకు నిర్వీర్యం అయిపోతుంది. కొత్త ఆలోచనలు భయం కలిగిస్తాయి. వర్తమానంలోని బ్రతుకు మీద ఉన్న అనిశ్చిత – భవిష్యత్తును కూడా అభద్రతా భావంతో చూపిస్తుంది.

ఎవరి జీవితం వారిదే, ఎవరి పరిమితులు వారివే. సమస్యలను విశ్లేషించుకునే శక్తి అందరికి అన్ని సమయాల్లోనూ ఉండకపోవచ్చు. అలాంటి వారికి సహానుభూతితో చేయి అందిస్తే, మళ్ళీ జీవిత పోరాటానికి శక్తి లభిస్తుంది.

అందమైన జీవితంలో పచ్చని రమణీయమైన ప్రకృతి ఉంటుంది. కారుమబ్బుల తుఫానూ ఉంటుంది. ప్రతి జీవితం మధురమైన ఆరోహణ అవరోహణల సమాహారం. ఈ గమనంలో కాలిలో గుచ్చుకునే ముళ్ళను తీసివేస్తూ ఎదురు దెబ్బలకు కట్టుకట్టుకుని అడుగు ముందుకు వేయాలి. గమనం మధురంగా మలచుకోవాలి.